భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు :

శివలెంక శంభుప్రసాద్

డిశంబరు **1954**

సంపుటము 31 : : సంచిక 12

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

—:o:—

డిశంబరు 1954



జయ
మార్గశీర్షము

భారతి

సంపుటము 31
సంచిక 12

చిన్నిపూలు

మురయా

చింతతో నే చివికిపోతే, వగపుతో నే దిగులుపడితే,
చింత విడచీ చేరుకొమ్మని, దిగులువిడచీ తేరుకొమ్మని,
చిన్ని పూలే పలుకరించాయీ!
చిన్నవాడని చెలిమి చూపాయీ!

ఎవ్వరెరుగని బాధతో నే,
నవ్వలెరుగని బాటలో నే,
ఒంటిగా నే నిలచిపోతే
వెంటరమ్మని పిలిచిపోతూ,
దారిపోయే యేటిసిరము
లేటికోయీ చింతలనుచూ,
మాటలాడీ వలపు చూపాయీ!
వాటిలాగే మెలగమన్నాయీ!

ఎడద చేసే రోదనలతో
మనసులో నే కుమిలిపోతూ
వేడియూర్పుల వెతలపాలై
వెఱ్ఱినై నే క్రుంగిపోతే
హోరుగాలికి మారు పలికే
పైరుభూముల పైననెగిరే
పికిలిపిట్టలె పలుకరించాయీ!
పిన్నవాడని కనికరించాయీ!

కారుమబ్బుల కటికచీకటి । కలచుజీవితగాథలన్నిటి
తలచుకొని నేభువినిరాలి । తల్లడిలిపోతే
మెఱుగుపుర్వులె వెలుగు చూపాయీ!
కీచురాళ్లే మేలుకొల్పాయీ!

శత్రువు

శ్రీ నిర్మల్ కుమార్ ముస్తాఫీ

★

అఖిలభారత పోటీలో నాల్గవ బహుమతినిపొంది, ప్రపంచపోటీకి పంపబడిన నాలుగవ కథ. నిర్మల్ కుమార్ ముస్తాఫీ ఈకథను ఆంగ్లంలో రచించి పోటీలో పాల్గొన్నారు. వీరు ఇప్పుడు చంద్రనగర్ ప్రభుత్వకళాశాలలో ఆంగ్లశాఖలో లెక్చరర్ గా పనిచేస్తున్నారు.

★

డేరాదెబ్బా బూట్లదప్పుడు; ట్రైనింగ్ కాంప్ నుంచి సిపాయిలను విడుదల చేశారు. ఎక్కడివా ళ్ళక్కడ గుంపులు గుంపులుగా వెళ్ళిపోతున్నా, హెర్ మన్ సైనికశ్రేణిలో వున్నట్టు ఇంకా అలా నే నిల్చునున్నాడు. ట్రైనింగ్ కాంప్ కమాండెర్ సందేశ వాక్యాలు ఇంకా అతని చెవుల్లో మారు మోగుతూనే వున్నయ్. 'మాతృ దేశంయొక్క గౌరవప్రతిష్ఠలను పరిరక్షించే మహత్తరమైన బాధ్యత మీ భుజస్కంధాలమీద వుంది. ఈ బాధ్యతను నిర్వహించుకోగలగటా నికి ఈ కేంద్రం మీకు తగిన శిక్షణనిచ్చి తరిఫీదు చేసింది. మీరు వేల్చే ప్రతిగుండూ ఒక శత్రువును రూపుమాపాలి! మీరు పాడిచే ప్రతి (తుపాకి) పన్నీ పోటూ ఒక శత్రువు హృదయాన్ని చీల్చాలి. మీ నేత్రాలకు సునిశితమైన లక్ష్యదశుద్ధినీ, మీ హస్తాలకు అచంచలమైన లాఘవాన్నీ భగవంతుడు ప్రసాదించు గాక!'—



'లక్ష్యశుద్ధిగల నేత్రాలూ — లాఘవంగల హస్తాలూ'—ఈమాటలు తనలో తను గొణుక్కుంటూ, హెర్మన్, పెరేడ్ మైదానానికి అడ్డంపడి దిగులుగా నడుస్తున్నాడు.

శిశిర ఋతువు; ప్రొద్దు గర్భాన పడ్డది. మసక మసకగా చీకట్లు క్రమ్ముకొస్తున్నయ్. హెర్మన్ వెనక్కు తిరిగి నిర్మానుష్యంగా వున్న కాంప్ వంక చూచాడు. చుట్టూవున్న పొలాలమీద తెరదించినట్టు పొగమంచు వ్యాపించివుంది. అతని మనస్సు యింటిమీద పోయింది. కళకళలాడే తన గృహానికీ ఈ వాతావరణానికీ ఎంత వ్యత్యాస ముంది! ప్చ్! లాభమేమిటి? ఇప్పుడు ఇంటికి తిరిగివెళ్లే అవకాశం లేదు. వెంటనే రణక్షేత్రానికి వెళ్లిపోవా లని ఉత్తరువులు! తన మనస్సులో కలుగుతున్న విచారాన్ని తోటిసైని కులతో చెప్పుకుని వాపోయాడు.

'ఇలాంటి విచారాలు పనికి రావురా! ధియ్యా! —శత్రువు చెయ్యి దాటి తప్పించుకు పారి పోతే తప్ప మరిక దేనికి విచార పడగూడదు'—ఇది టిల్లీ సలహా.

'సైన్యంలో వున్నవాడికి ఇలాంటి ముద్దుట్లూ, ముదిపాలూ పనేమీ రంజించవనుకో'—ఇది తక్కిన వారి మందలింపు.

తన తెలివితక్కువకు పశ్చాత్తాపపడుతున్నట్టు మొహం పెట్టి, హెర్మన్ క్షమార్పణ చెప్పుకుంటు న్నట్టు అన్నాడు: 'నిజమే—ఇలాంటివి మంచివి

కావు — కాని నాలో అప్పుడప్పుడు ఇలాంటి పిచ్చి ఊహ లేవో పుడుతూ వుంటాయి — మళ్ళీ ఇట్టే క్షణంలో అంతరించిపోతాయనుకోండి' — అన్నాడు. చేతినున్న గడియారంవంక చూసుకున్నాడు. ఒక రెండు గంటలు మాత్రమే వ్యవధి వుంది: 'టైమైపోతోంది — సామానూ బట్టా సర్దేసుకోవద్దూ?' అన్నాడు. అతని వెంబడే తక్కినవాళ్లు కూడా, బారకాసులవేపు బయలుదేరారు.

హెర్మన్ సర్వసన్నాహాలూ పూర్తిచేసుకుని నిల్చునున్నాడు. కన్నూ కన్నూ పొడుచుకున్నా కనుపించని చీకటి — అంధకారం; ఆ చీకట్లో అతని చుట్టూ అనంతమైన సందలనం. కళ్ళు పెకల్చుకు చూస్తే ఆ చీకట్లో పెనుభూతాల్లా మిలిటరీ ట్రక్కులు కనుపించుతున్నయ్. చాలా చలిగా వుంది. చేతులకు 'గ్లౌస్' తొడుక్కున్నాడు. మెల్లిగా ముందుకు నడిచి, ఆ లారీల ప్రక్కకు పోయి నిల్చున్నాడు. రెండు మూడు నిమిషాలు అలానే నిల్చున్నాడు. ఇంతలో దూరాన చక్రాల చలనం వినిపించింది. 'ఓహో! బయలుదేరుతున్నట్టున్నయ్' — అనుకున్నాడు. ట్రక్కులోకి ఎక్కాడు. ట్రక్కులో తోలగదొయ్యటానికి సందులేకుండా క్రిక్కిరిసి వున్నారు. కాస్త విశ్రాంతిగా కూర్చుని ప్రయాణం చేసే సావకాశం వుంటుందనుకున్నాడు. కాని మోకాళ్లు డొక్కల్లోకి ముడుచుకుని గొంతుక్కూర్చుని ప్రయాణం చేయవలసి వచ్చింది. లారీ గర్రుమని కదిలింది. లారీ వడివడిగా పోయినకొద్దీ, చలిగాలి జివ్వు జివ్వున ముఖంలోకి బాదుకుని ముఖం వాచిపోతోంది. నుదురుతుడుచుకుని, చినుకులు వ్రేళ్లతో చిలకరింపుతున్నాడు.

హెర్మన్, అతని సహచరులూ యుద్ధరంగంలో దిగారు. పరిస్థితులు అంత అధ్వాన్నంగా వుంటాయని వాళ్లు ఎప్పుడూ ఊహించలేదు. ట్రైనింగ్‌లో వున్నప్పుడు, సైనికుడు దుస్తుల విషయమై తీసుకోవలసిన శ్రద్ధనుగురించి వీరందరికీ ఎంతో ఉదాత్తమైన అభిప్రాయాలుండేవి. ఇక్కడి పరిస్థితుల్లో అలాంటి అభిప్రాయాలన్నీ తుక్కుతుక్కయిపోయాయి. జీవాలు నిలిచివుండటానికి, కావలసిన కనిష్ఠావసరాలు లభించటం అక్కడికి బ్రహ్మప్రళయం. ప్రాణాలు నిలిపివుంచుకోవటానికి కచ్చగా పోరాడే అడవిమృగాల ఆవేశం వాళ్ళల్లో పొటమరించింది. ఒక కందకంలో తలదాచుకుని, ఆకలిబాధ తీర్చుకోవటానికి ఆ వేళకు అందిన కబళాలను ఆప్యాయంగా తింటున్నారు. ట్రైనింగ్ కాంపులో వుండగా వీరభోగ వసంతరాయిళ్లలా అనుభవించిన అనుభవాలను తలపుకు తెచ్చుకుని, వర్తమాన స్థితికి లోలోపల దురపిల్లుతున్నారు.

ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకుందామనే మానవ సహజమైన ఉత్సాహంకూడా నశించి ఎవరికి వారు మౌనంగా కూర్చుని ఆ కాస్త ముద్దా గొంతులో వేసుకుంటున్నారు. ఇంతలోనే సమీపంలో సైరన్ ధ్వని వినిపించింది. మరుక్షణంలో ఎక్కడనుంచో రివ్వున ఒక ఫిరంగిగుండు ఎగిరివచ్చి కందకం అంచుకు కొట్టుకుని 'ఢన్' మని పేలింది. మట్టి, దూగరగా పైకి లేచి కళ్లనిండా పడ్డది. ఆ చీకట్లో ఏమీ కనుపించక హెర్మన్ ఇంకా అలా తింటూనే వున్నాడు. నోట్లో పెట్టుకున్న ముద్ద మట్టికంపు కొట్టింది. అతనికి చిరాకెత్తిపోయి అవతల పారేద్దామనుకున్నాడుగాని, ఆకలితో వుండటంచేత ఎలాగోలా ఆ రెండుముద్దలూ నోట్లో కూరుకున్నాడు. యుద్ధరంగంలో జీవితం అంటే ఇదికాబోలు, కనీసం ఈ రకంగా వుంటుంది కాబోలు ననుకున్నాడు.

ఫిరంగికాల్పులు సమసిపోయినై. హెర్మన్ బృందానికి ఉత్తరువులు అందినై: 'దొంగచాటుగా బయలుదేరివెళ్లి శత్రుస్థావరాలను రూపుమాపాలి.' ఆ ఉత్తరువులప్రకారం ముందుకు సాగిపోతున్నారు. ఉన్నట్టుండి, శత్రుశ్రేణి ముందు జాజ్వల్యమానంగా ఏవో మంటలు కనుపించినై. ఆ మంటల కాంతిలో పరిసరాలన్నీ శత్రువుకు విస్పష్టంగా కనుపించినై. వెంటనే శత్రుఫిరంగులు మృత్యువును వర్షించటానికి ప్రారంభించినై. ఇటు ఎడమవైపున ఒక గుండు అటు కుడివేపుగా ఒకటి — నెత్తిమీదుగా రివ్వున ఎగసిపోయేదొకటి! బిల్లీకూడా హెర్మన్ ప్రక్కనే

నేలమీద పాకుతున్నాడు. పట పటా పళ్లు కొరికి: 'అక్కడికి చేరాలే గాని...ఆ కుక్క వెధవల్ని...వాళ్ళ...'; ఇంకా ఆ వాక్యం ముగియకముందే 'పర్ ర్' మంటూ ఒక తుపాకిగుండు ఎగిరివచ్చి అతని గుండెల్లో కొట్టుకుని, అతన్నీ అతని కచ్చనూ కూడా అంతంచేసి వేసింది. హెర్మన్ టబ్రీ ప్రక్కనే మోకరిలి, అతని శరీరాన్ని తడివిచూచాడు. మృత్యువు ఎంత నిర్దాక్షిణ్యంగా సర్వాన్నీ అంతంచేసి పారేస్తుందో అతనికి అర్థమైంది. "పేల్చిన ప్రతి గుండూ ఒక శత్రువును రూపుమాపాలి" అనే వాక్యాలు తిరిగి అతని స్మృతిపథంలో వినిపించినై. చివాల్న లేచి నిల్చున్నాడు. మొండి ధైర్యంచేసి ముందు కురికాడు.

చుట్టూ చీకటి అంధకారం: గగనపథాన అక్కడక్కడ నక్షత్రాలు మాత్రం మినుకు మినుకు మంటున్నయ్. పైన ఆకాశం ఎంతటి విస్తృతావధిని పఱచుకుని వుందో, క్రింద అగ్నిగోళాలు వర్షించుతున్న ఆ రణక్షేత్రం కూడా అంత విస్తృతావధిని పఱచుకుని వున్నట్టు కనుపించుతోంది. ఆ రణక్షేత్రానికి మధ్యగాబడి హెర్మన్ ముందుకు సాగుతున్నాడు. ఫిరంగిగుండ్లు భూగర్భాన్ని భీభత్సంగా ఛిన్నాభిన్నం చేసేస్తున్నయ్. తుపాకులు నిప్పులు చెరుగుతున్నయ్. 'మోర్టారులు' అగ్నిగోళాలను విసిరివేస్తున్నయ్. వీటి భీభత్సరావంలో హతభాగ్యుల హాహాకారాలు కూడా కలిసి ప్రళయసంఘోషంగా వుంది. అలా నేలనుబడి పాకిపోవటంలో హెర్మన్ మోకాళ్లు కొట్టుకుపోయి రక్తాలోడుతున్నాయి. కాని అతను లక్షించలేదు. ముందుకు సాగుతున్నాడు. శత్రువుల మెషిన్‌గన్ దళంవున్న స్థావరం అనతిదూరంలో వుంది...ముప్ఫై అడుగుల దూరం! నేలనుబడి ప్రాకులాడుతూ, క్రమేపీ ఆ స్థావరం దగ్గిరికి చేరుకుంటున్నాడు. చీకటి పిశాచాలు నిల్చున్నట్టు ఇప్పుడు అక్కడున్న మనుష్యులు అతనికి స్పష్టంగా కనుపించుతున్నారు. చేతిబాంబు తీసుకుని విసిరెయ్యడానికి సిద్ధంగావున్నాడు. ఇంతలోనే శత్రుశ్రేణిముందు మరొక పర్యాయం, హఠాత్తుగా మంటలు లేచాయి. యుద్ధభూమి యావత్తూ పట్టపగలై కనిపించింది. శత్రువులు అతని మీద ఒక్కుమ్మడి తుపాకిగుండ్లు కురిపించారు. మరుక్షణంలో ఆ శత్రుస్థావరం కూడా పేలిపోయింది—హెర్మన్ విసిరిన చేతిబాంబు దాని సమాధానం అది చెప్పేసింది. అలాంటి స్థితిలో మృత్యువు అనేది అనలదిగ్ధం—అటు శత్రువును కబళించుతుందో, ఇటు నన్నే కబళించుతుందో చెప్పలేము. ఈ తలపుతో అతనికి ఎంతో విచారమేసింది.

'ఏది యేమైనా, నా బాధ్యతను నేను నిర్వహించాను' అని నచ్చచెప్పుకుని తనను తాను అభినందించుకున్నాడు. అక్కడే ఆగి క్షణం విశ్రాంతి తీసుకుని ఊపిరి పీల్చుకున్నాడు. లేచి నెమ్మదిగా ముందుకు సాగాడు. బాంబు పేలినందువల్ల యేర్పడిన ఒక పెద్దగోతిలో తలక్రిందులుగా పడిపోయాడు. తల దుమ్ములో కూరుకుపోయింది. మోకాళ్లకు బలంగా దెబ్బలు తగిలాయి — మోకాటిచిప్పలు తొలగిపోయాయేమో కూడా; ఆ మోకాళ్ల బాధ భరించలేక చేతులతో వత్తుకున్నాడు. చేతులనిండా రక్తం! భూమండలం యావత్తూ ఒక్కసారి గిర్రున తిరిగిపోతున్నట్టు తల తిరిగిపోయింది—ఉండీలేని స్పృహ—గోతి అంచుమీద చారబడిపోయాడు. తడిమట్టి చిరుపలు చిరుపలుగా పైనించి నెత్తిన పడుతోంది. నోటివెంట చొంగకూడా బయటికి వస్తోంది.

అతనికి తిరిగి స్పృహ వచ్చేసరికి తెలతెలవారుతోంది. నెమ్మదిగా కళ్లువిప్పి మోకాళ్లవంక చూసుకున్నాడు. మోకాళ్లు రెండూ బాదలైవున్నాయి. లేచి నిల్చోటానికి ప్రయత్నించాడు—కాని కాలు కదపలేకపోయాడు. ఆ హతాశలో ఆవుర్న యేడిచెయ్యాలనిపించింది. 'నిన్న—నిన్న నేగా!...'

తన తుపాకి యెక్కడున్నదా అని చుట్టూ చూసుకున్నాడు. తుపాకి సనీన్ అతని నెత్తిమీదనే తళతళా మెరుస్తోంది, గోతి ఒడ్డుమీదనుంచి. అతను గోతిలో పడిపోయినప్పుడు తుపాకి జారి గోతివడ్డున పడ్డది. కొంచెం పైకి లేచి చెయ్యెత్తితే అందే స్థితిలో వుంది—కొంచెం పైకి లేవగలిగితే చాలు! సరే పోనీ మనుకుని, యేమి చెయ్యటానికీ తోచక—కాస్త

రొట్టెముక్కన్నా కొరుక్కు తిందామని, జేబులో నుంచి పొట్లాం తీసి విప్పుతున్నాడు. ఒక ముక్క మునిపంట కొరికాడో లేదో...అడుగుల చప్పుడు! నిర్ఘాంతపడి వదిలివేశాడు. ఇంకా ఇంకా చేరువౌతున్న అడుగుల చప్పుడు! తల పైకెత్తి చూచాడు. ఒక మానవముఖం గోతి అంచుమీదనుంచి తనవంక తొంగిచూస్తోంది—ఉక్కు టోపీరంగునుబట్టి గుర్తుపట్టాడు—శత్రువు!

కలవరంగా లేచి తుపాకీ అందుకోబోయాడు—మోకాళ్ళు విరిగిపోయిన సంగతి జ్ఞప్తిలేక—'అమ్మో' అని ఆర్తనాదంచేస్తూ గోతి అంచుమీద పడిపోయాడు.

అతనికి తిరిగి తెలివివచ్చి కన్నువిప్పి చూసేసరికి ఆందోళనతో కిందపడుతున్న ఒక ముఖం అతని వంక జాలిగా చూస్తోంది—గోతి అంచుమీద కనుపించిన ఆ ముఖమే—హెర్‌మన్ గుర్తుపట్టాడు. శత్రువు మంచినీటి 'ఫ్లాస్కు' బయటికితీశాడు. మూత తీసి హెర్‌మన్ నోటికందించాడు. హెర్‌మన్ అతని వంక ఆశ్చర్యంగా చూశాడు. 'తాగు తమ్ముడూ!' —అన్నాడు. శత్రువు దుస్తులలోవున్న ఆ మానవుడు. ఎడమచేత్తో, హెర్‌మన్ శిరోజాలను జాలిగా దువ్వాడు. హెర్‌మన్ దీనుడై తన మోకాళ్లవంక చూసుకున్నాడు—అతన్ని చూడమన్నట్టు. చినిగి జీబులైపోయిన లాగూలోనుంచి రెండు మోకాళ్ళూ ఎద్దుపుండ్లులా బాడలై కనుపిస్తున్నయ్. 'మోకాళ్లు బాగా బాధగావున్నాయా తమ్ముడూ!' అన్నాడా వ్యక్తి. ఆ మాట్లాడుతున్నవాడు నిజంగా శత్రుపక్షానికి చెందినవాడని హెర్‌మన్ నమ్మలేకపోతున్నాడు. అతనితో మాట్లాడకుండా మొండిదజేచి మౌనం వహించాలనుకున్నాడు గాని, అతని అదుపులో వుండక దుఃఖసంతప్తాలైన అతని రెండుకళ్లూ కన్నీటిని విడిచిపెట్టినయ్.

'బలంగా దెబ్బలు తగిలినట్టేవున్నయ్!—మనం డాక్టరు నెవణ్ణన్నా చూడాలిసిందే'—

'డాక్టర్ ఎక్కడ దొరుకుతా డిక్కడ'—హెర్‌మన్ హతాశుడై అన్నాడు.

'ఈయుద్ధరంగంలో మీ హాస్పిటల్ ఏ చాయల వుందో చెప్పగలవా తమ్ముడూ?'—

ఆ వ్యక్తి తన్ను పరియాచక మాడుతున్నాడను కున్నాడు హెర్‌మన్: కొంచెం కచ్చగానే అన్నాడు: 'అక్కడికి వస్తే, నిన్నేం చేస్తారో అదే మన్నా కొంచెం ఆలోచించావా...?'

'అవును, ఖైదు చేస్తారు.—లేదా చంపుతారు' అని చిరునవ్వు నవ్వాడు: 'కాని మానవుడుగా నా బాధ్యతను నేను నిర్వహించుకున్న వాణ్ణవుతాను.

'బాధ్యతను నిర్వహించుకున్న వాణ్ణవుతాను'—ఇవే మాటలు తానూ లోగడ అనుకున్నాడు. కాని ఆ సందర్భం జ్ఞప్తికి వచ్చి సిగ్గుపడి తలవంచుకున్నాడు.

ఆ వ్యక్తి ఏదో ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నట్టు నెత్తిమీది ఉక్కుటోపీ తీసి తుపాకిసన్నీకి తగిలించి, తుపాకి చేత్తో బట్టుకుని లేచి నిల్చున్నాడు. మౌనంగా నిల్చుని రెండు క్షణాలు ఆలోచించాడు. దబాల్న తుపాకీ నేల పారేశాడు. ఉక్కుటోపీ తీసి తిరిగి నెత్తిన పెట్టుకుని దానితోలు పటకాలు గడ్డం క్రిందికి గట్టిగా బిగించుకున్నాడు.

'సరే తమ్ముడూ—ఇక చెప్పు!—హాస్పిటల్ ఏ వేపు నుంది,' అతి ప్రశాంతంగా అడిగాడు.

'ఇంతకీ నువ్వు ఏమిచేద్దామని'—అతని ధోరణి బోధపడక హెర్‌మన్ ఆశ్చర్యపడుతూ ప్రశ్నించాడు.

'చెప్తానుగా—హాస్పిటల్ సంగతి చెప్పవే!'

'అటు ఉత్తరంగా చర్చి గోపురం కనుపించుతోంది కదూ—ఆ చర్చిదగ్గిరే వుంది మా హాస్పిటల్!'

అతను నిల్చుని చుట్టూ పారజూచాడు. చర్చి గోపురం కనుపించింది. సరే, చాలా దూరమే—శత్రుస్థావరాల మధ్య వుంది. అతను హెర్‌మన్ ప్రక్కనే, మోకాటి తండావేసి కూర్చున్నాడు. 'పాపం! కదిలిస్తే బాధ పెడుతుందేమో—ఎల్లాగైనా క్షణం ఓర్చుకో' అంటూ హెర్‌మన్ను నెమ్మదిగా రెండు చేతులా పైకెత్తి, నెమ్మదిగా గోతి అంచు మీద పడుకోబెట్టాడు. తానుకూడా గోతిలోనుంచి

పైకి ఎక్కి వచ్చారు. హెర్మన్ ప్రక్కనే నేల మీద బోర్లగా పడుకున్నాడు. 'తమ్ముడూ! నీకేం ఫరవా లేదు; నెమ్మదిగా నా వీపుమీదికి ఒత్తిగిలి నా మెడ కావిలించుకుని హాయిగా పడుకో!"

హెర్మన్ను వెన్నుమీద పడుకోబెట్టుకుని అరచేతులతోనూ, పాదాల మునివేళ్లమీదనూ నేలమీద నావపాములా పాకిపోతున్నాడు—చర్చి గోపురం కనుపించుతున్న దిశగా. అలా గంటల తరబడిపాకాడు. అతని ఒళ్లంతాకూడా కొట్టుకుపోయి నెత్తురు కారుతోంది. ఆ కదలికతో హెర్మన్‌కు కూడా చాలా బాధగానే వుంది. కాని చర్చిదగ్గిరికి వచ్చేసరికి అతనికి ఎంతో హాయి మనిపించి ప్రాణం లేచివచ్చినట్లయింది. అతని వెన్నుమీదినుంచి నెమ్మదిగా క్రిందికి దొర్లాడు. అతన్ని అక్కడికి జేరవేసుకొచ్చిన ఆ వ్యక్తి లేచి మోకాళ్ళమీద కూర్చున్నాడు. రక్తధారలు ఓడుతూ, దుమ్ముకొట్టుకుని భీభత్సంగా వున్నా, అతని ముఖంలో వెన్నెలలా ఏదో ఒక మహా తేజం ప్రకాశించుతోంది. దేవతల ముఖాలు ఇలాగే వుంటాయి గాబోలు అనుకున్నాడు హెర్మన్. కాని ఇంతలో మోకాళ్లు మళ్లీ అపరిమితంగా బాధ పెట్ట సాగినై. మోకాళ్ళకు కట్టిన కట్లు మళ్ళీ రక్తంతో తడిసినై. తన కృతజ్ఞతను తెలుపుతూ అతని వంక చూసి ఒక చిరునవ్వు నవ్వాలనుకున్నాడు కాని, పెనవేస్తున్న బాధతో చుట్టలు చుట్టుకుపోయాడు—స్పృహ లేకుండాపోయింది.

తిరిగి హెర్మన్‌కు తెలివి వచ్చేసరికి అతని చుట్టూ కొంతమంది నిల్చున్నారు. అతనికిప్పుడేమీ జ్ఞప్తికి రావటంలేదు. నెమ్మదిగా మనోబలాన్ని కూడదీసుకుని: 'ఆ మనిషేడీ?' అని గొణిగాడు.

'వాడి గ్రంథం కనుక్కున్నాంలే—నీ కెందుకింకా ఆ బెంగ — దొరికిపోయావని కులుకుతున్నాడు వెధవ, అదృష్టం—సమయానికి వచ్చాం; ఒక్క గుండుదెబ్బతో తల పేలిపోయింది వెధవకి— అసలు ఆ కుక్క వెధవ, మన హాస్పిటల్ చుట్టూ తచ్చాడటానికి తెగించినందుకు చెప్పాలి!—ఏమిటి వాడి వెధవ ధీమా!!'

ఆ సమాధానంతో హెర్మన్ ప్రాణాలు అవటించిపోయినై. ఆ మానవులవంక చూడలేక మొగం తిప్పేసుకున్నాడు. పెద్దపెట్టున యేడిచెయ్యాలనే క్షోభ కలిగిందిగాని—ఏడవలేకపోయాడు.

శిథిలావస్థలో వుండికూడా, సూర్యకిరణాలుపడి ధగధగా మెరుస్తున్న చర్చిగోపురంమీద అతని చూపులు లగ్నమై పోయినై.

వాత్సల్యం

"బాలకృష్ణ"

మోహనుకు జ్వరం చాలా ఎక్కువగా ఉంది. 'నూటరెండు' అన్నాడు డాక్టరు. నీలిమ హృదయాన్ని ఆమాట కలచివేయ సాగింది.

"అబ్బే యీ సామాన్య జ్వరానికి భయమేమీ లేదండీ రేపు పొద్దుట యీపాటికి తగ్గిపోదూ"

అని ధైర్యం చెప్పి డాక్టరు జారుకున్నాడు. మాటలు అల్లా చెప్పాడు కాని డాక్టరు ముఖంమీద రోగిని చూచినప్పుడు పొడసూపిన నిరాశా రేఖల్ని, ఆతురతతో చిన్న అశుభసూచనసైనా పసికట్టె నీలిమకళ్లు గమనించకపోలేదు. అటునుంచి యిటు తిరిగి హృదయాన్ని చీల్చుకువచ్చే విచారాన్ని పైట చెంగు నోటికి అడ్డుపెట్టుకుని ఆపుకుంది. కంటినీరు చూస్తే భర్త కేకలు వేస్తాడని, నీలిమ బాధను హృదయంలోనే అణుచుకుంటూ కళ్లు తుడుచుకుంది. కంటినుండి చెక్కిలిమీదకు జారిన కన్నీటి చార అల్లాగే ఉండిపోయింది. అది యింక చెరగలేదేమో.

డాక్టరుబూట్లసవ్వడి హఠాత్తుగా ఆగింది. నీలిమ ఒళ్లంతా చెవులు చేసుకుని వింటోంది; డాక్టరు ఏమిచేస్తాడో విందాం అని. ఆమె హృదయం అల్లాన్ని శంకిస్తూ వేగంగా కొట్టుకుంటోంది. డాక్టరు భర్తతో "ఈరోజు దాటితే రోగి బ్రతుకుతాడు"అని చెపుతున్నాడు. నీలిమ హృదయం పగిలింది. ఆపుకోలేక 'భోరు'మని ఏడ్చింది. భర్త లోపలకువచ్చి "అబ్బే అదేమిటి అల్లా అధైర్యపడకూడదు ఇప్పుడేగా డాక్టరుగారు యింక తగ్గిపోతుందని చెప్త". నీలిమ ఎందుకు ఏడుస్తోందో అతనికి తెలుసు. ఇద్దరికీ తెలుసు మృత్యువు ఛాయలు రోగిని కప్పుతున్నాయని. అయినా ఒకరికి ఒకరు ఆమాట చెప్పకోరు. ఆమాట అంటే అమితమయిన భయంతో వణికిపోతారు. "ఇదుగో యింక యిల్లా ఏడవటం మొదలు పెడితే యీ యింట్లో బ్రతకటం నా తరంకాదు జంధ్యాలు తెంపుకుపోతాను ఎక్కడికయినా" నీలిమకు తెలుసు అతడు అంతటి సాహసి అని.

నీలిమ భర్తపేరు మాధవరావు. ఇప్పుడు న్యాయవాదవృత్తి చేస్తున్నాడు. నీలిమను యిద్దామని నీలిమ తండ్రి వెళ్ళినపుడు ఖచ్చితంగా చెప్పేశాడు మాధవరావు 'నే పెళ్ళిచేసుకోను' అని. అయినా పెద్దలు "తప్పదు తల్లిలేని పిల్ల మేనరికం వాళ్లు చేసుకోకపోతే ఎవరు చేసుకుంటారు" అన్నారు. 'తప్పించడం నా చేతులోది'అని అజంతా ఉడాయించాడు. చాలాకాలం చాటుగా తిరిగాడు. చివరకు పట్టుకుని పెళ్లిచేశారు పెద్దలు. పెళ్లి అయిన తర్వాతకూడా చాలాకాలం అత్తవారింటికి రాక, చాలా మారాము చెయ్యడం, మామగారు పోయిన తర్వాత నీలిమను తీసుకువెళ్ళడం...అంతా ఘరోక గాథ.

హృదయం పగిలిపోతున్నా, భర్త మాటమీద నోరు మూసుకుని మూగబాధను అనుభవిస్తోంది నీలిమ. 'నిన్ను చూస్తే వాడు ఎంత బెంగపెట్టుకుంటాడో తెల్సా' అని మందలించాడు మాధవరావు. ఈమారు నీలిమ కంటిధార కట్టుబడింది. మోహను ఇది చూస్తే ఎంత బెంగపెట్టుకుంటాడు. తను సంతోషంగా పరిచర్యలు చేస్తూఉంటే కోలుకోవచ్చు. తన ప్రేమతో తన ఆయుర్దాయాన్ని సగంచేసి మోహనుకు పొయ్యలేదూ..."ఈరోజు దాటితే—" ఆశారేఖ 'తళుక్'మంది. తను వెయ్యికళ్లతో కాస్తూ ఉంటుంది రోగిని, ప్రాణం ఎల్లా పోతుందో చూస్తుంది.

మోహనుకు తొమ్మిది ఏళ్లు. ముఖంమీద నీరసం ఏదో నిరాశ తాండవిస్తోంది. అప్పుడే అది ఇరువదవ లంఘనం. మరణం అంటే అతనికి ఏమీ తెలియదు. కాని తను మరణిస్తే మళ్లీ వదినను చూడలేదు అని మాత్రం తెలుసు. అందుకోసమే అతనిలో ఏదో ఆవేదన ఆరంభమయింది. ఇరవయిరోజుల క్రితం అమ్మ చచ్చిపోయింది. అది చూశాడు. అంతా ఏడ్చారు. తనూ ఏడ్చాడు గుండె పగిలేలా. ఎవరో ఒకామె వచ్చి 'ఎందుకు నాయనా అల్లా ఏడుస్తావు మీ అమ్మ

మీ నాన్న పిలిస్తే అక్కడకు వెళ్ళింది' అని చెప్పింది. 'నాన్న ఎక్కడ ఉన్నారు' అనడిగాడు మోహను అమాయకంగా. 'స్వర్గంలో' అని చెప్పిందామె సమాధానం. "మరి అయితే ఎక్కడకు వెళ్ళినా మా అమ్మ నన్ను తీసుకువెళ్ళేది ఇప్పుడు తీసుకువెళ్ళలేదేం' అని అడిగాడు. 'కొన్నిచోట్లకు పెద్దవాళ్ళే కాని చిన్నవాళ్లు వెళ్ళకూడదు' అని సమాధానం.

'ఏం ఎందుకు వెళ్ళకూడదూ?'

"స్వర్గంలో చాలా సౌఖ్యంగా ఉంటుంది. కాని గుమ్మందగ్గర పెద్దభూతం ఉంటుంది. దాన్ని చూస్తే నువ్వు భయపడతావు. అందుకు నిన్ను తీసుకువెళ్లలేదు."

'అమ్మకి భయం వెయ్యదూ?'

'మీ అమ్మ చాలా భూతాల్ని చూడటం నేర్చుకుంది. ముందు మీ నాన్న నేర్చుకుని స్వర్గానికి వెళ్ళిపోయారు. అప్పుడు మీ అమ్మ కూడా తనను తీసుకువెళ్లమని ఏడ్చింది—కాని మీ అమ్మ అప్పటికి భూతాలను చూడటం నేర్చుకోలేదు. అందుకు మీ నాన్న తీసుకు వెళ్ళలేదు. పెద్ద అయింతర్వాత నీకు కూడా భూతాలను చూడటం, భయపడకపోవటం అలవాటు అవుతుంది. అప్పుడు నువ్వు కూడా వెళ్ళవచ్చు'

"మీకు చాతవచ్చా భూతాలను చూడటం?'

'ఇంకా పూర్తిగా రాదు. అందుకే నేను ఉండిపోయాను' అని సర్ది చెప్పింది ఆ యిల్లాలు.

ఆమె చెప్పింది చూస్తే సరిగానే ఉంది. తను కూడా భూతాలను చూడటం నేర్చుకుంటే, అమ్మదగ్గరకు వెళ్లివచ్చు అనుకున్నాడు. ఆవాళ రాత్రి యిల్లంతా చాలా హడావుడిగా ఉంది. చాలా మంది చుట్టాలు వచ్చారు. వాళ్ళంతా అమ్మ ఎంత ధైర్యం గలదో భూతాల భయం తొందరగా వదుల్చుకుంది అనుకుంటూ చాలా యిదిగా ఉన్నట్టు అనిపించింది. ఒకళ్ళిద్దరు మోహన్ని ఒళ్లోకి తీసుకుని 'అయ్యొయ్య యీ చిన్ని వయసులోనే నీకెంత బాధొచ్చిందిరా' అని రాగాలు తీశారు. వాళ్లు ఎందుకు అల్లా ఏడుపు మొఖాలు పెట్టారు అని ఆలోచించాడు చిన్ని మోహను. అమ్మ సుఖపడేందుకు వెళ్తే మాత్రం తనకి బాధకదూ అమ్మ తనను వదలివెళ్తే...తన బాధ చూసి వాళ్లు బాధపడుతున్నారు అని సమాధానం చెప్పుకున్నాడు. నిజంగా అందుకే అయివుంటుంది. వెర్రివాళ్ళల్లా ఉన్నారే తను అంత బాధపడటం లేదనీ, తొందరగా భూతాలదగ్గిర భయం వదుల్చుకుని తనూ వెళ్లిపోతున్నాననీ చెబ్దాం అనుకున్నాడు. ఇంతలో వదినవచ్చి తనను చేతుల్లోకి తీసుకుని 'అతనికేం తెలుసు...గురేం పరామర్శచేసి బాధ పెట్టొద్దు' అని తనని దూరంగా తీసుకువెళ్లింది.

రోజూ మోహను 'అమ్మ'పక్కన పడుకునేవాడు. అమ్మ కథలు చెప్పేది అమ్మ కథ చెప్తూ ఉంటే అల్లా నిద్ర ఎప్పుడో ముంచుకువచ్చేది. తను నిద్రపోయేవాడు అమ్మమీద చెయ్యి వేసుకుని. ఆవాళ అంతా వదిన తనను వదిలిపెట్టలేదు. అన్నయ్య అసలు కనపడనే లేదు. ఆవాళ అన్నంతిన బుద్ధివేసింది కాదు. వదిన, దగ్గరకూర్చుని కలిపి పెడ్తోంది.

"ఒదినా అమ్మ, నాకు యిల్లా అన్నం కలిపి పెట్టమని చెప్పి వెళ్ళిందా."

"అవునమ్మ' అని ముఖం అటు తిప్పుకుంది.

ఇల్లా పెట్టడం వదినకి కష్టమేమో వదిన ఇల్లా కలిపి పెట్టడం యిష్టంలేక ముఖం తిప్పుకుందేమో. ఒదిన కళ్ళవెంట నీళ్లు కారుతున్నాయి.

"ఇల్లా ఏడుస్తూ పెట్టేమాట ఉంటే, నేనే కలుపుకు తింటాలే!...

'లేదు నాయనా ఏడవనుగా' అని ఒళ్ళోకి తీసుకుంది నీలిమ. మోహను ఆమెవడిలో ఒదిగిపోయాడు. ఇంకా దగ్గరగా హృదయానికి హత్తుకుంది. అదోలా ఉంది. వదిన చాలా మంచిది.

'చాలా మంచివాడవు. యిది తిను మరి'

ఒదిన చాలా మంచిది. నెమ్మదిగా మోహనుకు వదినకూడా అమ్మలా తనను వదిలి స్వర్గం వెళ్ళిపోతుందేమో నని అనుమానం వచ్చింది.

"నువ్వుకూడా నన్నువిడిచి స్వర్గం వెళ్ళిపోతావా వదినా?"

చిట్టెమరది, అమాయకత్వంతో తనకు తను సమాధానం చెప్పుకోవడం చూస్తే, గుండె తరుక్కుపోయింది.

" నేను చెప్తున్నాగా నిన్నువిడిచి నేను ఎక్కడికీ వెళ్ళను. ఇంక బెంగలేదులే తిను" అని తినిపించింది అన్నం. ఎందుచేతో మోహను తినలేకపోయాడు.

"పోనీలే సయించకపోతే" అని పీటలెత్తి మరది మూతికడిగింది నీలిమ.

ఆవాళ మోహనుపక్కన నీలిమ పడుకుంది. సరిగా అమ్మలాగే; అల్లాగే మీద చెయ్యివేసి. మోహను నిద్రపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆలోచనలు, సందేహాలు..."అమ్మ ఈపాటికి స్వర్గం చేరిఉండవచ్చు' అనుకున్నాడు. సుమ్మందగ్గర భూతాన్ని దాటి ఉంటుంది. ఏమో ఆ భూతం అమ్మను మింగేసిందేమో. ఎల్లాగ తెలుస్తుంది?

"వదినా వదినా మరి ఆ భూతం అమ్మను మింగెయ్యదా?"

"అశ్శే మింగడం దానికి చేతకాదు."

'ఊహూ అల్లాగా' అనుకుని మోహను నెమ్మదిగా కన్ను మూశాడు, తను భూతాలను ఎలా తొందరగా అలవాటు చేసుకుని అమ్మదగ్గరకు పోతానా అని ఆలోచిస్తూ.

ఈమధ్య రాత్రులు భూతాలు కనపడుతున్నాయి. మొదటి రోజున చాలా భయం వేసింది. పిచ్చిగా గావుకేక వేసి వదిన మెడకు చేతులు చుట్టి అల్లా బిగుసుకు ఉండిపోయాడు. "ఏమిటి నాయనా.. యిల్లా చూడు నీకు భయమేముంది. చెప్పు?..."

"వదినా...అదుగో...అదుగో...భూతం"

"భయంలేదు నాయనా...అశ్శే భూతం లేదు ఏమీ లేదు...యిల్లా చూడు నేను..."

"అదుగో వదినా...అక్కడా...భయం ..."

"మీ అన్నయ్య ఉన్నారు. నేను ఉన్నాను. నీకేం భరవాలేదు. భూతం వచ్చినా మేము కొట్టి పంపేస్తాము. ఇంక నిద్దరపో" అని ప్రక్కన పడుకుంది నీలిమ.

'ఇల్లా భూతాలంటే భయపడ్తే ఎల్లా? వాటి దగ్గిర అలవాటు చేసుకోవాలి. అమ్మదగ్గరకు వెళ్లాలి' అని ఆలోచిస్తూ పడుకున్నాడు. భూతాలు కనపడుతూనే ఉన్నాయి. నెమ్మదిగా అలవాటు పడుతున్నాడు మోహను రోజులు తిరుగుతున్న కొద్దీ. రోజూ ఆ దినంనుంచీ కొద్దో గొప్పో జ్వరం తగుల్తూనే ఉంది. మొదట్లో కొంచెం భయపడ్డాడు కుర్రాడు అనుకున్నారు. అది టైఫాయిడులో దింపింది.

నీలిమ, భర్త మందలింపులో కళ్ళు తుడుచుకుని రోగి మంచం దగ్గరకు వెళ్లింది. మోహను మూసిన కన్నెరగకుండా ఉన్నాడు. నీలిమ హృదయంలో ఏదో ఆవేదన ఆరంభమయింది. దగ్గరకు పోయి మీద చెయ్యివేసి 'బాబూ' అని పిలిచింది. ఎందుకో ఊరికే...కళ్లు తెరిచాడు. "ఇల్లా చూడు నేనూ..." "ఊఁ" అని అటునుంచి యిటు తిరిగి పడుకున్నాడు.

"వదినా నాకు భూతాలదగ్గర అలవాటయి పోయింది; ఇక అమ్మదగ్గరకు పోవచ్చు కదూ...?" శుభ్రంగా, ఆరోగ్యంగాఉన్న మనిషల్లే అడిగాడు మోహను.

"బాబూ ... బాబూ ... యిల్లా చూడు ... నేను... నేను...నీ వదిన్ని..."

కళ్లు విప్పిచూసి 'వదినా' అన్నాడు.

'ఆ నేనే...వదినను ఏంకావాలి బాబూ..."

"అమ్మదగ్గరకు వెళ్తున్నా..."

"నే అమ్మదగ్గరకు వెళ్తున్నా వదినా!..." నీలిమ నోటిలో గుడ్డ కుక్కుకుని భావురుమంది.

2

మోహను నెమ్మదిగా కోలుకుంటున్నాడు. ధైర్యం చెప్తూ వదిన ప్రక్కన పడుకుంటోంది. వదిన మీద చెయ్యివేసుకుని నిద్రపోయేవాడు మోహను ఏవేవో కలలు కంటూ. ఒక్కరోజున ఏవో కబుర్లు చెప్పేవాడు వదినతో. తల్లిలేని ఆ బిడ్డమాటలు వింటూఉంటే కడుపు తరుక్కుపోయేది. మోహనును యింకా దగ్గరకు తీసుకునేది. వదిన కౌగిలిలో కోటలోలా, ప్రశాంతంగా నిద్రలో వాలిపోయేవాడు. తనలో నీరసం అంతాపోయి వదినలో ధైర్యం బలం తనలో ప్రవేశిస్తున్నట్టు అనిపించేది. రోజురోజుకు ఆరోగ్యవంతు డవుతున్నాడు.

'వదినా పుస్తకాలు లేవు...అబ్బబ్బ ఎక్కడ పెట్టావు...ఇప్పుడు బడికి వెళ్లాలా? అవి కనపడక పోతే ఎల్లాగ?"

'నాయనకాదూ కోపపడకు మరి...యిస్తున్నాగా. వస్తున్నా...అన్నయ్య పిలుస్తేను కొంచెం ఆలస్యం అయింది!"

"నేను ఇంక వెళ్లను వదినా బడికి...కుదరదు యిల్లా ఆలశ్యం చేస్తే ఎల్లా?"

అని గారాం చేస్తాడు చిట్టిమరది. ఈమధ్యే పదవ పుట్టినరోజు పండగ తల్లి లేని లోటు కనపడకుండా జరిగిపోయింది.

'వదినా' అనే పిలుపు వినగానే నీలిమ ఆతురతగా, భర్త పని చూస్తూఉన్నది వదిలి మరదిదగ్గరకు వెళ్లింది. మరదిని గారంచేసి బడికి వెళ్తూఉంటే బుగ్గ గిల్లి ముద్దుపెట్టుకు పంపుతుంది.

మోహనుకు భోజనం పెట్టి చదువుకోమని దీపం యిచ్చి, పుస్తకాలు యిచ్చి వంటయింట్లోకి వెళ్లింది.

అతను తన ఊహకు అందినంతవరకు తను చదివే పద్యానికి అర్థం చెప్పుకుంటున్నాడు. "అక్క లేనపుడు మా అమ్మ తలకు"... ఇది రేపు పొద్దుట అప్పగించాలి. ఒకసారి రెండుసార్లు చదివాడు. ఏవో ఆలోచనలు సాగిపో నారంభించాయి. 'అక్క లేనపుడు మా వదిన తలతు' అనుకున్నాడు. జోడుపదాల మధ్యనున్న భావాన్ని తనకు తెలిసున్న కొన్ని విషయాలతో కలిపి అర్థం చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాడు. అమ్మ అంటే మంచిమొక్కపోతు అన్నమాట. తనను అన్నివిధాలా వదిన అమ్మను మరపిస్తున్నా ఎక్కడైనా దెబ్బతగిలితే 'అమ్మా' అనే అంటాడు అనుకోకుండా. అమ్మా అంటే ఏదో బాధ దిగిపోయినట్టు అవుతుంది. అమ్మ స్వర్గానికి వెళ్ళింది అనుకున్నాడు మరోకసారి. అన్నట్టు స్వర్గానికి వెళ్లినవారు కనపడకుండా తిరగగలరట. మొన్న అల్లా స్కూల్నుంచి వస్తూ ఉంటే, ఎన్నాళ్లో అయి స్వర్గానికివెళ్లిన వాళ్ళ అమ్మ, ఒక పదిహేనుఏళ్ళ అమ్మాయికి కనపడిందట. ఏవో కోరికలు కోరుతుంటే చూశాడు. వాళ్ల అమ్మ అల్లా కనపడింది కదా తన అమ్మ ఎందుకు తనకి కనపడలేదో అర్థంకాలేదు. ఇది తేలని సమస్య అయిపోయింది. ఆ పద్యం రావటల్లేదు. పద్యం బదులు ఏవో ఆలోచనలు అమ్మగురించి బుర్రలో తిరుగుతున్నాయి. వదినని అడుగుతే వదిలిపోతుందిగా అనుకుని బయల్దేరాడు లోపలకు వెళ్లేందుకు.

అన్నయ్య భోంచేస్తున్నాడు. వదిన గుమ్మం మీద కూర్చుని కబుర్లు చెప్తోంది.

'నువ్వు మరీ గారంచేసి గాడిదలా... తయారు చేస్తున్నావు!'

"అదేమిటండీ అల్లా అంటారు. తల్లి లేని పిల్లాడాయె, బెంగ పెట్టుకోదుటండీ..."

"ఒక నెల రెండు నెల్లు ఎన్నాళ్లకయినా ఆ రోజు పాతపడదూ?"

"తల్లి లేని లోటు పాతపడేది కాదు"...

"అవుతే అల్లా నెత్తి నెక్కించుకుని గాడిదలా తయారు చేస్తావంటావు?"

"అది కాదండీ మీరు ఆలోచించటల్లేదు. అతవిది ఎంత సున్నితమయిన మనస్సో..."

"మహా నీకే తెలుసు..."

"అహ అల్లా గట్టిగా అనకండీ...పొరపాటున వినపడ్డా బాధపడ్తాడు. అతనూ ఒక మనిషి అయేదాకా ఆ లోటు కనపడకుంటా చూచే బాధ్యత మనదా..."

"ఆమాత్రం బాధ్యత నాకూ తెలుసు...... అతిగా పోతే గాడిదలా తయారు అవుతాడనే నేననేది. రేపు పొద్దుణ్ణుంచి వాడిని బడికి పంపేందుకు దానికి అల్లా గారం చెయ్యడానికి వీలు లేదు తెలిసిందా?...ఈసారి మారాం చెయ్యనీ చెమడాలు ఎక్కకొడ్తాను..."

"పోనీ మీరు చెప్పినట్టే లెండి. మీరేమీ అనకండి. నే నెమ్మదిగా చెప్పిచూస్తాను..."

మోహను మాటలు వింటున్న వాడు అల్లాగే ఆగిపోయాడు. ఏ వ్యక్తి వినిపోతాడేమో అని వదిన తహతహలాడిందో ఆ వ్యక్తి చెవిని ఆ మాటలు పడ్డాయి. అతను వచ్చిన పని మర్చిపోయి అల్లా నుంచుని ఉండిపోయాడు. ఎందుకో ఆ సమయంలో వాళ్ళు యిద్దరూ మాట్లాడుతూ ఉంటే తను వెళ్ళకూడదు అనిపించింది. వెనకకు తిరిగాడు. అయినా...అదన్నమాట అమ్మకు వదినకూ తేడా. అదే అమ్మఅవుతే ఇల్లా అన్నయ్య అనేందుకు వీలు ఉంటుందా.? అమ్మలేని లోటు ఇప్పుడు కనిపించింది. దుఃఖము పొంగి పొరలివచ్చింది. అమ్మదగ్గరకు పోతే బాగుండు ననిపించింది. అన్నయ్య వదినతో అల్లా చెప్తాంటే విన్నాడు. రేపు ప్రొద్దుట నుంచి తను ఏంచెయ్యాలి. వదినకూడా 'నే చెప్పి చూస్తా' అంది కదూ. తను వదినను పుస్తకాలగురించి అడగకూడదు. ఏదో ఒకచోట దాచి పెట్టుకుని తనే తెచ్చుకోవాలి. ఇంక తను బడికి వెళ్ళనని మారాం చేస్తే ప్రేమతో "వెళ్లాలి మరి ..మీ అన్నయ్యగారికి మల్లే పెద్ద ఉద్యోగం చెయ్యాలి" అనే వదినమాటల బదులు అన్నయ్య రూక్షారుణనయనాలు ఎదురు అవుతాయి. తను భయం భయంగా భారంగా బడికి వెళ్తాడు. ఇంటికి రాగానే 'వచ్చావా...ఇదుగో ముఖం కడుక్కుని బట్టలు మార్చుకువస్తే మంచి తాయిలం పెడ్తాను' అనేది.

"నేను మార్చుకోను...."

"అవుతే తాయిలం లేదు'...

"పోన్లే తిననే తినను..." అని తాను కోపం నటించినప్పుడు వదిన బ్రతిమాలడం ఇటువంటివి ఇంక ఉండవు. అన్నయ్య, మాష్టరు కేకలు వినేందుకే తను

బ్రతికొలి. వదిన తనకు దూరంగా ఉంటుంది అల్లా దూరమయిపోతుంది. భరించలేకపోయాడు మోహను.

లోపలికి పోయి వేసిఉన్న పక్కమీద పడుకున్నాడు ఇంక చదవలేక. ఏడుపు ఆగలేదు. చెక్కిళ్ళమీద చారలు కట్టాయి కన్నీళ్ళు.

మోహనకు వదిన ప్రక్కన పడుకోవటం అలవాటయిపోయింది. అతనిది చిన్నమంచం. ప్రక్కనే ఆ గదిలోనే పెద్దమంచం. దానిమీద అన్నయ్య పడుకుంటాడు. అది మోహను నుంచుంటే అందదు. దాని కోలుపట్టుకుని చెట్టెక్కినట్టు ఎక్కేవాడు, అప్పుడప్పుడు చిన్నపిల్లలా దానిమీద కూర్చుని వదిన 'నన్ను ముట్టుకోకు' అన్నప్పుడు.

"కిందికి రావాలి మరి ముట్టుకుంటానో ముట్టుకు చూపిస్తానో; పైన నాకందని చోట కూర్చోవడం ఏమిటి గొప్ప!..." అని బుంగమూతి పెట్టేవాడు.

"ఆహా యిక నేం నువ్వు ఓడిపోయావు క్రిందకు వస్తే నువ్వేముట్టుకోవడమే ఏం, ఇప్పుడు పుట్టిన చంటి పాపకూడా ముట్టుకుంటుంది"...

మరిదికి పౌరుషం వచ్చేది.

"ఉండు నీపని చెప్తా. నేను ముట్టుకోలేననుకుంటున్నావా? నీకే కాదండోయ్ నాకూ చేతొచ్చు ఆమాత్రం" అని కష్టపడి ఒక కాలు పట్టుకుని పైకి ఎక్కేవాడు. నీలిమ మూలకు ఒదిగిపోయేది మరిది ఇక ముట్టుకుంటాడు అని భయపడ్డట్టు. పెద్ద వీరుడులా వదినను భయపెడ్తూ ముందుకు పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ పరుపుమీద నడిచేవాడు. వదినని ఇట్టే ముట్టుకునేవాడు. వదిన తన ముఖంఅంతా ముద్దులతో కప్పేసేది. తను వదిన కౌగిలిలో కరిగిపోయేవాడు.

మోహను అంతవరకూ జ్ఞాపకం తెచ్చుకున్నాడు ఎప్పుడో జరిగిన సంఘటన...తను పరుపు మీద నడుస్తున్నప్పుడు అన్నయ్య వచ్చాడు.

"వెధవా పరుపు అల్లా తొక్కుతా వేమిట్రా మళ్ళీ పడుకోవాలా" అని కేకలు వేశాడు.

తను భయంతో వణకిపోతున్నాడు. వదిన తనని ఒడిలోకి తీసుకుని

"చాల్లెద్దురూ కుర్రవాణ్ణి కేకలు వేస్తారు. మాసిపోతే కొంపేం మునగదు. దుప్పటి మార్చవచ్చు" అంది.

అన్నయ్య అల్లా కేకలువేస్తే వదిన ఈవాళ ఏమీ మాటాడదు తనను పులికి అప్పగించిన ఎరలా వదిలేసి. భయం వేసింది. వణకిపోయాడు.

అన్నయ్యమాట వినపడింది గదిబయట.

"దొరగారు అప్పుడే మంచం ఎక్కారు'

వదిన ఏమీ మాట్లాడలేదు. వదినముఖం ఒక్కమారు చూద్దాం అనుకున్నాడు. అన్నయ్య ఉన్నాడు. భయం వేసింది. నిండా ముసుగు కప్పుకున్నాడు.

అన్నయ్యను చూడటంతో భోజనం దగ్గర వదినతో అన్నయ్య అంటున్న మాటలు జ్ఞాపకం వచ్చాయి. వదిన దూరమయిపోతుంది. తను ఎల్లాగ భరించడం? దేవుని దయవల్ల అమ్మకు ఈ విషయం ఎల్లాగయినా తెలిస్తే బాగుండును. ఆ అమ్మాయికి వాళ్ళ అమ్మ ఏదో చెప్పినట్టు తనకుకూడా చెప్తే బాగుండును.

వదిన దూరంగా తప్పుకుంటోంది సాయంత్రం సూర్యబింబంలా. ఏదో క్లిక్‌మంది. చీకటి ముసురుకుంది. ఆ చీకటిలో భయం వేసింది.

నీలిమ తెల్లటి చీర కట్టుకుని విచ్చిన కలువలా ఉంది. ఆమె చెక్కిళ్ళు సిగ్గువల్ల ఎరుపెక్కి విరిసీ విరియని గులాబిపువ్వుల్లా ఉన్నాయి.

'నాయనా నిద్రపట్టిందా?' అది వదినకంఠం.

మోహను ఈ దృష్టిలో లేడు. చీకటిలో దారి లేక తన్నుకుంటున్నాడు.

కిలకిలా నవ్వింది నీలిమ మాధవరావు చిలిపి చేష్టకి.

గది అంతా చీకటి. నీలిమ కిలకిల నిశ్శబ్దాన్ని భంగపరుస్తోంది.

మోహనుకు దారి కనిపించటల్లేదు. ఇటువంటి అవసరం ఇదివరకు రాలేదు. వచ్చిఉంటే వదినను అడిగి ఉండేవాడు. కాని దీనితో వదినకుకూడా సంబంధం ఉంది. అందుచేత వదినను అడగకూడదు అనిపించింది. చీకటిలో చిన్నదీపం దూరంగా కనిపించింది. దాని వెనకాల ఎవరో తనవైపే వస్తున్నారు. పరకాయించి చూశాడు. అమ్మ... నెమ్మదిగా వస్తోంది. స్వర్గానికి వెళ్లిన చీరతోటే ఉంది. ఇప్పుడు దుద్దులూ మంగళసూత్రం కూడా ఉన్నాయి. చెవులు రిక్కించుకుని వింటున్నాడు ఆమె ఏమన్నా చెపుతుందేమోనని ఆశగా. ఆమె దగ్గరకు వచ్చి చెవిలో చెవిపెట్టి 'అవును నాయనా వదినకు అన్నయ్య ఉన్నాడా మరి...అస్తమానూ నీతో ఉంటే ఎల్లా?... రేపట్నుంచి వదినకు కష్టం కలిగించకుండా నువ్వే దూరదూరంగా ఉంటూఉండు. వదినని అన్నయ్యకూ

నీకూ మన్య నలిగిపోయేట్టు చెయ్యకు' అని చెప్పింది. ఏదో సందేహం తీర్చుకుందుకు నోరు తెరవాడు. అమ్మ మాయం అయింది దీపం లేదు. అలాగే చేద్దామను అనుకున్నాడు. ఇంక రేపట్నుంచి వదినకు దూరంగా ఉండాలని నిశ్చయించుకున్నాడు. అమ్మ మళ్లీ కనిపిస్తుందేమోనని ఆశగా చూస్తున్నాడు.

ఏదో 'కిలకిలా' వినిపించింది.

చీకటి ఉండకట్టుకుని భూతంరూపంలో ముందుకు వచ్చి నుంచుంది.

"ఏవా అమ్మ స్వర్గం వదిలి రాకూడదు. ఇక్కడకు వచ్చినట్టు తెలిసింది. వచ్చిందా లేదా నిజం చెప్పు" అని ఉరుముతూ అడిగింది ఆ నల్లటిభూతం.

ఏమి చెప్పాలో అర్థంకాలేదు.

"రాలేదు" అన్నాడు.

"నిజం చెప్పు" మింగేందుకు నోరు తెరచింది ఆ భూతం.

"అమ్మా..." అని పెద్ద కేక పెట్టాడు మోహను భయంతో.

వదిన మంచం దిగి వచ్చి ప్రక్కన పడుకుని 'భయంలేదు నాయనా' అని వెన్ను రాస్తోంది.

నిశ్శబ్దంలో మాధవరావు నరాల బిగువు సడల్చుకునే నిట్టూర్పు తన సుఖపుబాటకు అడ్డువచ్చినపుడు కొట్టే పాము బుస్సలా ఉంది.

వదిన అమృతహస్తం వెన్నుమీద పడడంతో భూతం చీకటిలో కరగి మాయం అయింది. ఇంకా గుండె కొంచెం వేగంగా కొట్టుకుంటూనే ఉంది.

'ఏం జరిగింది నాయనా?"

"ఆ...ఆ భూతం వచ్చింది"...

"అబ్బే ఏమీలేదు యిల్లా చూడు..."

కాని ఆ పదేళ్ల తల్లిలేని కుర్రవాడు ఎదురుగా కనపడి తనను భయపెట్టిన భూతం 'వట్టిది ఏమీలేదు' అంటే నిజమని నమ్మి మరచిపోగలడం అసంభవం. అదీ కాక ఈమధ్య భూతాలు కనపడ్తూనే ఉన్నాయాయెను.

"అవును ఇప్పుడేం లేదు..."

"ఏంలేదు పడుకో నాయనా..."

అని ఒదిన అన్నయ్య కళ్లను మాకేమో ప్రక్కమీదనుంచి లేవబోయింది. వదలని ప్రేమపాశంలా చీర చెరగు పట్టుకుని "ఒక్కసారి యిల్లా పడుకో వదినా" అని ప్రాధేయపడ్డాడు.

"ఒదినా వదినా నువ్వు వెళ్లిపోతే ఆ భూతం మళ్ళీ వస్తుందని భయంగా ఉంది" అని తన భయాన్ని వెళ్లబోశాడు.

"అబ్బే నే వెందుకు వెళ్లిపోతాను. అన్నయ్యకి మంచినీళ్లు కావాలట. యిచ్చొస్తా..." అని లేచి వెళ్ళి అన్నయ్యతో ఏదో చెప్పింది.

విసుగ్గా వాలిపోయాడు అన్నయ్య మంచం మీద.

"అదంతా మనం అనుకోడంలో ఉంటుంది అంతే...భూతాలు అనేవి అసలు లేనేలేవు" అని సర్దిచెప్పబోయింది, చెయ్యి మీద వేసుకుని ఆమె చేతుల మధ్య ఒదిగి ధైర్యంగా ఊపిరితీస్తున్న మరదికి.

ఈవిడేగా కొన్నాళ్ల క్రితం భూతాలు ఉన్నాయని ఒప్పుకుంది. ఇప్పుడు లేవంటుందేం?

ఇలా పెద్దాళ్ళు ఎందుకు అబద్ధాలు చెప్తారో అర్థంకాలేదు. అయినా ఈనాటి వదిన మాటలు ఊరికే తనకు ధైర్యం చెప్పేందుకు అన్నవే కాని నిజం కావని కనిపెట్టేశాడు. హఠాత్తుగా అతనికి ఆ వయస్సులో రావటం సంభవం కాని సందేహం వచ్చింది. మరి తిరిగిరాని అమ్మను మరపించేందుకు అప్పుడే అటువంటి అబద్ధం ఆడారేమో; ఇప్పుడే నిజమేమో. ఈ విషయాన్ని నమ్మరాదని శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాడు. కాని తన హృదయం ఇన్నినాళ్లుగా పాతుకుపోయిన ఏ నమ్మకంతో తను అమ్మ పోడంలో బాధను మరచిపోగలిగాడో, ఆ నమ్మకం అపనమ్మకమయినా విడిచిపెట్టలేడు. వదిన మాటలమీద ఎంత విశ్వాసం ఉన్నా ఆ నమ్మకాన్ని కూకటివేళ్లతో కూల్చ్రోయలేక పోయాడు. తను యిన్నాళ్లుగా భూతాలదగ్గిర భయం లేకుండా ఉండడం అలవాటు చేసుకుంటున్నాడు. అవికూడా సునూరుగా మచ్చిక అయిపోయాయి. అయినా భూతాలుకూడా అబద్ధాన్ని సహించవేమో ఇందాకటి భూతం తను నిజం దాచటంచూసి నోరు తెరచింది మింగేందుకు. చీకటి కరడుకట్టుకుంటోంది...కరడు కట్టిన చీకటి పైభాగంలో పొడుగుపాటి కోరలు సానపట్టిన కత్తుల్లా తళుక్కుమన్నాయి...'ఒదినా...ఒదినా' అని పిలిచిన అతని పిలుపు గొంతుకులోనే ఆగిపోయింది. ఒదినమీద తను కూడా చెయ్యివేసి యింకా దగ్గిరగా ఒదిగిపోయి కౌగలించుకున్నాడు. వదిన యింకా దగ్గిరకు తీసుకుంది. ఇరువురి హృదయాలూ యింకా దగ్గిర అయాయి.

'ఇదుగో' అని పిలిచాడు మాధవరావు నీలిమను

మోహను మళ్ళీ ఈ ప్రపంచంలో పడ్డాడు అన్నయ్య గొంతుక వినపడేంతలో.

మాధవరావు నిద్రపట్టని విసుగులా దొర్లుతున్నాడు మందంపొరవంటి అంత మందంకూడా దిసదిస లాడుతోంది అతని చర్యమాని.

'ఊ'... నెమ్మదిగా అంది నీలిమ నిద్రపోతున్నట్టు పడుకున్న మరదికి నిద్రాభంగం అవుతుందని.

అటునుంచి ఇటు దొర్లి పడుకున్నాడు మాధవరావు.

మోహను ఎందుకో వదిన తనదగ్గర పడుకోవటం అన్నయ్యకు కిట్టదు అనుకున్నాడు. అన్నయ్యకు కోపం వస్తుంది వదినమీద, అతికూడా అనుకున్నాడు. వదినకు తను మెలుకువగా ఉన్నట్టు తెలుస్తే తనకు భయం వేస్తుందని కదలడు. అమ్మ చెప్పినట్టు పాపం వదినని తను యిద్దరిమధ్యా బాధ పెట్టకూడదు అనుకున్నాడు.

నీలిమ, మరది నిద్రిస్తున్నాడనుకుని; తన కౌగిలికోటలో రక్షణకోసం తలను దాచుకున్న మరదిని తన కౌగిలినుంచి సడలించి పక్కకు జరిగింది. నిద్రమత్తులో తన చేతులు తీసుకుంటున్నట్టు, చేతులు తీసి అటు తిరిగి పడుకున్నాడు మోహను. నీలిమ 'నాయనా' అని పలుకరించి చూసింది. ఈమారు వదినను కష్టపెట తలుచుకోలేదు. వదిన తను నిద్రపోతున్నాననుకోవాలనిపించింది. మోహను పలకలేదు.

"వాడికి అన్నీ లక్షణాలూ మప్పావు. పాలుతుంటే సరి గాడిదలా ఉన్నాడు. భయమేమిటి? దానికి సాయం నువ్వు వచ్చి పక్కన పడుకోవటం సరిపోయింది..."

నీలిమ ధర నోరు నొక్కింది మోహనుకు విన పడీ వినపడని చిన్న మాటతో.

నీలిమ కిలకిల గదిని సుగంధ సౌరభంలో ముంచి ఎత్తుతోంది.

మోహను మొదటిసారిగా అనుకున్నాడు తన దగ్గర వదిన పడుకోడం అన్నయ్యకు సుతిరామూ ఇష్టంలేదని. అయితే తను ఇంకేం చెయ్యాలి అన్న సమస్య... అమ్మ మళ్ళీవస్తే బాగుండును. ఆ భూతం ఇంక రానివ్వదేమో......

గాజుల చప్పుడు వినపడింది.

కళ్ళు మూతలుపడి ఉండగానే ఆశగా చూస్తున్నాడు. అమ్మరూపం కనపడి చెప్పింది.

"నువ్వు ఇంక వదినకు అంత అల్లా దగ్గరగా ఉండకు. వదిన హృదయంలో స్థానం మీ అన్నయ్యది—అది నువ్వు ఆక్రమించుకోడం మీ అన్నయ్య సహించలేడు" అని.

మోహను నిశ్చయించుకున్నాడు తనకూ వదినకూ మధ్య వదినను బాధపెట్టకూడదు అని. ఏదో బరువు గుండెలమీదనుండి దిగిపోయినట్టయింది.

మళ్ళీ గది అంతా చీకటి ఆక్రమించింది. చీకటి నీడలా వచ్చి మోహనును జోకొట్టింది.

3

పొద్దున్నే లేచి మోహను పళ్లతోముకున్నాడు నీళ్ళ చెంబుతో తెచ్చుకుని సున్నుంమీద పెట్టుకుని. నూతిలో చేద ఎప్పుడూ వేసి ఎరుగని మోహను, నీలిమ చూడని సమయం చూసి తోడుకుని నీళ్ళు పోసుకున్నాడు. బట్టలపెట్టె వెతుక్కుని బట్టలు తీసుకున్నాడు. శ్రద్ధగా తల దువ్వుకున్నాడు. కొంచెం వంకరటింకరగా ఉంది. అవుతేనేం? నీళ్లు తోడినప్పుడు చిన్న దెబ్బ తగిలి రక్తం కారింది. కొబ్బరినూనె రాసుకున్నాడు.

నీలిమ, మాధవరావు ఆశ్చర్యపోయారు ఈ మార్పు చూసి.

'ఉండు బాబూ కట్టుకడతాను' అని కొబ్బరి నూనెలో గుడ్డ ముంచి కట్టుకట్టింది వేలుకు. 'ఫరవా లేదు వదినా' అంటూ వదినకూడా వెళ్ళి, వంటయింట్లో పీట వాల్చుకుని 'చద్దిఅన్నం పెట్టు' అన్నాడు. కాని...నోట్లోకి ఒక్క ముద్దకూడా వెళ్ళలేదు.

'ఏం నాయనా' అంటూ వదిన హృదయం కారణం తెలిసికోడంకోసం తహతహలాడింది.

"ఏం లేదు అంటూ" చెయ్యి కడుక్కుని పుస్తకాలు వెతుక్కుని, స్కూలుకు తయారుఅయాడు.

ఎప్పుడూ అన్నయ్యతో మాట్లాడి ఎరుగని మోహను "స్కూలుకు వెళ్తున్నానన్నయ్యా' అని చెప్పాడు, వదిన అక్కడ ఉన్నా మాట్లాడకుండా. కాని, వదిన వంక చూసిన జాలిచూపుతూపు ఆమె హృదయాన్ని నాటుకుంది వాడిగా.

'ఇల్లా బుద్ధిగా చదువుకోవాలి' అని మాధవరావు తమ్ముడి జేబులో అణాకాసు వేశాడు మోహను వదులుకున్న సౌభాగ్యాన్ని దాంతో కొనవచ్చునన్నట్టు.

మోహను మెల్లిగా మనసుకు ధైర్యం చెప్పుకుంటూ వెళ్ళిపోయాడు, గుండె రాయి చేసుకుని.

నీలిమ అటు తిరిగి వెల్లువలా వచ్చే దుఃఖాన్ని పైట చెంగుతో అపుకుందుకు వ్యర్థప్రయత్నం చేస్తోంది.

మాధవరావు అది చూసీ చూడనట్టు తమ్ముడు బుద్ధిమంతుడయిపోయినందుకు సంతోషిస్తూ లోపలకు వెళ్లాడు.

అతనికేం తెలుసు తమ్ముడిహృదయంలో ఎన్ని అగ్నిపర్వతాలు పగులుతున్నాయో.

నీలిమ తన సంభాషణను నిశ్చయంగా మరిది విన్నాడని స్థిరపరుచుకుంది. అతని సున్నితహృదయం తనకు తెలుసు. విశ్వప్రయత్నం చేసినా మామూలు దారికి రాడని తెలుసు ... మనసు విరిగినతర్వాత మళ్లీ అతుక్కుంటుందా? ఏమో...!

చిన్నప్పుడు తనకికూడా తనమరదికిలాగే తల్లి పోయింది. చిన్నవదిన తనని సవతిపురుగులా చూసేది. ఒక్క ప్రేమించే హృదయం, హృదయం విప్పి చెప్పుకుందుకు ఒక్క జీవి లేక ఎంత బాధపడింది తను. ఒక్కొక్క రోజున చిన్నన్నయ్య వదినమాటకు తందాన అన్నప్పుడు ఆత్మహత్య చేసుకోవాలి అనిపించేది. నాన్నగారికోసం, ఆయన ఎక్కడ బాధపడిపోతారో అని బ్రతికేది. ఎన్ని బాధలుపడ్డా నాన్నగారికోసం బ్రతికింది. అల్లాగే తల్లి పోయినా మోహను తను ఏమీ అనకుండా కళ్లిదూస్తోంది కనుక కోలుకున్నాడు. కాక అతను పడ్డ జబ్బుకి మళ్ళీ బ్రతుకుతాడనుకున్నారా? నాన్నగారు తనకు పెళ్ళిచేశారు. మరొక మనసు తనను ప్రేమించేందుకు ఉంది అని తృప్తిపడేది. తనను చూడక హింసించినపుడు తను ఎంత బాధపడింది. నాన్నకోసం బ్రతికి ఉంది అంతటి బాధను సహిస్తూ. ఆయన మాయమయ్యారు. ఆత్మహత్యకు ప్రయత్నించింది. "చిన్నవదిన అన్న "చచ్చిందేనా కాదు ముష్టిముండ" అన్నమాట శల్యంలా ఇప్పటికీ బాధిస్తోంది. ఆయన (భర్త) తనను దగ్గరకు తీసుకున్నారు. అందుకు బ్రతుక గల్గింది. తనను ప్రేమించే నాన్నగారు మాయమయినప్పుడు, లాలనగా మాటమాత్రం చెప్పేవారు లేక తను ఎంత నిరాశలో కృంగిపోయింది. తను యిల్లా మరదికి దూరం అయిపోతే ప్రేమించేవారు ఎవరున్నారని మరది తనని మరచిపోగలుగుతాడు? మరది చేతులోని సౌఖ్యాన్ని చేజేతులా, తనకోసం త్యాగం చేస్తున్నట్టు కనపడింది. తనకోసంకదా అతను ఇచ్ఛాపూర్వకంగా దూరమయిపోతూ ఉంటే? ఈత్యాగాన్ని అతని లేత హృదయం తట్టుకోగలదా?

మోహను ఎంత బాధపడుతున్నాడు? అతను చేసే ప్రతి పనిలోనూ తీరని బాధ, ముఖంలో నిరాశా స్పష్టంగా చూపింది. నీలిమ భర్త ఏమనుకున్నా సరే...కుదరదు ఇది ఇంక సాగనివ్వకూడదు...అతను బాధపడేందుకు వీల్లేదు అనుకుంది.

మధ్యాహ్నం అయింది. భోజనం చేసి అదే మూపుతో అల్లాగే ఇల్లు విడిచి వెళ్లాడు మోహను. నీలిమ ప్రాధేయపడి కూడా అతనిచేత కారణం చెప్పించలేకపోయింది.

"ఇల్లా ఉండటం నాకు సుఖం అనుకుంటున్నావా? ఏంతమాత్రం కాదు. నువ్వు ఇల్లా ఉంటే నేను క్షణంకూడా బ్రతకలేను."

వదిన కంటినీరుకూడా అతని దృఢనిశ్చయాన్ని కదిలించలేకపోయింది. మరది వెళ్ళిపోగానే పరుపుమీద బోర్లపడుకుని ఏడ్చింది. ఏడ్చినకొద్దీ యింకా భారమయింది హృదయం. ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది. కళ్ళు తెరచేటప్పటికి మోహను బట్టలు మార్చుకుని ముఖం కడుక్కుని కనపడ్డాడు.

వదిన వెళ్ళి మరదిని కౌగిలించుకుంది.

"నా నాయన కదూ. నువ్వు యిల్లా ఉండకు. ఇల్లా ఉంటే నే బ్రతకలేను" అంది. ముఖమంతా ముద్దులతో నింపింది. ఏ భావమూ లేని మరది ముఖం చూసి గొల్లుమంది. వదిన కంటినుంచి కారుతున్న నీరువైపు అల్లాగే చూస్తున్నాడు కన్ను ఆర్పకుండా.

కంటినుండి బయల్దేరిన నీటిప్రవాహం చెక్కిలిమీదకు ప్రవహించి, కొంచెం దూరం ప్రయాణం చేసి తటాలున పైటమీదపడి ఇంకిపోతోంది.

వదిన మాటలలోని బాధ మరిదిహృదయం మీద పడి బీటవారిన ఆచోటులో ఇంకిపోతోంది.

మోహను ఇంక చూడలేకపోయాడు "వదినా" అని ఏడ్చాడు.

అమ్మ, జలపూరితాలయిన వదినకళ్ళలో కనపడి...

'మాట మర్చిపోయావు' అన్నట్టయింది. క్రింద కూర్చుని బాధలో కొట్టుకుపోతున్న వదినను...... వదలి తనను కానట్టు వెళ్ళిపోయాడు మరది.

చీకటిపడింది. అన్నందగ్గర కూర్చుని లేచాడు మోహను. దీపందగ్గర చదువుకుంటున్నాడు. మన

సులో సుడిగుండాలు తిరుగుతున్నాయి. వాటిలో తను...వదిన దూరమయిపోతోంది.

అన్నయ్య వీధిలోంచి వస్తూ బుద్ధిమంతుడయిన తమ్ముణ్ణి చూసి సంతోషించాడు.

అన్నయ్య భోజనం చేస్తున్నాడు. ఇంక చదువుకోలేక పడుకుందుకు లోపలకు వెళ్ళాడు. తను రోజూ పడుకునే ఆ చిన్నమందం గదిబయట వెయ్యాలని తాపత్రయం. కష్టపడి ఆ పట్టెమంచాన్ని ఓరగా ఎత్తిగలిగాడు. దాన్ని కదపలేకపోతున్నాడు.

'(శ్రే)వు'మని అన్నయ్య తేనుపు వినపడింది. నీలిమ ఎంగిళ్ళు తీస్తోంది.

తమ్ముడు మంచం తియ్యటంకోసం పడేపాట్లు చూశాడు...

"ఏరా?"

"ఇది బయట వేసుకోవాలి"

"ఉండు నే వేస్తా..."

అని పట్టు పంచ వదలివచ్చి ప్రక్కగదిలో వేశాడు మంచం. ప్రక్కపరచుకు పడుకున్నాడు. నిద్రపట్టడం లేదు. ముసుకుతన్ని పడుకున్నాడు.

నీలిమ వచ్చిచూసింది. "అదేమిటి అక్కడ పడుకున్నావు?"

మోహను సమాధానం చెప్పలేదు.

"అబ్బే అంతయిదవుతే ఎలా...నువ్వొక్కడవ్వూ పడుకోలేవు...లోపల వేస్తాలే..." అంది చేతులో మంచినీళ్ల చెంబు క్రింద పెట్టి.

ఇప్పుడూ మాట్లాడలేదు.

నిద్ర పట్టిందేమో...

"పడుకోనియ్య అక్కడ పడుకోవాలనుందేమో" అని గట్టిగా అని లోపలకు వెళ్లిపతిరావ్వతి...

"నువ్వు మరీ పడుకోలేవు ఒంటరిగా...ఫరవాలేదులే వాణ్ణి పడుకోనియ్య..." అని ఈసడించాడు మాధవరావు.

నీలిమ లోలోన అణచుకుంది మూగబాధని.

చీకటి దట్టమయింది దీపాలు ఆర్పడంతో.

మోహానుకు నిద్ర పట్టడంలేదు. ఈవాళ ఇల్లా బాధపడ్డా వదిన కొమ్మదిగా సుఖపడుతుంది. సరిగ్గా అమ్మ చెప్పినట్టు చేశాడు. అమ్మకు సంతోషం కలిగి ఉంటుంది...

"అంతా సరిగాచేశానో లేదో అమ్మవచ్చి చెప్తే బాగుండును"...

గడియారం టంగ్ టంగ్ అని పన్నెండు కొట్టింది. మోహానుకు అవి వింటూఉంటే భయం వేసింది...

చీకటి ఉండకట్టుకుని భూతమయి వచ్చింది. కళ్లు చింతనిప్పుల్లా ఉన్నాయి. భూతం నోరు తెరచింది. నోరు పెద్ద అగాధంలా ఉంది. అగాధపు చివర తను నుంచుని ఉన్నాడు. వంగి లోపలకు చూశాడు తొంగ్గా. కళ్ళు తిరిగాయి. అందులో తను పడిపోయాడు...

"అమ్మా..."

అని పెద్దకేక పెట్టాడు. అది ప్రతిధ్వనించింది. లేచి వదినకోసం ఆ గదిదగ్గరకు వెళ్ళాడు. తలుపు బిగించిఉంది. బాదాడు ఒళ్లు తెలియకుండా. వదినకోసం గట్టిగా పిలిచాడు దిక్కులు ప్రతిధ్వనించేట్టు. సమాధానం లేదు. భూతం మీదకు వస్తోంది.

'అయ్యో బాబోయ్'...

తనని ఎవరు రక్షిస్తారు...

"అమ్మా..."

అమ్మ జ్యోతి పట్టుకు నుంచుంది దూరంగా. అమ్మకోసం పరుగెట్టాడు. భూతంనుంచి రక్షిస్తుందని. తన చేతిని చాచింది భూతం. పరుగెత్తుకువెళ్లాడు అమ్మవంక. అమ్మను చేరలేకపోతున్నాడు. చాలా ఆయాసంగా ఉంది ఒళ్ళంతా. మెట్లమీద దొర్లుతున్నట్టు అనిపించింది.

వెర్రికేక పెట్టి వదిన తలుపు తీసుకు వచ్చింది. ప్రక్కమీద మరది లేడు. తొందరగా మేడంతా చూచింది. మెట్లమీద దీపం వెలిగించింది. మేడపై మెట్టుమీద తను—క్రింద రక్తంలో తనమరది...

కారెంపూడి శిలాశాసనము

శ్రీ పల్లంపల్లి సోమశేఖర శర్మ

ఈ శిలాశాసనము గుంటూరుజిల్లా పల్నాడు తాలూకాలోని కారెంపూడి గ్రామము నందలి వీరులగుడి ఆవరణములో ఒక రాతిమీద చెక్కి యున్నది. ఇది గవర్నమెంటు శాసన శాఖ వారి 1909 వ సంవత్సరపు వార్షిక నివేదికలో 566-వ నెంబరు శాసనముగా ఈయబడినది. 1904 వ సంవత్సరమునుండి 1926 వ సంవత్సరమువరకు గవర్నమెంటు శాసన శాఖవారిచే తెలుగు దేశములో సేకరించబడిన తెలుగు దేశపు శాసనములు దక్షిణ హిందూదేశ శాసనసంపుటములు — పదవ సంపుటమున ప్రకటితమైనను ఈ శాసనము మాత్రము దాని లోనికి రాలేదు. ఇదొక్కటే కాక ఇటువంటివి, ఇంతకంటెను ముఖ్యమయినవి శాసనము లనేకములు ఆ సంపుటములో లేకపోవుట కడు విచారకరము. చరిత్రాభిమానులు, శాసనపరిశోధకులు అయిన శ్రీ జయంతి రామయ్యపంతులుగారి సంపాదకత్వమున వెలువడిన సంపుట మిది. ఇది ఇంత అధ్వాన్నముగ తయారగుట ఆంధ్రుల దురదృష్టము. ప్రకటితములయిన శాసన పాఠములైనను నిర్దుష్టములయినవి కావు. అవి తప్పుల కుప్పలుగ నుండి భాషావిషయకముగ పనిచేయువారికి నిరుపయోగములైనవి. కొన్ని కొన్ని రెడ్ల చరిత్రవిషయకముగ ఆధారపడుటకును అనుచితములుగ నున్నవి. ఇటువంటి ముఖ్య శాసన సంపుటము ఈ విధముగ తయారగుట ఆంధ్రుల దురదృష్ట మనక తీరదు.

ఇక ప్రకృత శాసనమును గురించి: ఈ కారెంపూడి శాసనమును నేను కారెంపూడి వెళ్ళినప్పుడు చూచి ప్రతిబింబము తీసి చదివితిని. ఆ ప్రతిబింబము చినిగిపోవుటచేత ప్రకటించుటలేదు. నా చదివిన శాసన పాఠమును మద్రాసు కోటలోని శాసన శాఖ వారి శాసన ప్రతిబింబము సహాయమున మరల సరిదిద్దుకొంటిని. శాసన పాఠమును సరిచూచుకొనుటకు శాసన శాఖవారు దయతో ప్రతిబింబ మొసగినందుకు వారికి నా కృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నాను.

ఈ కారెంపూడి శాసనము అన్ని శాసనముల వంటిది కాదు; ఇందులో కొంత విశేషత ఉన్నది. సాధారణముగా శిలాశాసనము లన్నియు ఎవరో ఒక స్వామికి (దేవునికి) అఖండ దీపారాధనము నిమిత్తమో, అంగరంగ భోగాదుల నిమిత్తమో చేసిన దానధర్మములను కట్టడాలను తెలుపును. సాధారణముగా ప్రతి శాసనమునను దేశము నేలు భూపతిని పేరు ఉదాహరించుట పరిపాటి. కాని ఈ కారెంపూడి శాసనము అఖండ దీపారాధన, అంగరంగ భోగాది దానధర్మములను తెలుపుటకు వేసినది కాదు; రాజు పేరును లేదు దీనిలో. అయినను ఇది విశిష్టమయినది. దీనివలన ఈ శాసనము వేసిన కాలమునాటి కులమర్యాదలు, కట్టుబాటులు ఎట్లుండెడివో విదితమగుచున్నది. ఇదియే ఈ శాసనమును ప్రకటించుటకు కారణము.

ఈ కారెంపూడి శాసనము ఎప్పటిదను విషయమునుగురించి మనము ఊహాలపై ఊహాలు చేయుట కాని, తర్క వితర్కములు చేయుట కాని అవసరము లేదు. శాసనకాల మిందు విస్పష్టముగ తెలుపబడినది. అది శకవర్షములు 1318 యువ సంవత్సర ఆషాఢ శు. 11 శుక్రవారము. యువ సంవత్సరమునకు సరియైన శకవర్షము 1317 కాని 1318 కాదు. శకవర్షము 1318 కి సరియైన బార్హస్పత్యమానాబ్దము ధాత. శకము 1317 యువ సంవత్సరములో శ్రీ స్వామికన్నుపిళ్లెగారి 'ఇండియన్ ఎఫిమెరిస్' ప్రకారము ఆషాఢ శుద్ధ ఏకాదశి శుక్రవారము కాలేదు; మంగళవారమయినది. అందువలన శాసనపు తేదిలో కొంచెము పొరపాటున్నది. శకము 1318 ధాత సంవత్సరములో, అనగా క్రీ. శ. 1396 లో ఆషాఢ శు. 11 పై నుడివిన 'ఇండియన్ ఎఫిమెరిస్' ప్రకారము జూన్ 16 వ తేది అయినది. ఆనాడు శుక్రవారము దశమి తిథి .74, అనగా 44½ గడియలవరకు ఉన్నది. అటు తరువాతి ఏకాదశి దీని ననుసరించి యువ గతాబ్దమని, శకము 1318 ధాత సంవత్సరమే వర్తమానాబ్దమని భావించవలసియుండును. అట్లయినచో శాసనములోని తేదికి సరియైన ఇంగ్లీషు తేది క్రీ. శ. 1396, జూన్, 16 వ తేది శుక్రవారమగును.

ఈ శాసనకాలమునాటికి తెలుగు లిపి చాల పరిణామము పొందినది. ఏమాత్రము స్వల్పకృషి చేసినను, స్పష్టముగా ఉన్నచో, తెలుగువారు ఈ శాసనాక్షరములను గుర్తించి శాసన పాఠమును విడదీయగలరు. క్రీ. శ. 1396 అనగా శ్రీనాథ కవి కాలము. శ్రీనాథుడప్పటికి చిన్నవాడుగా నుండవలెను. కొండవీడు రాజధానిగా తెలుగుదేశమును పరిపాలించిన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానములో విద్యాధికారిపదవీ నియుక్తుడై అతను సంతరించిన మొదటి శాసన మింతవరకు తెలియవచ్చినది పొన్నుపల్లి తామ్రశాసనము. ఇది క్రీ. శ 1404 తారణ సంవత్సరమునాటిది. పెదకోమటి వేమారెడ్డి శాసనములలోని లిపికిని ఈ కారెంపూడి శాసన లిపికిని భేదము లేదు. ఈ శాసనకాలము నాటికి ప్రాగాంధ్రదేశము కొండవీటి రెడ్డిరాజుల పరిపాలనలోనే ఉండెను కాని శ్రీనాథుని కాశ్రయమిచ్చిన పెదకోమటి వేమభూపతి మాత్రము ఇంకను రాజ్యమునకు రాలేదు. శాసనకాలమునాటికి రాజ్యము చేయుచుండిన రెడ్డిరాజు పెదకోమటి వేమారెడ్డికి పూర్వుడైయిన కుమారగిరిరెడ్డి. ఇతనినే కొమరగిరి రెడ్డి అని అందురు. పెదకోమటి వేమ, కుమారగిరుల పితామహులు సహోదరులు. కొమరగిరిరెడ్డి తరువాత కొండవీటి సింహాసనము నధిష్ఠించినవాడు పెదకోమటి వేమారెడ్డి. ఈ కారెంపూడి శాసనమున కుమారగిరిరెడ్డి కాని, అతని ప్రధాన దండనాయకులు ఎవ్వరు కాని పేర్కొనబడలేదు. అందువలన ఈ శాసనము ప్రభుత్వమున కేమాత్రము సంబంధము లేని వ్యక్తులు వేయించినది.

శాసనభాష ఇప్పటి కయిదువందల ఏబదెనిమిది సంవత్సరముల క్రిందట క్రీ. శ. 1396 లో, అనగా శ్రీనాథుని కాలమున తెలుగుదేశములో వాడుకలో నుండిన భాష. ఈ శాసనములో వైష్ణవ పరిభాష, వైష్ణవాచార్య బిరుదప్రశస్తి చాల ఉన్నది. వీటిలోని కొన్ని పదముల కర్థము తెలియుటలేదు. ఇటువంటి వానిలో 'కామశిగిట్లు', 'చోడపందిగూను', 'తిరుందుపక దాలతులు', 'తిరువిడిపోతులు' అనునవి కొన్ని. 'త్రిభువనికుశ సముద్ర విశంబతాళగిత శృంగారహార' అన్న బిరుదముల నెట్లు విడదీయవలెనో తెలియుటలేదు. 'త్రిభువనికుశ' అనుదానిలోని 'కు'ను 'తా'గ చదివినను దిగువవచ్చును. అట్లు చదివినను అర్థము సుబోధమగుటలేదు. 'విశంబ' అన్నది 'విడంబ' కావలెను. అట్లయినచో 'త్రిభువనీకుశ సముద్ర విడంబ' అని కాని, 'త్రిభువనీకుశ సముద్ర', 'విడంబ తాళగీత శృంగారహారి (కిర)' అని కాని విడదీయవలెనేమో. 'త్రిభువనీకుశ సముద్రవిడంబ' అన్న నెంత యర్థమగుచున్నదో 'త్రిభువనీకుశ సముద్ర' యన్నను నంతే యర్థమగుచున్నది. 'త్రిభువనీకుశమను సముద్రమునకు చంద్రునివంటివాడని యర్థము రావలెను. విశంబ పదమునకు కాని విడంబ పదమునకు కాని చంద్రుడను అర్థము లేదు. ఒకవేళ "త్రిభువనీకుశ చంద్ర" అనుటకు శాసనము చెక్కినవాడు "త్రిభువనీకుశ సముద్ర" అని తప్పుగా చెక్కెనేమో. అట్లయినచో 'విడంబ తాళగీత శృంగారహార (కిరి)" అని పాఠ మేర్పరుపవలెను. ఈ విషయ మింకను విచారింపవలసినది. 'పదుసెట్టి వాంటి శ్రీ వైష్ణాలకూను' అన్నది 'పదుసెట్టి వాంటి శ్రీ వైష్ణవులకును' అనుదాని అపపాఠము. 'ఎట్టు' అనగా అరవములో ఎనిమిది. 'పదీసెట్టు' అన 'పదునెనిమిది'. 'నా' డవ దేశము. 'పదుసెట్టు నాంటి శ్రీ వైష్ణవులకును' అనగా పదునెనిమిది దేశాల శ్రీవైష్ణవులకును అని యర్థము. శ్రీ వైష్ణవులు పదునెన్మిది దేశాలవారని ప్రతీతి. తమిళ వాఙ్మయములో ఈ పదునెనిమిది దేశములు ఈ రీతిని తెలుపబడినవి[1]:

తమిళము	కొంగణం (కొంకణం)	మగతం (మగధ)
సింగళం (సింహళము)	కొల్లం	గౌడం (గౌడ)
సోనహం	తెలుంగం (తెలింగ)	కుశలం
పావహం	కళింగం	కడారం
కన్నడం	వంగం	శీనం (చీనా)
తుళు	కంగం	కుడహం

తమిళదేశము చుట్టును మిగిలిన పదునేడు దేశములు ఉన్నట్లు తమిళవాఙ్మయమున చెప్పబడినది. తమిళమున 'పదిసెట్టు' పదమే తెలుగులో 'పదుసెట్టు'గా మారినది.

1. ఈ పదునెన్మిది దేశముల పేర్లను తెలిపిన (మదరాసు విశ్వవిద్యాలయములో తమిళభాషకు 'జూనియర్ లెక్చరర్'గా ఉన్న) విద్వాన్ శ్రీ బి. పురుషోత్తమనాయుడు గారికి నా కృతజ్ఞతావందనములు.

శాసనములో వచ్చు వైష్ణవ పరిభాషా పదములకు అర్థము చెప్పవలసినదని కోరుచు వారికి వ్రాసి యిచ్చియున్నాను. ఇప్పుడు నేను తెలిపిన యర్థములలో పొరపాటులున్నను, నాకు తెలియని పదములకు వారు అర్థము తెలిపినను రాబోవు సంచికలో ప్రకటింప గలను.

'శత్తిండమువారు' అనగా శాత్తాదులు, సాతానులు అని యర్థము. ఈపదము 'శత్తిండము' అనికాక 'శాత్తిండము'అని యుండవలెను. 'ఉప్వరపు గొడుగులు' అను రూపము తప్పు. 'ఉప్పరపు గొడుగులు' అని యుండవలెను. ఉప్పరపుగొడుగు లనగా ఆకాశపు గొడుగులు. 'కామశిగిళ్లు' అను మాటకు అర్థము తెలియలేదు. 'కామశిగిళ్లన కామతో కూడిన శిగిళ్లేమో. శిగిడి కర్థము తెలియదు. 'చోడపందిగూను' అన్న పదము సరియైనదో, లేక శాసనలేఖకుడు తప్పుగ వ్రాసెనో తెలియదు. చిట్టచివరి 'ను' సముచ్చయార్థకమని, దానికి పూర్వాక్షరములోని 'ఊ' దీర్ఘము వ్యావహారిక భాషవలన వచ్చినదని, సరియైన పదము 'చోడపందిసు' అయియుండునని నాయూహ. ఇట్లూహించినను దాని కర్థము తెలియదు. 'తిరుండుపకణాంతులు' అను దానిలో 'తిరు' శ్రీవాచకము. 'కణాంతులు' 'కణంతు' లనుదాని దుష్టరూపమేమో. కణంతి, కడంతి, కషంతి యను పదములకు కణుజు అని యర్థము. 'తిరుండుపకణంతు' లన్న నర్థము తెలియవచ్చుటలేదు. 'తిరుండ' అను పదము 'తిరుణ' కావచ్చు. ఇది 'తృణ' శబ్దభవము. ఇట్లయినను 'తిరుండుపకణంతు'లే సాధురూపమనుకొన్నను అర్థముగుట లేదు. 'తిరువళికోలలు'అన్నను 'తిరువడికోల'లన్నను ఒకటే. 'తిరువడికోల'యన దాసరివాని దీపస్తంభము. 'తిరువిడిపోతు' లను రూపము అసాధువని తోచును. సాధురూపము'తిరువడిపోతులు'. దీనికినిఅర్థము తెలియలేదు. శ్రీవైష్ణవ పరిభాషలో 'పాతిపోతు' అను పదము కలదు. 'పాతిపో'తన గా పాదపద్మము 2 'తిరువడి పోతు'లన శ్రీపాదపద్మములు—ఆచార్య శ్రీపాద పద్మములు లాంఛనముగా కల కేతనము కావచ్చును. 'ఉనుమరేగ' లన్నది అసాధువు. 'అనుమరేక' లని యుండదగును. 'అనుమరేక' లన హనుమంతచిత్రము వ్రాసిన జెండాలు కావచ్చును. 'శ్రీముఖము' అనగా మఠాచార్యులు తమ శిష్యులకు ఇచ్చెడి యుత్తరము, లేక ఆజ్ఞాపత్రము. శాసనమును లేఖకుడు తప్పుగ వ్రాసెనో లేక శాసనము చెక్కినవాడే తప్పుగ చెక్కెనో కాని శాసనమంతయు దోషభూయిష్ఠముగ నున్నది. కొలము(కులము)నకు 'గొల'రూపము ప్రయోక్తమయినది. 'సార్వభౌమ' పదము 'సావభౌముము' అని చెక్కబడినది. ఇందలి వైష్ణవ పరిభాష బిరుదలాంఛనములు అపరిచితములైనవి. పదరూపముల విషయమునను, వాటి కర్థము నిర్ణయించుటలోను నా యూహ కందినట్లు చెప్పినాను. నేను చెప్పినవి సరియైనవి కావచ్చును; కాకపోవచ్చును: తెలిసినవారు నేను చేసిన దోషము లేవయిన నున్న మన్నించి వాటికి సాధురూపములను సరియైన యర్థములను వివరింపగలందులకు వేడుచున్నాను.

శాసన విషయము: కుంకుమ వసంతము లాడు కొను విషయములో పలినాటివారికిని (పల్నాటి వారికిని) బడుగులసీమవారికిని(బడుగులవారికిని) వివాదము సంభవించినది. అంతకుపూర్వపు రివాజు ననుసరించి ఏయే కులములవారికి ఈ కుంకుమవసంతము లాడుకొను మర్యాదకలదో వారే కాని ఇతరు లాడుకొనరాదని పూర్వపు సాంఘిక నియమము. ఇట్టివి పూర్వపు కులమర్యాదలు (*Social privileges*) బడుగులవారు కుంకుమ వసంతము లాడుకొను మర్యాద తమకును కలదని (తమ గురువులైన?) దేవ చక్రవర్తి అయ్యంగారితో నిజము కప్పిపుచ్చి చెప్పి వారియొద్దనుండి శ్రీముఖములు తెచ్చుకొని వసంతము లాడుకొనగా పలినాటివారు వారిని వసంతము లాడనీక అడ్డుపెట్టిరి. అంతట గురువులైన 'చక్రకుల విజయ చూడామణి' శ్రీమాన్ నల్లాను గోవింద చక్రవర్తి అయ్యంగారు చాత్తిండమువారిని తమ సముఖమునకు పిలిపించి పూర్వము బడుగులవారికి కుంకుమ వసంత మాడుటకు తమకు హక్కు గలదని నిరూపించుకొన్నచో వారిని ఆడనిండని చెప్పగా ఆ బడుగులవారు తమ కట్టి మర్యాద యుండినట్లు రుజువు చేసికొనలేకపోయిరి. అంతట గోవింద చక్రవర్తి అయ్యంగారు దేవచక్రవర్తి అయ్యంగారు బడుగులవారి కిచ్చిన శ్రీముఖములు మరల తీసికొని, పలినాటివారికి 'బిరుదు నిశానీలు' మొదలైన—మహోదివరకు చెల్లువట్టె 'వైభోగములు' ప్రసాదించి, బడుగులవారు ఎక్కడెక్కడ కుంకుమ వసంతమాడినను పదునెనిమిది దేశాల శ్రీ వైష్ణవులును వారి నాడకుండ అడ్డుపెట్టునట్లు అనతిచ్చి పదునెనిమిది దేశముల శ్రీ వైష్ణవులకు శ్రీముఖము పంపిరి. ఆ శ్రీముఖమే ఈశాసనము. మొత్తముమీద ఇది పలినాటివారికి బడుగులనాటివారికి కుంకుమ వసంతములాడు కొనువిషయములో వచ్చిన వివాదమును విచారించి శ్రీ వైష్ణవ గురుస్వాములైన శ్రీమాన్ నల్లాను గోవింద చక్రవర్తి అయ్యంగారు ఇచ్చిన తీర్పు.

---

2. 'పాతిపోతు' అనగా పాదపద్మమని నిఘంటార్థ ధారమున చెప్పినవారు మిత్రులు శ్రీమాన్ మేడేపల్లి వరాహ నరసింహస్వామిగారు. 'తిరువడిపోతు' లన శ్రీపాదపద్మములు, సద్గురు పాదపద్మములు కావచ్చునని వారే సూచించిరి. వారికి నా కృతజ్ఞతావందనములు.

పూర్వము మతగురువులు కుంకుమ వసంతము లాడుకొనుటవంటి వేడుకలను గౌరవ మర్యాదలను ఒక్కొక్క కులమువారు సంఘమునకో మతమునకో చేసిన సేవా సత్కృత్యులను గమనించి యిచ్చినారు. వివాహ సమయమున పెండ్లికుమారుడు గుఱ్ఱమెక్కి గ్రామవీథులలో ఊరేగుట, ఉత్సవావసరములలో కుంకుమవసంతము లాడుకొనుట, పెండ్లి పందిళ్లకు మామిడాకు తోరణములు కట్టుకొనుట, పెండ్లి పందిరి స్తంభములకు అరటిచెట్లను నరికి తెచ్చి కట్టి అలంకారము చేయుట—ఈ మొదలైన మంగళ కార్యము లన్నియు మర్యాదలే. పూర్వము చతుర్థవర్ణములోని అన్ని కులములవారికి అట్లు చేసికొనుటకు హక్కు లేదు. ఆయా కులములవారికి ఈ మర్యాదలను దేశమును పరిపాలించు అధిపతియైనను ప్రసాదింపవలెను; లేదా మతగురువైనను ప్రసాదింపవలెను. ఒకవేళ ఏ కులమువారయినను ఇట్టి గౌరవ మర్యాదలకు తమకు 'హక్కు' లేనిదే నడుపుకొనిరా అట్టివాటికి 'హక్కు'న్న ఇతర కులములవారు వారిని అడ్డపెట్టుచు వచ్చిరి. సంఘములో ఇట్టి గౌరవ మర్యాదలకు గల 'హక్కు' ననుసరించియే గౌరవ ప్రతిష్ఠలు. వారి హోదా ఎక్కువ. ఇటువంటి గౌరవ మర్యాదలకు సంబంధించిన పట్టువిలలు ఓరుగంటి కాకతీయ సామ్రాజ్యము పతనమై హిందూధర్మము మరల సముద్ధరింపబడినతరువాతినుంచియే, క్రీస్తుశకము పదునాలుగవ శతాబ్దము ఉత్తరార్ధమునుంచి ఎక్కువ యైనవి. ఇటువంటి కులగౌరవ మర్యాదలకు, కులము అధికతా న్యూనతలకు సంబంధించిన శాసనములన్నియు పదునాలుగవ శతాబ్దమునుంచియే కానవచ్చును. ఈ శాసనమువలన పూర్వము మతగురువుల కెంతటి యధికారముండెనో, కులమర్యాదలు ఏవిధముగా పరిపాలింపబడుచు వచ్చినవో తెలియుచున్నది. దేశము నేలురాజునకు పరిపాలనము విషయమునను, ధర్మమును కాపాడు విషయమునను, దుష్టశిక్షణ శిష్టరక్షణముల విషయమునను మాత్రమే అధికారముండెను. మత సాంఘిక విషయములయందు అతని కేమాత్రమును జోక్యముండెడిది కాదు. దేశమునకు భూవరు డధిపతి కాగా సాంఘిక ధార్మిక చక్రమునకు మతాచార్యు డధిపతి. రాజకీయముగ మతాచార్యుడు నరవరునకు లోబడియుండినట్లే సంఘమునకు మతమునకు సంబంధించిన విషయములలో మతాచార్యునకు నరవరుడు లోబడియుండువాడు. దేశములోని జనుల అధిభౌతికాభివృద్ధికి భూవిభుడు బాధ్యుడు కాగా ధార్మిక ఆధ్యాత్మికాభ్యున్నతికి మతాచార్యుడు బాధ్యుడై దారి చూపువాడు. బాధ్యతామాలి అనర్థముగ ప్రవర్తించుచు వచ్చినవారు ఆవర్ణములోను ఈవర్ణములోను కూడ ఉన్నారు; కాని పూర్వపు రాజకీయ ధార్మిక పరిపాలనాపద్ధతి అట్టిది. సంఘము అభ్యున్నతిపతనములకు వారుభయులును సమానముగ బాధ్యులు.

విశేషవిషయములు: నల్లాని గోవిందచక్రవర్తి అయ్యంగారు గొప్ప వైష్ణవాచార్య శిఖామణులు. అయ్యంగారన్నది అయ్యగారను దాని రూపాంతరము. తెలుగుదేశములో శ్రీవైష్ణవమును వ్యాపింపజేసిన భట్టరు, కందాడై, తిరుమల మొదలైన సుప్రసిద్ధ శ్రీవైష్ణవాచార్యవంశములలో నల్లానివారిది ఒకటి. నల్లాని గోవింద చక్రవర్తి అయ్యంగారనగా నల్లాని కుమారుడైన గోవింద చక్రవర్తి అయ్యంగారని యర్థము. నల్లాని చక్రవర్తికే నల్లాండి (నల్లాణి) చక్రవర్తి యనియు పేరు. గుంటూరు జిల్లా నరసారావుపేట తాలూకా రొంపిచెర్లలోని వేణుగోపాలస్వామి ఆలయములోని పగిలిపోయిన గరుడస్తంభము మీది శాసనములో[3] నల్లాండి చక్రవర్తి ఉదాహృతుడయినాడు. ఇతని శిష్యుడు రామదాసాకడు. ఈ రామదాసు ఎవరో తెలియదు. ఈ శాసనములోని నల్లాండి చక్రవర్తి గోవింద చక్రవర్తి అయ్యంగారి తండ్రి యనుట కేమియు సంశయము లేదు. ఈ రొంపిచెర్ల శాసనము సయితము శ్రీ జయంతి రామయ్యపంతులుగారి సంపాదకత్వమున వచ్చిన శాసనసంపుటమున జేరకపోవుట విచారకరము. ఈ వంశములో దేవ చక్రవర్తి అయ్యంగా రొకరున్నారు. మన శాసనములోని దేవచక్రవర్తి అయ్యంగారు వారే. వారు గోవింద చక్రవర్తి అయ్యంగారికి అన్నగారు. ఈ విషయము మనకు ఈ శాసనమువలన తెలియదు, కాని అనంతామాత్యకవి రచియించిన భోజరాజీయ ప్రబంధమువలన తెలియుచున్నది. అనంతామాత్యుడు నల్లాని గోవింద చక్రవర్తి అయ్యంగారి శిష్యుడు. అతడు భోజరాజీయమున గురుచరణస్మరణము ఈ విధమున చేసియున్నాడు:

భూనభోహారిసంతతపూరిత సుకీర్తి
శాలి తిరువెంగళ చక్రవర్తి
సకల పార్థివ శుకప్రకర సత్ఫలపూర్ణ
సహకార మశేఘురి చక్రవర్తి
ఘనతరాజ్ఞానాంధకార విఖండన

3. *Ep. coll; No. 300 of 1915.*

వంశాంబుధి దౌబళె చక్రవర్తి
నానార్థిజనచాతకానూన ఘనవృష్టి
జలదంబు శ్రీదేవ చక్రవర్తి
యనఁగ బ్రథితచతుష్టయముతో నెనయునట్టి
యగ్రజులతోడఁ బుట్టిన యప్పదీయ
గురుఁడిఁ దిరుమల నల్లానివర తనూజుఁ
డలరు గోవింద చక్రవర్తులఁ బ్రియమున.

ఆ కాలములో శైవులకువలెనే శ్రీవైష్ణవులకును శిష్యబృంద ముండెడిది. ఈ శ్రీవైష్ణవ గురుస్వాములు తమశిష్యులకు ఆధ్యాత్మికజ్ఞానము నొసంగుటయే కాక వారికి విద్యాగురువులు కూడనై ప్రఖ్యాతివహించుచు వచ్చిరి. పై పద్యమువలన ఒక్క దేవచక్రవర్తి అయ్యంగారే కాక తిర్వెంగళ చక్రవర్తి, అఁకురి చక్రవర్తి, దౌబళె చక్రవర్తులుకూడ గోవింద చక్రవర్తులవారి అగ్రసోదరు లనియు, వీరి యింటి పేరు 'తిరుమల' అనియు విశదమగుచున్నది. శాసనమున 'చక్రవర్తి' కులమని కలదు. పేరు చివర ఈ వంశము లోని ప్రతివారికి 'చక్రవర్తి' అని యుండుటవలన చక్రవర్తులవారని పేరు కలిగియుండవచ్చును. తిరువేంగళ చక్రవర్తి విజయనగరాధీశ్వర మహాసామంతులలో నొకఁడైన పంజెట ఏటుకంపరాజునకు గురువు. ఈ యేటుకంపరాజు పార్థివ సంవత్సరమునకు సరియైన శకవర్షము 1326 లో తన గురువును, వస్తర్మాన స్థాపనాచార్యులును అయిన శ్రీ తిర్వెంగళ చక్రవర్తికి చియ్యవరమను గ్రామమును దానము చేసెను4

4. *Local Records, Vol. XL, p. 516.*

శాసనము[1]

చంద్రుడు2 శంఖము

సూర్యుడు చక్రము

1. స్వస్తి [॥] శకవరుషంబులు ౧౩౨౬ అగునేం
2. టి యుని సం[వ]త్సర ఆషాఢ శు ౧౧ శు
3 శ్రీ నల్లాని చక్రవర్తులు ఇచ్చిన
4. శాసనము [।*]
5. . వైదిక పేతె సంస్థి వివాదో పన్యాసానాం [।*] సమ్మతం సర్వజ్ఞలోకానాం
6. ం వశీనాం చక్రవర్తినాం । [।*] స్వస్తి శ్రీమతు వేదమార్గప్రతిష్ఠా
7. చాయణాం4 ది'క్కోల విజయచూడామణి దుష్ట
8. నిగ్రహ సి(శి)ష్ట ప్రతిపాలక మాయావాది కోలాహల మం
9. త్రివాది భయంకర । పరమవైదిక సార్వభౌముమ5 పరవా
10. [దిగ] జకేసరి త్రిభువని కుశీసముద్ర6 విశింబ తశేగిరి (శాశిగిరి) శ్రీ
11. ంగా [ర] హాం7 శరణాగత వజ్రపంజర శ్రీ అహోబలదేవ దిధివ పరో
12. ధియానమండాన తిరువెంగళ నాథదేవ దివ్యశ్రీ పాద పద్మారా
18 ధకులైన8 శ్రీ నల్లాను గోవింద చక్రవర్తి అయ్యంగారు అఖిలలో

1. శాసనప్రతిబింబమును ఇచ్చిన శాసనశాఖ అసిస్టెంటు సూపరింటెంటు శ్రీ హెచ్. వి. నరసింహస్వామిగారికి నా కృతజ్ఞత.

2. శాసనశిలమీద సూర్య చంద్ర, శంఖ చక్ర ప్రతిమలు చెక్కఁ ఉన్నవి.

3. రవ పంక్తి శ్లోకములో ఆరంభము. దీనిలోని మొదటి అక్షరము పోయినది. మిగిలిన మొదటి రెండక్షరములు అనుమానాస్పదములు.

4. 'చాయణా' అని చదువవలెను.

5. 'సార్వభౌము' అని.

6. 'త్రిభువనీకుల సముద్ర' అని. శాసనకర్త 'ల' కు బదులుగా 'శ' వాడినాడు.

7. 'శృంగారహా(?)' అని.

8. 'దివ్య శ్రీపాద పద్మారాధకులైన' అని.

14. లోకాల పదుసెట్టివాంటి శ్రీ వైష్ణవాలకూను9 ఆనతిచ్చి ప్రత్తెంచిన
15 శ్రీముఖం [।*] బసగుల సీవాలవారు10 తముసుం కుంక్కుమ వస
16 ంత్రి(ం)ము గల్దని దేవచక్రవర్తి అయ్యంగారికిని మఱుకవసి విన్నపం
17 చేసి శ్రీముఖాలు దెచ్చి వసంత్రిరూడే మనంగాను పలివా
18 ంటివారు వసంత్రం ఆసెనీక అష్టపెట్టి లేను చేము కత్రిం
19 ష్ణమువారిన్ని11 మా ముంద్దటికి రప్పించ్చి విచారింప్ప
20. ంగాను పలివాంటివారు ప్రాక్వ్రణమంద్దు కుంక్కుమ వస
21. ంతం బసగులవార్కిం గలుగం దెలుపుకొని ఆసె
22 విన్నంచ్చే(చే)ను ఆ బసగులవారు ప్రాక్వ్రణమంద్దు గలు
23 గం దెలుపరయిరి గాన దేవ చక్రవర్తి అయ్యంగా
24 రు యిచ్చిన శ్రీముఖాలు ముగుసెం బుచ్చికొ
25 ని చేను12 పలివాంటివార్కి మహాదేవరకుం కైల్లేటి
26 వైభోగాలు అన్నిన్నిం13 చెల్లించ్చి ఉప్పరపు14 గొడుగులు
27 ఆలవట్టాలూను కనకపెంచె అంద్దలమూను
28. కామశిగిశాన్యము నీలిగొడుగులూను చోకెప
29. ంటిగూను తిరుంకుపక దాంతులును తిరు
30. వళికొలలున్ను తిరువిడిపోతులున్ను15 అనుమ
31. . రేకలున్ను16 యిస్తిమి [।*] వారి శ్రీముఖాలు
32. వి[ం*]ట్టిమి గాన మీరు యెక్కువ బసగులమరు17 కు
33. ంక్కుమ వసం త్రి[ం*] ఆడినాను పదుసెట(ట్టి) వాంటి శ్రీవై
34. ష్ణవులకోను18 కుంక్కుమ వసం త్రిం ఆసెనీక అష్ట
35. పెట్టేది [।*]19 యీ శాసనం వుద్దగిలోనుంచెగి తే
36. వాటివారు పంబవాయింకున్ను మేసెపి చేటెబో
37. ఇంకున్ను మంగళ మహా శ్రీశ్రీశ్రీ జేయు
38. శ్రీ.

---

9. 'పదుసెట్టువాంటి శ్రీ వైష్ణవులకును' అని.

10. 'బసగుల సీరువారు' అని.

11. చాత్తింపెము వారిని అని; అనగా 'చాత్తనివారు'. చాత్తింప శబ్దము వికృతే శాత్తద పదము. శాత్తదులన సాతానులు.

12. 'మేము' అని యర్థము. ఏమ అనురూపము కలదు. పూర్వము 'నేము' కూడ ఉండె నేమో.

13. 'అన్నిన్నిం'—అన్నింటిని అని యర్థము.

14. 'ఉప్పరపు' అని చదువవలెను.

15. 'తిరువడిపోతులు' అని.

16. అనుమ తరువాత నొక యక్షరము పోయినది. అది 'అనుమంతరేకలు' అని కాని 'అనుమన రేకలు' అని కాని యుండవచ్చును.

17. 'బసగులవారు' అని చదువవలెను.

18. 'పదుసెట్టివాంటి శ్రీ వైష్ణవులును' అని చదువవలెను.

19. ఇక్కడినుంచి శాసనపాఠ మర్థమగుటలేదు.


Stephen Spender
29.10.54

స్టీఫెన్ స్పెండర్

★ ★ వర్తమాన పాశ్చాత్య సాహిత్యరంగాన్ని రూపొందించుతున్న ప్రధాన పురుషులలో ఒకరైన, ప్రసిద్ధాంగ్ల రచయిత స్టీఫెన్ స్పెండర్ గతమాసం భారతదేశానికి విచ్చేసి పలుతావుల ఉపన్యసించారు. ఈయన 'కల్చరల్ ఫ్రీడమ్ కాంగ్రెస్' అనేసంస్థకు అంతర్జాతీయ కార్యవర్గ సభ్యుడు. ఈ సంస్థ తరఫుననే సాంస్కృతిక రాయబారిగా భారతదేశానికి వచ్చి ప్రచారంచేస్తున్నారు.

కవిగా, విమర్శకుడుగా, వ్యాస రచయితగా జగత్ప్రఖ్యాతిని గడించుకున్న ప్రసిద్ధాంగ్ల రచయిత స్టీఫెన్ స్పెండర్ 1909 సంవత్సరంలో లండను నగరంలో జన్మించాడు. ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయంలో విద్యాసముపార్జన చేశాడు. కళాశాలలో చదువుతున్న న్నిరోజులూ ఆయన ఎక్కువగా యూరపు పర్యటనలో కాలం గడుపుతూ వచ్చాడు. చివరకు పట్టా పుచ్చుకోకుండానే విశ్వవిద్యాలయంలోనుంచి బయటికి వచ్చేశాడు. పదిహేడేళ్ళ ప్రాయంనుంచీ, తనదగ్గిరున్న చిన్న 'హాండ్ ప్రెస్' మీద మందుల సీసాలమీద అంటించే చీట్లు అచ్చువేసి తద్వారా జీవితం గడుపుతూ వుండేవాడు.

కళాశాలలో వుండగానే ఆడెన్ రచనలంటే ఆయనకు మోజు కలిగింది. ఆడెన్, స్పెండర్, లూయీ మాక్నీస్, సి. డే లూయిస్, వీరు నలుగురూ, వీరివీరి రచనావిధానాలలో వైవిధ్యమున్నా, నవ్యాంగ్ల సాహిత్యరంగంలో నాయకులుగా పేరొందిన వారు. వీరు నలుగురిలో ఒక సమానధర్మంకూడా కనుపించుతోంది — సాంకేతిక కావ్యరూపాలపట్ల (సింబాలిక్ పొయట్రీ) వీరికి గల ఔత్సుక్యం.

మొదటి ప్రపంచయుద్ధం రాజకీయరంగాన్నే గాక సాహిత్యరంగాన్ని కూడా తలక్రిందులు చేసివేసింది. పాత విలువలన్నీ పటాపంచలై పోయినై. పాశ్చాత్య నాగరికతకు చరమదశ వచ్చేసినట్టే కనుపించింది. ఈ వాతావరణం కారణంగా, 'డాడాయిజం' లాంటి అనేకరకాల నిరాశావాదధోరణులు అరాచకవాదధోరణులూ వ్యాపించినై. కాని 1930 వచ్చేసరికి యీ వాతావరణం క్రమంగా మారి ఆశాజనకమైన ఒక నూతనవాతావరణం ఆవిర్భవించింది.

యుద్ధానంతరదశలో కవి అత్యంత దుర్ఘటమైన బాధ్యతను పైన వేసుకుని తీరవలసివచ్చింది. వ్యాపించివున్న నాగరికత శిథిలమై ఛిన్నాభిన్నమై పోతుంటే, ఆ శిథిలాలలోనుంచి ఒక నూతన నాగరికతను నిర్మించుకుని రావలసిన అవసరం కవికి యేర్పడ్డది. నిరాశావాదిగా తలక్రిందులైపోతున్న మానవునికి దారి చూపి ఉద్ధరించవలసివచ్చింది. నూతనాదర్శాన్ని కట్టెదుట చూపించి ఆత్మవిశ్వాసాన్ని కలుగజేయవలసివచ్చింది. తన ధర్మాన్ని గుర్తెరిగిన కవిగా, స్పెండర్, యీ కార్యక్రమానికి నడుముకట్టాడు.

పీడనకూ, నిరంకుశత్వానికీ గురియై విలపించుతున్న అభాగ్యులపట్ల స్పెండర్‌కు అత్యంతమైన సానుభూతి వుంది. స్పెండర్‌కు తొలినుంచీ రాజకీయాలపట్ల ఔత్సుక్యం వుంది. ఈ నవీన యుగంలో, సాహిత్యరంగానికి రాజకీయాలతో తప్పనిసరి సన్నిహితత్వం యేర్పడిపోయిందని కూడా అభిప్రాయపడ్డాడు. కాని రాజకీయం అన్నదానికి ఆయన యిచ్చిన నిర్వచనం చాలా విస్తృతావధి గలది. రాజకీయాలను పురస్కరించుకొని స్పెండర్ రచించిన కావ్యసంచయంలో, కరుణావిలమైన హృదయస్పందన వినిపించుతుంది. ఈ క్రింది పంక్తులు పరికించితే ఆ విషయం విస్పష్టమౌతుంది.

The Guns spell Money's ultimate reason
In letters of lead on the spring hill-side
But the boy lying dead under the olive trees
Was too young and too silly
To have been notable to their important eye
He was a better target for a kiss.

[సైనికవాదపు పరమ ప్రయోజనమేదిటో, వసంతశోభితమైన కొండకోనలలో, తుపాకాలు లోహ శబ్దాలతో సుడింతిం పలుకుతూనే వున్నయ్; కాని, ఆలీవు తరుచాయ్పను చచ్చిపడివున్న ఈ పసికందు అమాయకుడు—ఆ అఖండుల మహత్తరమైన దృష్టి పథాన పడతగిన వాడు కాదు. మధురమైన ముద్దుకు లక్ష్యం కాదగినవాడుగాని—తుపాకీ గుండుకు కాదు.]

స్పెండర్ కు యుద్ధోన్మాద మంటే తగని చిరాకు. యుద్ధంలో తమ సర్వస్వాన్నీ కోల్పోయిన హతభాగ్యుల దీనావస్థకు ఆయన ఎంతో సంతాప పడ్డాడు. తన తల్లిని సంబోధించి వ్రాసిన యీ పంక్తులు ఆయన వేదనను వ్యక్తం చేస్తున్నయ్.

'You rebuilt the Georgian house with the old laws
And the kitchen-garden surrounded by a wall
And the servants in the servant hall
Tidying the room down-stairs at dawn
And gave these play things to your son,
Your son grew up and thought it all real
Hunting, Family, the businessman's Ideal.'

[పాతసూత్రాల పునాదులమీద మన కొత్త యింటిని పునర్నిర్మాణం చేశావు. పెరటితోట చుట్టూ గోడ కట్టించి బందోబస్తు చేయించావు. ప్రత్యూషమూ ఇల్లు పరిశుభ్రం చేస్తూ వుండటానికి సేవకులను నియోగించావు. కొడుక్కు ఆడుకోవటానికి ఆటవస్తువు లందించావు. నీ కొడుకు పెరిగి పెద్ద వాడై, ఈ వేటవినోదం, ఈ గృహారామాలూ, ఈ వ్యాపారధర్మం ఇవన్నీ ఆహ్లాదకరంగా నేవున్నా యనుకున్నాడు'—కాని ఆదర్శప్రాయమైన ఈ జీవితం రెండవ ప్రపంచయుద్ధంలో లయించిపోయింది.

He is thrown out on to a field abroad
A whip of lead
Strikes a strain of blood from his pure fore-head
Into the dust he falls,
The virgin face, carved from a mother's kisses
As though from sensitive ivory
Staring at the Sun—the eyes at last made open.

[ఆ కుమారుడు, కాని దేశాలలో ఎక్కడో...ఒక రణక్షేత్రంలోకి విసరివేయబడ్డాడు. అమాయకమైన అతని నుదురు సీసపు కొరడా దెబ్బతో ప్రిదులుకుపోయి రక్తాలోడుతోంది. ధూళిలో కూలిపోయాడు. శైత్యసంయుతమైన దంతమునుంచివలె, మాతృహృదయపు ముద్దులతో మనోహరంగా రూపొందించబడిన ఆ ముఖం, తెల్లబోయి సూర్యునివంక చూస్తోంది—ఇప్పటికి తెరిపిడిబడినై అకళ్లు]

1939 తో స్పెండర్ గొంతులో ఒక మార్పు వచ్చింది. కొంచెం వెనక్కు అడుగువేసి ఆత్మాశ్రయ కవితా రీతికి మొగ్గాడు. శైలీలనుగురించీ నిరుద్యోగ బాధితులనుగురించీ ఆయన రచించిన తొలిరచనలతో పోల్చిచూస్తే అనంతరదశలో వచ్చిన రచనలలో అంతటి ప్రతిభగాని కావ్యశోభగాని కన్పించదు.

ఏది ఏమైనా, స్పెండరుకు రూపకల్పన చెయ్యటంలో నేమి, శబ్దప్రయోగపరిజ్ఞానంలో నేమి, మహాకవికి ఉండవలసిన ప్రతిభాసంపద లున్నాయి. ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చుతూ 'హార్ట్ క్రేన్' అన్నాడు :

'He has a talent for syphonic structure and sustained movement.'

కావ్యరచనలో స్పెండర్ ప్రతిభా విశేషాల సంగతి ఇలా వుండగా, విమర్శకుడుగా, వ్యాస

రచయితగా, నవ్యాంగ్ల సాహిత్య రంగంలో ఆయన అత్యంత ప్రధానమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. బలమైన తార్కిక నిరూపణలతో తన వాదాన్ని విస్పష్టంగా చెప్పగల చాకచక్యం ఆయన రచనలలో సర్వత్రా గోచరిస్తూ వుంటుంది. ఎంతటి క్లిష్టమైన భావాన్నయినా, అతి తేలికైన భాషలో ముక్కుకు సూటిగా చెప్పివేయగలడు. సత్యాన్వేషిగా ఆయన యోజన తాత్కాలికములైన ప్రయోజనాల అవధులకు మాత్రమే పరిమితం గాక సార్వకాలీనములైన ప్రయోజనములను సాధించేమార్గంలో ప్రసరించుకుంది.

స్పెండర్, 'హొరైజన్' అనే పత్రికకు సిరిల్ కొనల్లీతో సంయుక్త సంపాదకుడుగా పనిచేసి ఆ పత్రికను మహోన్నతమైన సాహిత్యస్థాయిని అందుకునేలా చేశాడు. ఆ పత్రిక సంపుటాలు ప్రతి ఒక్కటీ అమూల్యమైనదే. అనంతరం ఆయనకు 'కల్చరల్ ఫ్రీడమ్' ఉద్యమంతో పొత్తు కలిసింది ఇప్పుడు ఆ ఉద్యమం తరఫున నడుస్తున్న 'ఎన్ కౌంటర్' అనే పత్రికకు సంపాదకుడుగా పనిచేస్తున్నాడు. ఇప్పటికే యీ పత్రిక మంచి పేరు ప్రతిష్ఠలను ఆర్జించుకో గలిగింది.

చెన్నపట్నంలో జరిగిన సాహిత్యోపన్యాసాలలో, స్పెండర్ సాహిత్యరంగానికి సూత్రప్రాయములు కాదగిన కొన్ని ప్రధానవిషయాలను వ్యక్తీకరించారు.

(i) కళాకారునకు గాని, ప్రేక్షకునికి గాని వాస్తవిక జగత్తుయొక్క విస్మృతిని కలుగజేసేది ఉత్తమమైన కళ గాదు. జీవితంలో వున్న సంఘర్షణను వ్యక్తీకరించి, దాన్ని అధిగమించటానికి ఉదాత్తంగా పరివర్తనను పొందుతున్న మానవ మనోభావనను వ్యక్తీకరించడమే కళ సాధించే మహాకార్యం.

(ii) వాస్తవిక జీవితానికి వెలిగా వ్యక్తికి సంపూర్ణ స్వాతంత్ర్యము నేది హాస్యాస్పదమైన విషయం. కాని సాహిత్యకారులు గమనించవలసిన ముఖ్యవిషయమొకటివుంది. వ్యక్తినిమానవకల్పితములై, క్షణక్షణం పరివర్తన పొందుతూవుండే సాంఘిక రాజకీయాది ఉద్యమ యంత్రాలకు బానిసగా పరిగణించకూడదు. వ్యక్తికొరకే సర్వనాగరికతలనూ రూపొందించుతున్నది గనుక వ్యక్తికొరకు పరమప్రయోజనంగానే సాంఘిక రాజకీయాది సముద్యమాలలోనూ పరివర్తన తీసుకురావటానికి ప్రయత్నించాలి.

ఇంతటి విఖ్యాతి నార్జించుకున్నా స్పెండర్ ఇంకా నడివయస్సులోనే వున్నారు. సాహిత్యరంగంలో ఇంకా అనంతంగా కృషిచెయ్యటానికి ఆయనకు అవకాశం వున్నది. మహాకవికి కావలసిన ప్రతిభాసంపదల నన్నిటినీ ఆయన సంపాదించుకో గలిగారు. సాహిత్య రంగానికి గర్వకారణం కాదగిన ఒక మహారచనను ఆయన ప్రపంచానికి అందజేయగలడని మనం ఆశించవచ్చును.

ఆచార్య భ్రష్టుడు

శ్రీ పురుషోత్తమ దోభాల్

★ ★ అఖిలభారత సంస్కృత కథానికలపోటీలో ప్రథమ బహుమతినందిన కథ. సంస్కృత రచనను ప్రోత్సహించే ఉద్దేశంతో వివిధభాషల జాతీయపోటీతో నిమిత్తం లేకుండా, ప్రత్యేక సావకాశమిచ్చి, ఈకథను సరాసరి ప్రపంచపోటీకి అంగీకరించారు. శ్రీపురుషోత్తమదోభాల్ సంస్కృత హిందీభాషలలో పండితులు; సంస్కృతంలో వీరు 'ఉత్సర్గ' అనే నాటకాన్ని, 'వనిత' అనే నవలను ఇంకా కొన్ని కథానికలను రచించారు. హిందీలో చాలా నాటకాలూ, నవలలూ, కథలూ, గేయాలు రచించారు. వీరి జన్మస్థానం ఉత్తరప్రదేశ రాష్ట్రంలోని మస్మోలాగ్రామం; జననం 1925.

'అరుణా! నాకు ఈవేళ చాలా అలసటగా వుంది'

'అవును మీరు విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు'—జాలి గొంతులో అరుణ మారుపలికింది.

'నీవుకూడా చాలా బడలిపోయినట్టున్నావు'

'నా అలసటకేమిఁలెండి'—చిరునవ్వుతో సమాధానం చెప్పింది.

అరుణ సంపన్న కుటుంబంలో జన్మించిన బాలిక. బాల్యంనుంచీ, నాట్య సంగీతాలూ చిత్రలేఖనం అభ్యసించుతోంది. అరుణకు ఇంకా ఇరవై యేళ్లు నిండలేదు; అయినా సంగీత కళలో ఇప్పటికే ఆమె పేరు బహుళ వ్యాప్తిలో వుంది.

'కుముద్ సంగీత పరిషత్' ప్రధానాచార్యుడు ఆచార్య కుముద్, శిష్యురాలు అరుణ తెలివితేటలు చూసుకుని ఎంతో మురిసిపోయేవాడు. అరుణ అంటే ఎంతో ఇదిగా వుండేవాడు. అలాంటి మహామహుడైన సంగీత కళానిధి తన ప్రతిభను గుర్తించటం అరుణకు కూడా గర్వకారణంగానే వుంది.

పరమపవిత్రుడైన కుముదాచార్యుడూ, సౌందర్యరాశి అరుణా, ఇద్దరూ కలసి సభలో కూర్చుని గానంచేస్తుంటే కోయిల లాలకించేవి. వారిద్దరూ ఒక మహాసభలో విజయం సాధించి అప్పుడే తిరిగి వచ్చారు. ఆనాటి సభలో మహామహులు ఎందరో పాల్గొన్నారు. కాని వీరిద్దరికీ లభించినన్ని అభినందన పరంపరలు మరొకరికెవ్వరికీ లభించలేదు. అరుణ వీణ వాయించుతూ సంగీతం పాడింది; అనంతరం అత్యంత మనోహరంగా నృత్యం చేసింది. ఆవిడకు సహకారంగా గానం చేస్తున్న ఆచార్యుడు ఆ కళ్యాణి కంఠమాధుర్యానికి ముగ్ధుడై, ఆ వేళ వివశుడైపోయాడు. ఒళ్లు తెలియని ఆనందతన్మయత్వంలో గంగాలహరులు ఒక్కుమ్మడి వెల్లివిరిసినట్టు పాడేశాడు. అనంతరం, అదే ఆవేశంతో లేచి స్వయంగా 'శివతాండవం' ప్రదర్శించాడు. సహజంగా ఇద్దరూ చాలా అలసటపడి బడిలిపోయివున్నారు.

ఒకక్షణానికి అరుణ లోపలినుంచి వచ్చి, భోజనానికి లేవవచ్చునని చెప్పింది.

'ఇదేమిఁటి అరుణా ఈవేళ?—పరమశివునకు ప్రాంజలి బద్ధులము కాకండా మనం భోజనం చెయ్యమనే సంగతి నీకు జ్ఞప్తి తప్పిందేం?'—

'క్షమించండి — మరిచేపోయాను' అంటూ, వెంటనే శివపూజకు సన్నాహాలు ప్రారంభించింది: జ్యోతులు వెలిగించింది: కర్పూర నీరాజనం వెలుగు

తూన్న పళ్ళెరం ముందు పెట్టుకుని ఆచార్యుడు శివ స్తోత్రాలు గానం చేస్తున్నాడు. ఉండుండి ఆయన కంఠం ఎందుకో రుద్ధమౌతోంది. ఏదో అంతు తెలియని వ్యధతో అతని హృదయం ఛిన్నాభిన్నమౌతోంది. అరుణ ఒడిలో తలదాచేసుకుని బిగ్గరిగా ఏడిచెయ్యాలని, ఆయనలో ఒక విచిత్రమైన దైన్యభావం కలిగింది. ఒకటి రెండుసార్లు తల పైకెత్తి అరుణవంక చూచాడు. అరుణ కన్నులు రెండూ మూసుకుని ధ్యానసమాధిలో మునిగి వుంది.

ఆచార్యుని హృదయంలో అలాంటి కల్లోలం బయలుదేరిందని ఆవిడ కెలా అర్థమౌతుంది. ఆయన తన శిష్యులనందర్నీ తండ్రిలా ఆదరించేవాడు. అరుణను కూడా అలాగే చూస్తున్నాడు.


ప్రార్థనాదికం ముగించుకుని భోజనశాలలోకి వెళ్ళారు. భోజనందగ్గర కూర్చున్నాడన్న మాటేగాని ఆయనకు మెతుకు సాగ్గ లేదు. ఎలాగోలా రెండు మెతుకులు మునిపంట కొరికి లేచి చేతులు కడుక్కున్నాడు. అరుణకూడా తిన్నగా భోజనం చెయ్యలేదు. మిగతా శిష్యబృందమంతా ఎక్కడివాళ్ళక్కడ యిళ్ళకు వెళ్ళిపోయారు. ఆచార్యుడు తన గదిలోకి వెళ్ళిపోయాడు. గదిమధ్య పద్మాసనం వేసుకు కూర్చుని తిరిగి ధ్యానంలో మునిగిపోయాడు. ఆచార్యుడు విశ్రాంతి తీసుకునే ఆ పవిత్ర మందిరంలోకి శిష్యులెవ్వరుగాని అడుగు పెట్టే అలవాటు లేదు — ముఖ్యంగా రాత్రివేళ ఆగదిలోకి ఎవ్వరూ వెళ్లరు. కాని ఆనాడు ఆచార్యుడు ఏదో మనోవ్యాకులస్థితిలో వున్నాడని గ్రహించిన అరుణ మనస్సు ఉండబట్టలేక పోయింది. ఆస్థితిలో ఆయన్ను ఒంటరిగా వదిలివేయటానికి ఆవిడకు మనస్కరించలేదు. అరుణ లోపలికి రావటం గమనించి ఆచార్యుడు కన్నులువిప్పి అత్యంతవిగ్రహాన్ని వ్యక్తంచేస్తున్న కంఠంతో: 'ఇలా వచ్చావేం, అరుణా?' అని ప్రశ్నించాడు.

'క్షమించండి — మీకు వంట్లో బాగ్లేదేమో వని...'

'అవుననుకో, కాని...'

'ఏమిటి సంకోచిస్తున్నారు? సెలవియ్యండి—'

'నీకు అర్థంకాదులే అరుణా'



రచయిత

'చెప్పండి పోనీ, ఏమైనా సాయపడగల్గు నేమో చూస్తాను'

'నాకేదో పిచ్చెత్తిపోతున్నట్టుగా వుంది—'

'ఎందుకూ — ఎందుకంత వ్యధా?'

'నా వ్యధకు నీకు కారణం చెప్పాలా?— పో ముందిక్కడనుంచి.'

అలాంటి కఠోరవాక్యం ఆచార్యునినోటినుంచి వెల్వడటం అరుణ అతఃపూర్వం ఎన్నడూ వినలేదు. ఇక అక్కడ నిల్చుంటే అవినయంగా వుంటుందని నెమ్మదిగా బయటకి వచ్చేసింది.

తన జీవితాన్ని కళారాధనకు అంకితం చేసుకున్న ఆచార్యుడు రెండుదశాబ్దాలుగా అత్యంత నిష్ఠతో జీవితాన్ని అసిధారావ్రతంగా గడుపుతూ వచ్చాడు. తన మనస్థైర్యాన్ని యావన్మాత్రమైనా చలింపనిచ్చేవాడుకాదు. కాని అరుణ గురుకులంలో అడుగుపెట్టినతరువాత, ఆయన మనస్సులో ఏదో మార్పు వస్తున్నట్టు ఆయనకే తట్టింది. మనస్సు స్వాధీనం తప్పుతోంది. రానురాను ఆపినా ఆగకుండా ఆయన మనోభావన యావత్తూ అరుణ చుట్టూ

తీగలుతీగలుగా పెనవేసుకుపోతోంది. కళ్ళెదుట వుంటే, ఆ మూర్తిమీదనుంచి కనుచూపులు వెనక్కి మళ్ళించుకోలేకపోతున్నాడు. కళ్ళెదుట కనుపించక పోతే ఆ మూర్తినిగురించే ఆలోచించుతున్నాడు. కలలోకూడా ఆ మూర్తినే దర్శించుతున్నాడు.

ఈ పదిమాసాలనుంచీ ఎలాగోలా నిభాయించు కొచ్చాడు. కాని నాటి సాయంత్రం జరిగిన ప్రదర్శనంలో ఆ ముగ్ధమోహినీరూపం చూసి తన్మయుడై పోయాడు. ఆయన మనస్థైర్యం ఛిన్నాభిన్నమైపోయింది. అరుణ సన్నిహితురాలౌతుంటే ఆయన కిప్పుడు భయంగానూ, అలజడిగానూ వుంది.

అరుణ కిదంతా ఏమీ తెలీదు. పరమపూజ్యుడైన గురుదేవుని ఈ మనోవ్యాకులతకు కంతికూ తనే కారణ మన్న విషయం కలలోనైనా ఊహించలేకపోయింది. ఆయన అంతకల్లోలపడటానికి కారణ మేమిటి? కొంప తన్వతి చేసిన అవినయంగా ప్రవర్తించలేదుగదా! అరుణకు కంగారుగా వుంది.

ఇలా మథనపడుతూ తన గదిలోకిపోయి పడు కుంది. కాని కునుకుపట్టలేదు. తెల్లవార్లూ అందోళన పడుతూనేవుంది.

తూరుపురేఖలు పొడుస్తున్నయ్. పక్షుల కలకలారావం విని పక్కమీదనుంచి లేచి బయటికి వచ్చింది. సరాసరి ఆచార్యుల గది దగ్గిరికివెళ్ళి కిటికీలోనుంచి తొంగిచూసింది. పద్మాసనస్థితుడై అలానే కూర్చునున్నాడు. వెళ్ళి స్నానంచేసి మళ్ళా తిరిగి వచ్చింది. ఆయన కళ్ళు తెరిచి చూచేసరికి తాను శివ పూజకు కావలసిన సన్నాహమంతా చేస్తూ కనుపించింది.

ప్రభాత పూజ పూర్తికాగానే అరుణ తన గది లోకి వెళ్ళిపోయింది. మిగతా అధ్యాపకులూ సచ్ఛాత్రులూ అంతా వచ్చారు. ఆచార్యుడు పాఠశాల కార్యక్రమంలో నిమగ్నుడైపోయాడు. ఆయన ఇప్పుడు నిర్వ్యాకులుడైవున్నట్టు అరుణకు కనుపించాడు. విద్యార్థులంతా రావటంతో వాతావరణ మంతా తిరిగి కళకళలాడిపోయింది.

మామూలు మోస్తరుగానే ఆ మధ్యాహ్నంకూడ అరుణ ఆచార్యులకు భోజనం వడ్డించింది. పగలంతా మామూలుగానే ప్రశాంతంగా గడిచిపోయింది. అంతా సరీగానే వున్నదనే ఆత్మసంతృప్తి కలిగింది, అరుణకు. సాయంత్రం పంచపాళీలోకూర్చుని హాయిగా వీణ వాయించుకుంటోంది. గీతిపై గీతిగా మహదానందంతో గానం చేస్తోంది. ఆ తన్మయతలో పరిసరాలలో ఏమి జరుగుతున్నదో కూడా ఆమెకు తెలియలేదు; ఎంత ప్రొద్దుపోయిందో కూడా అవగతం కాలేదు.

వీణావాదనం ముగించేసరికి అర్ధరాత్రిదాటింది. విశ్రాంతి తీసుకోవటానికి తన గదిలో ఉన్న పక్క చేరటకు వెళ్ళింది. ఏదో అలజడై వెనక్కి తిరిగి చూచింది. చిరునవ్వు నవ్వుతూ అనతిదూరంలో ఆచార్యుడు కనుపించాడు:

'అరుణా! ఇంత ప్రొద్దుపోయిందేం?'

'హాఁ! అవును ప్రభూ'—అయోమయంగా సమాధానం చెప్పింది.

ఆచార్యుడు ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ ఆమెను సమీపిస్తున్నాడు. ఇంద్రియ సంక్షోభంతో వికృతంగా మారిపోతున్న ఆయన ముఖం చూసి అరుణకు కంగారెత్తిపోయింది

'నాన్నా'—భీతహరిణిలా అర్చింది.

ఆ కేక ఆచార్యుని హృదయంమీద సుత్తిపు కొరడాలా ఛెళ్ళున మోగింది. తన అమానుషత్వానికి తానే సిగ్గుపడి తలవంచేసుకున్నాడు పశ్చాత్తాపంతో ఆయన హృదయం దగ్ధమైపోతోంది.

'మహా పాపిని—క్షమించు అరుణా!'—ఈమాట అంటూనే, బయటికి వెళ్ళిపోయాడు.

మర్నాటి ఉదయమే నిద్రలేచి అరుణ ఆచార్యుల మందిరం దగ్గరికి వచ్చి చూచింది. గది మధ్య పద్మాసనం వేసుకుని ధ్యాననిమగ్నుడై వున్నాడు. ఆయన సాధనకు భంగం కలగకుండా ఏమీ చప్పుడు చేయకుండా పిల్లికూనలా యివతలికి వచ్చేసింది. దేవాలయంలోకి వెళ్ళి పూజాదికాలు ముగించుకుని మళ్ళా తిరిగివచ్చి చూచింది. ఆయన శిలామూర్తిలా ఇంకా అలానే కూర్చునున్నాడు. అరుణకు అనుమానమేసి, దగ్గిరికి వచ్చి, ఆయన దేహాన్ని స్పృశించి చూచింది. ప్రాణంలేని మృత కళేబరం! అరుణకు కంగారెత్తిపోయింది. గురుదేవుని ముందు జ్వాలలు లేస్తున్న అగ్నిహోత్రపు దీధితులతో ఆ మందిరం ఊహకు అందని ఒక పునీత దృశ్యంగా మారిపోతున్నది. అరుణ మానసపథంలో ఏదో సుడిగాలి ఉప్పెనలా లేగిపోయింది. ఆచార్యుల పాదసన్నిధిని సాష్టాంగంగా మూర్ఛిల్లిపోయింది.

అస్థిపంజరం

శ్రీ మంథా వెంకటరమణారావు

[గతసంచిక తరువాయి]

రంగం: 2

★★ పార్వతీశంగారియిల్లు. పొడుగాటి పెద్దగది; గదిలో ఒక పెట్రొమాక్సు వెలుగుతోంది ఒక స్టాండుమీద; గదికి పెద్దపెద్ద కిటికీలు; రెండు ద్వారాలు — ఒకటి బైటకి, రెండవది ప్రక్కగదిలోకి; దళసరైన ఎర్రటి కర్టెన్లు; రెండవగదిలోకూడా ఒక పెట్రొమాక్సు వెలుగుతోంది కాని దానికాంతిని మరుగుపరుస్తోంది ద్వారానికున్న కర్టెను.

గది ఈ కొసను రెండుసోఫాలు, ఒక పెద్దటేబిలు, రెండుకుర్చీలు; టేబీలుమీద డాక్టర్ తోలుసంచి, ఇంజక్షన్ పరికరాలు, కొన్నిగ్లాసులు, బేసిన్‌తో నీరు — ఇంకా కొన్నికొన్ని మందుసీసాలు, ప్యాకెట్లు; టేబిలుమీద వెలుగుతూ ఒక స్టవ్; డాక్టర్ రామా రావు నిల్చొని ఇంజక్షనుకు కావలసినవి తయారుచేసుకుంటూ ఉంటాడు; పార్వతీశంగారు ప్రక్కని నిల్చొని ఉంటారు. వయస్సు 55 సం॥లు, తెల్లటి పంచ, గోధుమ రంగు లాల్చీ, బట్టతల, పెద్దనుదురు; తమ్మునికీ ఇతనికీ పోలిక ముక్కులోనూ, పెదవులలోనూ ఉంది. ఇతనికీ మీసాలున్నాయి కాని అంత పెద్దవి కావు ★★

పార్వతీశం: (ప్రక్క గది ద్వారంవైపుచూసి) ఇంజక్షన్ ఇప్పుడే ఇస్తారా డాక్టర్?

రామారావు: ఇంకొక పదినిముషాల్లో —

పార్వతీశం: అయిదునిముషాలు మీరు విశ్రాంతి తీసుకోవచ్చు—

రామా: నేను విశ్రాంతి తీసుకు నేందుకు రాలేదు.

పార్వ: (గొంతు తగ్గించి) మీ అభిప్రాయ మేమిటి డాక్టర్?

రామా: (పనిచేసుకుంటూ మౌనం)

పార్వ: (బెదురుగా) మనచేతులుదాటి పోయిందంటారా?

రామా: నా ప్రయత్నం నేను చేస్తాను అన్ని విధాలా—

పార్వ: ఆశ ఉందంటారా?

రామా: మీ రింకా ఆలస్యంచేసుంటే ఏమీ ఉండకపోను—

పార్వ: ఔను—మధ్యాహ్నంవరకూ తెలుసుకో లేకపోయేను. తెలుసుకున్నాకకూడా ... (డాక్టర్ మౌనంగా పనిచేసుకపోతూ ఉంటాడు) మీకొక సంగతి చెప్పాలి...

రామా: చెప్పండి...వింటున్నాను...

పార్వ: మీతండ్రిగారినిగురించి...

రామా: చెప్పండి...

పార్వ: మీతండ్రి గొప్పభక్తులు...

రామా: నాకు తెలుసు...

పార్వ: అసంగతి...?

రామా: విన్నాను.

పార్వ: నాభార్య పోవడానికి ఆయనే కారణం అని ఇవాళవరకు నా నమ్మకం.

రామా: (పనిచేసుకుంటూనే) ఇవాళ ఆనమ్మకం పోయిందా?

పార్వ: ఆయనే ఆనాడు పూజమానేసి వచ్చి ఉంటే నా భార్య బ్రతికుండేది.

రామా: ఆయన రాకపోయినా అంత అనుభవమూ ఉన్న కామేశ్వరరావుగార్ని తీసుకవెళ్లేరుగా?

పార్వ: మీ తండ్రిలో నాకు గురి ఉండేది...

రామా: ఆయన ట్రీట్ చేసినా అదే ఫలితం కలిగితే...

పార్వ: అంతగా బాధపడకపోయిఉండేవాణ్ణి.

రామా: మీకు ఆయనమీద గురిఉందని, ఆయన రాకపోయేడని, మీ భార్య పోవడానికి ఆయనమీద నిందవేస్తారన్నమాట...

పార్వ: కాని, డాక్టర్ అన్నవాడు సందర్భాన్ని, తొందరని గమనించి వెంటనే కేస్‌కి ఎటెండవడం బాధ్యత కాదా?

రామా: ఎందరు డాక్టర్లలా ఎటెండవుతున్నారు?

పార్వ: ఏ డాక్టరన్నా వచ్చిఉండును...

రామా: మీరు పిలుస్తే...

పార్వ: నేను పిలుస్తేనా?

రామా: ఔను! మీరు పిలుస్తే. మీకా శక్తి ఉంది గనక—ఒక సాయంత్రం టెన్నిస్ ఆట పోయినా విచారించవల్సిన పనిఉండదు గనక.

పార్వ: ఇతరులు పిలిస్తే అలా వెళ్ళరంటారా?

రామా: అలా నేను చెప్పలేను...కాని, ఇవ్వడంలో శక్తి తక్కువగా ఉన్నవాళ్లు, అలాటివాళ్ళ విరామసమయంలో పిలుస్తే, కొంతమంది కొంచెం ముందువెనుకలు ఆలోచించటం వుంది సాధారణంగా...ఇప్పుడు మీరేగా నా తండ్రి, మీ భార్య పోయేందుకు కారణం అన్నారో, అలానే ఇవ్వలేందుకు శక్తిలేనివాళ్ళంతా ఇలాటి దేదన్నా అయితే ఆ డాక్టర్ని అలానే అంటారు...నేననేది మా నాన్నగారు తక్కిన డాక్టర్లకన్నా తప్పుగా ప్రవర్తించిందేమీ లేదని. డాక్టరయాక తన వృత్తిధర్మాన్ని కొన్ని స్వంత కారణాలవల్ల నెరవేర్చలేకపోవటం తప్పే...కావచ్చు......కాని ఆయన కేసు పట్టాక అశ్రద్ధ చూపటం నేనెప్పుడూ ఎరగను. పూజ విషయమంటారా? మనిషై పుట్టాక అలాంటి మొండిపట్టు ప్రతీవారికీ ఏదో ఒకటి ఉంటూనే వుంటుంది

పార్వ: మీరెంత చెప్పినా, నా మనస్సులో ఆ బాధ ఉండిపోయింది...

రామా: మీ నాన్నమీద పగపట్టేరని కూడా విన్నాను—

పార్వ: (నవ్వి) ఆ ద్వేషం ఉండేది. ఆయన కుమారులు మీరు—మీమీద కూడా ఆ ద్వేషం ఉండేది ..అలాటివారు మీరు కాకపోయినా...

రామా: ఇప్పుడుకూడా ఉందంటారా?

పార్వ: మీ తెలివితేటలలోనూ, కార్యదీక్షలోనూ నాకు పూర్తిగా నమ్మకం ఉంది. అందుకే మీరు తప్ప మరెవ్వరూ నాకిష్టం లేకపోయింది...మీ దగ్గరికి వెళ్ళడానికి మనసు కుదుర్చుకోలేక మధ్యాహ్నంనించీ కొట్టుకున్నాను...

రామా: ఊఁ...

పార్వ: నాకు పిల్లొక్కటే కూతురు......ఏక పుత్రి విషయం.

రామా: విన్నాను.

పార్వ: ఏమంటారు......(గద్గదస్వరంతో) నేనేవో మాటలు మీ తండ్రిగారిని గురించన్నాను. అది మరిచిపోండి...

రామా: దానికీ, దీనికీ సంబంధ మేమిటి?...మానసిక కారణాలు వృత్తిలోకి తేవటం డాక్టరు పని కాదు...

పార్వ: (కొంతు తగ్గించి) మీలో నేను పూర్తి నమ్మకం ఉంచుకున్నాను...అన్నివిధాలా ప్రయత్నిస్తారని...మిమ్మల్ని నా శక్తికి తగ్గట్టు సంతోష పెట్టకపోను...

రామా: సంతోష పెట్టడం సంగతి ఎత్తకండి... పేషెంటుని డబ్బు దృష్టితో చూడడం నాకు సాధ్యం కాదు పార్వతీశం గారూ......మీరు కోగాన్ని డబ్బుతో లొంగదియ్యలేరు కదా! నా ప్రయత్నం గురించి మీరేం ఆతురతపడకండి...

పార్వ: మీ కింకేమన్నా కావాలా?

రామా: ఏమీ అక్కర్లేదు—కాని ఎవరన్నా నాకు సహాయం ఉండాలి...

పార్వ: నేను ఈబాధ చూడలేను...

రామా: బిడ్డవిషయంలో తండ్రికి అలానే ఉంటుంది...మీరే ఉండక్కర్లేదు...

పార్వ: (బాధతో) నా ప్రాణం అన్నా ఇచ్చేస్తాను కావాలంటే...కాని ఈ ఇంజక్షన్లివ్వడం అదీ చూడలేను...

రామా: ఎవరున్నా చాలు ... మీరు విశ్రాంతి తీసుకోండి...

పార్వ: విశ్రాంతి!! అదికూడానా?

రామా: సరే ... మీరు వెళ్ళి ఎవర్నన్నా పంపండి...

పార్వ: పనివాళ్ళు లాభంలేదు...మా కోడల్ని పంపుతాను....

రామా: (ఆశ్చర్యపోయి) వద్దొద్దు! ఆవిడకి శ్రమ నివ్వకండి! పనిమనిషిని పంపండి చాలు!

పార్వ: మా కమల ఇటువంటివిషయంలో ఆరి తేరిపోయింది.

రామా: కమల!! (వెంటనే సర్దుకుంటాడు)

పార్వ: (అనుమానంగా) మీకు తెల్సునా? విశ్వనాథంగారి అమ్మాయి.

రామా: (పని ఆపి) విశ్వనాథంగారి అమ్మాయి!!

పార్వ: ఔను—కాలేజీలో చదివినఅమ్మాయి .. మీకు తెలిసేఉంటుంది...

రామా: (కొద్దిగా తొణుకుని) ఔను! నాకు తెలుసు. (తత్తరపాటుతో) నా క్లాస్ మేట్.

పార్వ: నిజంగా — (అంత విచారంలోనూ చిన్న నవ్వు తెచ్చుకొని) అయితే ఇంకేం — మీతో పరిచయమున్నది కూడానూ...(ఎవర్నీ ఉద్దేశించక) ఇన్నేళ్లయి కమల గాక ఇంకెవరు నెగ్గుకొచ్చేరు.

రామా: ఆమె కింకా శ్రమనివ్వడం మంచిది కాదేమో! పనిమనిషిని పంపండి...

పార్వ: పనిమనిషిని పంపడమే! కోడలు ఒప్పుకుంటుందా! అలా లాభంలేదు డాక్టర్! కమలని పంపుతాను...మీ భోజనం ఎనిమిదింటికి...

రామా : క్షమించండి — నేను భోజనం చెయ్యను.

పార్వ: అదేం డాక్టర్! మనమంతా ఒక శాఖ వాళ్ళమే!

రామా: నాకా నియమా లేమీ లేవు...కాని కాఫీ వుంటే పంపండి...అంతకుమించి ఏమీ తీసుకోను...

పార్వ: సరే డాక్టర్...నాకూ ఏం తినాలని లేదు...

[పార్వతీశంగారు వెళ్తారు...రామారావు పని ఆపి ఒకసారి ద్వారం వైపు, మరోకసారి పేషెంటున్న గదివైపు చూస్తాడు...అతని ముఖకవళికలలో చాలా మార్పు వచ్చింది. చిన్న దవ్వాడైతే అతని కళ్లు చెదురుగా చూస్తున్నాయి.

రెండు నిమిషాలు గడుస్తాయి. కమల కాఫీ ఫ్లాస్కుతోనూ, బిస్కట్ల టిన్‌తోనూ ప్రవేశిస్తుంది. వయస్సు-25 సం॥—లేతగులాబీరంగు చీర—తెల్ల వాయిలు జాకెట్టు వేసుకుంది...ముడి వేసిన జుత్తు—మనిషి అందకత్తె అనే చెప్పాలి. గోధుమరంగు శరీరం.

ముఖం వాడిపోయింది......కళ్ళు నీరసంగా వుండి, ఏదో విచారాన్ని, బాధని వాటిలో దాచుకున్నాయి—

రామారావు ఉలిక్కిపడి, ఆమె ముఖాన్ని కొన్ని సెకెండ్లు చూసి పనిలో మునిగిపోతాడు—కమల ఇదేదీ గమనించనట్టు టేబిలుదగ్గిరికి వెళ్ళి, ఫ్లాస్కు, టిన్ను, దానిమీద పెట్టి, పేషెంటున్న

(ప్రక్క గదిలోకి వెళ్తుంది. ఒక నిమిషం పోయాక తిరిగి డాక్టర్ దగ్గరి కొస్తుంది.]

కమల: ఏమిటి చెయ్యమంటారు?

రామా: (ఆమెముఖంలోకి చూస్తాడు. ఆమె కళ్లు దించుకుంటుంది) ఇంజక్షన్ తయారుచేస్తాను. కొంచం సాయం చెయ్యాలి—అంతే. సెలైన్ ఫ్లాస్కు పట్టుకోవాలి...

కమల: సరే...

రామా: (వాచీ చూసుకుంటాడు) టయిమైంది. రండి...

[గది కొన్ని నిమిషాలు కాళీ—ఇద్దరూ తిరిగి వస్తారు—కమల ఇంజక్షన్ పరికరాలు మోస్తూ]

రామా: (ఆగి) ఒక్క రోజులో ఇలా కల్యం అయిపోయేరా?

కమల: (ఆగి) కాదు.

రామా: ఊఁ...

కమల: క్షయ...

రామా: ఓహో!

కమల: తెలిసే అడిగేరా?

రామా: (తత్తరపాటుతో) ఎలా అనుకుంటున్నారు?

కమల: ఆశ్చర్యపోలేదు కాబట్టి.

రామా: ఎందు కాశ్చర్యపోవాలి? రోగం పేరు విని?

కమల: అయితే నేను పొరపాటుపడ్డాను.

[కుడిప్రక్క గదిలోనించి గడియారం గంటల శబ్దం వినవస్తుంది, ఎనిమిది సూచిస్తూ]

రామా: (వాచీ చూసుకుంటాడు) ఆగడియారం గంటలు మైలుదూరం వినిపిస్తాయిలా ఉంది...ఇటు వేపింకో గది ఉందా?

కమల: ఉంది — కాని దానిద్వారం అటు వేపుంది—మళ్ళీ ఎన్ని గంటల కివ్వాలి?

(టేబిలువైపు నడుస్తుంది)

రామా: మూడేసిగంటల కొకొక్కసారి... అంటే పదకొండుకొకసారి, రెండు కొకసారి. (ఆమె వెంటవెళ్తూ) మరోక పావుగంటకి కోరమైన్ ఇంజక్షనిస్తాను.

కమల: తలుపుదగ్గర వేడినీళ్లు, సబ్బు ఉన్నాయి. చేతులు కడుక్కోండి.

రామా: (ఆగి) టేబిలుమీద డెట్టాలుంది... పట్రండి. అక్కర్లేదు... నేనే తెచ్చుకుంటాను...

కమల: ఫరవాలేదు — నేను తెస్తాలెండి...

రామా: అనూదికూడా ఇప్పుడే తీసేస్తే తరవాత ఇంకోసారి చేతులు కడుక్కో అక్కర్లేదు—

[టేబిలు దగ్గరికి వెళ్లాడు కమల స్టవ్ క్రింద నుంచి బేసిన్‌తో నీళ్లు దానిమీద పెడుతుంది... డాక్టర్ తనపని చేసుకుంటాడు. కమల తలుపుదగ్గరికి వెళ్ళి చేతులు కడుక్కుంటుంది.

డాక్టర్ కూడా వెళ్లి చేతులు కడుక్కుంటాడు—

కమల తువ్వాలందిస్తుంది. చేతులు తుడుచుకొని అతను సిరంజికేసుతోకూడా బేసిన్‌లో పెడతాడు]

కమల: కాఫీ ఇచ్చేదా?

రామా: (ఆమెవేపు చూస్తూ) ఈ ఊళ్లో కాఫీ హోటలుందా?

కమల: హోటలుకాఫీ కాదులెండి... నేను చేసింది...

రామా: రెండు నిమిషాల్లో చేసేశారా?

కమల: ముందుగానే చేసి ఉంచేను.

[బిస్కట్లటిన్ను విప్పుతుంది]

రామా: తుమిందండి. నేనేమీ తినను. కొంచం కాఫీ ఇవ్వండి చాలు...

కమల: మీరు భోంచెయ్యలేదుగా?

రామా: నాకేం తినాలని లేదు. కాఫీ ఇవ్వండి చాలు—

[వెళ్ళి సోఫాలో కూర్చుంటాడు. కమల ప్లేట్లో బిస్కట్లు, కప్పులో కాఫీపోసి సోఫాదగ్గరి కొకస్టూలు లాగి దానిమీద పెడుతుంది]

కమల: ఫరవాలేదు. అవి తీసుకోండి. ఇక్కడేమున్నా తినేందుకు జంకుతున్నారేమో?

రామా: జంకెందుకు? 'డిస్ ఇన్ ఫెక్టు' చేసేక అంతా?

కమల: ఏమోలెండి.

రామా: వద్దు—వత్తిడి చెయ్యకండి...

కమల: నేనూ భోజనం చెయ్యలేదు—ఆ మాట కొస్తే నాకూ కొంచెం ఏమన్నా తినాలని ఉంది... మీరు తినకపోతే నాకూ తిన బుద్ధికాదు.

రామా: మీరు భోం చెయ్యలేదూ? ఇందండి... (ప్లేటు అందిస్తాడు) నేను తినకపోతే మీ కెందుకభ్యంతరం?

కమల: మీరు అతిథిలాంటి వారుకూడా...

రామా: ఆ పిచ్చేం పెట్టుకోకండి—నా కలాటి మూఢ విశ్వాసా లేమీ లేవు.

కమల: (లేచి మరొక ప్లేట్లో బిస్కట్లు తెచ్చుకొని సోఫాకొసని కూర్చుంటుంది) రాత్రిళ్లా మేలుకోవాలి. అలసట ఔతుంది...మీ ఇష్టం.

రామా: సరే—అంత వత్తిడి చేస్తున్నారు కనక.

[ఇద్దరూ తింటూ ఉంటారు]

మీరు నన్ను పోల్చలేనట్టుంది...

కమల: (ఊరుకొని) కాఫీ మీకు వెంటనే ఎలా వచ్చింది?

రామా: నేను వస్తానని తెలుసునా?

కమల: తెలుసు—నూమగారు చెప్పేరు.

రామా: కాని మీరు నన్ను గుర్తించినట్టు అనిపించలేదు.

కమల: అంటే ఎలా ప్రవర్తిస్తానని ఉద్దేశపడ్డారు?

రామా: ఓహో అంటే ఓహో అనుకోవచ్చును గా? అంతమాత్రాన ఏమీ తప్పులేదు.

కమల: నేను ఇంతసేపయి మీ అతిథి మర్యాదకి ఆశ్చర్యపోయేను—ఒకవేళ మీకే నన్ను తెలుసుకోడం ఇష్టం లేదేమోనని...

రామా: పరిస్థితులు మారేయి కదూ? పైగా నీకే నన్ను జ్ఞాపకం ఉంచుకోడం ఇష్టం లేదేమోనని.

కమల: (దెబ్బతిన్నట్టయి) అంటే?

రామా: నేను తిరిగి మద్రాసునించి వచ్చేవరకు నువ్వింత అదృష్టవంతురాలవయ్యేవని తెలీదు ... అర గంట క్రిందటివరకూ ఆ శ్రీమంతుల ఇల్లు ఇదేనని తెలీదు.

కమల: (ఆవేశం పట్టలేక) రేపు ఉదయం వరకూ తెలీదు నాలాంటి దురదృష్టవంతురాలుండబోదని...

రామా: కమలా!! ఏమిటా మాటలు!!

[కమల ప్లేటు క్రిందపెట్టి సోఫా చేతిమీద తల ఆన్చి, చేతులతో ముఖం కప్పుకుంటుంది]

రామా: (తన ప్లేటుకూడా స్టూలుమీద పెట్టి) ఎందుకలా బాధపడి ఏడుస్తావ్ కమలా) ఏ బెంగా పెట్టుకోకు. మీ ఆయనకేం ఫరవాలేదు. నాకు ధైర్యంగా ఉంది...నువ్వలా అధైర్యపడకు.

[కమల ముఖం ఎత్తి కళ్లు చీర చెంగుతో తుడుచుకుని రామారావు వేపు వింతగా చూస్తుంది]

ఔను కమలా! నే నీకా ధైర్యం ఇస్తున్నాను. సరిగ్గా వేళకు మందుపడాలి. రాత్రి పన్నెండునించి తిరుగు ముఖం పడుతుంది వ్యాధి.

కమల: (ఏదో బాధని మరుగుపరుస్తూ) నిజమా డాక్టర్!

రామా: నిజం కమలా ... మీ ఆయన్ని తిరిగి నీకప్పగించే పూచీ నాది...సరా?

కమల: (గుండెమీద చెయ్యి వేసుకొని) నా కెంత ధైర్యం ఇచ్చేరు! మీ మేలు మరిచిపోలేను జన్మజన్మలకీ!

రామా: ఇందులో మేలు కేముంది కమలా! నా కర్తవ్యం!

కమల: ఔను కర్తవ్యం—డాక్టర్లకదూ...

రామా: నేనలా అనడం నీ కిష్టం లేకపోతే... ఒక స్నేహితుడుగా సాయం అనుకో.

కమల: ఎలా అనుకోమంటారు ... డబ్బండీ డాక్టర్ గారూ...డబ్బు పుచ్చుకోడం మానేస్తారా?

రామా: అలా ఎందుకంటావ్ కమలా! నువ్వలా అనటం నాకు కొత్తగా ఉంది... నేను డబ్బుకోసమే రాలేదు...

కమల: నాకోసం కూడానా?

రామా: (తీవ్రంగా) కమలా! ఏంమాటలవి?

కమల: మీ రెందుకలా అనుకుంటారు. నాకు సాయం చెయ్యడానికా? అంటే ఒక యువతిని వైధవ్యంనించి తప్పించడానికా అని?

రామా: అబ్బ! నువ్వింతగా మారిపోయేవ్! ఎలాటిమాటలు!

కమల: నేను శ్రీమంతురాలిని. మారిపోయేను కదూ! పరిస్థితిబట్టి మాటలుకూడా మారుతాయి.

రామా: (ఆశ్చర్యంగా) నాకేదో తప్పన్నట్టు మాటాడుతున్నావ్ కమలా—ఎందుకో నా కలా అనిపిస్తోంది.

కమల: తప్పా? (జ్ఞాపకం వచ్చినట్టయి తీవ్రంగా) ఔను. మీరు పావుగంటకి ఒక ఇంజక్షనేదో ఇస్తానన్నారు...ఇరవైనిముషాలు దాటిపోయింది...

రామా: (గాబరాగా వాచీచూసుకొని) ఇంకా నాలుగు నిముషాలుంది...

కమల: మీ వాచీ తప్పు! మీరు అశ్రద్ధచేద్దామని చూస్తున్నట్టుంది డాక్టర్!

రామా: (కోపంగా) కమలా! ఇలాటి మాటలు నేను పడను. నా డ్యూటీలో నే నెప్పుడూ అశ్రద్ధ చెయ్యలేదింతవరకూ...ఆ నిందమాత్రం అన్నింటికన్నా నన్ను బాధపెడుతుంది...

కమల: అశ్రద్ధచేస్తే రేపు నా కెవరూ ఉండరు...దిక్కూ మొక్కూ ఉండరు...అది అనువుగా తీసుకుందామని చూస్తున్నారా? తీసుకొని, మీకు పోయిన కమలని తిరిగి తెచ్చుకుందామని చూస్తున్నట్టుంది...

రామా: కమలా!!! (వణుకుతూ లేచి నిల్చుంటాడు)

కమల: ఎంతసాహసం! ఇది అన్యాయంకాదా డాక్టర్! ఒక ఆడదాని జీవితం పాడుచెయ్యడం!

రామా: హా! కమలా...చూడు...ఏంచెప్పడానికి నోరురాకుండా ఉంది...ఇదగ ఈ వాచీ... (వాచీతీస్తాడు చేతినించి) వెళ్ళి టైమ్‌చూసిరా ఆ వాచీతో...వెళ్లు...ఇందాక గంటలు కొట్టినప్పుడు వాచీ చూసుకోలేదంటావా? ఎంత నిందవేసేవ్ కమలా! నా ఒళ్లు వణికిపోతోంది!

కమల: ఒళ్లు వణికితే ఇంజక్షనివ్వలేరు. మీ కర్తవ్యం?

రామా: (మనసు కుదుట పరుచుకుంటూ) ఇవ్వగలను. ఆ బాధేమీ లేదు. ఎంత మాటన్నావ్ కమలా! నా మనస్సెంత బాధపడుతోంది! నువ్వు పాత కమలవి కావు!

కమల: (చిన్న నవ్వు నవ్వి) ఎలా ఔతాను. మీకేం పిచ్చిపట్టిందా? పాత కమలనైతే బావుణ్ణనుకుంటున్నార్లా ఉంది...

రామా: కమలా నువ్వు నన్నెందుకో బాధ పెడదామని చూస్తున్నావ్. నాది తప్పు లేకపోయినా, నే నే తప్పూ నీపట్ల చెయ్యలేను...మరింక ఈ రాత్రి ఇలా నువ్వు మాట్లాడకు మీ ఆయనమీద నీకు ప్రేమ ఉంటే...

కమల: అడుగో మళ్లా బెదిరింపా? లేకపోతే ఇక్కడ్నించి పోతానంటారా?

రామా: పోను. నువ్విలా మాటలతో నన్ను బాధ పెడుతూ ఉంటే నా మనస్సు స్థిమితంగావుండదు. ఈ పనికి మనస్సు అడ్డురాకూడదు. దానికేభావం ఉండకూడదు. మరలా పని చెయ్యాలి...(వాచీ చూసుకొని) టయిమయింది—ఇంజక్షనివ్వాలి...

కమల: ఏం చెయ్యమంటారు?

రామా: ఇప్పుడు నువ్వేం చెయ్యక్కర్లేదు. (కేసిన్‌లోనుంచి సిరంజికేస్ తీస్తాడు. స్టవ్ ఇంకా వెలుగుతూ ఉంటుంది సిరంజ్ తీసి దాన్లో మందు నింపడంలో మునిగిఉంటాడు)

కమల: స్టవ్ ఆర్పివేసేనా?

రామా: ఇప్పటి కార్పేయి మళ్ళా వెలిగించుకోవచ్చు.

[స్టవ్ ఆర్పేస్తుంది కమల. నిశ్శబ్దం—హోరున వర్షం కురిసి వెలిసినట్టుంటుంది.]

నువు రానక్కర్లేదు.

[రామారావు ప్రక్క గదిలో పేషెంటుదగ్గరికి వెళ్తాడు. కమల లైటుకి గాలి కొడుతూ ఉంటుంది—గాలికొట్టి కమల సోఫాలో కూర్చుంటుంది. రామారావు ఇంజక్షన్ ఇచ్చి టేబిల్ దగ్గరికొస్తాడు]

ఆ సీసాలోవి రెండు మాత్రలు మింగించిరా.

[కమల సీసాలో మాత్రలు తీసుకొని గదిలోకి వెళ్తుంది. రామారావువెళ్లి చేతులు కడుక్కొని వచ్చి సోఫాలో కూర్చుంటాడు. కమల తిరిగి వస్తుంది, వచ్చి సోఫా రెండవకోసని కూర్చుంటుంది]

కమల: కాఫీ అలా ఒదిలేసేవ్! తాగు!

[రామారావు వింతగా ఆమెకళ్లలోకి చూస్తాడు] ఏం? మర్యాదగా మాట్లాడాలా?

రామా: ఇంతకన్న ఎక్కువ మర్యాద నాకొద్దు.

కమల: కాఫీ చల్లారిపోతోంది—

రామా: నాకు తాగాలని లేదు....

కమల: నేనేదో సరిగా ఇందాక అనేశాను... అందుకు కోపం వచ్చిందా?

రామా: ఆశ్చర్యం వేసింది. అదీ ఒక్క నిమిషమే. కోపమా? అది నాకు రాదు...

కమల: డాక్టరయాక కొన్ని నియమాలతోనూ, నిబంధనలతో నూ జీవితాన్ని కట్టేసుకున్నట్టుంది...

రామా: నావృత్తికి సంబంధించినంతమట్టుకు—నిజమే—

కమల: అది తప్పిస్తే నువ్వు స్వతంత్రుడవేనా?

రామా: అలా అని అనుకుంటాను. కాని కాదేమో. మనం అంతా అంతే. కొన్ని కొన్ని నియమాలు ఏర్పాటుచేసుకుంటాం మన జీవితంలో .... వాటి ప్రకారం నడుస్తూ ఉంటాం—

కమల: కొన్ని ఆశయాలుకూడా ఉంటాయి ప్రతిమనిషికీ—

రామా: ఆశయాలు—ఔను ఉంటాయి.

కమల: నియమాలు మనస్సుమీద ఆధారపడి ఉంటాయి. కాని ఆశయాలు సిద్ధించడం పూర్తిగా ఆవ్యక్తి ఇష్టంమీదా, మనోబలంమీదా ఆధారపడి ఉండదు....

రామా: నేను నిరాశపొందలేదు—నాకు చిన్నప్పట్నుంచీ డాక్టర్ అవాలని ఉండేది ... అదే నాఆశయం—డాక్టర్ని అయేనుకదా?

కమల: మరింకే ఆశయం నీకుండేది కాదని ఖాయమేనా? నువ్వు నిశ్చయంగా చెప్పగలవా?

రామా: చెప్పగలను.

కమల: నువ్వు వట్టి పిరికివాడివి!

రామా: (ఆశ్చర్యంగా) ఏం?!

కమల: నే ననుకున్నది నిజమున్నమాట!

రామా: ఏమిటనుకున్నావ్ నువ్వు?

కమల: జరిగిపోయింది మరెందుకు? నీకు మరే ఆశయం లేదన్నందుకు నా కాశ్చర్యం వేస్తోంది. కాలేజి రోజులు జ్ఞాపకం ఉన్నాయా?

రామా: ఉన్నాయి. ఎందుకు లేవు?

కమల: అప్పటి రోజులు!

రామా: జ్ఞాపకం ఉన్నాయి.

కమల: నా కప్పుడు ఒక ఆశయం ఉండేది. ఒకే ఒక ఆశయం. అది నెరవేరింది కాదు.

రామా: నా కర్థమయింది కమలా. దాన్నే నువ్వు ఆశయం అంటే—

కమల: అది ఆశయం కాదంటావా?

రామా: కాదేమో! అది కోరిక.

కమల: కోరిక! ఆశయానికీ దానికీ ఏమిటి భేదం?

రామా: ఆశయం అంటే, అది సిద్ధించడంవల్ల తనకే కాకుండా కొంత ప్రజకైనా ఏకోవిధంగా లాభంగాని, సహాయంగాని ఉండాలేమో...కోరిక కేవలం స్వార్థం...

కమల: నువ్వు డాక్టర్ అవడం స్వార్థానికి కాదంటావా?

రామా: పూర్తిగా కాదేమో. నా కిందులో కొంత తృప్తి ఉంది, లేకపోలేదు సాధ్యమైనంతవరకు బీదవాళ్లకి సాయపడాలని నా ఉద్దేశం. నా వృత్తిధర్మాన్ని సక్రమంగా నెరవేరుస్తున్నాను. అది కొంతవరకు స్వార్థరహితమేమో.

కమల: నువ్వందుకు గర్వపడుతున్నట్టుంది.

రామా: సక్రమంగా ఒక పనిచేస్తున్నందుకు తృప్తిపడడాన్నే నువ్వు గర్వమంటే సరే...అలా నే అనుకో. నువ్వే నీకుండేది ఆశయం అంటే నాకూ మరొక ఆశయం ఉండేది. అది నాకూ నెరవేర లేదు...

కమల: నేను కోరుకున్నది కాలేదు కాని, నే నొక పనిచేసేను. దాని కేమంటావ్?

రామా: ఏమిటి చేసేవ్?

కమల: ఒక క్షయరోగిని పెళ్ళిచేసుకుని ఎనిమిదేళ్ళయి అతనికి పరిచర్య చేసుకొస్తున్నాను.

రామా: అందుకు నువ్వు గర్వపడుతున్నావా?

కమల: లేదు—

రామా: తప్పునా దంటావా?

కమల: తప్పు ఎవరిదైందీ ఇప్పుడు ఆలోచించి లాభ మేమిటి?

రామా: డబ్బు చూసి ఒప్పుకున్నావ్ కాని క్షయరోగి అని తెలీదేమో.

కమల: తెలిశాక హతాశురాలనయిపోలేదు.

రామూ: మోసం లాటిదేకదూ అది?

కమల: అప్పుడు నా తెలివి పేరుయింది. అంతటి శ్రీమంతులు నాలాటి ముష్టిదాన్ని కోరుకున్నారంటే దానికి ఏదో ఒక కారణం ఉంటే దానికి ఏం అభ్యంతరం ఉంది?

రామూ: ఏదో ఒక కారణం ఉంటుందని తెలిసి కూడా నువ్వొప్పుకున్నావ్?

కమల: ఆ పరిస్థితులు అలాంటివి.

రామూ: నా మాటమీద నీకు నమ్మకం లేకపోయింది? నాలోనే నీకు నమ్మకం లేకపోయింది. దగ్గరున్నప్పుడే మనసులు...

కమల: నాకు నమ్మకం లేదంటావ్. ఎక్కడో మద్రాసులో చదువుతున్న నీకు ఇక్కడి స్థితి ఏం తెలుస్తుంది?

రామూ: మొదట్లో కొన్ని ఉత్తరాలు రాసేవు. తరవాత ఏమన్నా తెలియనిచ్చేవా?

కమల: నువ్వు తెలుసుకోలేకపోయావ్.

రామూ: నేను తెలుసుకోలేకపోయేనా!!

కమల: నీ ఇంటరు పూర్తయి, మరేం అనుకున్నప్పుడే నేను నీకు మాచాయగా తెలియజేసేను మా పరిస్థితి.

రామూ: ఔను. పరిస్థితి అంత బాగులేదన్నావ్ — కాని బాగా లేదన్నావ్.

కమల: నువ్వు మెడిసిన్ చదువుదామని చాలా కుతూహలంతో ఉండేవాడివి.

రామూ: నాకు మొదట్నించీ అలా ఉండేది.

కమల: నీకు నాకన్నా ముఖ్యం ఆ చదువేమో అనిపించింది.

రామూ: ఎవరన్నారు? చదువయ్యాక మనమిద్దరం పెళ్ళిచేసుకుందాం అనుకోలేదూ? ఏదైతే కొన్నాళ్ళు ప్రాక్టీస్ చేశాక, లేదా ఏమీ చెయ్యకుండా నే అనుకున్నాను.

కమల: ఈమధ్యని అవడానికి ఏళ్లేదా? ఆరేళ్ల వరకు ఉండాలా అని నేనడగలేదూ?

రామూ: ఔను. అడిగేవ్ —

కమల: ఆరేళ్ళపాటన్నావ్. నీకు చదువుమీద మమకారంకొద్దీ అలా అనిపించింది. మీ పరిస్థితి వేరు. మా పరిస్థితి వేరు. నీకు ఒక్క చదువే ధ్యాస...

రామూ: నువ్వుకూడానా—

కమల: నేను జ్ఞాపకంఉండి ఉండొచ్చు — కాని నా కిక్కడ నీ గురించి ఒక్కటే కాదు ఆలోచించవల్సింది. మా ఇంటిస్థితికూడా ... మాస్థితి మరీ పాడయింది — అదే నీకు రాసిన ఉత్తరాలలో సూటిగా కాకపోయినా, తెలియజేసేను. ఆర్థికంగా మాస్థితి ఏమీ బాగుండలేదు. ఈ సంబంధం గురించి మా నాన్నగారు ఒకటి రెండుసార్లు నాతోని చేసేరు ... కాని నేనూరుకోవడం చూసి ఆయనా ఊరుకున్నారు. నాకూ తెలుసు. ఇందువల్ల ఆయనస్థితి కొంత బాగుపడవచ్చుని ... నీకు ఒక ఉత్తరంలో రాసేను — నువ్వు సరిగా అర్థం చేసుకోలేదు —

రామూ: అర్థం చేసుకోలేనట్టు నువ్వేదీ రాయలేదే?

కమల: ఇంకా ఐదు సంవత్సరాలలాగుండాలేమో తెలీకుండా ఉంది మా పరిస్థితికూడా అట్టే బాగులేదు — నీనిశ్చయం మార్చుకోలేవనుకుంటాను అని రాసేను —

రామూ: ఔను... కాని...

కమల: నువ్వింకోలా అర్థం చేసుకున్నావ్, ఆ ఉత్తరాన్ని — ఆలస్యానికి ఒప్పుకోలేకపోతున్నానేమో అనుకున్నావ్ — ఐదేళ్ళపాటి అయినా ఆగాలని రాసేవ్...

రామూ: అప్పుడలా నే అనుకున్నాను—

కమల: అంతకన్నా సూటిగా చెప్పడానికి నాకు మనసొప్పకపోయింది, మా పరిస్థితి—

రామూ: నాకే నిజమైనస్థితి తెల్సి ఉంటే! తరువాతనుకున్నాను. అంతా అయిపోయేక నీకు నిజమైన స్థితి చెప్పడానికి అభిమానం వేసి ఉండాలని.

కమల: నా ప్రకృతి తెలిసి నువ్వు ఆ ఉత్తరంలోని అర్థం తెలుసుకోలేకపోయేవంటే అది నా తప్పు కాదు. అదికాక, చదువు పూర్తికాకుండా పెళ్ళికి మీ తండ్రి ఒప్పుకోకపోయి ఉండురు... నీ చదువయ్యేవరకు ఉండేందుకు నా పరిస్థితి బాగులేదు—

రామూ: నావల్ల మీ తండ్రి సాయం పొందడం నీ కిష్టం లేకపోయింది?

కమల: ఎందుకిష్టం లేదు? కాని అది సూటిగా చెప్పడం ఇష్టం లేకపోయింది. నువ్వు తెలుసుకోలేకపోవడం నీది తప్పు. తెలిసినా మీ తండ్రిముందు ధైర్యం లేక ఊరుకున్నావేమో. నువ్వు పిరికివాడివి!

రామూ: నిన్ను జారవిడుచుకోవడమే నా ఇష్టమైతే మరి నేనెందుకు పెళ్ళిచేసుకోలేదంటావ్?

కమల: అప్పటి పిరికితనానికి పర్యవసానం పశ్చాత్తాపం. ఇలా ఆఖరివరకూ ఉండిపోవాలన్న

ఉండిపోగలవ్ నువ్వు. నువ్వు ప్రేమించేది మరొకటి ఉంది.

రామూ: (ఉలిక్కిపడి) నేను ప్రేమించేదా?

కమల: ఔను. నీ వృత్తి—ఏ లోటున్నా అది తీర్చేస్తుంది.

రామూ: తిరిగి వచ్చాక నే నెంత బాధపడ్డానో నువ్వూహించుకొనే ఉంటావ్.

కమల: ఎలా ఊహించుకుంటాను? నీ జవాబు చూసి నే నెంత బాధపడ్డానో నువ్వు ఊహించుకో గలిగేవా? నేను నీకు ద్రోహం చేసేనని నువ్వనుకొని ఉంటావ్. నువ్వు తప్పుచేసేవని నే ననుకున్నాను. నీమీద నువ్వు, నామీద నేను జాలిపడ్డాం తప్ప ఒకరి స్థితి ఒకరు ఆలోచించి ఉండం.

రామూ: నువ్వన్నదీ నిజమే. కాని ఏడాది వరకూ తట్టుకోలేకపోయేను. పిచ్చెత్తినట్టుగా ఉండేది... నాకు చదువునుంచి తిరిగివచ్చాక తెలిసింది.

కమల: ఏడాదిపోయాక తట్టుకున్నారా పోనీ.

రామూ: నువ్వు నన్ను తప్పుగా అర్థంచేసుకోకపోతే ఒక సంగతి చెప్తాను. నాకు కొంచమన్నా మనశ్శాంతి దొరికే విధానం—

కమల: నిన్ను తప్పుగా అనుకోడానికి నీమీద నాకేం అధికారం ఉంది?

రామూ: నువ్విలా అంటే...

కమల: సరే చెప్పు.

రామూ: నాకొక చెల్లెలు దొరికింది—

కమల: చెల్లెలా?

రామూ: ఔను. నా స్నేహితుడి భార్య.

కమల: ఊఁ (చిరునవ్వుతో) ఏమీ అనుమానాలుండకుండా మంచి జాగ్రత్త తీసుకున్నావ్.

రామూ: ఆతనూ డాక్టరే. మొదటిసారిగా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఉలిక్కిపడ్డాను ఆవిడ్ని చూసి—అచ్చు నీలానే ఉంటుం దావిడ.

కమల: ఆవిడలో రోజూ నన్ను చూసేవాడివి—అంతేనా?

రామూ: (ఆశ్చర్యంగా) ఆ దృష్టితో కాదు. ఆవిడ చాలా దయగా మాట్లాడుతుంది. నలుగురు పిల్లలు ముచ్చటవేస్తూ—భర్త అంటే ప్రాణం ఆవిడకి—వాళ్ళ సంసారం చూస్తూఉంటే నా కెంతో సంతృప్తిగా ఉంటూఉంటుంది. ప్రతి ఆదివారం వాళ్ళ ఇంట్లో ఒక సాయంత్రమల్లా గడుపుతూ ఉంటాను ఆ పిల్లల్తో ఆడుకుంటూ, ఆవిడ మాటలు వింటూ—

కమల: (ముఖం తిప్పుకొని) నీకు మరి జీవితంలో లోటంటూ ఉండదు.

రామూ: (వింతగా) ఏం కమలా? అలా అన్నావ్.

కమల: (సర్దుకొని) ఏమీ లేదు. ఊరికే అన్నాను.

రామూ: చెప్పాలి!

కమల: (క్షణం ఊరుకుని) వాళ్ళ సంసారం చూస్తూ, నీ ఊహల్లో, అనుకున్నట్టే అయివుంటే ఉండే నీ సంసారం అలానే ఉండునని ఊహించుకుని తృప్తిపడుతున్నావ్. ఏ బాధా, బరువూ, చింతా లేకుండా నీకా తృప్తి దొరుకుతోంది—ఇంక నువ్వు లెక్కచేసేది నీవృత్తి—అది నిరాటంకంగా సాగిపోతోంది. అంతకన్న మనిషి కోరుకోదగ్గ దేముంది?

రామూ: (ఆలోచిస్తూ) నువ్వన్నదీ ఒకవేళ నిజమే నేమో. అంతకన్న చెయ్యగలిగే దేముంది—ఎలానో ఓలా మనస్సుని సమాధానపరచుకొని బాధ తగ్గించుకోవాలికదా—

[పైన పాదాలసడి—కమల లేచి నిల్చుంటుంది. పార్వతీశం గారు ప్రవేశిస్తా రాత్రంగా—రామారావు లేస్తాడు)

పార్వతీశం: (డాక్టర్ దగ్గరికివచ్చి) ఎలాఉంది?

రామూ: ఇరవై నిమిషాలక్రింద ఇంజక్షన్ ఇచ్చేను—పన్నెండుగంటలకి తిరుగుముఖం పట్టొచ్చు—

పార్వతీశం: ధైర్యంగా ఉండా?

రామూ: ఇప్పటికి—

పార్వతీశం: (తనలో తను మెల్లగా) పరమేశ్వరా! కాపాడు తండ్రీ! (ఆతనికళ్ళు చెమ్మగిల్లుతాయి)

రామూ: మీరు ధైర్యంగా ఉండండి చాలు—పదకొండుకింకొక ఇజక్షన్ ఇస్తాను—

పార్వతీశం: మీ మేలు మరిచిపోను—(కమలని చూసి) అమ్మా! నువ్వు ధైర్యంగా పనిచెయ్యాలి... నేనూ భయపడి, నువ్వూ భయపడితే లాభంలేదు—అంతా మీ ఇద్దరిచేతిలోనూ పెట్టేను — నేను మరి ఉండలేనిక్కడ—

[కళ్ళనీరు కారుస్తూ పోతాడు]

రామా: పాపం—ఒక్కడే ఒక్క కొడుకు—నిజంగా బాధే!

కమల: (సోఫాలోకూర్చొని) పని చెయ్యాలి... భయపడితే లాభం లేదు—

రామా: నిజమే అది—

కమల: నేను కాపురానికొచ్చినప్పుడు చెప్పిన మాటలవి, ఆ క్షయరోగిని నాకప్పచెప్తూ—

రామా: క్షయరోగి అని ఎందుకంటావ్ కమలా?

కమల: (రామారావు కళ్లలోకిచూసి) మరింకే మని పిలవమంటావ్.

రామా: (ఆశ్చర్యంగా ఆమెవైపు చూస్తాడు)

కమల: నే నతని డాక్టర్ని, నర్సుని, పని మనిషిని—

రామా: కమలా!

కమల: ఔను రామం! నే నతని సంరక్షకు రాలిని. అతను నా రోగి—ఈ ఎనిమిదేళ్లయి.

రామా: నిజంగానా?

కమల: అంతకుమించి మా ఇద్దరిమధ్యా ఏ బంధుత్వం లేదు. అతని సంరక్షణ, అతని జాగ్రత్త, అదే నా పని—అతని ఉనికికి నేనొక ఆశ్రయాన్ని—ఒక ఊతని!

రామా: నిన్నాయన ప్రేమగా చూసేరా?

కమల: ఎందుకు చూసెరు? నే నొక్క గడియ లేకపోతే ఆయనకి గడిచేదెలా? ఆయన్ని మాసేవా రెవరు? ఆయనొక అసహాయుడు. చాలా దయగా మాటాడతారు. ప్రాణంగా చూస్తారు. అంతకన్న ఏం చెయ్యగలరు? నే నాయనకొక స్నేహితురాల్ని, ఆయన ఆరోగ్యాన్ని జాగ్రత్తచేసే కోశాగారాన్ని, ఆయన అలవాటు అదుపులో పెట్టే కమేంషర్ని, పక్కలో పెట్టి జోకొట్టే తల్లిని...

రామా: కాని కమలా. ఈ ఎనిమిదేళ్లూ ఇలా నే గడిచాయా!!!

[గడియారం తొమ్మిదిగంటలు కొడుతుంది ప్రక్కగదినుంచి. రామారావు చేతివాచీ చూసు కుంటాడు]

కమల: ఔను. కాని నేను విచారించలేదు.

రామా: (ఆశ్చర్యపోతాడు)

కమల: నే ననుకున్నది కానప్పుడు—ఇంకే దయితేమట్టుకు నే నెందుకు పట్టించుకోవాలి? ఈ ఎనిమిదేళ్లూ అతనికి సరైన ఆహారం, టైమ్కి మందులు, అతని బట్టలు, అతని విశ్రాంతి వీటన్నింటిని చూడడం అలవాటయిపోయింది. అన్నట్టు నీ హాస్పిటల్ పెద్దదికదూ?

రామా: పెద్దదే. ఒక మోస్తరుగా—సేనిటోరియమ్ కట్టిద్దామని ఉంది. అది ఇంతవేగం కాదు.

కమల: నీ హాస్పిటల్కి నర్సక్కర్లేదూ?

రామా: ఏం?

కమల: నాకో అవసరం పడ్డప్పుడు, నీకు కావల్సివచ్చినప్పుడు నేనున్నానని మరిచిపోకు.

రామా: ఏం మాటలు కమలా అవి. నీకేం? శ్రీమంతుల ఇంటికోడలివి!

కమల: ఆ మాట లని ఇందాక నన్ను పిచ్చెత్తించేవ్.

రామా: ఉన్న మాట కమలా.

కమల: అయితే ఉన్న మాటలు చాలా ఉన్నాయి. క్రిస్టియన్ 'నన్'లాగా అన్ని సంతోషాలు, ఐహిక బాంధవ్యాలూ పక్కకి పెట్టి, ఒకరి సేవ చేస్తూ, అందులో తృప్తిపొందుదామని పొందలేక పోవడం ఉన్నమాట కాదంటావా?

రామా: (విస్తుపోయి) నీ తండ్రికోసమని, నన్నింకోలా అర్థంచేసుకొని ఒక స్త్రీ త్యాగం చేశావా కమలా?

కమల: ఆ సంగతి మరచిపోదిప్పుడు.

[తెర]

రంగం: 3

అదే స్థలం.—సమయం, ఒంటిగంటకు ముందు, పన్నెండు తరవాత—పార్వతీశం గారు వస్తారు—రామారావు, కమల లేచి నిలబడతారు.

పార్వతీశం: (మొదటిసారిలా నే డాక్టర్కి దగ్గరగా వచ్చి ఆత్రంగా) ఎలా ఉంది?

రామారావు: పదకొండుకి ఇంజక్షన్ మళ్ళీ ఇచ్చేను. రోగం తిరుగుముఖం పట్టింది. భయం లేదని చెప్పగలను—

పార్వతీశం: నిజంగా డాక్టర్!

రామా: నిజంగా నే — ఇప్పటికి తిరుగుముఖం పట్టింది — నాకు బాగా ధైర్యంగా ఉంది. మూడు తరవాత మరి నిష్పూచీ.

పార్వతీశం: తెలివి వచ్చిందా?

రామా: వాంతులు అన్నీ కట్టిపోయేయి — ఇందాక తెలివొచ్చి ఒక నిమిషం మాట్లాడే డాయన ...నీరసం! నీరసంవల్ల నిద్రపోతున్నారు...

పార్వతీశం: వాడిమాటలు వినాలనిఉంది .. వింటున్నాడు...వాడు! అమ్మా! వింటున్నాడు?

రామా: (కమలవేపు చూశాడు)

కమల: (ఏం చెప్పాలో తోచనట్టు ఆలోచించి) నన్ను దగ్గర కూర్చుమన్నారు — ఇంగ పెట్టుకో వద్దన్నారు...

రామా: (ఆమె వేపు వింతగా చూస్తాడు)

పార్వతీశం: ఔను — నువ్వే వాడి ప్రాణాలు... వాణ్ణి నీకప్పగించేను — నువ్వు లేకపోతే ఒక్క క్షణం గడపడు వాడికి —

కమల: (నిస్పృహతో) మీరలా అనకండి!

పార్వతీశం: నే వెళ్తాను — తెలివొచ్చి మళ్లా మాట్లాడితే నన్ను పిలవండి — నేను కనిపెట్టుకునే వుంటాను.

కమల: (ఏదో చెప్పబోయింది)

పార్వతీశం: లాభం లేదమ్మా — నిద్రరాదు... రాదు...

[అతను వెళ్తాడు గడియారం ఒంటిగంట కొడుతుంది. రామారావు వాచీ చూసుకుంటాడు]

రామా: ఏం చెప్తావో అని భయపడ్డాను...

కమల: (సోఫాలో కూర్చుంటూ) నిజం చెప్తే ఉంటే పిచ్చివారిలా అయిపోరూ? పాపం!

రామా: నువ్వు ఆయనమీద జాలిపడుతున్నావ్ — నీమీద ఎవరు జాలిపడతారు కమలా? కాని నా కాశ్చర్యం వేస్తుంది. అతనికోసెల్లా నువ్వు మాట్లాడినట్టనిపించ లేదు—ఎవరో ఒక పైఆవిడ ఆమనలాయనస్థితికి జాలిపడుతున్నట్టుంది...

కమల: హాస్పిటల్ నర్సులు, డాక్టర్లు ఇలానే కదూ ఓదారుస్తారు. నిజాన్ని దాచి ఓదార్పుకి చిన్న చిన్న అబద్ధాలాడతారు? నేనూ ఇక్కడ నర్సులాటి దాన్ని.

రామా: అతని మనస్సు స్థిమితంగా ఉండడానికి నువ్వయితే అబద్ధం ఆడేవు కాని, నేనుమాత్రం నిజమే చెప్పేను.

[సోఫాలో కూర్చుంటాడు]

కమల: (దగ్గరగా వెళ్ళి) రామం! నువ్వన్న అలే ఉండింటావా?

రామా: తప్పకుండా కమలా! నేను మొదట నాటికి ఒకసారి ఆతడితో దెబ్బలాడేను, ఇప్పుడు ఏకైపాళ్ళీ ఆతడితో దెబ్బలాడగలను రోగంతో!

కమల: (సోఫాలో కూర్చొని) నిజమా రామం? హాస్పిటల్ డాక్టర్లు ఇచ్చే ధైర్యం కాదూ?

రామా: ఈ తమాటలు చేనాడేను. నా పనిలో నేను నన్ను మోసం చేసుకోను, పైవాళ్లని మోసం చెయ్యను.

కమల: మూడుగంటలతరవాత బాధ లేదన్నావ్?

రామా: రెండుగంటల కొక ఇంజక్షన్ ఇవ్వాలి కదూ. అదిగాక మూడుగంటలు దాటితే నాటికి నూరుపాళ్లు ఆశే...మనది గెలుపు!

కమల: మనది కాదు. నీది!

రామా: నీకుకూడా కొంతభాగం ఉంది. అది కాక నీ కిది సర్వస్వం!

కమల: (దగ్గరగా వెళ్లి మెల్లిగా) కాదు రామం!

రామా: (త్రుళ్లిపడి) కమలా!!

కమల: నే చెప్పేది నిజం. నాకది సర్వస్వం కాదు. గెలుపు కాదు!

రామా: నువ్వతని భార్యవి. నువ్విలా అనొచ్చునా? అతని ఆరోగ్యం కోరుకోవాలి కాని!

కమల: (విరాగిలా నవ్వి) ఓటమి, విరాశ నాకే కాదు రామం. ఆయనక్కూడా! ఆయనకూడా ఓడిపోతారు!

రామా: ఆయనక్కూడానా?

కమల: ఔను. ఇందాక తెలివొచ్చినప్పుడు ఆయన ఆడినమాటలు, ఆయన చేష్టలు నువ్వు పట్టించుకో లేదుకదూ?

రామా: ఆ తీవ్రతలోనూ, నీరసంలోనూ అలానే అంటారు.

కమల: నీ డాక్టర్ కళ్లతో నే నువ్వు చూస్తావ్!

రామా: ఎలా కమలా?

కమల: నువ్వే అన్నావ్, నీరసంవల్ల, ఆరోగం పెట్టే బాధవల్ల అలా అనిపిస్తుందని. ఇవాళ ఈరోగం వల్ల ఆయన బాధపడుతున్నారు. కాని ఎనిమిదేళ్లయి, నాకు తెలిసినమట్టుకు ఆయన క్షయవల్ల బాధపడుతున్నారు. ఈ నిజం, ఆయనన్న ఈమాటలు, ఈనాటివి కావు. ఆ భావం ఈ ఇంట అడుగు పెట్టినదాదిగా ఆయన ముఖంలో చూస్తున్నాను.

రామా: ఎనిమిదేళ్ళనించి!

కమల: ఇందాక నిన్ను దగ్గరగా పిలిచి ఏమన్నారు?

రామా: ఔను. బ్రతకాలని లేదన్నారు—మళ్ళా నరకంలోకి తీసుక వెళ్ళొద్దన్నారు. కాని కమలా...ఆ మాటలు...

కమల: విను. ఈ ఎనిమిదేళ్ళయి అతనిలో ఉండే దిదే ఆలోచన—కాని ఆ తరుణం రాలేదు. నాకూ తెలుసు ఆయనలోని భావం. ఈ నరకం, ఈ రోగం చేసే చిత్రవధ ఎప్పుడు ఆఖరౌతుందా అని... పిలుపు ఎప్పుడొచ్చునా అని ఆయన నిరీక్షణ. ఆయన రాత్రి పగలు పడే బాధ, ఆ బాధ నాకు తెలీదంటావా రామం...

రామా: కమలా! నువ్వే ఈ మాట లంటున్నావా?

కమల: ఆయన మంచిని కోరేదాన్ని—ఈ విషయంలో నన్నతని భార్యగా చూడకు రామం! ఈ ఇంట్లో, ఆ గదిలో ఎనిమిదేళ్ళ జీవితం గడిపేరతను—నా సహాయంతో. ఈ ఎనిమిదేళ్ళూ ఆయన ప్రతి నిమిషం కాచుకున్నారు ఆత్రంగా, పిలుపు వినేందుకు. శాంతికోసం, సంతోషంకోసం......స్వర్గం నుండి పిలుపుకోసం...

రామా: బ్రతుకంటే ఆయన కిష్టం లేదంటావా?

కమల: ఇది బ్రతుకు కాదతనికి. నరకం—నాతో చాలాసార్లన్నారా మాట నాతో పంచుకున్నారా బాధ. ఆయనకు మనశ్శాంతి, శాశ్వత సుఖం కోరుకోవద్దంటావా? ఇది భార్య కోరుకోరాదంటారు పెద్ద లందరూ! మన శాస్త్రా లంటాయి అలాగే—కాని నేనేం ఆయన చెడు కోరలేదే!

రామా: అయితే నేనిక్కడికి రావడమే తప్పంటావా?

కమల: తప్పనను—రోగం అన్నాక డాక్టర్ని రప్పించడాన్ని నేనెలా కాదనగలను?

రామా: డాక్టర్ ఎప్పుడొచ్చేడో రోగంతో చేతికి చెయ్యిచ్చి దెబ్బలాడతాడు—అతనికీ రోగానికీ సంబంధం—ఆ మనిషితోనూ, అతని మనస్సుతోనూ కాదు — అతనికి మరింకేం ఆలోచించవల్సినపని లేదు—

కమల: కేవలం మరలాటివాడు—

రామా: ఔను కమలా!

కమల: నువ్వూ అంతేనా?

రామా: నేను ముఖ్యంగా అంతే.

కమల: ఒక్క సంగతి ఆలోచించు—నీకు నమస్కారంచేసేరతను. నీ మేలు మరిచి పోనన్నారు—తన్నలా వదిలిపెట్టమన్నారు—మళ్లా ఆ నరకంలోకి తీసుక వెళ్ళొద్దన్నారు...

రామా: అతనికలానే ఉంటుంది కమలా!

కమల: నాకూ నమస్కారం చేసేరు—

రామా: ఔను—

కమల: నన్ను దగ్గరగా పిలిచేరు—నన్ను మరిచి పోలేనన్నారు — "ఆ నరకంలోకి వెళ్లడం నాకిష్టం లేదు — నిన్నుకూడా నాతో బంధించి ఉంచడం నాకిష్టంలేదు — అతన్ని కొంచెం దయచూపెట్ట మను—" అని నాతో అన్నారు.

రామా: (మౌనం)

కమల: నీకు జాలి ఉందనుకుంటాను రామం—నువ్వు కేవలం డాక్టర్వి, మరవే అయిపోకు రామం. (భుజంమీద చెయ్యివేసి) కొంత దయ చూపెట్టు—బ్రతుకంటే, అందరికీ తియ్యగా ఉంటుందను కున్నావా? బాధపడేవారికి శాంతి నివ్వటమే కదూ నీపని?

రామా: కాదు—రోగాన్ని పోగొట్టడం—

కమల: అయితే ఆయన కుయ పోగొట్టగలవా? నాకా హామీ ఇవ్వగలవా? ఆయనకి బ్రతుకంటే తియ్యగా ఉంటుందని చూపెట్టగలవా?

రామా: నేనెలా చెప్పగలను? ఆరోగంతో అది ఉన్నన్నాళ్ళా దెబ్బలాడతాను—

కమల: మీ ఇద్దరి ఎడతెగని యుద్ధంలోనూ ఆయన నరకబాధ అనుభవించవల్సిందే. ఎంత దయలేనిపని! రోగం ముదరదు, తగ్గదు, అలా పీడిస్తుంది....

రామా: మరి, ఎనిమిదేళ్లయి ఆయన అనుభవించలేదా?

కమల: అనుభవించేరు. కాని ఆయన, ఈ మందులకీ వాటికీ లెఖ్ఖచేస్తున్నా రనుకున్నావా? వీటిలో ఆయన కేమాత్రం ఆశాలేదు. ఆయన సరిగ్గా మందు తాగరు. రాత్రులు చాలా భాగం మేలుకొనే ఉండేవారు, నేనేవో కబుర్లు చెప్తూఉంటే.

రామా: నువ్వనాపిన శ్రద్ధ అదేనా?

కమల: నేను అదుపులో పెట్టడంవల్ల ఆ పాటన్నాను. అతను పడేబాధని నేను గుర్తించాక అంతగా నిర్బంధించలేక పోయేదాన్ని.

రామా: నన్నేవిధంగా దయచూపెట్ట మంటావ్?

కమల: (మరీ గొంతుతగ్గించి) కొంచెం అశ్రద్ధ.

రామా: (ఉలిక్కిపడిలేచి) అశ్రద్ధ!!

కమల: కూర్చో! అలా బెదిరిపోకు.

రామా: అశ్రద్ధ!!

కమల: (అతని చెయ్యిపట్టుక కూర్చోపెట్టి) ఔను. అదే అతనికి దయచూపెట్టగలది. ఈ ఒక్క సారికీ నువ్వు మనిషిగా ప్రవర్తించు రామం

రామా: అశ్రద్ధ! అది నేను చెయ్యలేను కమలా ...నిన్ను పిలవటం మానివల్సింది. కాని పిల్చాక ఇటువంటి పని ప్రాణంపోయినా నావల్లకాదు అది అతనికి ఇష్టమే కావచ్చు. కాని లాభంలేదు. ఆమాట ఎత్తకు

కమల: ఇంకోవిధాన ఆలోచించేవా? అతని ప్రార్థన వదిలెయ్ నా ప్రార్థన విను. నాకు నువ్వు అన్యాయం చేసేవ్.

రామా: నేనా! అన్యాయం చేసేనా!

కమల: ఏ సుఖమూ లేకుండా, ఈ ఎనిమిదేళ్లోయి అతని బాధని పంచుకున్నది నీవల్లనే.

రామా: కమలా! దీనికంతా నేను కారణం అంటావా?

కమల: కాదంటావా?

రామా: నువ్వు నాకు సరైన స్థితి అప్పుడు చెప్ప లేదు. నీ స్థితి అంత హీనంగా ఉందని తెలుస్తే, నిన్ను నేను వదులుకొనే వాడినా?

కమల: లేదు. నన్ను నువ్వు మోసం చేసుకు న్నావ్. అంతకన్నా విపులంగా నన్నేం రాయ మంటావ్? అభిమానం ఉన్న ఏ ఆడదన్నా ఇంకేం రాయగలదు? తిండికి లేదు, పస్తులుంటున్నాం, అందుకు ఒక డబ్బున్న సంబంధానికి నే నొప్పుకు న్నాను అని రాయమంటావా? నేను నీకు రాసింది అర్థమయింది కాని నువ్వు నమ్మకపోడానికి యత్నం చేసేవ్ — అయిదేళ్లూ అయిదు నిమిషాల్లా గడిచిపోవా అనుకున్నావ్. అయిదు నిమిషాలపాటు సమయం ఏ స్థితిలో వున్నా మనుష్యులు గడిపేయలేరా అని అను కున్నావ్. నువ్వు తిరిగి వచ్చేవరకు, నువ్వన్నీ ఎలా వదిలి వెళ్లేవో అన్నీ అలానే ఉండాలి, ఉంటాయి అని నమ్మడానికి ప్రయత్నించేవ్. ఏం? కాదం టావా?

రామా: (బాధగా) కమలా నాదే తప్పంటావా?

కమల: అవును. నీదే తప్పు—

రామా: (ఆలోచిస్తూ) అయితే ఇప్పుడేం లాభం—

కమల: అయితే విను — నే నిన్ని సంవత్సరాలు అతనితోకూడా అనుభవించిన బాధ — అసంతృప్తి బంధం — మరొక్క నిమిషంకూడా అనుభవించ లేను—అతనూ అంతే — బ్రతుకంటే అతనికి నరక బాధ — నీకు అతనిమీద మమకారం లేకపోయినా, నా సంగతి ఆలోచించు — నేనంటే నీకు అభిమానం లేదా?

రామా: ఒక్క అభిమానమేనా కమలా? నువ్వెప్పుడూ నా మనస్సులో ఉంటావ్.

కమల: నేను సంతోషంగా ఉండాలని నీకుందా?

రామా: ఎందుకు లేదు?

కమల: అందుకోసం నువ్వేసాయమన్నా చెయ్యగలవా?

రామా: నువ్వనబోయేది నాకు తెలుసు. ఈ పని మాత్రం నేను చెయ్యను. అశ్రద్ధ చెయ్యలేను.

కమల: మనఇద్దరి సంగతీ అతనికి తెలుసు రామం.

రామా: ఆఁ!

కమల: నిజంగానే. ఇప్పుడుకాదు. ముందు నుంచీ తెలుసు; కాని, నన్నాయన కోరిందొక్కటే— "నాకూ సుఖంకావాలి కమలా—నాసుఖం ఇక్కడ లేదు — ఆలోకంలో — నీకూ సుఖం కావాలి — నీసుఖం ఈలోకంలో — నిన్నెట్టకాలం బందీలో ఉంచను—ఆరోజుకోసం చూస్తున్నాను — అంత కాలం నన్నొదలకు" అనేవారు.

రామా: అయితే అతనుండకపోవడం నీ కోరిక అనుకోవాలా?

కమల: అతని కోరిక—అతని తపస్సంతా అందుకే.

రామా: కాని కమలా ఇది సాధ్యంకాదు— ఇది నా చేతకాదు.

కమల: ఈ వృత్తి నువ్వు మానెయ్యి—ఇల్లు, భార్య, పిల్లలు, సుఖం-దానిమీద నీకు కోరిక లేదా?

రామా: కావాలి—కాని అదెలా?

కమల: నీకది కలగానే ఉండిపోయింది. నే నుంటే నీకది సాధ్యం అవుతుంది.

రామా: కాని ఎలా సాధ్యం.

కమల: అతనిపట్ల దయ చూపెట్టు - సాధ్యం అవుతుంది - అతనికి సాయం చెయ్యి - అతను నన్ను బంధవిముక్తగా చేస్తారు - అతనికి అనంత సుఖానికి దారిచెయ్యి - అతను నీకు నన్ను సంతోషంగా అప్పగిస్తారు - మన ఇద్దరిసుఖం కోరతారు—

రామా: ఇది కల...కల...అంతే!

కమల: కలకాదు - నిజం! నీమీద ఆధారపడి ఉంది. మన విషయంలో ఒకసారి పొరపాటు పడ్డావ్—ఇప్పుడు కూడా పడతావా?

రామా: ఇదివరకు తెలీకుండా పొరపాటు పడ్డాను—ఇప్పుడు తెలిసి పొరపాటు చేస్తాను కమలా! చెయ్యాలి; అది నా వృత్తిధర్మం; (బాధగా) నన్నెందుకు పిల్చేరు. (చేతులు జుత్తులోనికి పోనిచ్చి జుత్తు పీక్కుంటూ) నన్ను పిల్చేక, నే నశ్రద్ధ చెయ్యలేను, చెయ్యలేను; అది నాకు సాధ్యంకాదు, అంతే సాధ్యంకాదు...

కమల: బండరాయి! ఉత్త పాషాణం—రాయివి నువ్వు!—

[కళ్లు కప్పుకొని గదిని వదుల్తుంది.]

రామా: కమలా! (లేచి ద్వారంవరకూ వెళ్ళి తిరిగి వస్తాడు—గది నాలుగుమూలలా వెర్రివాడిలా కొంతసేపు చూస్తూ నిల్చుంటాడు తరువాత టేబిలు దగ్గరికి వెళ్ళి ఇంజక్షన్‌కి కావల్సిన సరంజామా తయారు చెయ్యడంలో మునిగిపోతాడు. కొన్ని నిమిషాలు అలా గడుస్తాయి; పనివల్ల కలిగే చప్పుడు తప్పించి అంతా నిశ్శబ్దం; కమల తిరిగి చప్పుడులేకుండా వచ్చి అతనికి అంతరాయం కలిగించకుండా సోఫాలో కూర్చుంటుంది, ఒక మూల, ఆలోచిస్తూ; అతని పని పూర్తయాక సోఫావేపు తిరిగి కమలని చూస్తాడు)

రామా: కమలా! (వెళ్లి ఆమె దగ్గరగా సోఫాలో కూర్చుంటాడు.)

కమల: ఆవేశం పట్టలేక వెళ్లిపోయేను—క్షమించు.

రామా: నువ్విలా బాధపడడం నాకు చాలా కష్టంగా ఉంది. నన్ను పిలిచిఉండకపోతే ఎంత బాగుండును.

కమల: సరే, నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. అదృష్టాన్నిబట్టి తక్కినది నడుస్తుంది.

రామా: ఆఖరికి అదృష్టంమీదే బరువుపడేసేవా?

కమల: కనీసం అదన్నా దయ చూపెట్ట వచ్చేమో.

రామా: నువ్వు నాకు కావాలి కమలా; అతని ఇష్టం కూడా ఉందంటే నా మనస్సు, ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ నిండింది. నా బ్రతుకులో నువ్వు లేకపోవడమే లోటు. కాని—ఆ సంతోషం తెచ్చుకొనే శక్తి నాలో లేదు—అస్థిపంజరంతో ముడి వేసేసుకున్నాను. మానవ యంత్రం, దాని రోగాలు—అదే నా సంబంధం. మనస్సుకీ నాకూ సంబంధం లేదుకమలా—(ఊరుకుని) నేనింక ఈ వృత్తి మానేస్తాను. ఇదే నా ఆఖరి కేసు. మనస్సుతో ఈ దెబ్బలాట నా శక్తివంతా లాగేసింది—

కమల: నీలాటి డాక్టర్ని నేను చూడలేదు—ఆనాడు నువ్వే ఊళ్లో ఉండేఉంటే మా నాన్నగారు బ్రతికేఉండేవారు—

రామా: (ఉలిక్కిపడి) ఔను—విశ్వనాథం గారు; ఆయన హాస్పిటల్‌లో పోయేరు—నే నూళ్లో లేనని నీకెలా తెలుసు?

కమల: నేను కనుక్కున్నాను - నాగురించి నీకు తెలీదు కాని. నీ భోగట్టా అంతా నేను తెలుసుకుంటూనే ఉన్నాను—

రామా: నువ్వప్పు డెక్కడి కొచ్చేవా?

కమల: ఒక్క గంట—మా నాన్నగారు పోయేక—అదంతా రాత్రిరాత్రి అయిపోయింది. నాకు తెలిసే తెలీదు—ఏ సంగతీ కబురు తెలిసేందుకు సమయం లేకుండా అయిపోయింది—

రామా: కాని ఏవో పుకార్లు-అశ్రద్ధ జరిగిందని.

కమల: (ఉలిక్కిపడి) నేనూ అంతా విన్నాను-లోకం తిరుగుముఖం పట్టేక డాక్టర్ ఇంకో కేసు చూసేందుకు వెళ్లేరని. అక్కణ్ణుంచి తిరిగి వచ్చేసరికి ఆయన ఆఖరు గడియల్లో వున్నారని.

రామా: అది నేను నమ్మను కమలా—ఆ పుకార్లు—

కమల: ఏమో నాకు సరిగ్గా తెలీదు—కాని నువ్వే ఉండేఉంటే!

రామా: నేనుమాత్రం దేవుణ్ణా? నాదీ ప్రయత్నమేకాని మరేమీ కాదుగా?

కమల: కాని నీ ఇప్పటి పట్టుదల చూస్తే అలా అనిపిస్తోంది.

రామా: ఈ కేసులో నాకు ప్రతిఅడుగున ఆశ, భయం రెండూ అడ్డొస్తూనే ఉన్నాయి, నన్ను లొంగదీసేందుకు.

కమల: ప్రతిఅడుగునా?

రామా: వెంకటప్రసాదశర్మ తెలుసునా? సర్దార్

కమల: ఔను నా పినమామగారు.

రామా: ఇవాళ అతను నా దగ్గరికొచ్చేరు.

కమల: నీదగ్గరికా? నీదగ్గరికెందుకు?

రామా: పదివేలివ్వడానికి తయారుగా—

కమల: పదివేలు! నాకేం అర్థం కావటంలేదు.

రామా: నేనిక్కడికి రావల్సివస్తుందని అతనికి తెలుసు—కొంచం అశ్రద్ధచేస్తే పదివేలిస్తానన్నాడు—

కమల: (ఆశ్చర్యపోయి) అశ్రద్ధ—ఔను! నా కర్థమయింది—మరి చెప్పనక్కర్లేదు—

రామా: తొంభైపాళ్ళు అతనికి ధైర్యం ఉందన్నాడు—ఉన్న పదిపాళ్ళు నన్ను పూర్తి చెయ్యమన్నాడు.

కమల: నాకు తెలుసు ఆ ఉద్దేశం—అనంతా డబ్బుగురించి ప్రాకులాట—దానికీ నాకూ సంబంధం లేదు—అతనిసంగతి మరెత్తకు?

రామా: నేను కాదన్నానని నీకు చెప్పక్కర్లేదు.

కమల: తెలుస్తూనే ఉంది. కాని నీ దిలాటి మనస్సు!

రామా: నామనస్సుని పొగడకు; మామూలుగా డబ్బుమీద ఆశ నాకు లేకపోలేదు; అది ఇటువంటి విధాల ఆర్జించటం నా కిష్టంలేదు.

కమల: భయం అన్నావ్ దేనికి?

రామా: నేను భయపడలేదు; అతను భయపెడదామనుకున్నాడు; బెదిరించేడు.

కమల: నిజంగా?

రామా: నేను నెగ్గతే ఇంటికి తిరిగి వెళ్ళలేనన్నాడు; అవన్నీ ఉత్తిమాటలు—

కమల: ఎంతపనిచేసేవ్ రామం!

రామా: ఏం?

కమల: అతనిసంగతి నీకు తెలీదు— అన్నంత పనీ చేస్తాడు. నాకు నిశ్చయంగా తెలుసు— (ఆమెముఖం భయంతో నిండుతుంది.)

రామా: అతని ధైర్యం నాకు తెలుసు. నువ్వేమీ అనుకోకపోతే ఒకమాట చెప్తాను—

కమల: ఏమిటి?

రామా: అతని దేపాటి ధైర్యమో! పోలీసు, కేసు, శిక్ష, ఏటి భయంలేనివాడు, తనలో తనకి అంత నమ్మకం ఉన్నవాడు, పదిమంది కాపలా ఉన్నా హాని తప్పదన్నవాడు, ఇన్నేళ్ళయి ధైర్యం ఉండే కోరుకున్నాడా? ఇంత నిపుణుడు, ధైర్యవంతుడు అనాడే మీ ఆయనకి, తల్చుకుంటే హాని చెయ్యలేకపోయేవాడా? నావరకూ రావటం ఎందుకు? ఏ కష్టం, చట్టాల భయం, లేకుండా తన పని అయిపోతుందని—ఉత్తి పిరికిపంద—ఒక చీమకి కూడా హాని చెయ్యడానికి భయపడే పిరికి జంతువు.

కమల: (వింతగా అతని ముఖంలోకి చూస్తుంది).

రామా: నాకే భయమూ లేదు—అతని ధైర్యం నాకు తెలుసు—

కమల: అయితే రెండోది నేను—ఆశ, భయం.

రామా: ఔను—నువ్వు—

కమల: అయితే నేనూ ఆ రాశీ ఒకటే కదూ?

రామా: కాదు కమలా! నిన్ను చూసెంతో నాకు ఆశ కలిగింది—అన్ని సంగతులూ నువ్వు చెప్పాక అది బలపడింది—కాని దానిని కాదనాల్సొచ్చింది.

కమల: నేనేం బెదిరించేను?

రామా: ఇక్కడ బెదిరింపు ప్రశ్న లేదు; కాని నేను భయపడుతున్నాను—నువ్వు పొందే అశాంతి, బాధ చూస్తే, దాన్ని గురించి ఆలోచిస్తే బాధ, భయం రెండూనూ నాకు—కాని నేనది అనుభవించాల్సొంటే—అందుకే నేనింక ఈ వృత్తినించి విరమించుకుంటాను ఇది అయిపోయేక—

కమల: అంటే, ఇక్కడ విజయంసాధించేక—

రామా: ఈ గెలుపు నా మనస్సుది కాదు; నా మనస్సు ఓడిపోయింది—ఈ గెలుపు నాలోని డాక్టర్ ది. ఈ రెండింటికీ మధ్యన ఘర్షణ ఇంతగా నేనెప్పుడూ అనుభవించలేదు — మరింక నాకు శక్తి లేదు—అందుకే...

[ప్రక్క గదిలోనుంచి పేషెంటు మూల్గు—రామారావు ఉలిక్కిపడి నాడీ చూసుకుంటాడు. దెబ్బ తిన్నట్టయి లేచి]

రెండున్నర! మైగాడ్!!! కమలా!!

కమల: (ఆశ్చర్యంగా) ఏమిటయింది రామం!

రామా: నా నాడీ రెండున్నర అయింది! రెండుకి ఇంజక్షన్ ఇవ్వాలి! ఏమిటిది! ఎలాఅయింది!

కమల: ఇంకా రెండు కొట్టలేదు ప్రక్క గదిలో గడియారం.

రామా: అది గంటలు కొడుతుందని కాచుకొని ఉన్నాను. వావాచీ తప్పలేదు. రెండూ సరిపోయేవి ప్రతి గంటా, నిమిషం సరిగ్గా!!

కమల: ఉండు రాముం చూసివస్తాను.

[గది వదిలి వెళ్ళబోతుంది]

రామా: గడియారం ఆగిపోయింది...అదే అయి ఉండాలి! కీ సరిగ్గా ఇప్పుడే అయిపోవాలా?...... ఇంకా ఎందుకు గంటలు కొట్టలేదా అని ఆశ్చర్యం వేసింది...(తొందరగా) అయినా ఇప్పుడేం బాధ లేదు. నువ్వు వెళ్ళబోకు.

[టేబిల్ దగ్గరికి వెళ్ళి ఇంజక్షన్ సరంజామా పట్టుకుంటాడు]

కమల: అరగంట ఆలశ్యం అయింది!

రామా: (గాబరాగా) ఔను - అయింది! అయినా బాధ లేదు - ఏమీ బాధ లేదు. అరగంట ఏమంత ఆలస్యం కాదు. నేనంతా చూసుకుంటాను— అన్ని విధాలా ప్రయత్నిస్తాను—ఈపాటి ఆలశ్యం... (గదిలోకి వెళ్తూ) లెక్కలోది కాదు.

((ప్రక్క గదిలోనుంచి) రా కమలా... వేగం—

(కమల కొన్ని సెకండ్లు కొయ్యలా నిల్చుంటుంది—ఆమె ముఖం వివర్ణమౌతుంది)

రా కమలా!!

(కమలకూడా ప్రక్క గదిలోకి వెళ్తుంది)

[తెర]

రంగం: 4

ఒక చిన్న గది. ఒకమూల చిన్న టేబిలు, కుర్చీ; టేబిలుమీద ఒక దీపం; గది గోడకి పెద్ద గడియారం; అది ఆగిపోయింది—రెండుకి ఐదునిమిషాలు తక్కువగా టైము సూచిస్తోంది. కుర్చీలో రామారావు కూర్చున్నాడు, తల చేతులలో పట్టుకుని—పార్వతీశం ప్రవేశం—అతని ముఖం వాడి, కళ్లు ఎర్రగా ఉన్నాయి.

పార్వతీశం: (డాక్టర్ దగ్గరికి వచ్చి, భుజంమీద చెయ్యివేసి చిన్న గొంతులో) డాక్టర్!

(రామారావు ఉలిక్కిపడి లేవబోతాడు) లేవకండి! కూర్చోండి.

(రామారావు కూర్చుంటాడు—ఇద్దరూ కొన్ని నిమిషాలు మౌనం)

మీరు చెయ్యవల్సిందంతా చేసేరు. (దుఃఖంతో ఊరుకుంటాడు)

రామా: నాకు పూర్తి ధైర్యం ఉండేది—మీ రొచ్చినప్పుడు తిరుగుముఖం పట్టింది—కాని మళ్ళా తిరగ వేసింది—రెండుగంటలకి ఇంజక్షన్ ఇవ్వడం కొంచెం ఆలస్యమయింది. గడియారం ఆగిపోయింది.

పార్వ: ఔను—విన్నాను—కమల చెప్పింది. కాని ఆపాటి ఆలశ్యానికి—

రామా: ఆ ఆలశ్యం అంతగా లెఖ్ఖలోకి తీసుకోవల్సింది కాదు. ఈ రోగంతో చెప్పలేం—అందుకే మూడు గంటల తరవాత పూర్తిగా ధైర్యం ఉండొచ్చన్నాను

పార్వ: ఇంతకీ వాడికి బ్రతకాల్సిన యోగ్యత లేదు.

రామా: ఆయన అసలే నీరసం మనిషని విన్నాను.

పార్వ: కారణం కూడా వినేఉంటారు.

రామా: విన్నాను. ఆ జబ్బుండడం నా ప్రయత్నాన్ని కొంత అసాధ్యం చేసింది.

పార్వ: ఒక సంగతి చెప్పడానికొచ్చేను డాక్టర్! మీమీద నా కొక దురభిప్రాయం ఉండేది; మీ తండ్రిమీద నాకుండే ద్వేషంవల్ల నేమో. కాని ఇప్పుడు పూర్వం అలాటి అభిప్రాయం నా కున్నందుకు సిగ్గుపడుతున్నాను.

రామా: (ఆలోచిస్తూ ఉంటాడు)

పార్వ: నాకివాళ ఒక నిజం తెల్సింది. నా భార్య పోవడానికి ఎవరూ బాధ్యులు కారు—నా కొడుకుని మీరింత ప్రయత్నంచేసినా బ్రతికించగలిగేరా? ఆ పిలుపొచ్చినప్పుడు మనం ఆపలేం. మనలో ఏమీ లేదు.

రామా: అలానే మీరు ఆత్మశాంతి పొందాలి. కాని, మీరు ఆనాడు మీ భార్య పోయేందుకు నింద మా తండ్రిమీదే వేసేరు. అప్పుడు మీ కెవరైనా, మీ రిప్పుడన్న ఈ నిజం చెప్పివుంటే మీరు నమ్మి ఉండరు. కాని ఇవాళ, మీకు గురియన్న నేను ఎంత ప్రయత్నించినా మీ కొడుకు బ్రతక లేకపోయేడు; ఇవాళ మీరు ఆ వేదాంతంలో నమ్మకం కుదుర్చుకుంటున్నారు. మనస్సు, మార్పులకి ఎంత సులభంగా లొంగిపోతుంది. దేనిలోనైనా ఎంత వేగం మరో ఆలోచన లేకుండా నమ్మకం కుదుర్చుకుంటుంది!

పార్వ: ఆత్మశాంతి ఏదోవిధంగా పొందాలి; అప్పుడు ఆ చిన్న అనుమానంలో పొందేను—ఇప్పుడు ఏ అనుమానం లేదు చచ్చిపోయేక ఎక్కడికి వెళ్తామో తెలుసుకోలేం. కాని చావుకి ఏదో ఒక కారణఅంటకడతాం; అప్పుడు మనశ్శాంతి; రోగం కారణమే; కాని, అది మన ఏ శక్తిలోపంవల్ల పోలేదో కనుక్కుంటే నే కాని శాంతి ఉండదు; అందుకే అప్పుడు మా తండ్రి మీద నింద వేసేను; ఇప్పుడు భగవంతునిమీద నింద వేస్తున్నాను; దాని ఫలితం ఈ వేదాంతం; ఆత్మశాంతికి ఏదో ఒక మార్గం—

రామా: (మౌనం)

పార్వ: ఇప్పుడు నాకు అన్నింటిమీదా అదోక విరక్తిభావం కలుగుతోంది—

రామా: విచారంలో మీకలా అనిపిస్తుంది—

పార్వ: (నిట్టూర్చి) నేను స్వార్థపరుణ్ణి—

రామా: మనం అంతా అంతే—

పార్వ: నే నందుకే హద్దులు దాటేను— నాకలా అనిపిస్తున్న దీ నిమిషం. నా కొడుకు నాతో అనేవాడు—నాన్నా! ఆరోజు...ఆ మంచి రోజు ఎప్పుడు వస్తుందో—ఆ లోకానికి పోయే ఘడియ ఎప్పుడొస్తుందో, అని— నేను వాడిని మందలించేవాణ్ణి—వాడి జీవితానికి ఏ హానీ రాకుండా, సూటిగా చెప్పాలంటే, వాడి జీవితం పొడిగించడానికి అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాను—కాని, వాడు ఎంత బాధపడేవాడో...ఆమాట లనడానికి...ఎంత నరకయాతన అనుభవించేవాడో ఈ బ్రతుకులో... అది నే నాలోచించలేకపోయేను. ఆఖరి నిమిషం వరకు వాడి బ్రతుకుని నిలుపుదామనే ప్రయత్నించేను—ఇదంతా వాడిమీద ప్రేమవల్లేనా? నిజమైన వాత్సల్యంవల్లేనా అనిపిస్తుంది.

రామా: కాక మరేమిటి పార్వతీశంగారూ? తండ్రికి కొడుకుమీద మరేం ఉంటుంది? అందులో ఒక్క కొడుకు—

పార్వ: నా కివాళ, నా మనసు లోతులలోంచి నిజాన్ని తెలుసుకోవాలని ఉంది—నన్ను నేను విమర్శించుకోవాలని ఉంది అదంతా ప్రేమవల్ల కాదు; స్వార్థంవల్ల నేమో డాక్టర్! అసలు మొఖాసాదారు నేను కాను, వాడు—

రామా: అది తెలుసు.

పార్వ: కాని ఇంకొకటి మీరు తెలుసుకోవాలి. నాకొక తమ్ముడున్నాడు. నా కొడుకు పిల్లలు లేకుండా, మేం బ్రతికుండగాపోతే ఆ ఆస్తి మా ఇద్దరి మధ్యా పంపకం జరుగుతుంది మాతండ్రి వీలు ప్రకారం; అది నాకిష్టంలేదు; అంతా నా కింద ఉండాలని, అంతా నాకే నని ఆశ...తృష్ణ. అవి ఉండేవి—

రామా: పార్వతీశంగారూ...మీమనస్సు బాగు లేదు.

పార్వ: వాడు బ్రతికున్నంతకాలం ఆస్తి వాడే ...నేను పోయేవరకన్నా వాడు బ్రతికి ఉండాలని ... నన్ను నేను తెలుసుకుంటున్నాను డాక్టర్! మీతో చెప్తేఅన్నా మనశ్శాంతి ఉంటుందేమో! వాడికి కొంతైనా సంతోషం దొరుకుతుందేమోనని ఒక అమాయకురాలిగొంతుక కోసేను—వాడికి పెళ్ళి చేసేను — ఇందుకు నన్నెవరన్నా క్షమిస్తారా డాక్టర్?

రామా: (మౌనం)

పార్వ: నా కొడుకుమీద నాకు ప్రేమఉంది—లేదనను—ఈ సర్వం వాడిదే అన్న జ్ఞానం ఉంది. లేకపోలేదు—కాని, నాఆశ, నా స్వార్థంకోసమని, నయంకానిరోగాన్ని నయంచేదామని, వాడి జీవితాన్ని పనికిరానిమందులతో పెంచడం, దాని కన్నివిధాలా ప్రయత్నించేసి వాడిబాధని మరికొన్ని సంవత్సరాలు పొడిగించడం! నన్ను నేను క్షమించుకోలేను.

రామా: మీ కర్తవ్యం మీరు నెరవేర్చేరు— రోగికి చికిత్స చేయించటం తప్పు అని మీ రెందుకనుకుంటారు?

పార్వ: జాలిగా నా కళ్ళలోకిచూస్తూ — ఈ నరకం అనుభవించలేను నాన్నా! అని వాడన్నప్పుడు—వాడిమీద కోపగించుకున్నాను—మందు పుచ్చుకోడం అశ్రద్ధచేస్తే వాడిని పైకి మందలిస్తూ, మనస్సులో వాడిని తిట్టేను—వాడిబాధకి ఎంత సానుభూతి, ప్రేమ లేకుండా ప్రవర్తించేను. నన్నెవ్వరూ క్షమించకండి—నన్నెవ్వరూ క్షమించకండి డాక్టర్!

రామా: పార్వతీశంగారూ! మీ మనస్సు సరిగా లేదు.

పార్వ: నా మతి కూడా బాగులేదని అంటారు. అనండి. వాడి మాటలు జ్ఞాపకం ఉన్నాయి. ఒక్క నిమిషంలో బాధని శాశ్వతంగా పోగొట్టే మందు, ఒక గుక్కెడు విషం ఎందు కివ్వరు? అని—వాడన్నది నిజమే. వాడి రోగం నయం కాదు. వాడు బ్రతికి వాడికేం సుఖం—వాడి కోరిక తీర్చిఉంటే వాడెంత సంతోషించును? మన చట్టం ఒప్పుకోదు—

కాని నాకెందుకు ధైర్యం లేదు; నాకు స్వార్థం; విషమే ఇవ్వక్కర్లేదు—వాడు మందులు పుచ్చుకోడంలో ఎందుకంత శ్రద్ధ పుచ్చుకోవాలి! పులిలా ఎదురుగా నిల్చొని కళ్ళెర్ర చేసి వాడికి ఇష్టమైన సిగరెట్లు ఎందుకు మానిపించాలి? మానిపించనందువల్ల ఏమన్నా లాభం ఉందా? వాడి ప్రాణం పెంచడం తప్పు! వాడికున్న ఆ కొత్త సుఖం పోగొట్టడం తప్పు! పెళ్ళి చేసేను—అంతకన్నా ఉబ్బిచ్చి ఒక నర్సుని పెట్టి ఉంటే! నర్సుకన్న ఆ పిల్లవాడికేమిటి? ఆ హద్దులు దాటొద్దని ఆమెను ప్రతిమాలుకొన్నాను. వాడిని బెదిరించేను—కాపలా కాసేను—వాడికి ఈ జీవితంలో ఏ సుఖమూ లేకుండా చేసేను.

రామా: మీకు విశ్రాంతి అవసరం...పదండి, మీ గదికి.

పార్వ: నాకే విశ్రాంతీ వద్దు! ఇదంతా ఎందుకు చేసేను? వాడిని అదుపులో పెట్టి వాడి ప్రాణం పెంచేను. నేను పోయేవరకన్నా వాడుండాలని—నన్ను వాడు క్షమించడు; మీకందరికీ ఇందులో తప్పు కనిపించదు—కాని వాడుమాత్రం నన్ను క్షమించడు! ఇప్పుడు వాడు సుఖంగా ఉన్నాడు కాని పాత సంగతులు మరిచిపోలేడు—(ఎలుగెత్తి) ఒరే గోపీ!! (గదివదుల్తూ) క్షమించరాబాబూ!! మీ నాన్నని క్షమించరా తండ్రీ!!

[అతని గొంతు మరి వినిపించదు. ద్వారంవైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోతాడు రామారావు—తరువాత ముఖం తిప్పి, తల చేతుల్లో పెట్టుకొని ఆలోచిస్తూ ఉంటాడు.

కమల అలికిడి లేకుండా ప్రవేశిస్తుంది. రామారావుని సమీపించి అతని భుజంమీద చెయ్యి వేస్తుంది.]

రామా: (ఉలిక్కిపడి తిరిగి చూసి) నువ్వా!

[లేచి నిల్చుంటాడు]

కమల: ఫరవాలేదు—కూర్చో.

రామా: నాకు బాధ లేదు. నువ్వు కూర్చో.

[కమల కుర్చీలో కూర్చుంటుంది—రామారావు టేబిలుకి చేరబడి నిల్చుంటాడు]

అన్ని విధాలా ప్రయత్నించేసేను...నాలోపం ఏమీ లేకుండా—

కమల: (ఆలోచిస్తూ) ఔను! నీ లోపం ఏమీ లేదు.

రామా: ఆ అరగంట ఆలస్యం...

కమల: (ఉలిక్కిపడి తిరిగి సర్దుకొని) అదే కారణం అంటావా?

రామా: అయివుండదు—అరగంటవల్ల అంత బాధ లేదు ఆ స్థితిలో.

కమల: నువ్వు చాలా బాధపడుతున్నట్టుంది.

రామా: లేదు—నేనేం బాధపడలేదు కాని నువ్వు వెళ్ళి ఆ ముసలాయన్ని కొంచెం చూడు కమలా...అతను పిచ్చెత్తినట్టయిపోయేడు...

కమల: నేను వెళ్ళి ఏమీ చెయ్యలేను. నేను కనిపిస్తే మరింత బాధ—ఇప్పుడు నేను కనిపించగానే తప్పుచేసిన మనిషిలా బెదిరి పరుగెత్తిపోయి గదిలో తలుపు వేసుకున్నారు.

రామా: నీకేదో అన్యాయం చేసినట్టు బాధపడుతున్నాడాయన—

కమల: నా కొక్కర్తికేనా?

రామా: నువ్వొక్కదానివే అంటావా కమలా? ఆ ముసలాయనమీద కొంచెం సానుభూతితో మాట్లాడు!

కమల: అదే ఇప్పుడు చెయ్యాలి!

[మౌనం]

ఇప్పుడాయన సుఖంగా, నిష్పూచీగా—ఎంతో హాయిగా, ఏ బాధా లేకుండా ఉన్నారు!! కాని... (ఊరుకుంటుంది).

రామా: ఏమిటి కమలా?

కమల: నాకిప్పుడేమీ పని లేదు. ఎనిమిదేళ్ళ ఆపనికి అలవాటుపడిన ఈ చేతులు, విరిగిపోయేయి. నేనింక ఏం చెయ్యాలి!

[మౌనం]

నిజంగా చెప్పు రామం - నీ హాస్పిటల్‌కి నర్సక్కర్లేదా?

రామా: (మౌనం).

కమల: నాపని ఇక్కడైపోయింది...ఈ ఇంట్లో నాకింక చోటు లేదు - నాకు పనిలోనుంచి డిస్మిస్!

రామా: నువ్వు ముసలాయన్లాగే మాట్లాడుతున్నావ్...మనస్సు కొంచెం కుదుటపరచుకో—

కమల: నాకూ పిచ్చెత్తించకు రామం! అతనికి ఈ నరకంనుంచి విముక్తి దొరుకుతే నాకూ స్వేచ్ఛ దొరుకుతుందని అనుకున్నాను అతనికి ముక్తి దొరికింది కాని, నాకా స్వేచ్ఛ దొరకగానే... ఏమిటిక అని ఆలోచనలో పడాల్సొచ్చింది. నా

కింక ఈ శ్రీమంతుల ఇంట్లో పని అయిపోయింది. ఆ ముసలాయన నన్ను చూసి దాక్కుంటున్నాడు నన్ను చూసి పారిపోతున్నాడు—నన్ను చూసి అసహ్యించుకుంటా డింక—

రామూ: ఇప్పుడెలా నే ఉంటుందాయనికి — కొన్ని రోజులు పోయేక కుదుటపడతాడు...

కమల: డాక్టర్‌లా మాట్లాడకు రామం—సూటిగా మాట్లాడు—నీ మనస్సుకి నమ్మకం ఉందా?

రామూ: ఏమో నాకు తెలీదు కమలా...నాలో నాకే ఎందుకో నమ్మకం పోతోంది ..

కమల: సిగ్గ లేకపోయేనా?

రామూ: కాదు—మరెందుకో...సరిగ్గా చెప్ప లేను...

కమల: నీకు నర్సక్క రేదా రామం?

రామూ: నా హాస్పిటల్ కా?

కమల: నీకు—

రామూ: నాకా......!!

కమల: ఔను—నాకే ఇంట్లో చోటు లేదు—నేను ఉండలేనుకూడా—ఎక్కడో ఓచోట ఏదో ఓలా బతకాలి...

రామూ: అవేం మాటలు కమలా...

కమల: ఔను రామం. నేను నిజం అంటున్నాను—నీకు నర్సక్కర్లేదా?

రామూ: నాకెందుకు? నాకేం...

కమల: నీకు తుయాలేదంటావ్ — నిజమే. నీ శరీరం ఏ రోగంతోనూ బాధపడలేదు—కాని, నీ మనస్సు రామం? నీ మనస్సు ఏళ్లతరబడి ఏబాధా లేకుండా ఉందంటావా?

రామూ: (అనుమానంగా ఆమెని చూస్తూ) మనస్సుకేదో బాధ ఉంటూనే ఉంటుంది—అది లేకుండా ఎలా సాధ్యంబోతుంది కమలా?

కమల: నీ మనస్సు విషయంలో జాగ్రత్త తీసుకోవేందుకు ఎవ్వరూ అక్కర్లేరూ?

రామూ: అంటే?

కమల: నీ మనస్సుని అదుపులో పెట్టడానికి, దానికి మందులివ్వడానికి, దానికి శాంతినివ్వడానికి—దానిని జోకొట్టడానికి.

రామూ: కాని అలాంటి నర్సు...ఉంటుందా...

కమల: నేనైనా?

రామూ: నువ్వా!!

కమల: ఔను—నే నాపని సరిగ్గా చెయ్యగలనని నీకు నమ్మకం లేదా?

రామూ: ఎందుకు లేదు—కాని కమలా...

కమల: నేను జీతం ఎక్కువ అడగను. ఇక్కడ ఏదిచ్చేవారో అదే—తిండి...బట్ట......కొంచం స్వేచ్ఛ...అంతే...ఏమంటావ్ రామం?

రామూ: కాని కమలా...ఎవరన్నా ఏమన్నా అనుకోడానికి...

కమల: మామగారు సంతోషిస్తారు. నేను కనిపించకపోవడమే ఆయనికి కావల్సింది—మా ఆయన నాకెలానూ స్వేచ్ఛనిచ్చేరు. ఈపాటికి ఆ లోకంలో ఆ సంతోషంలో నన్ను మరిచేఉంటారు. ఇంకెవరు ఏమనుకున్నా నాకేం రామం? నువ్వేమన్నా బాధ పడుతున్నావా?

రామూ: (నవ్వడానికి ప్రయత్నిస్తూ) లేదు లేదు...అలానే కమలా...నువ్వు నాకు నర్సుగా ఉండు—

కమల: (సంతోషంతో) నిజంగానా! ఇంక నే నే బెంగా పెట్టుకోనక్కర్లేదు.

రామూ: ఔను కమలా...

కమల: (అనుమానంగా) నువ్వెందుకింకా అలా ఉన్నావ్? ఎందుకింతలా ఆలోచిస్తున్నావ్?

రామూ: లేదు కమలా...

కమల: దాచకు. నువ్వు సిగ్గులేకపోయేనని విచారం పెట్టుకున్నావ్.

రామూ: కాదు—ఒక సంగతి ఆలోచిస్తున్నాను. ఆ గడియారంగురించి—

కమల: (ఆందోళన మరుగుపరుస్తూ) గడియారం గురించి చేమిటి? గడియారం ఆగిపోయిందనా?

రామూ: కాదు—ఇంకొక విషయం. ఇప్పటివరకు అదే ఆలోచిస్తున్నాను ఇందాకట్నించి—

కమల: ఆ అరగంట ఆలశ్యంవల్ల...

రామూ: ఆ అరగంట ఆలశ్యంవల్ల ఇది జరగలేదు—నిజమే—కాని నాకు ఇందాక...నాకు లోపల—మనసులోపల, దాని లోతుల్లో తెలుసును గడియారం గంటలు కొట్టలేదని...రెండు దాటిపోయిందని...అయినా నే నూరుకున్నాను - నా చేతివాచీ చూసేందుకు ధైర్యం లేక—ఆ గంటలు కొట్టి నప్పుడే చూసుకుందామని...

కమల: అది నిజం కాదు—నువ్వలా అనుకోకు రామం—

రామా: నేను నీతో మాటల్లోనే ఉన్నాను కాని, నా అంతరాత్మకి తెలుస్తూనే ఉందేమో— గడియారం గంటలుకొట్టలేదు. అలక్ష్యం అయితే అది ఆ గడియారానిదే తప్పు—ఈ అవకాశం ఎందుకు జారవిడుచుకోవాలి...అనిపించిందేమో!

కమల: (ఆశ్చర్యంగా చూస్తుంది)

రామా: కమలా! గడియారం నువ్వే ఆపేవ్ కదూ?

కమల: (తృళ్లిపడి) నేనా!

రామా: చెప్పుకమలా! నిన్ను నేను ఏమీ అనను—నీమీద నాకున్న అభిమానం తగ్గదు. నిజం చెప్పుకమలా!

కమల: (ఆలోచించి) ఔను రామం—నేనే .. ఆపేను—

రామా: ఔను—నేనదే అనుకున్నాను—నా లోపలి మనస్సుకి ఆ అరగంటా ఆ నిజం తెలుస్తూనే ఉంది—కమల అందరికోసం ఈ పని చేసి ఉంటుందేమో— అలక్ష్యం ఔతోంది— కానీ— తెలుసు—కాలం జారిపోనీ బాహ్యంగా నీకు తెలీకుండా—అలా అనిపించింది!

కమల: నువ్వలా అనుకోకు రామం—ఈ అరగంట ఆలస్యం దానికి కారణం కాదు!

రామా: కాదు. నిజమే—కాని నేనెందుకు తెలిసి తెలిసి ఊరుకున్నాను? రెండుగంటలు అయి ఉండాలే అనుకుంటూ, అనుమానం వేసినా నా వాచీ ఎందుకు చూసుకోలేదు? స్వార్థ కాంక్ష ఎందుకొచ్చింది?...స్వలాభం! కమలా...స్వార్థం.

కమల: (లేచి దగ్గరగా వస్తూ) ఏమిటా మాటలు రామం!!

రామా: అశ్రద్ధ !!

కమల: (ఉలిక్కిపడి) అశ్రద్ధ !!

రామా: ఔను. అశ్రద్ధ! ఆ అశ్రద్ధ దానికి కారణం కాకపోయినా, అది ఎందుకు జరగాలి? నీకోసం ఆపని చేసినానేమో...దానికి నాలోని డాక్టర్ ఒప్పుకున్నాడేమో...

కమల: (కోపం తెచ్చుకొని) పోనీ! అలా నే అనుకో—ఇందువల్ల ఎవరికీ నష్టంలేదు — అతను కోరిందీ అదే. నిన్న అతను బ్రతిమాలుకున్నదీ అది. నీకేం నష్టం ఉంది? (వచ్చి భుజంమీద చెయ్యి వేస్తుంది.)

రామా: నేనింక డాక్టర్ని కాదు. నాలో నాకు విశ్వాసం పోయింది. నాపని సరిగా చేయ్యలేక పోయేను—ఇంక నేను ఏమందూ ముట్టుకోను—నే పోతాను కమలా...

కమల: ఎక్కడికి?

రామా: ఇంటికి.

కమల: ఈ చీకట్లోనా?

రామా: ఔను. నాకేం భయంలేదు. ఇక్కడ ఉండలేను—నా మనస్సు ముక్కలౌతుంది మరొక నిమిషం ఉంటే; ఈ వాతావరణంలో ఉండలేను. ఇంటికి పోవాలి. మనస్సు కూడ తీసుకోవాలి...అస్థిపంజరం! అస్థిపంజరం!

కమల: నీకు పిచ్చెత్తిందా రామం!

రామా: అస్థిపంజరం ముందు కూర్చుని మనస్సు కూడ తీసుకోవాలి. ఆత్మవిశ్వాసం కుదుర్చుకోవాలి.. ఇక్కడ ఉండలేను...(పోబోతాడు).

కమల: నీ పంచీ - వస్తువులు...

రామా: వాటిఅవసరం తీరిపోయింది...నాకవి అక్కర్లేదు—నేనీ వృత్తి మరి చెయ్యను! చెయ్యలేను!...కాని అస్థిపంజరం...అది ఉండాలి... ఆత్మవిశ్వాసానికి...అది ఉంటేనే కాని ఇది ఉండదు—

కమల: నువ్వీ రాత్రప్పుడు వెళ్ళకు—నామాట విను—

రామా: నే నిక్కడ ఒక్క నిమిషం అన్నా ఉండలేను—వదులు నన్ను! నామనస్సు పాడైయింది. దానికి రోగం వచ్చింది—

(ద్వారంవైపు వెళ్తూ ఒక్కసారాగి) నాకు నర్సుగా ఉంటావ్ కదూ?

కమల: ఉంటాను రామం—కాని నువ్విలా పిచ్చివాడిలా అవకు—

రామా: నీ విలువ చూసుకోవిరా—కాని ఈరోగివి మరిచిపోకు! (తిరిగి తాకే) ఆత్మవిశ్వాసం! అస్థిపంజరం...నాలోని రాక్షసుడు - రాక్షసుడి కంటి బలం!!

(నిష్క్రమణ)

కమల: (స్తబ్ధురాలయి నిల్చుంటుంది కొంతసేపు అతను వెళ్లినవైపే చూస్తూ - తరువాత కుర్చీలో కూలబడి టేబిలుమీద తల ఆన్చి, ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడుస్తుంది - ఏడుపు మధ్య) భగవంతుడా!... రక్షించు!!!

మన చలనచిత్ర పరిశ్రమ

శ్రీ కాట్రగడ్డ నరసయ్య

1920 వ సంవత్సరములో తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఒక పునాది ఏర్పడినదని చెప్పవచ్చు.

1918 కు ముందు మళయాళీ దేశస్థుల జోస్ బయాస్కోపు కార్బయిడ్ లాంపుతో సైలెంటు సినిమాలు చూపేవారు. 1919 లో కాకినాడ కాలేజీ ప్రిన్సిపాలు శ్రీ రఘుపతి వెంకటరత్నం గారి తమ్ముడు శ్రీ వెంకయ్యగారు ఇంజను డైనమోతో ప్రథమ టూరింగుహాలు నడిపి, తరువాత 1920 లో మద్రాసులో గెయిటీహాలు నిర్మించారు.

ఇతర ప్రాంతాలవారు వచ్చి మనదేశంలో క్రొత్తపద్ధతిలో వ్యాపారం చేసి లాభాలు గడించటం, తమలో ఒకరైన శ్రీ వెంకయ్యగారు గెయిటీహాలు నిర్మించటం గమనించిన మన పరిశ్రమ పితామహులు చలనచిత్ర పరిశ్రమలోని వ్యాపార లక్షణాన్ని, వ్యాపార స్వభావాన్ని గుర్తించారు. ఈ పరిశ్రమలో పెట్టుబడి పెట్టటం లాభదాయకమని గ్రహించారు. 1921 లో ఆంధ్రలో విజయవాడలో తొలి ప్రదర్శనశాలను శ్రీ పోతిన శ్రీనివాసరావుగారు నిర్మించారు.

1921-23 సంవత్సరాలలో చాలావరకు పరిశ్రమలోనికి పెట్టుబడులు రాసాగాయి. గోడౌనులను ప్రదర్శనశాలలుగా మార్చటం జరిగింది. బందరులోను, ఏలూరులోను, రాజమండ్రి కాకినాడలలోను ప్రదర్శనశాలలు నిర్మింపబడ్డాయి. క్రమేపీ వీటి సంఖ్య ఆంధ్రదేశంలో పెరిగింది. అంతవరకు సైలెంటు చిత్రాలనే ప్రదర్శించేవారు.

ఆ సమయంలో సి. పుల్లయ్యగారి మార్కండేయ, ప్రకాశ్ తీసిన భీష్మలాంటి సైలెంటు చిత్రాలు వచ్చాయి.

టాకీల యుగం ప్రారంభం కావటంలో పరిశ్రమ క్రొత్తసమస్యలను ఎదుర్కొంది. నూతనత్వం చూపటమే లక్షణం, స్వభావంగాగల పరిశ్రమలో తమ స్వభావంలో చిత్రాలు తీస్తే చాలా లాభాలు వస్తాయని గ్రహించారు.

1931 లో హెచ్. యమ్. రెడ్డిగారు భక్త ప్రహ్లాద తీశారు. ప్రథమ తెలుగు చిత్రం కావటంతో భక్తప్రహ్లాద ఎంతో విజయవంతంగా నడిచింది. ఎంతో మంది క్రొత్తవారిని పరిశ్రమలోనికి ఆకర్షించింది.

మధ్యరకం పరిశ్రమ

ఈ విధంగా ఎంతోమంది క్రొత్తవారు ఆకర్షింపబడటం, ప్రదర్శనశాలల నిర్మాణం జరగటంతో పరిశ్రమ ఒక మధ్యమ తరగతి (మీడియం స్కేలు) పరిశ్రమగా అభివృద్ధి కాసాగింది. 1931 నుంచి 1936 వరకూ 29 పౌరాణికాలు నిర్మింపబడ్డాయి. హిందీ భాషలో వచ్చిన సాంఘికాల మూలంగా, నూతనత్వంకోసం జరిగిన ప్రయత్నాల ప్రభావంగా, 1936 లో ప్రథమ సాంఘిక చిత్రం ప్రేమవిజయం నిర్మింపబడ్డది. అయితే పౌరాణికాలకున్న విలువ సాంఘికాలకు అప్పట్లో లేదు.

స్టుడియోలు

1936 వరకు స్టుడియోలు మద్రాసులోనే వుండేవి. పరిశ్రమ అభివృద్ధిని, సంవత్సరానికి 8 చిత్రాలు తయారవటం గమనించిన తెలుగు వ్యాపారస్తులు కొందరు రాజమండ్రిలో దుర్గాసినీటోన్ 1936 లో నిర్మించారు. ఆ దుర్గా సినీటోన్‌లో సంపూర్ణ రామాయణం, సత్యనారాయణ వ్రతం మాత్రం నిర్మించారు. 1937 లో విశాఖపట్నంలో ఆంధ్ర సినీటోన్ నిర్మింపబడి భక్త జయదేవ్ అన్న చిత్రం తయారుచేయబడింది. తెలుగు గడ్డపై నిర్మింపబడిన రెండు స్టుడియోలు ఆ తరువాత మూసివేయబడ్డాయి.

తెలుగు చలనచిత్ర పరిశ్రమ తరువాత మద్రాసులోనే కేంద్రీకృతం కాసాగింది. కలకత్తా,

బొంబాయి స్టుడియోలలో కూడా తెలుగు చిత్రాల నిర్మాణం తగ్గిపోయింది.

1938 వరకు పౌరాణికాల నిర్మాణం ఎక్కువగా జరిగింది. 1938 లో విడుదల చేయబడిన సాంఘిక చిత్రం గృహలక్ష్మి విజయవంతం కావటంతో సాంఘికాలపై నిర్మాతలు మోజుపడసాగారు. ఆ రోజులలో పరిశ్రమలోని ప్రముఖులు పి. వి. దాసు గారు, పారుపల్లి శేషయ్యగారు, గూడవల్లి రామబ్రహ్మంగారు

గూడవల్లి రామబ్రహ్మంగారు సాంఘిక సమస్యలను తీసుకొని చిత్రాలు తీయటంతో పరిశ్రమలో ఒక నూతనదృష్టి ఏర్పడింది పౌరాణికాలే కాకుండా సాంఘికాలు కూడా ప్రజలను ఆకర్షించుతాయని గ్రహించారు. పారుపల్లి శేషయ్యగారు, పి వి. దాసు గారు పెట్టుబడులను పరిశ్రమలోనికి తేవటానికి ఎంతో కృషి చేశారు. పౌరాణికాలు, సాంఘికాలు, జానపద చిత్రాలు తీయటం పెరిగింది. తిరుపతి కుటుంబ గాథలు చిత్రాల కథావస్తువు కావటం ప్రారంభమైంది.

1936 నుంచి 1942 వరకూ సంవత్సరానికి 10 చిత్రాలకు తక్కువ కాకుండా నిర్మాతలు విడుదలచేశారు.

చలనచిత్ర పరిశ్రమ ఎంతో విశాలమైన పరిశ్రమగా పెంపొందసాగింది. యుద్ధకాలంలో నిర్మాణం కొంత మందగించినా పరిశ్రమలోనికి పెట్టుబడులు డిస్ట్రిబ్యూషను వ్యాపారరూపంలోను, ప్రదర్శనశాలల రూపంలోను చాలా త్వరితంగా రాసాగాయి.

1943 నుండి 1949 వరకు సంవత్సరానికి సుమారు 7 చిత్రాలు విడుదల అయ్యాయి. దీనికి ముఖ్యకారణం ద్వితీయ ప్రపంచ సంగ్రామంగా గుర్తించవచ్చును. యుద్ధానికి పూర్వం 40, 50 వేల రూపాయలతో చిత్రం తయారయ్యేది. యుద్ధానంతరం 2, 3 లక్షలకు దాటిపోయింది ముడి ఫిలిం ఖరీదు, నిర్మాణం ఖర్చులు ఎక్కువ కావటం దీనికి కారణం.

ప్రధాన పరిశ్రమ

ఈ దశలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ మధ్యతరగతి పరిశ్రమ దశనుంచి ప్రధాన పరిశ్రమగా పెంపొందింది. 1950-53 సంవత్సరంలోని పెట్టుబడులను పరిశీలించితే సుమారు 7½ కోట్లు తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కేంద్రీకృత మయినట్లు తేలుతుంది. కోటిరూపాయలు నిర్మాణంలోను, కోటిరూపాయలు 6 స్టుడియోలమీదను, కోటిరూపాయలు డిస్ట్రిబ్యూషను వ్యాపారంలోను, 4½ కోట్లు 227 పర్మనెంటు ప్రదర్శనశాలల మీదను సుమారు 201 (101 + 100) టూరింగుల మీదను. మొత్తం 7½ కోట్లు పరిశ్రమలోకి వచ్చింది.

ఆంధ్రదేశంలోని పంచదార పరిశ్రమ, సిమెంటు పరిశ్రమ బిస్క్యం, వేరుశనగనూనె ఫ్యాక్టరీలు, బ్యాంకులమీద కూడ ఇంత పెద్ద మొత్తం పెట్టుబడులు లేవు కనుకనే ఆంధ్రదేశంలో సినిమా పరిశ్రమ ప్రధాన పరిశ్రమగా తయారయింది. ఇంత విశాలమైన పరిశ్రమ స్వభావం, ప్రత్యేక లక్షణాలు, అభివృద్ధిలోని వివిధ ధోరణులు పరిశీలించవలసిన అవసరం ఎంతైనా వున్నది పరిశ్రమలోని యీనాటి అరాచకాన్ని అర్థం చేసుకోవటానికి కూడా అది అవసరం.

పరిశ్రమ స్వభావం

పైన వివరించినటుల 1931 నుండి 1935 వరకు పూర్తిగా పౌరాణికాలు వచ్చాయి చిత్రాలు ఎక్కడో ఒకటి తప్ప అపజయం పొందినవికావు.

ఈనాడు కన్నడభాషలో 7 చిత్రాలవస్తే. ఏడూ ఎంతో విజయవంతముగా నడుస్తున్న పద్ధతిలో మన పరిశ్రమ తొలిరోజులలో జరిగింది. పరిశ్రమవైపు ధనికులు ఆంధ్ర ప్రాంతాలనుండి ఆకర్షించబడ్డారు. పరిశ్రమలోకి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ప్రదర్శకులుగా చాలా మంది వచ్చారు.

నిర్మాత : డిస్ట్రిబ్యూటరు

నిర్మాత, డిస్ట్రిబ్యూటరు పరిశ్రమలో చాలా దగ్గర సంబంధాలుగల వ్యక్తులు. ఒకరిపైన ఒకరు ఆధారపడి వుండేవారు. ఆంధ్ర డిస్ట్రిబ్యూటర్లు పరిశ్రమలోనికి రాకముందు డిస్ట్రిబ్యూషను వ్యాపారం గుజరాతీ సంస్థల చేతులలోను, బెంగుళూరు సంస్థల చేతులలోను వుండేది.

పరిశ్రమలోని లాభాలను గుర్తించి, డిస్ట్రిబ్యూషనులోనికి క్రొత్తవారు రాసాగారు. నిర్మాతలు తమను ప్రోత్సహించే తెలుగు వ్యాపారస్థుల కోసం వెదుకసాగారు. పూర్ణాసంస్థ అధిపతి మంగరాజుగారి ప్రవేశం ఆకాలంలో జరిగింది. పారుపల్లి శేషయ్యగారు స్థాపించిన సరస్వతీ టాకీసు లిమి

టెడ్ వారు నూటికి నూరు రూపాయలు డివిడెండును ఇవ్వటం, బంపెరు పి వి దాసు గారు వేల్ పిక్చర్సులో 60% డివిడెండ్లు యివ్వటం క్రొత్తవారిని పరిశ్రమలోనికి ఆకర్షించింది.

ఆంధ్రదేశంలో అప్పుడే వస్తున్న ఇతర పరిశ్రమలు ఆర్థిక సంక్షోభంతో పతనమయిపోవటం, లిమిటెడ్ కంపెనీల దివాళాకోరు పద్ధతులు గమనించిన భూస్వాములు మిగతా పరిశ్రమలకన్న చలనచిత్ర పరిశ్రమవైపు ఎక్కువగా ఆకర్షించబడ్డారు. అంతేకాకుండా వ్యవసాయదారుల వడ్డీలను తగ్గించుతూ చట్టం రావటం కూడా యీ పరిశ్రమలోనికి పెట్టుబడులు రావటానికి దోహదమిచ్చింది.

పరిశ్రమకు గల ఆకర్షణ

చలనచిత్ర పరిశ్రమకు ఇతర పరిశ్రమలకు లేని ఒక ఆకర్షణ వుంది. ఈ పరిశ్రమలో వ్యాపారం, జీవితం, వినోదం పెనవేసుకొని వుంటాయి.

భూస్వామిక సమాజంలోని భోగం మేళాలకు అలవాటుపడ్డ వారికి కూడా సినిమా పరిశ్రమపట్ల ఔత్సుక్యం కలిగింది. ఈ కాలంలోనే కొంతమంది జమీందారులుకూడా పరిశ్రమలో ప్రవేశించారు. అనేకమంది భూస్వాములు, ధనిక రైతులు పరిశ్రమలోనికి పెట్టుబడులను విరివిగా పెంచసాగారు.

చలామణీ పెట్టుబడులు

భారతదేశంలోని ఇతర పరిశ్రమలవలెనే చిత్ర పరిశ్రమలోనికి వచ్చిన ధనాన్నంతటినీ పెట్టుబడుల క్రింద మార్చటం చలామణీ పెట్టుబడుల (*liquid capital*) గా ఉంచకపోవటం జరిగింది పరిశ్రమ. పెరుగుతున్నంత వేగంగా పెట్టుబడులు రాలేకపోయాయి. అందువలన పరిశ్రమ యితర పరిశ్రమలాగా కేంద్రీకృతమైన పరిశ్రమగా (*Concentrated Industry*) (లిమిటెడ్ కంపెనీలుగాను జాయింటు స్టాకు కంపెనీలుగాను) పెరగలేదు. అనేకమంది వ్యక్తులు కొద్ది పెట్టుబడితో రావటం జరిగింది. దానివల్ల యిటు నిర్మాతగాని, అటు డిస్ట్రిబ్యూటరుగాని స్వతంత్రంగా చిత్రాన్ని తీయలేకపోయారు. ఒకరిపై ఒకరు ఆధారపడుతూ ఉండటంవల్ల అంతకుముందు విజయవంతంగా ఇతరులు అనుసరించిన పద్ధతితప్ప క్రొత్తపుంతలను త్రొక్కటానికి భయపడసాగారు. అందువల్ల, ఆ పాతపద్ధతి పూర్తిగా అపజయం పొంది లాభం లేదనుకొన్నప్పుడే, క్రొత్తపద్ధతిని అవలంబించటానికి ఆలోచించటం పరిశ్రమస్వభావంగా మారిపోయింది. ఇతర పరిశ్రమలకు చలనచిత్ర పరిశ్రమకు ఉన్న ప్రాథమిక వత్యాసాన్ని కూడా గమనించలేకపోయారు. ఏ క్రొత్తదనం (*Novelty*) చేత తాము ఆకర్షింపబడ్డారో అలాంటి నూతనత్వాన్ని ప్రేక్షకులు కూడా కోరతారని, వారి అభిమానాలు పొందాలంటే సంవిధానం విషయంలో పరిశోధన అవసరమని గ్రహించికూడా అవలంబించలేదు. సిద్ధాంతాల ప్రకారం (8 డాన్సులు 10 పాటలు, 5 విషాదఘట్టాలు, కొన్ని హాస్య సన్నివేశాలు లాగా) చిత్రాలు తీయటం ఎక్కువ అయింది.

పరిశ్రమలోనికి వచ్చిన క్రొత్తవారి పరిస్థితులు

నిర్మాతలు

క్రొత్తవారికి చాలా ఖర్చులు అయ్యేవి. అనుభవం లేకుండా గ్రామ ప్రాంతాలనుంచి పెట్టుబడులు తీసుకొనివచ్చేవారు. ఈ చిన్న చిన్న నిర్మాతలు తెచ్చిన తక్కువ పెట్టుబడులతో నిర్మాణం మొదలెట్టేవారు. తరువాత డిస్ట్రిబ్యూటర్లపై ఆధారపడేవారు. చాలామంది ఒక చిత్రంతీసి నష్టపడి పరిశ్రమలోనుంచి బయటికి పోయేవారు. పరిశ్రమలోని పెట్టుబడులను చిత్రాలవారీగా పరిశీలించితే వస్తోన్న నష్టం ఎవరూ సహించలేరు. ప్రణాళిక లేని పరిశ్రమ యింతకాలం నిలబడటానికి కారణం క్రొత్తవారు ఆకర్షింపబడి వ్యక్తిగతంగా నష్టపడినా కొంత పెట్టుబడిని పరిశ్రమ పెంపుదలకు వదలిపోవటం ఒక కారణంగా గుర్తించవచ్చును. నిర్మాణ ప్రణాళిక (*Planning*) లేకపోవటంవల్ల స్టుడియోలలో కాల్ షీట్ల రూపంలో ఎక్కువ ధనం యివ్వటంతో స్టూడియోలలో పెట్టుబడులు పెరగటం జరిగింది. కాలక్రమేణా టెక్నీషియను, నటీనటులు చిత్రాలు తియ్యటానికి దోహదమిచ్చింది.

డిస్ట్రిబ్యూటర్లు

డిస్ట్రిబ్యూటర్లుగా పరిశ్రమలో ప్రవేశించి విజయవంతంగా వ్యాపారం చేయటం చాలా కష్టంగా ఉండేది. కిరాయిపద్ధతిలో (*Hire Rental System*) క్రొత్త డిస్ట్రిబ్యూటర్లు చిత్రాలను సరిగా పంపిణీ చేయలేరని నిర్మాతలు భావించారు. అందువల్ల తమకు నిర్మాణంలో ఎక్కువ డబ్బు అడ్వాన్సుగా యిచ్చి తక్కువ కమీషను తీసుకొనే వారికి చిత్రాలను

యిచ్చేవారు. అందువల్ల పరిశ్రమలోనికి క్రొత్తవారు ప్రవేశించాలంటే చాలా కష్టంగా ఉండేది. క్రొత్తవారు చాలా స్వేచ్ఛ లేదను చెప్పుకోవాల్సివచ్చేది. కనుక వారు ధైర్యంతో నూతనత్వాన్ని కోరే క్రొత్త నిర్మాతలను ప్రోత్సహించేవారు. అయితే పరిశ్రమలో నిలదొక్కుకోగానే పాత పద్ధతులలోనే పోయేవారు. క్రొత్తగా ప్రవేశించిన కొందరు డిస్ట్రిబ్యూటర్లు వి స్వేచ్ఛ లేదను స్థాయిపై పైకి వచ్చాకా అదే పద్ధతిలో తరువాత కూడా వ్యాపారం చేసి పూర్తిగా నాశనమైన సంఘటనలు కూడా లేకపోలేదు. వారు వ్యాపారానుభవం గడించకుండా లోగడపొందిన విజయంతో లెక్క లేకుండా ప్రవర్తించి పతనమయిన ఘటనలున్నాయి.

ప్రదర్శకులు

ప్రదర్శకులుగా వ్యాపారానుభవంలేని క్రొత్తవారు రాసాగారు. ప్రతి కేంద్రములోను పరిస్థితులను, ఆవశ్యకతను గుర్తించకుండా ఎక్కువ హాలులు నిర్మించి తీవ్రమైన పోటీని పెంచివేశారు.

ఉదాహరణగా విజయవాడలోని 11 హాలుల సంఖ్య. ప్రదర్శనవిధానాలలో క్రొత్తపద్ధతులు అవలంబించకుండాను, ప్రేక్షకుల సౌకర్యాలు గమనించకుండానూ మంచిచిత్రముంటే ప్రేక్షకులు రాకుండా ఎక్కడకు పోతారన్న ధీమాతోనూ చిత్రాలకోరకే డిస్ట్రిబ్యూటర్లవైపు ఎగబడసాగేరు. అందువల్లనే ప్రదర్శకులకు ఇన్‌కంటాక్సు డిపార్టుమెంటువారునిర్ణయించిన స్థాయినిమించి ప్రయాణపు ఖర్చులు పెరిగిపోయాయి.

ప్రేక్షకులు

ప్రేక్షకులలో చాలామంది ప్రదర్శనశాలలో సౌఖ్యాన్ని గమనించకుండా చిత్రం చూడటానికి పోతారు. వీరు ఆయా చిత్రాలకోసమే గత్యంతరం లేక అలాటి ప్రదర్శనశాలలకు వెడతారని మనమంతా గుర్తించవచ్చును. కొంతమంది ప్రేక్షకులు ప్రదర్శనశాల తమ నివాసములకు దగ్గరగా ఉన్నప్పుడు అది ఎలా వున్నప్పటికీ అక్కడికే పోతారు. ఇటువంటి వారిని ఒకరకపు ప్రేక్షకులుగా గుర్తించవచ్చును. కాని కొంతమంది ప్రేక్షకులు అన్ని సౌకర్యములు కలిగి, విశ్రాంతిని కలుగజేసే ప్రదర్శనశాలకు ఏ చిత్రం వున్నప్పటికీ లెక్క చేయకుండా పోతారు. ఇలాంటి ప్రేక్షకులు సమాజం అభివృద్ధి అవుతున్న కొద్దీ ఎక్కువ అవుతారు. ఈ ప్రేక్షకులకు అవసరమైన ఏర్పాటులు చేయటం వార్తాచిత్రాలు, సైన్సు రీల్సు సంపాదించటం, ఉత్తమ చిత్రాలను తెప్పించటం ద్వారాను క్రమేణా ప్రదర్శనశాలకు యిలాంటి ప్రేక్షలను ఎక్కువగా ఆకర్షించవచ్చు. అభివృద్ధి చెందుతున్న మన సమాజంలో యిలాంటి ప్రేక్షకుల సంఖ్య పెరుగుతుంది. వారిని ఆకర్షించటమే ప్రదర్శకులు ఆదర్శంగా పెట్టుకొన్నప్పుడే ప్రదర్శనశాల బాగా అభివృద్ధి చెందుతుంది. కాని తీవ్రమైన పోటీ పెంచినంత మాత్రంచేత కాదు. అలా చేయటం వ్యాపారాన్ని నాశనం చేయటం గాని, సంపాదించటం కాదు.

నటీనటులు

పరిశ్రమలోని పాతపద్ధతుల అనుసరణ కారణంగా నటీనటులను ఒకేరకపు పాత్రను ధరించేలాగు వత్తిడి చేయసాగారు. కళాకారుని అభివృద్ధి చేసే వాడుకోవటం మాని, ఒకే పాతపద్ధతిలో (*Steriotyped*) నటించేలాగు చేయసాగేరు. అది చివరకు ప్రేక్షకులు అసహ్యించుకొని ఆ నటుడుకాని నటిగాని ఉన్న చిత్రమంటే విసుగుపడేటంతవరకు చేయటం జరిగింది. కనుక పరిశ్రమను సమగ్రంగా పరిశీలించితే ఉత్తమస్థాయి పరిణామంకోసం కాకుండా ఒకే పద్ధతి ఒకే సంవిధానం పూర్తిగా అపజయం పొందేవరకు ఆ పద్ధతినే అవలంబించటం పరిశ్రమ స్వభావంగా మారినట్టు మనకు తెల్లమౌతుంది.

పరిమిత పెట్టుబడులు కావటంతో పేరున్న నటీనటులు, టెక్నీషియన్లు, డైరక్టర్లు మొదలైనవారి కోసం ఎగబడటం జరిగింది. 1950 లో యీ స్థితి అంతిమస్థాయికి పోయింది. క్రొత్త నటీనటులను తీసుకురావటంలో టెక్నీషియన్లను అభివృద్ధిపరచుకోవటంలో హాలీవుడ్ అనుసరించుతున్న విస్తృత పద్ధతిని మననిర్మాతలు గుర్తించలేరు. ఈనాడు పరిశ్రమలో అందరికంటె ఎక్కువ పెట్టుబడులు, స్టుడియోలు కల సంస్థలు కూడా ఆ కార్యక్రమాన్ని కొనసాగించుటలేదు.

1950 లో పరిశ్రమ ఎంతో ఉచ్ఛస్థితికి పోయింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్ల సంఖ్య పెరిగింది. క్రొత్త నటీనటులు కూడా వచ్చారు. కాని పరిశ్రమ స్థాయినిబట్టి నిర్మాతలు, స్టుడియోల సంఖ్యనుబట్టి నటీనటులు పెరుగలేదు. తారల పద్ధతి అమలులోనికి వచ్చింది.

1950-58 లో 88 మంది నిర్మాతలు, 57 గురు డిస్ట్రిబ్యూటర్లు ఉండేవారు. 827 ప్రదర్శన కేంద్ర

ములలో 458 ప్రదర్శనశాలలు వుండేవి. ఆంధ్రదేశంలో సుమారు 110 తాలూకాలలో తాలూకాకు ఒక ప్రదర్శనశాల అయినా వుండేది. అంత ఉచ్ఛదశను అందుకొన్న పరిశ్రమకు తరువాతి సంవత్సరాలలో పరిస్థితులు మారిపోయాయి. అంతకుముందు చిత్రాలు ఎక్కడో ఒకటి తప్ప పూర్తిగా అపజయం పొందేవి కాదు. అనంతరదశలో ఈ పరిస్థితి తల్లక్రిందులై ఏ ఒక్క చిత్రమో తప్ప మిగతావన్నీ అపజయం పొందిపోగాయి.

ప్రచారం

1950 కి ముందు వార్తాపత్రికలలో ప్రచారం అధికంగా ఉండేది. చిత్రానికి 10 వేల రూపాయిల వరకూ ఖర్చు పెట్టేవారు. తరువాత 10 వేల రూపాయిలకు వార్తాపత్రికలలో ప్రచారం తగ్గించివేశారు. గోడలమీద పోస్టర్ల సంఖ్య పెరిగింది. యుద్ధంవల్ల తగ్గిన పోస్టర్ల సంఖ్య మళ్ళీ విపరీతంగా పెరిగింది దీనికి కొంతవరకు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కొలుసుకట్టు పద్ధతిలో అనుబంధ పరిశ్రమలను — లితో ప్రెస్సులు, ప్రింటింగు ప్రెస్సులు మొదలైనవాటిని, అభివృద్ధిచేసుకోవటం, కారణం. పరిమితములైన పెట్టుబడులతో పరిశ్రమలో ప్రవేశించిననిర్మాతలు ప్రచారాన్ని పూర్తిగా ప్రదర్శకుడిమీద పని వేయటం మరొక ముఖ్య కారణం. ఈ స్థానిక ప్రచారపు పద్ధతులైన పోస్టరు, కరపత్రాల ప్రచారం కారణంగానూ, వార్తాపత్రికల ప్రచారం ప్రణాళిక ననుసరించి లేకపోవటంవల్లనూ ప్రచారం లేకపోయినా పేరున్న నటీనటులు చిత్రంలో నటించితే మొదటి వారంలో చాలా మంచి ఆదాయం వస్తుందని పరిశ్రమలోని అన్ని శాఖలలోనివారూ నమ్మసాగారు. దానివలన పేరున్న నటీనటులు వుంటే డిస్ట్రిబ్యూటరు వస్తాడు, ప్రదర్శకుడు చిత్రాన్ని తీసుకొంటాడు అన్న అభిప్రాయం ప్రబలింది. ఇది క్రమేపీ నటీనటులను ప్రచారంకోసం వాడుకొనే విధానాన్ని అమలులోనికి తెచ్చింది.

ఈ పరిస్థితులలో పరిశ్రమలోని వివిధశాఖలలో మార్పులు చాలా వచ్చాయి. ఆర్థిక సంక్షోభం థియేటర్ల సంఖ్య తగ్గిపోవటం, ఆంధ్ర చలనచిత్రములకు మార్కెటు తగ్గిపోవటంతో పరిశ్రమలోని అన్ని శాఖలూ చాలా మార్పులకు లోనయ్యాయి.

నిర్మాతలు

నిర్మాతలలో పైన వివరించినటుల కొద్ది పెట్టుబడులతో నిర్మాణం సాగించుతున్నారు. క్రింది లెక్కలు పరిశీలించితే నిర్మాతల సంఖ్యలోని మార్పులు గమనించవచ్చు.

	జనవరినుండిఅక్టోబరు ఆఖరు వరకు 1953–1954
సాంఘిక చిత్రాలు	16 - 15
జానపద చిత్రాలు	8 - 7
ఆర్థికంగా విజయంపొందిన చిత్రాలు	6 - 3
క్రొత్తగా పరిశ్రమలోకి వచ్చి పూర్తిగా నష్టపడిన తెలుగు నిర్మాతలు	5 - 3
ఆంధ్రేతర నిర్మాతలు	13 - 8

డిస్ట్రిబ్యూటరు దొరికితే చిత్రాలు తియ్యాలనుకుంటున్న నిర్మాతలు చాలామంది తయారయ్యారు. వీరిని స్టుడియో నిర్మాతలు, అనుభవం వున్న నిర్మాతలు, వ్యక్తి నిర్మాతలు, టెక్నిషియన్ నిర్మాతలుగా విభజించవచ్చును.

స్టుడియో నిర్మాతలు

స్టుడియో నిర్మాతలు తీసుకుంటున్న కథా సంవిధానాలు పరిశీలించితే 1954లో పౌరాణికాలవైపు మొగ్గు కనబడుతున్నది. విజయావారు శశిరేఖా పరిణయం, భరణీవారు విప్రనారాయణ, శ్రీకృష్ణతులాభారం, రోహిణీవారు అమృతహస్తంలాంటి జానపదాలు, ఎ. వి. యం. వారు సావిత్రి లాంటి చిత్రాలు నిర్మించుతున్నారు. మొత్తం నిర్మాణంలో వున్న 40 చిత్రాలలోను 10 వరకు పౌరాణికాలు వున్నాయి. ఒకసారి నిర్మించబడి డబ్బు చేసుకొన్న పౌరాణిక చిత్రాలను టెక్నికల్ గా పెంపొందించి బ్రహ్మాండమైన సెట్టింగుల హంగామాతో, కెమెరా ట్రిక్కులతో మళ్ళీ తీస్తున్నారు. ప్రేక్షకులను ఆశ్చర్య సంభ్రమాలలో ముంచెత్తే పోరాట చిత్రాలనుగాని, పెద్ద నటీనట సముదాయంతో ఊహాచిత్రాలనుగాని, నిర్మించుతున్నారు. వీరు హాస్యం, వినోదం, చిత్ర నిర్మాణానికి సూత్రాలుగా భావిస్తున్నారు. అంతే కాని షాహుకారు, దేవదాసు, పల్లెటూరు, పేదరైతు, సంసారంలాంటి ఉత్తమచిత్రాలు నిర్మించి ప్రేక్షకులలో మానవత్వాన్ని పెంపొందించే ప్రయత్నం చేయుటం లేదు. వాస్తవిక చిత్రాలను తీయుటంగాని, చౌకలో చిత్రాలను తీయుటంగాని లేదు. తమ స్టూడియోలలో అదనపు ఉత్పత్తిగా (*Bye Product*) 2 రీళ్ళ హాస్య, విద్యా, డాక్యుమెంటరీ ఫీచర్లు తీసి ఎమెచూర్సుని ప్రోత్సహించి కొత్తమార్గాలను పరిశోధించటం లేదు. 17 వేల అడుగుల చిత్రాలు తీయాలని, తమ పేరువింటే ప్రేక్షకులు రావాలని భావి

స్తున్నారు. ప్రేక్షకుల అభిరుచిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం లేదు. హాలీవుడ్ లాగా ప్రతి స్టుడియో ప్రతివారం ఒక సైకురీలును, చిత్రాన్ని యివ్వటానికి ఉత్పత్తిస్థాయిని, వేగాన్ని పెంచటానికి ప్రయత్నాలు జరగటం లేదు. పరిశ్రమలో యీ నాడు వచ్చిన మేధాదారిద్ర్యం అనండి, లేక వెనక్కి నడిచే మనస్తత్వం అనండి, దాన్ని తొలగించుకోగల సాధనసంపత్తి వున్న స్టుడియో నిర్మాతలు పూనుకోవటం లేదు. దీనికి కొంత కారణం కేంద్రీకృతమైన మూలపరిశ్రమ లక్షణాలు ఈ పరిశ్రమకు లేకపోవడమే కావచ్చు. సరస్వతీ టాకీసు లిమిటెడ్, సారథీ ఫిలిమ్సు లిమిటెడ్, పూర్ణా పిక్చర్సు లిమిటెడ్, విజయా ప్రొడక్షన్సు లిమిటెడ్ వాహినీ పిక్చర్సు లిమిటెడ్ లాంటి కంపెనీలు తప్ప వేరే విజయవంతముగా నడిచిన లిమిటెడ్ కంపెనీలు చాలా కొద్ది.

అనుభవం వున్న నిర్మాతలు

వీరు నిర్మాణకాలం పొడిగించినా కొంతవరకు భావపూరితములైన చిత్రాలను తీస్తున్నారు. వాహినీ వారి పెద్దమనుష్యులు, ప్రకాశ్ వారి దీక్ష, రాజరాజేశ్వరివారి పేదరైతు, వినోదావారి దేవదాసు మొదలైనవి యిందుకు ఉదాహరణలు అలాగే బంగారు పాప, అన్నదాత, సంతానం, కన్యాశుల్కం చిత్రాలలో పైన వివరించిన లక్షణాలు వుంటాయని ఆశించవచ్చు. వీరు చిత్రాలకు సామాన్యంగా ఉత్తమ సాహిత్య కథలను ఆధారంగా తీసుకొంటున్నారు. వీరి చిత్రాలలో మంచి సంగీతాన్ని పెడుతున్నారు. పెద్దమనుష్యులలో తెలుగు పల్లెపాటల ట్యూనులు ప్రజలలో ఎంతో విరివిగా వ్యాపించాయి.

వ్యక్తి నిర్మాతలు

వీరి విషయం చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. వీరి పెట్టుబడులు చాలా పరిమితాలు. వీరు తమ శ్రమనుకూడా పెట్టుబడుల క్రిందకు మార్చుకొంటారు. పరిశ్రమ స్వభావాన్ని బట్టి, వీరి ఆర్థిక పరిస్థితులనుబట్టి క్రిందివిధంగా విభజింపవచ్చును.

బి. యస్. రంగా, రెహమాన్, బోళ్ల సుబ్బారావులాంటి టెక్నీషియన్ నిర్మాతలు, వినోదా, సాహిణీలాంటి కోపరేటివు నిర్మాతలు, శ్రుతి అంజలి, కాంచన, రామారావులాంటి నిర్మాతలుగా మారిన నటీనటులు, ఉత్తమ ఆదర్శాలతో పరిశ్రమలోనికి వచ్చినవారు.

వీరు పరిశ్రమలో కొత్త సంప్రదాయాలను పెంపొందించారు. నిర్మాణంలో వేగం పెంచివేశారు. పరిశ్రమలోని దుస్థితిని అర్థంచేసుకున్నారు. పబ్లిసిటీకోసం, డిస్ట్రిబ్యూటరుకోసం, ఒకరో, యిద్దరో పేరుపొందిన నటీనటులను తీసుకుని చిత్రనిర్మాణాన్ని తక్కువ సెట్లతోను, తక్కువ కాల్ షీట్లతోను పూర్తి చేస్తున్నారు. వాస్తవికతకు దూరంగా పోతే నిర్మాణపు ఖర్చులు పెరుగుతాయని గ్రహించారు. స్క్రిప్టు పైన ఎక్కువ కాలం వినియోగించలేక, కొంత సెక్యూరిటీ కావాలి గనుక (*Minimum Guarantee*) విజయవంతముగా నడిచిన ఇతర భాషాచిత్రాలను, సెంటిమెంటు చిత్రాలను ఆధారంగా చేసుకుని చిత్రాలు నిర్మించుతున్నారు. ఉత్తమసాహిత్య కథలను ఆధారంగా చేసుకొంటున్నారు. డిస్ట్రిబ్యూటర్లు కూడా తక్కువ పెట్టుబడులు కావటంతో, ఆర్థిక సహాయం చేస్తున్నారు. వీరు పేరున్న టెక్నీషియన్ల కోసం కాలం వృధాపరచటం లాభం లేదని గుర్తించారు. ఈ దృక్పథం పరిశ్రమ పెంపుదలకు ఎంతో సహాయకారిగా తయారయింది.

అయితే నియమితములైన పెట్టుబడులు కావటంతో నిర్మాణవేగం పెంచటంవలన కొన్ని చెడు లక్షణాలు కూడా పరిశ్రమలో ప్రవేశించాయి. ప్రతి టెక్నీషియను ఎక్కువ కాల్ షీటు పనిచేయటం, ఖర్చులనుగురించి తాపత్రయపడటంతో చిత్రస్థాయి కొంత నష్టపడుతోంది. ఇతర భాషాచిత్రాల అనుకరణకే తాపత్రయపడటంవల్ల తెలుగు జాతీయతను, తెలుగుజాతి ప్రత్యేకతలను, చిత్రాలలో జొప్పించటం వారికి చాలా కష్టం అవుతున్నది. పెద్దమనుష్యులలోవలె తెలుగుజాతి సొంపును పోషించిన పల్లెపదాలు, మల్లేశ్వరిలాగా మన కళాభిరుచిని ప్రదర్శించే చిత్రాలు తీయాలంటే స్క్రిప్టు దశలో ఎంతో తీవ్రమైన కృషి, పరిశోధన, పరిశీలన, అవసరం.

ఈ సందర్భములో మన పరిశ్రమలోని ప్రముఖుల సంఖ్య హాలీవుడ్ సంఖ్యలతో పోల్చిచూద్దాం.

		తెలుగు	హాలీవుడ్.
నిర్మాతలు	...	86	26 + 20
దర్శకులు	...	42	221 సీనియర్లు
			228 జూనియర్లు
రచయితలు	...	28	1000
కళాదర్శకులు	...	12	159
సంగీత దర్శకులు	...	17	—
నటీనటులు }	...	150	40000
ఎక్స్ట్రాలు }	...	1000	

*హాలీవుడ్‌లో సంగీత దర్శకుల సంఖ్య ప్రత్యేకంగా లేదు గాని, ఫిలిం సంగీతం యిచ్చేవారి సంఘంలో సభ్యులు 1,80,000 మంది. కంపోజర్ల సంఘంలో 159 మంది వున్నారు. దీనినిబట్టి సంగీత దర్శకుల సంఖ్య ఎంత ఎక్కువగా వుండేది అంచనా చేయవచ్చును.

పై సంఖ్యలు పరిశీలించితే మన పరిశ్రమలోని ప్రముఖుల సంఖ్యలోని విపరీతాలు అర్థమవుతాయి. స్క్రిప్టు రచయితలకంటె డైరెక్టర్ల సంఖ్య ఎక్కువగా వుంది. స్క్రిప్టుదశలో తీవ్రమైన పరిశీలన, పరిశోధన వున్నప్పుడే షూటింగు పూర్తి స్వభావం, పని విభజన, కార్యక్రమ ప్రణాళిక పూర్తిగా కాగితంపై తయారవుతాయి. సెట్టుపైకి వచ్చి రిహార్సల్సు చేయటం, డైలాగులు మార్చటం, లైటింగు, కెమెరా యాంగిల్సు ఏర్పాటుచేయటంలాంటివి జరుగకూడదు. ఈలాంటి మార్పులు చేయటంవల్ల నిర్మాణపు ఖర్చులు పెరుగుతాయి అన్నిటికంటె ముఖ్యమైనది యీ మార్పులలో కథాగమనం నాశనమౌతుంది.

సీక్వెన్సులు, మారిపోవటంతో రచయిత "ఫార్ములా" ప్రకారము వ్రాసినప్పుడు కూడా కథాగమనాన్ని అదుపులో వుంచుకోవటం దుర్లభం. సరియైన ప్లానింగు స్క్రిప్టుదశలో జరుగకపోవటం తక్కువ ఖర్చు అయ్యేదశలో జాగ్రత్తలేకపోవటం, ఎక్కువ వ్యయమయ్యే షూటింగుదశలో హడావుడిగా జరగటం మన పరిశ్రమస్వభావమయింది. స్క్రిప్టునుబట్టి డైరెక్టరు షూటింగు జరపటం కాకుండా షూటింగుదశలో వున్న కొద్దికాలంలో హడావుడిగా డైలాగులు మార్చటం, సీక్వెన్సులే మార్చటం, తనకు యిష్టం వచ్చినవాటిని కలుపుకోవటం ఆఖరు నిమిషంలో డిస్ట్రిబ్యూటరు కోరే డాన్సులు, హాస్యం అతికించటం, కొందరు దర్శకులకు స్వభావంగా మారింది. చిత్రంలో కథాగమనం సరిగా వుంచటంకూడా ఒక గొప్పవిషయంగా ప్రేక్షకులు, విమర్శకులు అనుకొనే అధోగతికి చిత్ర పరిశ్రమను తీసుకుపోయారు. చిత్రానికి ప్రధానంగా వుండవలసిన దామాలు ప్రాథమిక లక్షణాన్ని ఎంతో ఆశ్చర్యపడే విధంగా మార్చివేశారు.

* హాలీవుడ్ సంఖ్యలు *International Motion Picture Almanac 1945 - 46* నుండి తీసుకోబడ్డాయి. తెలుగు సినిమా సంఖ్యలు తెలుగు ఫిలిం డైరీనుండి తీసుకోబడ్డాయి.

ఈ కారణాలవల్ల ఒకేమాదిరి జానపద గాథలు కుటుంబ గాథలు, అనేకం వచ్చాయి. పరిశ్రమ అధోగతికి దారితీశాయి. కాల్‌షీట్ కార్యక్రమంలో పూర్తిగా పనిని విభజించకపోవటంతో కాల్‌షీటులో 2 లేక 8 షాట్లకంటే ఎక్కువ తీయటం గొప్పగా తయారయింది. ఈ మధ్య జపాను పర్యటన గావించి వచ్చిన పటేల్ మాట్లాడుతూ జపానులో రోజుకి 70 షాట్లవరకు తీస్తారని, 15 రోజులలో చిత్రం షూటింగు పూర్తి అవుతుందని షూటింగు స్క్రిప్టు ప్రింటుచేసి నటీనటులకు, టెక్నీషియన్లకు యిస్తారని వివరించారు.

సెట్టుపైకి వచ్చిన తరువాత మార్పులు చేయరని దీనినిబట్టి గ్రహించవచ్చును. నేడు చిత్రనిర్మాణానికి సర్వాధికారిగా తయారైన దర్శకుడు రచయితను వాడుకోకుండా అణచివేయటం జరుగుతోంది. షూటింగు స్క్రిప్టు అంటే డైలాగులన్న భావం పెరిగింది. అదే పరిస్థితులలో వ్యాపారదృష్టి లేకుండా, అనుభవం లేకుండా పరిశ్రమచేత ఆకర్షింపబడిన ధనికయువ నిర్మాతలు పరిశ్రమ ఒడిదుడుకులకు కారణభూతులయ్యారు. అర్థంలేని అనుకరణవలన పరిశ్రమ చాలా దెబ్బతింది. ఈ పరిస్థితిని వ్యక్తి నిర్మాతలు చాలావరకు మార్చారు. విజయవంతంగా నడిచిన ఇతర భాషాచిత్రాల్ని అనుకరించటంచేత తక్కువ సెట్లు, కాల్‌షీట్లతోను అయ్యే ప్రఖ్యాత సాంఘిక గాథలను (స్టుడియో నిర్మాతలులాగా పౌరాణిక గాథలు కాకుండా) ఎన్నుకొని స్క్రిప్టు దశలోనే సర్వం నిర్ణీతం చేసుకుంటున్నారు. వీరి చిత్రానికి ఆధారముగా తీసుకోబడ్డవాటికే కొంత శ్రమించినందువలన వీరికి కొంత ఖర్చు తప్పింది.

పరిశ్రమ పరిస్థితిని అర్థంచేసుకొన్నా వ్యక్తి నిర్మాతలు ఎమెచూర్సుని ప్రోత్సహించలేక పోతున్నారు. నిర్మాణంలో వేగం పెంచాలంటే అనుభవంవున్న నటీనటులు పనిని తొందరగా ముగించుతారు. ఎమెచూర్సు ఎక్కువకాలం తీసుకోవటం వలన కాల్‌షీట్ల ఖర్చు పెరుగుతుంది. ఈనాటి ఆర్థిక పరిస్థితి దీనికి ప్రతిబంధకముగా ఉంది. కుతూహలం వున్నా నియమితములైన పెట్టుబడుల కారణంగా ఎమెచూర్సుని ప్రోత్సహించటంలేదు.

సంక్షోభసమయంలో పరిశ్రమలో 'మొనాపలి' నిర్మాణం

చలనచిత్రపరిశ్రమలో 'మొనాపలి' స్వభావం మిగతా పరిశ్రమలలాగా లేదు. పెట్టుబడులు, ప్రయి

పేటు లిమిటెడ్ కంపెనీలు, జాయింటుస్టాకు కంపెనీలలో షేర్ల రూపంలో కాకుండా వ్యక్తిగతంగా నియమిత పెట్టుబడులు కలిగిన వ్యక్తులు సరాసరిగా పరిశ్రమలో ప్రవేశించుచున్నారు ఈలాంటివారిని ఆకర్షించటానికి స్టుడియోలు, టెక్నిషియన్లు, నటీనటులు కృషిచేస్తున్నారు. కనుక నే పనివున్న స్టుడియోలలో పని అధికమవటం, రెండు స్టుడియోలు చేతులు మారిపోవటం, కొరల రెండు స్టుడియోలలో యితరులు చిత్రాలు తీయకపోవటం జరుగుతున్నది. పెద్దస్టుడియోలకు అంటిపెట్టుకున్నవారు తొందరగా చిత్రాలు తీయటం జరుగుతోంది. స్టుడియోవారు వ్యక్తినిర్మాతలతో చేతులు కలిపి చిత్రాలు నిర్మించటం ఆంధ్రుల స్టుడియోలు చేయటంలేదు స్టుడియోలపై అధికారంలేని వ్యక్తినిర్మాతలకు కాల్‌షీటు ఆయా స్టుడియోలలో సరిగా యివ్వకపోవటంతో కొన్ని సందర్భాలలో నిర్మాణం ఆలస్యమయిన సంఘటనలుకూడా ఉన్నాయి ఈ కారణాల వల్ల తెలుగు వ్యక్తినిర్మాతలు తమిళ స్టుడియోలలో చిత్రాలు నిర్మించటం గమనార్హం.

డిస్ట్రిబ్యూషను

1950 లో 57 సంస్థలుంటే 1953/54 సంవత్సరానికి 7 సంస్థలు తప్ప మిగతావన్నీ శీర్ణావస్థకు వచ్చాయి. చిత్రాలను వివిధకేంద్రాలలో విడుదల చేయటానికియూ 7 సంస్థలు తప్ప మిగతా సంస్థలకు చాలా క్లిష్టత ఏర్పడ్డది. క్రొత్తగా పరిశ్రమలోనికి డిస్ట్రిబ్యూటరుగా గాని, ప్రదర్శకుడుగా గాని రావటం చాలా కష్టంగా తయారయింది.

ప్రదర్శన

పేరున్న డిస్ట్రిబ్యూటరుకు సంబంధించిన వారికే చిత్రాలు దొరకటం మిగతా ముఖ్య కేంద్రాలలోని ప్రదర్శకులకు రోజు ఖర్చులుకూడా రాకపోవటం గమనించవచ్చు అయితే ప్రదర్శకుల గొలుసుకట్టు (*Chain theatres*) పెరగలేదు. 1950 కి పూర్వం వచ్చిన సరస్వతి సర్క్యూట్ వారికి 4 కేంద్రాలలోను, కాజా వెంకట్రామయ్య సర్క్యూట్‌కు 4 కేంద్రాలలోను, నిడమర్తి సర్క్యూట్‌కు 3 కేంద్రాలలోను, బి. క్లాసు కేంద్రాలలో పోమరాజు సర్క్యూట్‌కు 6 కేంద్రాలలోను, తప్ప వేరే థియేటర్లకు గొలుసుకట్లు, ఇతర రాష్ట్రాలలాగా మన రాష్ట్రంలో పెరగలేదు. కాని వ్యాపారానుభవంలేని ధనికులు ముఖ్యంగా యువకులు ప్రదర్శకులుగా చాలామంది వచ్చారు. తీవ్రమైన పోటీ తీసుకువచ్చారు. ఎక్కువ హాలులువున్న కేంద్రాలలోనే హాలులు నిర్మించటం, ఒక టూరింగు హాలు సరిపోయే కేంద్రములో వేరొక టూరింగు ఏర్పాటు చేయటం ద్వారా పరిశ్రమలో తికమకలకు దారితీశారు. ఉదాహరణగా విజయవాడలో 11 హాలుల నిర్మాణం. ప్రదర్శన పద్ధతుల అభివృద్ధి మానివేసి పోటీ పెంచివేశారు. 1950 నుండి 53 కల్లా వీరి పోటీ పరిశ్రమపై ఎంతో దెబ్బతీసింది 1950 లో 327 టూరింగులు, 131 పర్మనెంటు హాలులు వుంటే 1953 లో 227 ఎక్కువ పెట్టుబడులు అవసరమైన పర్మనెంటు హాలులు పెరిగాయి. తక్కువ పెట్టుబడులు అవసరమైన టూరింగుల సంఖ్య 101 కి పడిపోయింది. పర్మనెంటు హాలుకు 1,50,000 రూపాయిలు అవసరమైతే టూరింగుకు రూ 30,000 సరిపోతుంది టూరింగులు చాలావరకు చిన్నచిన్న కేంద్రాలలో ఉండేవి. అదనంగా వచ్చిన పర్మనెంటు హాలులు ముఖ్య కేంద్రాలలో మాత్రమే వచ్చాయి కాని చిన్న కేంద్రాలలో రాలేదు. అందువల్ల చిన్న కేంద్రాల సంఖ్య బాగా దిగజారిపోయింది 1950 లో సుమారు 400 కేంద్రాలు వుండేవి. 1953 లో 170 కేంద్రాలకు మించిలేవని గుర్తించితే పరిశ్రమకు వచ్చిన కొత్తసమస్యలు, హద్దులు అర్థమవుతాయి 1950 సంవత్సరములో ఎ, బి, సి, ముఖ్యకేంద్రాలు అయిన తరువాత 50 వేల రూపాయిలవరకు ప్రతి చిత్రం మీద వచ్చేది. అటువంటి పరిశ్రమలో నేడు 10,000 రూపాయిలుకూడా రావటంలేదు. ప్రదర్శన కేంద్రాలు నిర్తితమవటంతో చిత్రాలను ముఖ్యకేంద్రములకోసం తీయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిత్రాలలో పట్టణ వాతావరణము పెరగసాగింది. ఒకప్రక్క ఆర్థికపరిస్థితి పిడికిలిలో వున్న పరిశ్రమలో వేరొక ప్రక్క 'మొనాపలీ' పెరుగుతోంది.

అయినా పరిశ్రమ యీనాటి పరిస్థితిలో మొనాపలి ఎంత పెరిగినా వ్యక్తినిర్మాతలు పూర్తిగా పోరు. దీనికి ముఖ్యంగా చెప్పుకోదగ్గ కారణం వారి నిర్మాణ సూత్రాలు. వ్యక్తినిర్మాతలు చౌకలో కొద్ది ఖర్చులతో చిత్రాలు తీయటం, వారు టెక్నిషియనులు, నటీనటులు కోపరేటివ్ పద్ధతిలో తీసేవారు కావటం వలన వారు తమ శ్రమను పెట్టుబడులుగా వాడటం వలన వారు పరిశ్రమలోంచి పోరు. కనుక స్టుడియో నిర్మాతల పోరాటచిత్రాలు, ఊహాచిత్రాలుమాత్రమే కాకుండా వ్యక్తిగత నిర్మాతల సాంఘిక చిత్రాలు, సెంటిమెంటు చిత్రాలు మన పరిశ్రమలోకి వస్తాయి.

చలన చిత్రపరిశ్రమకు గల ఆర్థికాది వివరాలు

ఇతరపరిశ్రమలలోనూ వ్యాపారాలలోనూ పెట్టుబడికి సం॥కె 3, 4 రెట్లు వ్యాపారం జరుగుతుంది. కాని యీ పరిశ్రమలో అది వీలు కావటం లేదు. మిగతా పరిశ్రమలకు బ్యాంకు ఏర్పాటులు, తాకట్టు ఏర్పాటులు వుంటాయి. కాని ఫిలిం పరిశ్రమలో అది వీలు కావటం లేదు. కేంద్రీకృతమైన పరిశ్రమగా పెంపొందకపోవటంవల్ల యీ యిబ్బందులు మరీ ఎక్కువయ్యాయి. స్టూడియోలపైన 1/10 కూడా బ్యాంకు సౌకర్యాలు దొరకవు. ప్రదర్శనశాలలపైన ¼ కూడా బ్యాంకు సౌకర్యాలు దొరకవు. 2 లక్షల రూపాయిలతో హాలు నిర్మించితే చివరిదశలో అవసరమయ్యే రూ 25,000 కూడా బ్యాంకులు తాకట్టుమీద డబ్బు యివ్వవు. చిత్రం అంతా నిర్మించబడి ప్రింటులను తాకట్టుపెట్టినా బ్యాంకులు ఏమీ డబ్బు యివ్వవు. లక్షలకొద్ది డ్రాఫ్టులను వివిధకేంద్రాలలో రిప్రజెంటేటివులు ప్రదర్శకులదగ్గరవచ్చే డబ్బును జమ కట్టుతున్నా, పెద్ద టరన్‌వోవరు చూపుతున్నా, డిస్ట్రిబ్యూటర్లకు వోవర్ డ్రాఫ్ట్ బ్యాంకులు యివ్వవు. దీనికి ముఖ్య కారణం యీ పరిశ్రమలో నమ్మకం (*Minimum Guarantee*) లేకపోవటం. చిత్రం విజయవంతమయ్యేది లేనిది తెలియకపోవటం. స్పెక్యులేషన్, గుర్రపు పందాల స్వభావం, లక్షణాలు కలిగి కేంద్రీకృతం కాని పరిశ్రమ అని గ్రహించితే ఆశ్చర్యం కలిగించే ఈ పరిస్థితులు అర్థమవుతాయి. ఈ పరిశ్రమలోని చాలామంది వ్యక్తులు ఇతర పరిశ్రమలు, వ్యాపారాలలోలాగ మాట నిలబెట్టుకోరు. అందువల్ల నూటికి రూ 3. నెలకు వడ్డీకి లేవటం చిత్రాలపై రాయల్టీలను యివ్వటం అలవాటయిపోయింది. డిస్ట్రిబ్యూటర్లు ఎక్కువ వడ్డీలకు ప్రయివేటు వడ్డీ వ్యాపారస్తులదగ్గర అప్పులు తేవటం సహజమయిపోయింది. ఇతర పరిశ్రమలవారు యీ పరిశ్రమపై వాడే హాస్యపూరితములైన మాటలు ఎన్నో వున్నాయి.


చిత్రాల విడుదలలోని అరాచకం

పైన వివరించిన ఆర్థికములైన చిక్కులు కారణంగానే చిత్రాలను విడుదలచేయటంలో అరాచకం పెరిగింది. ఒకోసారి జానప చిత్రాలను విడుదలచేయటం చిత్రం దెబ్బ తింటుందని తెలిసికూడా విడుదల చేయటం ఈ ఆర్థికపరిస్థితుల గొడవలు కారణంగానే.

పనివారి స్థితి

ఫ్యాక్టరీల చట్టంగాని, షాపు అసిస్టెంటు చట్టం కాని ఏదీ కూడా అమలు జరగటం లేదు. పనివారలకు సెక్యూరిటీ లేదు. గ్రాట్యుయిటీ, ప్రావిడెంటు ఫండు ఏర్పాటు లేదు. పరిశ్రమలో పనివారల పనులు, ఉద్యోగాలు ఎప్పుడు వుంటాయో ఎప్పుడు వూడతాయో ఎవరికీ తెలీదు. ఇది కూడా పరిశ్రమ ఆర్థిక లక్షణాన్ని తెలియజేస్తుంది.

ఆర్థికపరిస్థితులతో పెనవైచుకొని వివిధ ధోరణులతో పెరుగుతున్న చలనచిత్ర పరిశ్రమ ముందు ముందు చక్కటి మేధావుల్ని సృష్టించుతుంది. స్వతంత్ర గాథలు, వాస్తవిక చిత్రాలు, సెంటిమెంటు చిత్రాలు, చాలా వస్తాయి. హిందీ ట్యూనుల కాపీలు కాకుండా తెలుగుపదాల సొంపుతో మేళవించుకొంటూ ట్యూనులు వస్తాయనటానికి ఇటీవలి చిత్రాలను కొన్నిటిని ఎత్తి చూపవచ్చును. అదనపు ఉత్పత్తి (*Bye Product*) గా 2 రీళ్ల చిత్రాలు రావాలసిన స్థాయిలోనికి పరిశ్రమవస్తోంది. కనుక అనేకమంది క్రొత్త టెక్నీషియన్లు, నటీనటులు వస్తారు. ఆంధ్ర చిత్రాలకు ఇతరరాష్ట్రాల మార్కెటుతగ్గినా దేశీయమైనమార్కెటు పెరగటానికి అవకాశముంది, కనుక పరిశ్రమ పెరగటానికి ఎంతో అవకాశముంది. నిర్మాణపు ఖర్చులు మద్రాసులో పెరగటంచేతను ఇతర భాషారాష్ట్రాలైన మహారాష్ట్ర బెంగాలులలోలాగా చౌకలో చిత్రాలు రావలసిన ఆవశ్యకత వున్నందువల్లనూ ఆంధ్రదేశంలో స్టుడియోల నిర్మాణానికి అవకాశం వుంది. తగ్గిపోయిన ప్రదర్శనశాలలను పెంపొందించాల్సిన అవసరం ఎంతో వుంది. తక్కువ పెట్టుబడులతో తయారయ్యే 16. మి. మి. ప్రొజక్టర్ల థియేటర్లు ప్రతి గ్రామంలో రావటానికి మార్గాలు పరిశోధించాలి. అప్పుడు ప్రింటు ఖరీదు 2000 రూపాయిల నుండి 350 రూపాయిలకు తగ్గటంతో పెట్టుబడులు తగ్గి పరిశ్రమకు అదనపు ఆదాయం (*Surplus*) రావటానికి అస్కారం ఏర్పడుతుంది. నిర్మాతలు కూడా ఒక షెడ్యూలు ప్రకారం నియమితకాలంలో చిత్రాలను నిర్మించటానికి ప్రయత్నించినపుడు విడుదలలోని అరాచకం మొదలైనవి పోతాయి. పరిశ్రమ స్వభావాన్ని లక్షణాలను అర్థం చేసుకున్నప్పుడు సినిమా పరిశ్రమ ఆంధ్రదేశంలో చక్కగా అభివృద్ధి చెందటానికి ఎంతో అవకాశం వుంది.


ప్రతిదినము మీరు మలినము లోని క్రిములనుండి అంటు రోగమును పొందే ప్రమాదమున్నది
లైఫ్‌బాయ్‌తో ఈ క్రిములను కడిగివేసి మిమ్ములను మీరు ప్రతిదినము కాపాడుకొనండి
లైఫ్‌బాయ్ యొక్క "రక్షక నురగ" మీ ఆరోగ్యమును కాపాడును
లైఫ్‌బాయ్ సబ్బు
ప్రతిదిన మలినములోని క్రిములనుండి మిమ్ములను కాపాడును
LIFEBUOY SOAP
LIFEBUOY SOAP
LIFEBUOY SOAP
ఇండియాలో తయారుచేయబడినది
L. 248-X52 TL

అతను ఇక రాడు

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

చంద్రరావు శివాలయానికి వెళ్ళి, పరమేశ్వరదర్శనం చేసుకొని, చిల్లరదేవుళ్ళకు మ్రొక్కి, నవగ్రహ ప్రదక్షిణ చేస్తూంటేగా ఎదురయింది శశిరేఖ. చేతిలో వెండిపూలసజ్జా, చెవిలో తులసీదళమూ, తడిసిన మల్లెమొగ్గలావున్నదామె. సెలవులకు ఇంటికొచ్చింది గావును అనుకున్నాడు చంద్రరావు. అతనికీ ఆమెకీ సంబంధం నిశ్చయమై పదిహేనురోజులయింది. పలకరిద్దామా అనుకున్నాడు. కాని అంతలో సిగ్గుల రామచిలక అయిపోయిందామె. ధ్వజస్తంభం పక్కనించీ తలవంచుకొని వెళ్ళిపోతూ తనవంక చూస్తుండానే "ఒక్కమాట! ఇట్లా వస్తావా?" అని సాగిపోతూంది శశిరేఖ. చివుక్కుమన్న దతనికి. బి. యే. చదువుతోన్న తనకి నిశ్చయమైన పోక ప్రౌఢ అంత యేకాంతంగా తారసిల్లితే ఏదో పోకవంకని పలకరించాలిసిన చాకచక్యం తనకి లేకపోగా ఎదురు సిగ్గుల తెర చీల్చుకొని ఆమే తనని పలకరించేసరికి తల కొట్టినట్టయిందతనికి. సరే—ఇక తప్పేదుంది గనకనా — గంగిగోవులా కూడాపడ్డాడు. వెనకోతల గుడిమంటపం మెట్లమీద కూర్చున్నా రిద్దరూనూ. అంతా నిశ్శబ్దంగా వున్నది. ఊరిచివర పంటకాలవ పక్కనే వుంది శివాలయం. సెజ్జలోవున్న శంఖుపుష్పాలూ పూకబంతిపువ్వులూ విడదీస్తో నుతారంగా మాటలకు దిగిందామె.

"నిశ్చయమయిందని నీకయినా తెలిసిందా బావా?"

"అదేమిటి? నీకు తెలియదా యేం?"—నెరజాణలా వుందే! ఇదో యుక్తిగావును!

శశిరేఖ మేనమామపోషణలో వుంది. తల్లీ తండ్రీ లేరు. చదువుకున్న పిల్లగదా! 'పెళ్ళి నిశ్చయించాము అని చెప్పనక్కర్లే?—లాంఛనప్రాయంగానైనా? 'ఒక్కసారి పెద్దవాళ్ళకు మరు బంపవు' అనుకున్నాడు.

"అయితే యిప్పుడేమంటావు?"

"నా కిష్టం లేదు."

పిడుగు పడినట్టయిందతనికి. తనంటే ఇష్టం లేదట! యీ దొరసానికి! స్కూల్ ఫైనల్ చదువుతోందిగా గుంటూరులో. అప్పుడే యే లండను దొరతో పెళ్ళి చేసుకోవాలనుకొంటోంది గావును. పౌరుషం బుస్సున పొంగుకొచ్చింది. తమాయించుకొన్నాడు.

"అయితే అట్లా చెప్పెసెయ్. ఇప్పుడు మునిగిపోయిందేముందీ?"

చక్కాపోతున్నాడు. తన నిరుత్సాహమూ, ఉక్రోషమూ ఎక్కడ పనికడుతుందోనని గుండె పీకుతోంది. ఆదివె అందకత్తె అనీ చదువుకున్నదనీ— అట్లాంటి శశిరేఖ తనకి భార్య కాబోతోందనీ తను మురుస్తున్న మాట నిజం.

"నేనా చెప్పుకోవాలిసింది?" అంటోంది, ఉత్కంఠంగా.

ఆగాడు—

"నువ్వు కాకపోతే నేనా కలిపించుకోవాలిసింది—ఈ స్థితిలో — ఒక తెంపన తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తం నిర్ణయమైపోయి శుభలేఖ లచ్చయిపోయి—అటు మీ వాళ్లూ ఇటు మా వాళ్ళూ పెళ్ళిపనులలో సతమతమవుతూంటే తెగదెంపుల్ని అని యిప్పుడు "నా కిష్టం లేదు" అని చెప్పరచ్చావా నువ్వు?"

"మొగాడివుకదా అని నాలిక ఎట్లా తిరిగితే అట్లా తిప్పకు. ఈ తికమక లన్నిటికీ నువ్వే కారణం."

చిర్నవ్వు లేచింది. ఇదో తారాజువ్వ ప్రశ్నలా వుంది.

"నేనా?" తెల్లబోయాడతను.

"అవును—శశి బంగారుబొమ్మ—శశినే చేసుకుంటాను—శశి నా ప్రాణం అని నాలిక బుజాన వేసుకొని తిరగటం లేదూ నువ్వు?"

అతను నేరస్థుడల్లే నిలబడ్డాడు. ఆమె అభియోగం, అక్షరాలా నిజం. ఆమె కిష్టంలేదని తన కేమి తెలుసూ—ఇష్టం లేనంతమాత్రాన తనని అలుసు చెయ్యాలి గావును—పూరికే తోముతోంది. చేసిన గాయాన్ని సీమ పచ్చిమిరపకాయతో కెలుకుతోంది పైగా. కాని జవాబు లోకువగా యివ్వకూడదు, అనుకున్నాడు.

"అవును నా కిష్టముంది కాబట్టి యిష్టమని చెప్పుకున్నాను. నీ కిష్టం లేకపోతే లేదని చెప్పలేక పోయినావా?" అని విదిలించాడు.

"పన్నెత్తైనా అనలేదు"—మౌనం.

"అడగాలిట—బొట్టూ కాటుకా పెట్టి పిలిచి అడగాలి గావును."

"నువ్వంటే యిష్టముయింది కాబట్టి కనబడ్డ వాడికలా పనిగట్టుకుని వెళ్లి దారిన పొయ్యేవాడిల్లా జబ్బబట్టుకొని ఆపుచేసి మరీ ఫ్రూటలూగుతో..."

అదిగో మళ్ళీ విజృంభిస్తోంది. దీన్ని పెళ్ళి చేసుకుని ఆ పొగరు కాస్తా దించెయ్యాలనిపిస్తోంది. కాని తన పొగరే దించుతుందేమో! గోల!

"నీ బుర్ర అంతవరకే పోయింది మరి. నాకు నచ్చిందని నేను ఫ్రూటలూరుతో చెప్పకొంటే 'నాకు నచ్చలేదని నువ్వు మొహం చెండుకుంటూ చెప్పకో లేకపోయావా?'—కచ్చగా అన్నాడు.

"నిశ్చయం చేస్తారని అనుకోలేదుగా నేను. అంచేత నా కిష్టంలేదు అని చెప్పాలిసిన ఆగత్యమూ నాకు పట్టలేదు."

"అనుకుంటే వాల్ పోస్టరమీద రాయించి అంటించేదానవు. పాపం! అవునా?"

"తప్పకుండానూ"

అన్న పొగరు! చురుకూ చురుకూ చూస్తోంది పైగా! ఏమి చేస్తుందో మరి!

"నాకు తెలిసిందిగాదు మరి. ఏమి చెయ్యమంటావు చెప్పు?" అన్నది అంతలో కోపం దిగమింగి.

"తెలియకపోతే తెలుసుకోవాలిసింది."

"మరిప్పుడు జరగాలిసిం దేమిటో అని" లాలనగా ప్రశ్నిస్తోంది.

"తెలుసుకోలేదు గనక అనుభవించండే" మళ్ళీ లేచాడు. రోగం కుదిరింది.

"కూచో మరి"—

కూచున్నాడు, ప్రమతగా—ఏదో దౌర్బల్యం ఏడిపిస్తోంది లోపల. వెళ్ళాలని లేదు. ఇష్టం లేకపోతే లేదని చెప్పెయ్యరాదూ తనవాళ్ళతో — దీనికి తన సలహా సంప్రతింపులు కావాల్నయేం?

"మీకు మాత్రం మక్కర్లేదండీ సార్ నా కిష్ట మున్నదో లేదో...?"

మళ్ళీ వెటకారాలకి దిగింది!

"నా కక్కర్లేదు", ఫుల్ల విరిచినట్టు మొహాన్ని కొట్టాడు. నిజానికి ఆమె యిష్టపడే ఉంటుందనీ అంచేతనే పెళ్ళికి ఒప్పందం జరిగిందనీ అనుకున్నాడతను. లేకపోతే స్కూలు ఫైనల్ చదువుతున్న పిల్లని, వయసొచ్చిన పిల్లని, ఆమె యిష్టానిష్టాలు కనుక్కోకుండా పెళ్ళి నిశ్చయం చేసి పారేస్తారని తనెల్లా అనుకుంటాడు?

"నీకక్కర్లేదూ?—పంకాలకు పోకు—నిన్ను చూచీ నీ అందం చూచీ మోహించానుకున్నావ్ గావును—అవునా?"

కస్సున లేచాడు—

"మాటలు తిన్నగా రానీ—ఆడదానవు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఎంత దూరమైనా వచ్చేది. నీ అంతస్తూ హద్దూ, చూసుకుని బుద్ధిగా మెలగడం నేర్చుకో—తెలిసిందా?"

"వాదం పెంచక నువ్వే ఏదో చెప్పి పెళ్లి ఆపు చెయ్యి—తెలిసిందా? నీ హితం కోరే చెపుతున్నా."

"నేను చెప్పను—చెప్పను.. ...ముమ్మాటికీ చెప్పను—నా కవసరం లేదు."

"ఇప్పుడేదోవిధాన ఆటంకం కలిపించకపోతే పెళ్లి జరిగిపోతుందో యేమిటో" అన్నది సగం స్వగతంగా.

"జరగనూ జరుగుతుంది" అన్నాడు తొణుకూ బెణుకూ లేకుండా—తనూ ఏడిపించగలనని ఆమెకి బాగా తెలిసేలా—

ఇక వెళ్ళిపోతోంది—ప్రాలసజ్జ అందుకొని, వెడుతూ వెడుతూ ఓ చిన్న విసిరింపు!

"తరవాత విచారించినా లాభం లేదుసుమా. నువ్వంటే యిష్టంలేని ఒక కన్యని, యిష్టంలేదని— మళ్ళీ చాటునా మాటునా కాదు—నీ మొహంమీద కుండ బద్దలు కొట్టినట్టు చెప్పుకొన్న ఒక కన్యని పెళ్ళిచేసుకుంటే రాగల ప్రమాదం రవంత వూహించుకోడం మంచిది."

అతని కోపం భగ్గుమంది. ఎంత మాటన్నదీ? సున్నితంగా దెబ్బకొట్టి తనూ లేచిపోవాలి.

"ఇదిగో అమ్మాయీ చెప్తా విను. ఇష్టంలేనిది నీకు. ఇష్టంలేదని చెప్పాలిసింది నువ్వు. ఆ కాలంలో ఆమాట చెప్పకపోగా నీ యిష్టమొచ్చినట్టు నాలిక పారేస్తున్నావ్; తప్పు నీది; అయినా మించిపోయింది లేదు ఇప్పుడైనా యిష్టంలేదని మీ వాళ్ళతో చెప్పు; చెప్పి పెళ్లి తప్పించు నీకూ నాకూ శుభం. నీ కిష్టమున్నా లేకపోయినా, ఎల్లాగో ఒకలాగు నిన్ను కవుగిట్లోకి బలవంతాన తీసుకుంటానని నా కేమీ లేదు అల్లా చెప్పవూ, చెప్పక బింకాలు పోతావూ, నేను మాత్రం చేసేదేమీ లేదు పెళ్ళి జరిగిపోతుంది. జరిగితీరుతుంది. ఆ తరవాత నిన్ను ఓ దాసీలాగానో, ఒక వుంపుడుకత్తెగానో చూస్తాను నిన్ను భార్యగా చూసెను—చూడలేను. ఏ స్కూలుమాష్టరుగానో ఏ ఆసుపత్రి నర్సుగానో చెలాయిద్దామని చూస్తున్నావు గావును. నీ బతుక్కి ఏ చిత్రాంగి వీధిలోనో, ఏ పత్తేకుగల్లీలోనో దుకాణం తెరవాలిసిన దుర్గతి పట్టిస్తాను. దానికో—రాగల ప్రమాదాన్ని వూహించుకోవాలి గదూ?"

చివాల్న లేచి సింహద్వారందాకా విసవిస నడిచాడు.

"ఒక్క మాట"

గిరుక్కున తిరిగి చూచాడు. వెక్కి వెక్కి యేడుస్తోంది పాపం! అల్లా దారికి రావాలి. కొంత స్థిమిత పడ్డాడు. లేకపోతే, పౌరుషాలు రెచ్చగొట్టి పని చేయించుకోవాలని చూస్తుందీ?

జాలి కలిగింది.

ఆ ధిక్కారంవెనక ఎంత బాధ, ఎంత ఆవేదన వున్నదో పాపం! తను కరిగిపోతున్నాడేమిటీ మందు బిళ్ళలా? మగాడి కీలకం గ్రహించిందా? గ్రహించి యాదృచ్ఛికంగా పేటు మారుస్తోందా? ఏమో దిక్కుమాలిన గోల—ఏమయినా, అతనిలో దెబ్బతిన్న మగతనం కోలుకుంది.

దగ్గరగా వెళ్లి నిల్చున్నాడు. కేలుదమ్ములతో కన్నీళ్లు తుడుద్దామా, అనుకున్నాడు. అగ్నిమీద గుగ్గిలం అవుతుందేమో—లేనిపోని కుమ్మరాం—అసలే ఈ అప్సరసకి తనంటే అయిష్టంట—

అరే—ఇంకా ఏడుస్తోందేమిటే? బావుంది తనేమి చేశాడనీ? వేరస్తుపెల్లే బాధపడ్డాడు. అతని కేమీ పాలుపోలేదు.

వంగి, "అమ్మాయీ, ఎందుకట్లా ఏడుస్తావూ?" అన్నాడు వోదార్పుగా. కన్నీళ్ళు గబగబా తుడుచుకుంది.

"నామాట ఎవరూ లెక్క చెయ్యరు బావా! నేను చెప్పినా, ఆగదీ పెళ్ళి" అన్నది గాద్గదికంగా."

"ఎంచేతా అని—అదీ నాకు పట్టుకుంట?" అని అడిగాడు —కొంత సమాధానంగా.

"నేనొక అనాథనని నీకు తెలియదా? మా అమ్మ చనిపోతూ నన్ను అయిదేళ్ళపసికందుని, మా మామయ్య చేతిలోవుంచి హరీ అన్నది. ఆ బరువు తన భుజాలమీంచి దించుకుంటున్నాడివాళ. నామాటకు విలువ ఏమి ఉంటుంది చెప్పు నువ్వన్నట్టే యిదివరకే ఏపని లేకపోయినావా యీ ఏడుపు అని రెండు మొట్టికాయలు మొట్టి పెళ్ళిపీటలమీద కూచోపెడతారు. కట్నాలూ కానుకలూ లేకుండా అతి చవుకగా నువ్వు దొరికావుగదా అని నన్ను వొదిలించుకోవాలని చూస్తున్నారు."

అదుగో—ఆ ఆఖరిమాటలు తనకెంత అవమానకరంగావున్నాయో తెలిసికోదు. అదీ వచ్చినచిక్కు. ఆమెకళ్లింకా మంచుతో నిండిన మల్లెపువ్వుల్లా వున్నాయి. ఆ కంఠస్వరంలో దీనత్వమూ, ఒక నిస్సహాయతా, ఒక్క మాటలో చెప్పాలంటే, ఆకర్షణ గల అబలాత్వ మేదో తళుక్కుమని స్ఫురించిం దతనికి.

ఆలోచించాడు.

"సరేలే, నేనే కలిపించుకుంటానులే, వెళ్లు" అని తలవంచుకున్నాడు. పూలసజ్జ చేతిలో పట్టుకుని వెళ్లిపోతోం దామె. మళ్ళీ చివుక్కుమన్న దతని హృదయం ఆ నిష్క్రమణలో, విచారం తప్ప, తనయెడల చూపాల్సిన కృతజ్ఞత గాని, వొక అపాయంనుంచి తప్పించుకొన్న ఆహ్లాదవైఖరి గాని, అవుపడదే? వెళ్లిపోతోంది శశిరేఖ—బ్రతుకే శూన్యమైపోయిన ట్లనిపించిం దతనికి—

రాత్రి 'షా' నాటకం చదివిన తరవాత లాంతరు తగ్గించి, రగ్గులో తలదూర్చి ఆలోచిస్తూ పడుకున్నాడు. చంద్రరావు. కారాలు కొట్టీ, పప్పులు వేయించీ, అప్పుడా లక్ష్మీ, ఇంట్లో అలిసి అంతా నిద్రపోతున్నారు. తనకి తల్లితండ్రులు చిన్నప్పుడే కరువయ్యారు. ఎటొచ్చీ, తన చదువూ పెళ్ళీ, పెత్తండ్రి రామయ్య కొంత పట్టించుకుంటున్నాడు. పోనూ, పోనూ తనతండ్రి పడిపోతూవున్న పూరిపాక వొకటి ఈయన కప్పగించాడని వినికిడి. అది అమ్మగా వచ్చిన నాలుగు రాళ్లు, తనకోసం వెచ్చిస్తున్నట్టు కనిపిస్తుంది. అది అంతనీ, ఇంతనీ తేల్చుకునేందుకు తనకు దమ్ములు లేవు; ఎవరూ చెప్పరు. తన చదువుకి చిల్లిగవ్వ ఖర్చు కావటం లేదు. స్కాలరుషిప్పులతో నే గడిపేస్తున్నాడు. ఇక బి. యస్. సి. సమాప్తి కావాలి. తను కాకివాడలో వారాలు చేసుకొని తింటున్నట్టు ఎవరికీ తెలియదు. తన పోషణా, తన విద్యాదికాలూ, సొంత ఖర్చుమీద భరిస్తున్నట్టూ, తన పెళ్లీ, తన ఆలనా పాలనా అంతా తనభుజస్కంధాలమీద నే పడివున్నట్టూ పెత్తండ్రి వీలయినచోటల్లా గప్పాలు కొట్టుకుంటూ పోతున్నాడు. అవునని తనూ తలవూపేస్తున్నాడు. లేకపోతే 'నిజం ఫలానా' అని విడమర్చి చెప్పుకుంటే, తనకే అప్రతిష్ఠ. తనకి వో యిల్లంటూ వున్నదనీ, స్నేహితులమధ్య రుజువుచేసుకుందుకు, ఏదో నాలుగురోజులు కాలక్షేపం చేదామని, సెలవులలో వచ్చాడు పెంటపాడు. తన పెత్తల్లికయినా తనమీద మమకారం అంతంత మాత్రమే. ఈ పరిస్థితిలో తను అంతంత కష్టపడి కుదిర్చిన సంబంధం, పెళ్ళిముహూర్తం నిశ్చయమయిపోయింతరవాత, పెళ్ళి ప్రయత్నాలు ఆఖరిఘట్టంలో పడుతున్న సమయంలో, ఇన్నాళ్ళా 'అప్సరసలాంటి పిల్ల, చిదిపి దీపం పెట్టవచ్చును' అని తను చెప్పుకొంటూ వస్తున్న పిల్ల, ఈనాడు 'నాకు నచ్చలేదు' అని ఎట్లా చెప్పడం. తన పెత్తండ్రి అసలే చండశాసనుడు. విరుచుకుని మీదపడతాడు. ఆయనంటే తనకి విపరీతమయిన భయం. ఆయనవల్ల తనకి వొరింగిందున్నా లేకపోయినా 'నా' అన్న అండకింద పనికొస్తున్నాడు.

ఒక వేళ తను సాహసించి 'శశిరేఖ నాకు నచ్చలేదు' అని చెప్పడానికి పూనుకున్నా, చుట్టుపక్కల వాళ్ళు, తన నోరే మూయిస్తారు. ఎవరూ నమ్మరు— సీరియస్ గా తీసుకోరు కూడా. ఆ అమ్మాయంటే పడి చస్తున్నాడాయిరి. ఆ అమ్మాయి ఫొటోలన్నీ తన క్లాసు పుస్తకాలలో సయితం, లోపలి అట్టలో భద్రంగా అంటించుకుని, దానికింద 'నా శశి' అని వ్రాసుకొని పేజీ కోమాగైనా, ఆ ఫొటోవంక చూచుకొని గాని, తరువాత పేజీకి వెళ్ళకుండా మిడుకుతున్నాడాయిరి. తను ఎంత పిచ్చివాలకంగా వ్యవహరించాడో తలుచుకుంటే, శశిరేఖకి తను అలుసయిన కారణం లీలగా గోచరించిందతనికి. ఇప్పుడు కూడా తనొక పిచ్చిధోరణిలో వున్నట్టే లెఖ్ఖ. ఇష్టంలేనిది అవిడకా! అట్లా స్పష్టంగా చెప్పి, పెళ్లి ఆపుచెయ్యవలసిన అవసరం ఆవిడకుండెగా, తనని నానామాటలూ అని, ఆఖరికి పంగనాచిలా బుడిబుడి దుఃఖాలుపోయి, కడివెడు కన్నీళ్లు కార్చి, ఇదేమిటో సర్దుబాటు చెయ్యమని తన నెత్తిన రుద్ది చక్కాపోయింది! సరేలే, అని ఆ ఘనకార్యం చేస్తానని వాగ్దానమిచ్చి, వీరాధివీరుళ్ళా వొచ్చేశాడూ తను! ఏమి సొగసుగా వుంది? ఆపిల్ల ప్రవర్తనగురించి ఏవో అనుమానాలు తన చెవికి సోకినట్టు, పెత్తండ్రికి చల్లగా వూదితేనో—ఈ దట్టాకారీ సంబంధం మన కెందుకురా బాబూ అని తెగతెంపులు చేసుకుంటాడు తప్పకుండా. సంప్రదాయమంటే ఆయన చెవి కోసుకుంటాడు కూడాను. తీవ్రంగా ఆలోచించాడు. తన పెత్తల్లి కొంత గయ్యాళి రకం. వదినకి సరేసరి నోట్లో నువ్వుగింజ దాగదు. వీళ్లు యీ రహస్యం యాగీచెయ్యకుండా వుంటారా? అందులోనూ, ఇందాకా వచ్చింతరవాత పెళ్ళి ఆగిపోయి, పుకారు పుట్టిందంటే, నడివేసంగిలో పూరిళ్ళమధ్య తాటాకుపాక అంటుకున్నట్టే ... ఇహను ఆపిల్ల భవిష్యత్తు చెప్పాలీ! భగ్గూ వెలుగూ. మెడకాయమీద తలకాయ వున్నవాడు తలవొగ్గడు. తనెంతో పవిత్రంగా ఎంచుకుంటూ వచ్చిన శశిరేఖ పేరు గోడలమీద కొంటెకోణంగుల రాతలలో, ఆకతాయి అల్లరిపేలాపనల్లో, ఇరుగుపొరుగువారి హేళనలో తగలబడిపోతుంటే తను సహించలేడు. మళ్ళీ ఏదో అజ్ఞానంలో పడిపోతున్నాడు. లేకపోతే ఈ శశిరేఖంటే తన కెందుకూ యింత అభిమానం? ఆవిడ ఏమయితే తన కెందుకూ? తన కష్టసుఖాలేమైనా పట్టించుకున్నదా, ఆవిడ. తరచి తరచి చూసుకోగా, ఈ శశిరేఖ తనది కాకపోయినా తనలో ఏదో అలజడికి కారణమవుతున్నట్టు గుర్తించాడతను. లేకపోతే తను అనుకోని ప్రేమాంకుర మేదయినా నిప్పురవ్వలా పనిచేస్తోందా లోపల? అతని గుండె ఝల్లుమంది. అంతే అయివుంటుంది. లేకపోతే ఈ గుంజాటన దేనికీ? తటపటాయింపు దేనికీ? తర్జనభర్జన దేనికీ? ఆపిల్ల తాలూకు

ఘాత, భవిష్యద్వర్తమానాలకు తను గార్డియనా? ఇంకా నయం ఎందుకిష్టం లేదు అని తను శశిరేఖ నడగలేదు. అడిగితే, ఫెళ్లున తననీ తన అందాన్నీ వర్ణించి చెప్పగలదు. కుమిలి చావాలిసొచ్చేది. అంత తెలివితక్కువ ప్రశ్న వేయనందుకు తనను తానే అభినందించుకున్నాడు. తనేమైనా స్వతంత్రుడా "మొన్న వచ్చింది, మరి యివాళ వచ్చలేదు అని కళాకళలుగా మాట్లాడి నెగ్గించుకు నేందుకు... "ఆపిల్ల నా మొహాన్నే చెప్పింది నేనంటే యిష్టం లేదని" అని పెత్తండ్రితో బయటపడదామా అనుకున్నాడు. అటు శశిరేఖ మేనమామకి ముక్కు మీద కోపం. సంప్రదాయానికి దెబ్బతగిలిందంటే ఎంతమాత్రమూ సహించడు. ఇష్టంలేకపోతే యింట్లో గుంభనగా చెప్పకోవాలా, విచ్చలవిడిగా "నువ్వు నా కక్కర లేదని" ముఖాముఖీ వరుడితోనే ఘర్షణకి దిగాలా, అని ఆమెని దండిస్తాడేమో? ఆ హింస తప్పకునేందుకే తనని ఆశ్రయించిందేమో శశిరేఖ. అంగాకా వస్తే 'నా కిష్టమేను' అని ఆమెచేత బలాత్కారంగా వొప్పించనూ గలడు. వొప్పకున్నట్టు చెప్పించనూ గల డాయన.

మరి ఇహ నీ పెళ్లి ఎట్లా తప్పించగలడో బోధపట్టం లేదు.

శశిరేఖా, తనూ పెంటపాడులోనే పుట్టి, పెంటపాడులోనే పెరిగారు. ఎటొచ్చీ నాలుగేళ్ళ నుంచీ తను కాకినాడలో కాలేజీ చదువులోనూ, ఆమె గుంటూరు మిషన్ హైస్కూల్లో పింతల్లి గారింట్లోనూ వుంటూవచ్చారు. అంచేత అన్యోన్యం చూచుకుందుకు అవకాశాలు సన్నగిల్లినా, తనకిమాత్రం శశిరేఖంటే ఆకర్షణ తగ్గలేదు. చిన్నప్పడు, 'బావ' 'బావ' అని పిలిచేది. తను శశీ అని పిలిచేవాడు. ఆ తీయని కల ఈనాడు ఇట్లా తారుమారయింది.

ఈ పెళ్ళిగాని తప్పిపోతే, మరి పెళ్ళిమాట తలపెట్టకూడదు అనుకున్నాడు. తనకి పిల్ల నివ్వడానికి, కాళ్ళు విరుచుకుంటున్నవారెవరూ లేరని తెలుసును. మొట్టమొదటిసారి తన అందంమీదా తన స్తోమతుమీదా తన వునికిమీదా ఒక ఏహ్యభావం కలిగిందతనికి. శశిరేఖ తనకి సుముఖంగానే వుంటుందని యాదాలాపంగా అనేసుకుని చక్కా వూరుకున్నాడు, తెలివితక్కువగా — అనుకుని యేమి లాభం? ఆమె రూపసి, చురుకైనపిల్ల. తన పరిస్థితిని అన్నివేపులనుంచీ, చీల్చి చూచుకొని వుంటుంది.

బహుశా; తనకి యిల్లూ వాకిలా, బలగమూ, డబ్బూ దస్కమూ, అందమూ చందమూ, దర్జానా? ఏ మాకర్షణ తనదగ్గర వుందని తనని మోహిస్తుంది శశి? ఇన్నాళ్ళూ ఏదో తన గొప్ప తను వూహించుకుని ధీమాగా బతికాడు. ఒక్క శశిరేఖ తృణీకరించగానే తన అవతారమేమిటో తన విలువ ఏమిటో, నిలువుటద్దంముందు నిలుచున్నట్టు తెలిసొచ్చిందతనికి. ఆ పరాభవంతో ఒక్కసారిగా కుంగిపోయాడు.

రాత్రి చాలా భాగం గడిచిపోయినట్టుంది. వీధిలో లైట్లు కుప్పన ఆరిపోయాయి. ఉపాయం దట్టున స్ఫురించిందతనికి. ఒక నిశ్చయానికి వొచ్చేశాడు.

* * * *

పెరట్లో కంచాలు కడిగి, పిల్లల మూతులు తుడిచి భోజనాలయినచోట నీళ్లు చల్లి, మామయ్యకు పొగాకుగొట్ట మందిస్తోంది శశిరేఖ. పోస్టుమేన్ ఏదో వుత్తరమిచ్చి వెళ్లాడు. రామచంద్రయ్య ఆ వుత్తరం చదువుకొని, ఎందుకనో దిగాలుపడి మడతకుర్చీలో కూలబడ్డాడు. శశిరేఖ గమనించింది. అదేమిటో మామయ్య చెప్పేదాకా ఆగాల్సిందేకాని, ఈలోగా ఆరాలడిగితే చివాట్లు తగుల్తాయి. అంచేత అమ్మక్కే వొలకబోసిన పొడరు డబ్బా సర్దుతో అక్కడే ఏదో వొకవంకని తచ్చాడుతూ వుంది. కాని మామయ్య ఏమీ చెప్పదలుచుకోలేదు. రాత్రి ఇంట్లో గుసగుసలు ప్రారంభమయినాయి. ఆ యింటికీ, పొరుగునవున్న మెంతివారింటికీ వుమ్మడి తలుపాకటుంది. ఇద్దరికీ వైరాలు ముదిరితే ఆ తలుపులికి తాళాలు పడతాయి. పొత్తుగా వుంటే గొళ్లెలు పడివుంటాయి. ఇప్పడా తలుపులు బార్లా తెరుచుకుని వుంటున్నాయి. ఆ వుత్తర మొచ్చిందగ్గరనుంచీ, ఆ యింటివారూ, ఈ యింటివారూ చెవులు తెగకొరుక్కుంటున్నారు. అత్తయ్య సరే, ఆ తలుపుదగ్గర కాపురమే పెట్టేసింది. ఇంట్లో అంతా కారాలూ మిరియాలు నూరుతున్నారు — కారణం గ్రహించలేకుండా వొచ్చింది.

రాత్రి వో నిద్దరోయింతరవాత మెళుకువ వచ్చింది శశిరేఖకి. పంచపాళీలోనుంచి మాటలు విన వస్తున్నాయి. చెవులు దోరబెట్టుకుని వింది. చంద్రావుకి క్షయవ్యాధి వున్నదని ఆకాశరామన్న వుత్తరము వచ్చిందట మేనమామ రామచంద్రయ్యకి. ఆమె గ్రహించింది. చంద్రావు కలిపించి వ్రాసి వుంటాడు బహుశా. ఆ వీధిన కండెకట్టువారికీ, ఈ వీధిన దాపర్తివారికీ దొమ్మీ జరిగినంత పనయింది మర్నాడు. పెళ్లికి తెగతెంపులయినాయి.

శశిరేఖకి ఖంగారెక్కువయింది. చివరికిట్లా పరిణమిస్తుందో యేమిటో. మామయ్య ఇంట్లో అడుగు పెట్టగానే ఆమె గుండె వేగంగా కొట్టుకొంటోంది. ఆపైన గదిలో గడియ వేసుకుని బిక్కుబిక్కుమంటూ కూచుంటుంది. పెళ్లి చెడిన కారణంగా తను కాకపోయినా తన జాతకచక్రం గురిఅవుతోంది, అందరి ఆగ్రహాలకీ. అట్లా తలదాచుకుందుకు అవకాశం లేదు. ఇంటిపని అందుకోకపోతే అత్తయ్య సాధిస్తుంది. మామయ్య కేకలేస్తాడు. పోటిన పిల్లిమీద పిట్టే, పిచికమీద పిట్టే నూటీపోటీమాట లంటుంది. మొహం చూపితే అంతా కోరకోరలాడుతున్నారు. తల దాచుకుంటే అంతా సాధిస్తున్నారు. సెలవ లెప్పుడై పోతాయా అని కూచుంది.

మామయ్యకి చంద్రారావంటే ఎంతో అభిమానం. అతను చాలా బుద్ధిమంతుడు. అతని లోటుపాట్లన్నీ అతనే తనతో వొకసారి ప్రస్తావించి చెప్పాడు. తనకి చిల్లిగవ్వ లేదనీ ఇంట్లో గాని, ఆస్తిపాస్తులలో గాని పెత్తండ్రివల్ల తనకి సంక్రమించేది పూరి పుడకైనా వుండదనీ స్పష్టంగా చెప్పాడు. బి. యస్. సి. ప్యాసయిన తరువాత వుద్యోగం దొరికితే సరేసరి. లేకపోతే ఏ పెన్సిలు మేన్యుఫాక్చరింగో పెట్టుకుంటాననీ ప్రస్తావించాడు. ఈ రహస్యం ఎందుకు బైట పెట్టలేదా అని మీమాంస పట్టుకుంది మామయ్యకి. అతన్నే అడిగి తెల్సుకుందా మనుకున్నాడు. ఎవరైనా దుర్మార్గుడు అతనంటే గిట్టనివాళ్లు ఈ అభాండ మతని నెత్తిన వేశారేమో.

మాఘవరంలో మున్నంగివారు, అటు కందికట్టువారికీ, ఇటు దాపర్తివారికీ కావలసిన బంధువులు. మున్నంగివారింట్లో పెళ్లికి ఆ యింటివారూ, ఈ యింటివారూ తర్లి వెళ్లారు. సాయంత్రం క్రీనీడలు పొడుగు సాగుతున్నాయి. పెళ్లివారిల్లు కిటకిటలాడుతోంది. శశిరేఖకి చిరాకుగా వుంది. మేనల్లుడు బాజీని తీసుకుని షికారుగా బల్లకట్టుదాటి పంట కాలవ కనువని బాడిత చెట్టునీడని చాలా సేపు కూచుని, పొద్దుకుంకే వేళ తిరుగుమొహం పట్టింది. మలుపు తిరగగానే కాలవ గట్టువాలుమీద సరుకుచెట్ల క్రీనీడని ఇసుకలో టర్కీ తువాలు పరుచుకుని చదువుకుంటున్నాడొక కాలేజీ కుర్రాడు. గబగబ అడుగు వేసింది. అతను చంద్రారావు! రామయ్యగారి తాలూకు వచ్చారని తెలుసుగాని, చంద్రారావు వచ్చాడనుకోలేదు.

వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది. ఈ వారంరోజులలోనూ అతనెంతో చిక్కిపోయాడు. కళ్లల్లో నిద్రాభారం కనిపిస్తోంది. ఇంత పరకాయించి ఎవరినింకా చూడలేదు తనింతవరకూ. అతనికి తన కృతజ్ఞత చెప్పుకోవలసి వున్నది. అతనితో మాట్లాడాలిసిన పని వున్నదికూడా. అతని వ్యాధిని గూర్చి అతనినే అడిగి తెలుసుకుంటానన్నాడు మామయ్య. "ఎవరో గిట్టనివాళ్లు వ్రాసి వుంటారు, నాకట్లాంటి వ్యాధి ఏమీ లేదు" అని చంద్రారావు అన్నాడా మామయ్య తప్పకుండా అతన్ని నమ్ముతాడు. అతనంటే మామయ్య కంతగురి. నిజానికి అతని కట్లాంటి వ్యాధి వున్నదని ప్రచారం కావడం తన కెంతమాత్రమూ యిష్టం లేదు. దానివల్ల తన కుపకారం జరిగినా అతనిభవిష్యత్తు అప్పుడే చాలా వరకు భగ్నమయిపోయింది. అతిసామాన్యమైన సంసారులుగూడా అతనికి పిల్లనివ్వడానికి జంకుతున్నారప్పుడే. తన సంబంధం నిశ్చయం కాకపూర్వం అతనికోసం మొగబడినవాళ్లంతా "ఇంకా నయం, మనం తొందరపడలేదు" అని, ఇహ నా ప్రసక్తి విరమించుకున్నారు.—ఆగింది.

అతను కన్నెత్తి చూడలేదు. కొంచెం దూరంగా కూచున్నది "ఆ ఉత్తరం నువ్వేనా రాస్తా బావా" అని అడిగింది, వోరగా చూస్తూ. అతనింకా పుస్తకం చదువుకొంటూనే వున్నాడు. చాలా కోపంగా వున్నట్టుంది. ఆ పరిస్థితిలో వాళ్ళిద్దరినీ ఎవరైనా చూచినా ఏమైనా అల్లి పారెయ్యగలరు. ఆమె అభిమానం కొంత గాయపడిందికూడా. ఉన్నట్టుండి "కసితీరిందా?" అన్నాడు చంద్రారావు. "బావా, ఎందుకట్లా వ్రాశావు? ఈ పెళ్లి తప్పించడానికి, నీ కిట్లాంటి విపరీతమైన పంథా తొక్కుతావని తెలిస్తే నేను తప్పకుండా వారించేదాన్ని..." అతనిక పుస్తకం మూసేశాడు. "ఇదిగో శశీ, పిచ్చివాలకంగా మాట్లాడకు... నా యింట్లో నా కెంత స్వాతంత్ర్యమున్నదో నీకుమాత్రం తెలియదూ?" .. కాలి బొటనవ్రేలితో రాస్తూ మౌనం వహించింది శశిరేఖ. "శశీ" అని తనని పిలవడంలో వున్న చనువూ ఆంతర్యమూ గుర్తుపెట్టుకుంది. మళ్లీ పుస్తకం చదువుకొంటున్నాడతను. అతనివంకే చూస్తూ కూచున్నదామె. అంతత్వరలో వెళ్ళిపోవాలని లేదు. "అవును గాని నాకు తెలియక అడుగుతాను. నాకు క్షయవ్యాధి వున్నదని, ఇంటింటా వాడవాడలా నాలిక బుజమ్మీద వేసుకుని చాటింపేస్తేనేగాని మీకు తృప్తి తీరదా యేం?"

"నేనేంచేశాను చెప్పబావా." అంటున్నది శశిరేఖ.

"నువ్వేమీ చెయ్యలేదనే అనుకుంటూంట"

"నాకు తెలియనివ్వలేదు. నిజానికి"

"అవునో— తెలిసిం తరవాత నువ్వు తీసుకున్న దర్జా యేమిటో చెప్పు. మీ మామయ్యతో గాని అత్తయ్యతో గాని, అతని సంబంధం మం మెట్లానూ కొదురుకుంటున్నా మా గదా, అతని పేరు యాగీ చెయ్యట మెందుకు మనకీ, అని ఒక్క మాట చెప్పి చూచావా నువ్వు?" తనవంక చూడకుండా చూపుడు వేలు మాత్రం తనవైపు చురుగ్గా చూపుతూ సమాధానంకోసం ఎదురుచూస్తున్నా డతను. నిలువునా నీరయిపోయింది శశిరేఖ. అతనివల్ల తనకి జరిగిన వుపకారాన్నీ, తనవల్ల అతనికి జరిగిన అపకారాన్నీ పోల్చి చూచుకుని ఎంతో కించపడింది. నిజమే, అతని భవిష్యత్తు మట్టిపాలవుతూంటే తను చేసిం దేమిటి? తన కక్కర్లేని పెళ్ళి నిలిచిపోయిందేచాలని మురవపెంకన్న! అపరాధం ఒప్పుకుని మౌనంగా వూరుకుంది. "అట్లా వుండాలి—అయినా నీకేమి పట్టిందిలే వెళ్ళి—నీ సంకల్ప మీడేరిందిగా! ఇహ కోరుకున్న వరుణ్ణి పెళ్ళిచేసుకుని హాయిగా కులుకుతూ సంసారం చేదువు గానిలే. ఈ ప్రచారంవల్ల నాకు అదనంగా కలిగే నష్టమేమీ లేదులే! నీస్వార్థం ఎంతవరకూ పోయిందో చూపుతున్నాను నీకు. అంతే. నాకింక పిల్ల నిస్తామనికూడా ఎవరూ రారని మురుస్తున్నావు గావును. పెళ్ళి పెటాకులూ అవాడే మానుకున్నాను. నువ్వు నా అందాన్ని గురించి వుపన్యాసమిచ్చిన రోజున" అని ఒక్క బిగిని తన అక్కసంతా తీర్చుకున్నా డతను.

శశిరేఖ "నా తొందరపాటుకి క్షమించు బావా," అని కంట తడిపెడుతూ వెళ్ళిపోతోంది. తన తెలివితక్కువకి తనని తానే నిందించుకున్నది. ఏమవాలో తోచనూ లేదు. తన కృతజ్ఞత వెల్లడించాలనుకొన్నది. మామయ్య అతన్ని అడిగి ఏమిటో తేల్చుకోవా లన్నాడు. ఏమని చెప్ప దలచుకొన్నాడో అరా లడుగుదా మనుకొన్నది. అతని ధోరణి బాగుండ లేదు. లాభం లేదు. వెళ్ళిపోతోంది. దీనత్వంలోకి దిగజారి వెనక్కయినా తిరిగిచూడకుండా వెళ్ళిపోతున్న ఆ అందాలరాశిని అవలోకగా చూచా డతను. ఆమె జడ పడగెత్తిన నల్లతాచు మూపుపై కదిలిపోతోంది. పరవళ్ళు తొక్కుతో ఆమె వెంటపడుతున్న పంటకాలవతో పాటు అతని చూపులు కూడా చూపందేవరకూ ఆమెని వెన్నంటే వున్నాయి.

శశిరేఖకి రాత్రి అన్నం రుచించలేదు. రాత్రి అంతా నిద్దరపోయిం తరవాత తెలగని కన్నీటికాలవలుగా ఎంతో సేపు ఏడిచింది. ఎందుకో ఏమిటో తెలియలేదు. నిజంగా అతనికి అపకారం చెయ్యాలని తనకి లేదు. కాని అపకారం జరిగింది. అపకారం ఇంతా అంతా కాదు. అతనూ తల్లిదండ్రులు లేనివాడు. ఏ విధమైన ఆర్థికస్తోమతూ లేనివాడు. స్వతంత్రంగా బ్రతికలేనివాడనీ కాదు గొప్ప అందగాడు కాదనీ కాదు. అతన్ని ఎంచేతనో వరుడుగా స్వీకరించలేకపోయింది. లోలోపల తరిచి చూచుకుంది మొట్టమొదటిసారిగా. అతను చాలా అపోహపడుతున్నాడు. తన కెవరిమీదనో మోహమున్నదని అనుకుంటున్నాడు బహుశా. నిజానికి తన మనస్సు ఎవ్వరిమీదా వాలలేదు. మనసులూ మమతలూ, విరహాలూ, వ్యామోహాలు ఇంకా తనని ఆవరించలేదు.

కోటు చిలకకొయ్యకి తగిలిస్తూ మామయ్య అత్తయ్యతో చెబుతున్నాడు. శశిరేఖ జాగ్రత్తగా వింది. చంద్రరావుతో ఆ ప్రస్తావన తెచ్చాడట. నిజమేనని తక్షణం ఒప్పుకున్నాడట. అట్లాంటి లోపాన్ని స్వార్థంకొద్దికీ తను దాచినందుకు చేతులు పట్టుకుని క్షమాపణ వేడుకున్నాట్ట. మామయ్యకీ కళ్ళు చెమ్మగిల్లినై. అంత దక్కని కుర్రవాడికి ఎట్లాంటి వ్యాధి! ఎంత బుద్ధిమంతుడు!! ఎంత వుదార గుణ మతనిది. ఎంత తెలివితేటలైనవాడు. కాలేజీలోనూ, ఆఫీసులోనూ అతని కెంత మంచిపేరు! "ఇంతకీ శశి దురదృష్టవంతురాలు" అని పెదవి విరిచారంతా. శశిరేఖ కిదంతా ఆశ్చర్యంగా వున్నది. ఇంకా అతను "నాకు వ్యాధి లేదు, సింగినాదం లేదు కావలిస్తే డాక్టరు పరీక్ష చేయించుకో" మని నిగ్గదీస్తాడేమో ననుకుంది. అతని మాటంటే మామయ్య కెంతో గౌరవం. ఆ చురుకుచూపుల వెనక, కరుకుమాటల వెనకా తనంటే ఎంత మెత్తగా స్పందించే హృదయమున్నదో, ఆమె కవగాహనయింది. తనవింటి యేదో ఒక ఆత్మీయతని పుణికి పుచ్చుకుంటున్నాడా అనిపించింది.

* * *

చంద్రరావూ, రఘూ క్లాసుమేట్లూ, రూముమేట్లూకూడా. ఆవేళ రఘు మంచి బందోబస్తుగా టాయిలెట్టయాడు. అందమైన హవానా సూటు బనాయిస్తూ, తచ్చాడుతున్నాడు గదిలో. చంద్రరావు,

తన క్లాసు పుస్తకాలలో ఫోటోలు చింపి, అవతల పారేస్తున్నాడు. అట్లాంటి ఒక ఫోటో రఘుమీద పడింది. ఏమిట్రా యిది. ఇంత చక్కని ఫోటోలు చించిపారేస్తున్నావట్రా. నీ కక్కర్లేకపోతే ఇట్లా పారెయ్య అన్నాడు రఘు. "ఫోటోలతో కర్మమేమిట్రా, అట్లాంటి అసలైన పిల్లొకతె పాత్యార్థూ మా వూళ్ళోవుంది. కావాలంటే వెళ్లి తెచ్చుకో." అన్నాడు చంద్రరావు. "నిజం?" అని ఫోటో వంక కొంత పరిశీలనగా చూచుకున్నాడు రఘు. ఆ వేళ ఒక సంబంధం చూచుకుందుకు వెళుతున్నాడు రఘు. ఏదో ఒక పల్లెటూరిపిల్ల, ఇక్కడ వాళ్ళ బంధువులయింటికి వచ్చిందట గణపతి నవరాత్రులకు. చూచిపొమ్మని ఆహ్వానం వచ్చిందతనికి. స్నేహితులిద్దరూ పెళ్లిచూపులికి బయలుదేరారు.

రఘు ధనవంతులబిడ్డ. పిల్ల అందంమీదా, చదువుమీదా చూపతనికి; సంప్రదాయంమీదా, కట్నంమీదా చూపతని తండ్రికి. ఆయన నిర్ణయించిన సంబంధ మితనికీ, ఇతను అవునని తలవూపిన సంబంధం ఆయనా రద్దుచేసుకుంటూ వొస్తున్నారు. రఘూ భయస్తుడు. ఆదర్శాలకీ, ఆశయాలకీ పుస్తకాలలో యిచ్చినంత విలువ ఆచరణలో ఇవ్వటం సాహసమన్న మతంలో మనిషి. "నీకు నచ్చిన పిల్లని చేసుకోరాద్రా" అంటే, పితృభక్తిని ఆదర్శంగా చెపుతాడు. పోనీ పెద్దవాడు ఆయన నిర్ణయించిన సంబంధమేదో అంగీకరించరాదా అంటే, అమ్మో పిల్ల అందంగా వుండాలి, చదువులూ, సంగీతాలూ వెలిగిస్తూండాలి అని గొంతెమ్మకోరికలు వెళ్లబోస్తాడు. "ఇట్లాగయితే నీకు పిల్ల అమిరినట్టే." అని చంద్రరావు ఒకసారి ఎత్తిపొడిచాడు. "మించిపోయిందేముంది, అన్నీ అమిరితేనే చేసుకుంటానూ" అని సారాంశం తేల్చాడు రఘు. అంటే కావలసిన కట్నాలూ, కానుకలూ, లాంఛనాలూ, ముట్టచెప్పి, అందమూ చందమూ అమిరిన పిల్లని, చదువులూ సంగీతాలూ నేర్చిన పిల్లని సమర్పణచేస్తే దయా ధర్మభిక్ష క్రింద స్వీకరిస్తాడు. అదీ అతనికి చాతనయింది.

పెళ్ళికూతుర్ని, తీసుకొచ్చారు. గుమ్మడిపువ్వులో మంచుబొట్టులా, పచ్చని తివాసీమీద పొందికగా కూర్చుంది శశిరేఖ. చంద్రరావు తెల్లబోయాడు. పెళ్ళిచూపు లయినాయి. పక్కకి తీసికెళ్లి "ఈ పిల్ల నెక్కడో చూచినట్టుందిరా" అన్నాడు రఘు. "ఆ ఫోటోలో పిల్లరా," అన్నాడు చంద్రం. "ఆ!" అని తెల్లబోయాడు రఘు. "అయితే, ఇహనేం, కట్నమూ గట్రా లావుగా యిప్పించాలేయ్." అని గునిశాడు రఘు. సరిపోయింది! రామయ్యగారూ వచ్చారు. రఘుని తప్పించి రామయ్యగారూ చంద్రరావూ లోపాయికారీగా మాట్లాడుకున్నారు. రఘూ పరిస్థితులు సాకల్యంగా విశదపర్చి చెప్పాడు. రామయ్యగారికి. అన్నివిధాలా అవలంబించదగిన సంబంధమన్నాడు. పెళ్ళికొడుకుని వొప్పించే భారం నీదని రామయ్యగారు అర్థించాడు. "ఇదిగో, ఇప్పుడే వుపక్రమిస్తున్నా" అని చంద్రరావు "ఒరేయి అబ్బాయీ! చెబుతున్నా విను. డబ్బు శాశ్వతం గాదు, అగ్నిహోత్రం లాంటి కుటుంబం. వజ్రపు నెరుసులాంటి పిల్ల. చదువులకు సరస్వతి. పాట పాడిందంటే మాటలు పెదవులమీద నించీ వస్తున్నాయో, వీణతీగలమీదనించీ వస్తున్నాయో గుర్తించడం కష్టం. నీ యింటి కొక వెలుగనుకో!" అని ముగించాడు. బావుంది వర్ణన! శశిరేఖ కిటికీలోంచి చూస్తూ సిగ్గుపడింది. రఘు చాలా సేపున్నాడు. చంద్రావొక స్నేహితుడుగా, హితైషిగా పెద్దమనిషిగా, మధ్యవర్తిగా, ఎన్నోవిధాలుగా బోధించి చూశాడు. "పిల్ల నచ్చిందీ" అని అతనిచేత పలికించడానికి రెండు గంటలు పట్టింది. ఆఖరికి ఒక మాట యిచ్చాడతను. కట్నం లేమీ యివ్వకపోయినా తండ్రికి నచ్చజెప్పిచూస్తానన్నాడు. ఆయన అంగీకారం లేనిదేమటుకు తను స్వతంత్రించనని నొక్కి చెప్పాడు. కొంత నయమనిపించింది. రఘు వెళ్ళిపోయాడు.

చంద్రరావు ఆ రాత్రి భోజనాని కుండిపోయాడు. పంచపాళీలో కుర్చీ వేసింది శశిరేఖ. కూచున్నాడు. ఎవరూ లేరు. "నచ్చాడా" అని ప్రశ్నించాడు అంతర్యంగా. సిగ్గుపడింది. "మళ్ళీ కొంప ముంచకు, మహాతల్లీ" అన్నాడు. హాస్యంగా నవ్వింది. శశి అత్తయ్య వొచ్చింది. చిన్నతనంనించీ ఎరిగున్న మూలాన అతనంటే ఆవిడ కెంతో అభిమానం. "జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు కాబట్టే అన్నీ మర్చిపోయి తల్లీ తండ్రీ లేని పిల్లయినందుకు ఇంత శ్రమ తీసుకుంటున్నావు నాయనా. ఇంకొకరైతే గర్భశత్రువులుగా మారిపోయేవారు. నీ పెత్తండ్రి పరిపరి మమ్మల్ని చేస్తున్న యాగీ ఇంతా అంతా కాదు" అని ఏకరువు పెట్టిందామె. "తప్పంతా నాదేనండి, ఆ సందర్భంలో నా లోపం నేను చెప్పేసి వుండాల్సింది మీకు. భగవత్కృప వల్ల మీరెట్లా తెలుసుకున్నారో గాని నా కాశ్చర్య

మయింది. లేకపోతే శశి జీవితం సంకపాలయ్యేది." అని నేరస్తుడల్లే తల వంచుకున్నాడు చంద్రరావు. "విచారించకు నాయనా, నీ మంచితనమే నిన్ను రక్షిస్తుంది." అని వోదార్చిందామె. శశిరేఖ గది గుమ్మందగ్గర వోరగా నిల్చుని వింటోంది. పాపం తనకోసమని అతనెంత అపహాస్యకరంగా, అవమానకరంగా నటించాల్సొచ్చిందో! తలుచుకొంటే, ఆమె అంతరాత్మ ఘోషించింది — భోజనాల వేళయింది. శశిరేఖ అప్పడాలూ వొడియాలూ వేయించింది. మామయ్యకీ చంద్రరావుకీ, వెండికంచాలుంచి వడ్డన కుపక్రమించబోయింది. "మామయ్యకి తరవాత వొడ్డిస్తువు గానిలే" అన్నది అత్తయ్య. "అతని కొక్కడికీ కేటాయింపుగా వొడ్డిస్తే ఏం బావుంటుందీ" అని కించపడుతోంది శశి. "చెప్పేనమాట వినవమ్మా తల్లీ, క్షయం టే దారుణమైన అంటువ్యాధి నీకు తెలదు, చెబితే వినవ్వా, వచ్చే చావయింది నాకు" అని చీదరించుకున్నదామె. కంచాలు తీసి వొక్కటే విస్తరి వెయ్యడం చూచాడు చంద్రరావు. గ్రహించాడు. తను భోజనానికి నిలవడం పొరబాటు. చెయ్యి కడుక్కొని పంచపాళీలోకి వచ్చేస్తూ గుమ్మందగ్గర ఆగి విన్నాడు. "నువ్వే ఎత్తు ఆ విస్తరి. అతను తీస్తానంటే వొద్దని సైగచేస్తావెందుకూ, నువ్వే అనుభవించు" అని ఛీత్కారిస్తోంది అత్తయ్య. తను వ్యాధిగ్రస్తుడన్న సంగతి ఘడియఘడియకి జ్ఞాపకముంచుకోవాలి తాను. రామయ్యగారితో మాట్లాడి వెళ్ళిపోతున్నాడు చంద్రరావు. తలుపు వేసుకుంటుండగా శశిరేఖ వచ్చింది. "చెప్పేస్తాను" అంది.

"ఏమనీ?"

"నేనే ఆ వుత్తరం నీచేత వ్రాయించానని నీ క్షయమాట అబద్ధమనీ"

"నష్టమెవరికో ఆలోచించి చూచుకో," అని చక్కాపోయాడు.

* * *

పొద్దున్న లాడ్జిలో రఘు చదువుకొంటో, చంద్రరావుదగ్గర కొచ్చి, "ఏమిరోయ్, మా వూరు పిల్లంటున్నావు, నీకేమయినా పాతపురాణమేమిట్రా" అన్నాడు చటుక్కున. ఏడిపించేట్టుంది. అదివరకే తనకి మన్య ప్రణయకాండ ఏమీ నడవలేదని వాడి బుర్రకెక్కించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. కొంత అసత్యమూ చెప్పాల్సొచ్చింది. కొంతమంది ఎంత కుళ్ళుగా ఆలోచిస్తారూ!

సెలవల్లో రఘు సర్వవరం వెళ్ళిపోయాడు. చంద్రరావూ, రామయ్యగారూ సర్వవరం బయలుదేరివెళ్ళారు సంబంధం ఖాయం చేసుకుందుకని. రఘు తండ్రి సూరపరాజుగారు అతిలౌక్యుడు: ఆయన కొరుకుపడలేదు.

సెలవల్లో చంద్రరావు ఇంటికి వెళ్ళలేదు. అతనూ పెత్తండ్రీ ఘర్షణపడ్డారు. ఏవో అనవారకం సంబంధాలకి...తన మెడలు విరుద్దామని చూస్తాడు. దానితో అతను సెలవులలో పెంటపాడు వెళ్ళడం పడలేదు. కాకినాడలోనే వుండిపోయి, మూడు నాలుగు మంచి ట్యూషనులు ఏర్పాటు చేసుకున్నాడు.

* * *

రకరకాల సంబంధాలు చూశారు, చంద్రరావూ రామయ్యగారూ కలిసి. రామయ్యగారు మూడానుకొన్నవి కొన్నీ, చంద్రరావు ఎరికలో వున్నవి కొన్నీ, "పెళ్ళవడికి కావాలండీ. బోగంది గడిస్తుంది. పిల్ల దక్కదనమూ సంప్రదాయమూ కావాలిగాని" అని ప్రారంభించి, తీరా మధ్యలోకి దిగింతరవాత కట్నాలూ, లాంఛనాలు ఆడబడుచు కింతో, అలక కింతో, మనుగుడుపుల కింతో, కార్యానికింతో, బాలతోడు కింతో రూపాయణా పైసలతో అనుకున్న అంకెకి అంది వస్తేనే గాని వొక తెన్నుకురాని సంబంధాలు, పూటకి టికాణా లేకపోయినా పిల్ల పెళ్ళికున్నదీ అనగానే కట్నమెంత యిస్తారూ అన్న బేరంతో మొదలయ్యే సంబంధాలు, ఉన్నట్లున్నా యనిపించి ఆఖరికి వున్న ఆస్తులూ చేసిన అప్పులూ లెఖ్ఖవేసిచూస్తే అంకె మిగలకపోయినా ఆకాశయానం చేసే సంబంధాలు, గోటూ బోటుగా పెట్టుకుని చూపదగిన ఆస్తులు లేకపోయినా మా అమ్మమ్మ ఆస్తి నాకే వస్తుంది, మా మేనత్త నాకే రాస్తుంది, అని గాలిమేడలలో కూచుని పంకాలు లాగించుకోవాలని చూసేసంబంధాలు చూచిచూచి ప్రాణం విసిగింది.

శశిరేఖ అన్నీ వింటూనే వున్నది. "బిళ్ళ పెట్టుగా అంతా వొచ్చిపడ్డాము. వొకరోజా, వొక వారమా, మళ్ళీ వస్తాము"ని చెప్పి రామయ్య భార్యా పిల్లలూ, శశిని మాత్రం కాకినాడలో పినతల్లిగారింట దిగవిడిచి వెళ్ళారు. చంద్రరావు తిరుమరావడం లేదు. వచ్చినా తనవంక చూడ్డంగాని తనతో మాట్లాడడంగాని పూర్తిగా మానుకున్నాడు. శశి పినతండ్రి, కలవాడూ, చాలా పెద్దమనిషీ. ఆయనా తాపత్రయ పడుతూనే వున్నాడు. చంద్రరావు గ్రహించాడు, ఎవరెంత తాపత్రయపడినా పెళ్ళిఖర్చులు మినహా,

కట్నాలకూ పేణా గాని కానుకలకూ పేణా గాని చిల్లి గవ్వ ఖర్చుచేసేవా రెవరూ లేరని.

శశిరేఖ చంద్రరావుతో అంతరంగంగా మాట్లాడా లనుకొన్నది. తన కష్టసుఖాలు, ఎవరితోనూ అంతవరకూ ప్రస్తావించని సాంసారిక బాధకాలు అతని ముందు ఏకరువు పెట్టాలని తపనపడింది. కాని అతను తనచుట్టూ వొక గోడలాంటిది కట్టేసుకుంటున్నాడు. తను తొంగిచూచేందుకు వొక కిటికీ అయినా వొదలని ఇనుపగోడ. అమ్మమ్మ వొకసారి పెంటపాడు వెళ్ళివచ్చింది. చంద్రరావు అక్కడికి రావడమే లేదట. రామయ్యగారు గాని, ఆయన తాలూకు గాని అతని విషయం పట్టించుకోనే పట్టించుకోరు. అతను మాత్రం మా పెదనాన్న, మా పెదనాన్న అని వ్రాసుకుంటాడు. అతని జీవయాత్ర అంతా నిగూఢ మయింది. అతని కష్టనిష్ఠురాలు అతను చెప్పుకోగా ఆమె ఏనాడూ వినలేదు. అతని పుస్తకాలకి గాని, జీతాలకి గాని, తిండితిప్పలకు గాని పైసా యివ్వడం పెత్తండ్రి. మరి యెట్లా బండీలాగుతున్నాడో భగవంతుడికే తెలియాలి. తనకి గాని, తన మేనమామకి గాని తను పనులమీద వినియోగించుకోవడం మినహా అతని కెట్లా గడుస్తుందో, ఆలనా పాలనా సూచనగా నైనా అడిగి తెలుసుకుందామన్న శ్రద్ధ లేదు. తన మేనమామ సరేసరి అతను రాగానే అక్కడి సంబంధం గొడవతోనూ, ఇక్కడి సంబంధం గొడవతోనూ అతి ఆత్రంగా అతన్ని తోమితోమి, భోజనాలవేళ దాటినా, భోజనానికి వుండమని లాంఛనప్రాయంగా నైనా అనడు. ప్రయాణంలోనూ కట్టా అతని ఖర్చులు అతనే భరిస్తున్నట్టు మామయ్య ధోరణిలో ఒకనాడు పసికట్టింది. మామయ్య సంగతి తెలీదూ! తనని ఆ బంధువుల ఇంట్లోనూ ఈ బంధువుల యింట్లోనూ, నెలల తరబడి వుంచేస్తాడు. తొందర పడి వాళ్లేమనుకొంటారోనని తనంతట తానే ఇంటికొచ్చేస్తే కేకలు వేస్తాడు. ఒక పెళ్ళి చూపులికి ముస్తాబవుతూంటే ఇంటిదగ్గర సిల్కు చీర మర్చిపోయివచ్చిందని తనని పట్టుకుని ఝాడించేశాడు చంద్రరావుసమక్షంలో — ఇంటిదగ్గిర తనకి నిజంగా వొక సిల్కు చీర వున్నట్టు — చంద్రరావు వొక జార్జెట్ సిల్కు చీర కొని తీసుకొచ్చాడు. ఈసారి పెంటపాడునుంచి రాగానే పైకమిచ్చేస్తానెమ్మని, మామయ్య చంద్రరావుతో రెండుమూడు సార్లు స్పష్టంగానూ, ఆతరవాత విసుగుతోనూ అన్నాడు. రోజులు గడిచింతరవాత మర్చిపోయినట్టు నటిస్తున్నాడు. ఆచీర కట్టుకొన్నప్పుడల్లా తనవొళ్లు గగుర్పొడుస్తుంది.

కాకినాడలో పింతండ్రియింట్లో ఆమెకి కొంత చనువున్నది. ఆయనకి కొ్వరీటాకీసులో భాగముంది. నెలకి 40 పాసు టిక్కెట్లు వస్తాయి. పింతండ్రికొడుకు రవణని ఎనిమిదేళ్ళ కుర్రకుంక వొకడున్నాడు. వాడు చీటికీ మాటికీ శశిరేఖని సినిమాకి తిప్పెందుకు మరిగాడు. కథా, కథలో చిన్నిచిన్ని ఘట్టాలూ రసవంతంగా విడమర్చి చెబుతుంది. అంచేత చూచిన సినిమాకే మళ్ళీమళ్ళీ ఆమెను వేధించి తీసుకెళుతూ వచ్చాడు. చంద్రరావు కిప్పుడు పరీక్ష లయిపోయినై. లాడ్జిలో వొక గది తీసుకొని వొంటరిగానే వుంటున్నాడు. లాడ్జి సినిమానుంచి వచ్చేతోవలోనే వున్నది. వచ్చి, పొయ్యేటప్పుడు అది వొక ఆకర్షణగా పని చేస్తోంది ఆమెలో. ఒకటి రెండుసార్లు అతనిలాడ్జి పక్కనే రవణంత కాపాగి ధైర్యంగా నిల్చుని తిరిగి వచ్చింది. ఎప్పుడు చూచినా ఆ మేడమీద కిటికీదగ్గిర చదువుకుంటూ కూచుంటాడు. పరీక్షలయినా ఏమిటో చదువు! మేడ మేడంతా చీకటిమయం. అక్కడ మాత్రమొక చిన్న లైటు. ఆ లైటు వెలుగువలయంలో బస్టు ఫోటోలా, అతను తదేక దీక్షగా చదువుకుంటూ కూచునే భంగిమ. ఒకనాడు రెండో ఆట అయిన తరువాత తిరిగివస్తోంది రవణతో. వీధి వీధంతా నిర్మానుష్యంగా వున్నది. అతను మాత్రం ఇంకా ఏదో రాస్తూ కూచున్నాడు. తనకోసం అంతింత తాపత్రయాలు పడే వొక ప్రాణి, తన హృదయంలో ఇంతచోటు దొరుకుతుందేమోనని గాలిస్తున్న ఆ చిన్న మెదడు అట్లా ఆ పుస్తకాలలో లీనమయిపోయివుండటం కొంత కష్టంగానే వుంది. అతనేమి చేస్తుంటాడో, ఎట్లా కాలక్షేపం చేస్తుంటాడో తెలుసుకోవాలని మనస్సు రెపరెపలాడుతోంది. వెళ్లి పలకరించా లనుకుంది. అంతరాత్రివేళ! ఏమనుకొంటాడో!......వెళ్లింది. పక్కని రవణ వున్నాడుగా. ధైర్యం తెచ్చుకుంది. వొక్కొక్కటే మెట్లు ఎక్కి, నిలబడింది గదిలో. అతను వులిక్కిపడ్డాడు. "ఎక్కడినించీ!" అతని ప్రశ్నలోనే చూపు లాగిపోయినాయి. ఆమె గది అంతా కలయజూచింది. పుస్తకాలక్కడా ఇక్కడా చెల్లాచెదురుగా లేవు. వుంటే సర్దుదా మనుకున్నది. కూచోమని సైగ చేశాడు. ఉత్తరాలు కొన్ని టేబిలు మీద అడ్డదిడ్డంగా పడివున్నాయి. "నాకొకటి చూపు కోరాదూ!" అని వుపక్రమించింది "అవి ఇంకా పరిశీలించాలిసి వున్నదిలే" అని వారించాడు. క్యాలండర్లో పాత నెలల కాయితాలు చింపుదామని బయల్దే

రింది. "అందులో కొన్ని శాఖలు వర్తమానంలో వారి లే— చింపకు, చింపకు" అని అభ్యంతరాలు పెట్టాడు. అతనిమీద కోపమొచ్చింది. తన చేత ఏవిధమైన పనులూ చేయించుకోకూడదని మతం గావును. ఏమిటో తెగ వ్రాస్తున్నాడు. కాయితాలతని చేతుల్లోంచి చనువుగా లాక్కొని చదివింది. అర్థం కాలేదు.

"ఏమిటిది?"

"ఒక వ్యాసం లే"

"జీవితచరిత్రా?"

"వృక్షశాస్త్రంలో వొక థీసిస్"

"ఎందుకూ సెలవలలో"

"ఒక పోటీ పరీక్షకని"

ముక్కకొక్క ముక్క, ముక్తసరిగా సమాధానం చెప్పాలి గావును!— చిరాకుపడింది.

"చాలా కష్టపడుతున్నావు, పైగా కొట్టేలా వున్నావులే" అన్నది... తలవొంచి నిట్టూర్చాడు... జాలిపోయింది. కదిలిద్దామని "కూచో, ఏం భయంగా వున్నదా?"

"భయ మెందుకూ" పైటకొంగు తెగ మెలి వేస్తోంది.

'ఏమో లే'

'కొంచెం పెద్దవాడివయినా బావుణ్ణు"

"ఎందుకూ?"

"కాస్త భయమైనా వహించేవాన్ని"

కిలకిల నవ్వు మెట్లు దిగింది రవళితో. అతను కిటికీలోంచి చూస్తూ నిలబడ్డాడు "ఈమె వొక కొత్త శశిరేఖ!" అనుకున్నాడు. శశిరేఖ గబగబా వెళ్ళిపోతోంది. వెనక్కి తిరిగి చూడకూడదనుకుంది. కాని అతను కిటికీదగ్గర నిల్చుని చూస్తున్నాడా లేకపోతే తక్షణం వ్రాతలో పడ్డాడా తెలుసుకుందుకు ఆత్రంగా వుంది. వెనక్కి తిరిగి చూచింది. అతను చూస్తూనే నిల్చున్నాడు. ఎక్కణ్ణించో వలపూలిన సిగ్గు ముంచుకొచ్చింది. అడుగులు తడబడ్డాయి. ఎందుకు చూచానా అని కించపడ్డది.

ఇంటి మాటకే, సర్వవరంలో రఘు సంబంధమింకా మామయ్య వదులుకోలేదు. చంద్రరావు అపుడపుడు సర్వవరం వెళ్ళివస్తున్నాడు. రఘు తండ్రి అతి లౌక్యుడు. తొంటిచెయ్యి చూపడానికి తొంభై రోజులు తీసుకుంటాడు. అక్కడ జరిగిన మాటలూ వాళ్ళధోరణి వింటోంటే శశిరేఖకి చిటచిటలాడింది. అసలీ మనిష్య సంబంధాల గాలింపుల్లో ఆమెకి ప్రపంచం చాలా చుట్టుకు అవగాహన అయినట్లనిపించింది. పెద్దమనుషులుగా పొందాగా రొమ్ములు విరుచుకునే యీ మగరాయళ్ళలో ఎంతమందికి నిజమైన జీవితపు విలువలు తెలుసునో, ఎన్నెన్ని స్వార్థాలు ఎన్నెన్ని మారు వేషాలలో మనుషుల్ని నడుపుతివో అలోచిస్తే వొకవిధమైన విరక్తి కలిగింది. చంద్రరావుకి తన అభిరుచులు బాగా తెలుసును. మామయ్యాకి యిష్టమైన కొన్నికొన్ని సంబంధాలు తన కయిష్టమని ఎట్లా గ్రహించేవాడో ఏవో లొసుగులు బయటికి తెచ్చి అయిపోవన్నట్టు మార్చేవాడు. చిత్రంగా కనిపించేది. తనకి పెళ్ళి చేసెయ్యాలని ఎందుకో అందరికీ ఇంత ఆలజడి. ఆ చంద్రరావుకి మరీను. అతని కెందుకో యీ దుగ్ధ తనకి పెళ్ళి కాకపోతే అతనికేమో. ఆ రఘుసంగతి మరీ చొంగలు కారుస్తూ చెప్పవస్తాడతను వొళ్ళంతా చీమలు పాకినట్టుంటుంది తనకి. రఘు అందమైనవాడే. చదువుకొన్నవాడే. తనని చేసుకోవాలని మహా వుబలాటపడుతున్నాట్ట! తన అందానికి ముగ్ధుడై పోయాట్ట! ఏపని లేకపోయినాడా అనిపించింది శశికి. కోరిన కట్నాలతో తులతూస్తే వాళ్ళకి తీసుకుంటాడు పాపం. వీళ్ళకి సిగ్గులుండవా అని? వాకొపిల్ల వచ్చింది, ఈపిల్ల వచ్చింది అని చెప్పుకుంటుకు. వొ ఉంజాకుని చస్తున్నాడు రఘు, కట్నమెట్లా రాబట్టాలా అని. తండ్రీ వాడూ లాలూచీ అని, శశికి గట్టి నమ్మకం. ఈ స్వార్థాలన్నిటికీ అతీతమైన అంతస్తులో మరకలు లేని, నిర్మలమైన తెరమీద తళుక్కుమని మెరిశాడు చంద్రరావు. రఘూ సమాధానానికి అంగీకారంగా తల ఎందుకు వూపావా అనుకున్నది.

చంద్రరావు బి. యస్. సి. ఫెయిలయ్యాడు. ఒక చెంపని ట్యూషన్లు చెప్పుకోవడంలో, ఒక చెంపని తన పెళ్ళివ్యవహారాల గజిబిజిలో చదువు సాగలేదేమో అతనికి. మళ్ళీ యిహ చదవనన్నాడు. పెన్సిల్ మాన్యుఫాక్చరింగ్ పెట్టుకోవాలని అతని కొక ఆశ.

దానికి రెండుమూడు వేలన్నా కావాలి. మెషినరీకిగట్రా. చంద్రరావుకి తెలియందిలేదు. ఎలక్ట్రిక్ వర్కులలోగాని ప్రెస్ వర్కులోగాని, ఏ పరిశ్రమలో ఎంత గిట్టుబాటవుతుందో అవలీలగా అంద

వాలు వేయగలదు. అన్ని పరిశ్రమల కీలకాలూ అవగాహన చేసుకోగలదు. మామయ్యతో అతను కొన్ని కొన్ని పథకాలు చర్చిస్తూంటే ఆ పరిభాషే అర్థమయి చచ్చేదికాదు. డబ్బులేనివాడి బుర్ర ఎంత చురుగ్గా పనిచేస్తుందో ఆమె కర్థమయింది.

నెలలు గడిచినై.

మామయ్య ఒక శుభవార్త తెచ్చాడు. చంద్రావుకి ఆంధ్రవిద్యాలయం బహుమతేదో వచ్చిందట మూడు వేలట! "ఏదో పాపం, గుడ్డిలో మెల్ల" అని సంతోషించాడు మామయ్య. పేపర్లో పడి వారం రోజు లయిందట...తను చూసే వేలేదు. లాడ్జికి వెళ్ళి వొకసారి పలకరిద్దామా అనుకున్నది. తనతో చెప్పలేదని కొంత కోపంగానూ వున్నది. ఆ వేళ రవణని సినిమాకు లేవదీద్దామని ప్రయత్నించింది. వాడు రథోత్సవం సరదాలో పడివున్నాడు. మహా చికాకు పడ్డది. ఆ వేళ సినిమా రకరకాలా వర్ణించి చెప్పింది. వాడి బుర్ర కెక్కలేదు. విసుక్కుంది. మామయ్యతో కూడా వెళ్ళి అతన్ని అభినందించవద్దామనుకున్నది. కాని అతను పట్నానికి వెళ్ళాట్ట. సరే పోయింది! ప్రైజు అందుకొందుకు గావును. ఆమె నిరుత్సాహపడింది.

శశిరేఖా రామచంద్రయ్యగారూ, కుటుంబ సమేతంగా పెంటపాడు వెళ్లిపోయారు. చంద్రావు మళ్ళీ రాలేదు. కాకినాడకి వెళ్ళిపోయాడేమో తెలియదు. మామయ్యకీ అతనికీ ఉత్తరప్రత్యుత్తరాలు నడుస్తుండటం గమనించింది.

ఆనాడు శ్రీరామనవమి. వూళ్లో భరతనాట్యం. పిల్లా మేకా అంతా వెళ్లారు.

శశిరేఖ గబగబా కంచాలు కడిగేసి గాడిగేదకు కుడితి గోలెంలో పోసి ఇంటికి తాళంపెట్టి తనూ వెడదామని ఆలోచిస్తోంది. ఎవరో లోపలికొస్తున్నారు, "అత్తయ్యా" అని పిలుస్తూ; "లేరండీ" అని కేక వేసింది. గబగబా పెరట్లోకి వచ్చాడతను. చంద్రావు! నైట్ క్వీన్ మొక్క సువాసనలు గుప్పున విసిరికొట్టింది. అతను మాంచి ఉత్సాహంగా వున్నాడు. "కూచో బావా" అని ముక్కాలిపీట నూతికి దగ్గరసా లాగింది. "వో మాట చెబ్దామని వచ్చాను శశీ." చందమామవంక చూస్తున్నాడతను. "నేను పది మాటలు మాట్లాడదామనుకుంటున్నాను సరా" అని జడలో చెండు సర్దుకున్నది శశిరేఖ. "రఘు సంబంధం సెటిలయింది." ఎంతో సంబరపడుతుం దనుకున్నాడు. పైపెచ్చు "చట్, ఈ మగతనంలేని సంబంధాలన్నీ చూస్తావెందుకు బావా నువ్వు" అని చీదరించింది. సరిపోయింది! "ఈ నటన కేమిలే" అని వోరకంట చూచాడతను—"అంటే, ఆ రఘుమీద నాకు తహతహగా వున్న దనుకుంటున్నావుకదూ నువ్వు?"

"పోనీ ఆ తహతహ అతనిమీద నీకు కాదు గాని, వాడికి నీమీద, సరేనా!"

"అయ్యో రామ! నామీద అంత తహతహగా వుంటే వొక రెండు వేలు ఎక్కడైనా తెచ్చుకుని చదివించుకోరాదూ"

"ఆ అరేంజిమెంటే చేసివచ్చా. నా ప్రైజు సొమ్ము రూ 3000/ లు చెక్కు వచ్చింది. అతనికి ఎండార్సు చేసి యిచ్చేసివచ్చాను."

"పాపం యిహ కులుకుతూ పెళ్లి చేసుకుంటా వన్నాడుకదూ—దేవయ్య!"

"శశీ, నీకు కాబోయే భర్త వట్టా ఈసడించకూడదుసుమీ" అతను సీరియస్ గా మొహం పెట్టాడు.

"నా పెళ్ళి నువ్వు చూడనక్కర్లేదు తెలిసిందా"

"చూడనక్కర్లేదూ?"

"అక్కర్లేదు. నేను చూచుకోగలను. చూచుకున్నాను కూడా."—అతని జేబులో వున్న ఫౌంటెన్ పెన్ను లాగి అతని అరచేతిలో వ్రాస్తూ వర్ణక్రమం వల్లిస్తోంది. సకార ఈకారములు "సీ" వకార ఏకారముల "వే"—చెయ్యి లాక్కున్నాడతను. నూతిపక్కని అతని సరసనే నుంచుని కొంటెగా అతని కళ్లల్లోకి చూచింది శశిరేఖ.

"ఇట్లా బుద్ధిపుట్టిం దేమిటి" అతనికి నిజంగానే కోపమొచ్చింది.

"ఇదంతా కృతజ్ఞత గావును. అవునా?"

"ఛ—కృతజ్ఞతా? నీకా? దేనికి? తిరిగావనా? బావుంది. ఎవరికోసం తిరుగుతావు" కిలకిల నవ్వింది. అతను మౌనంగా వూరుకున్నాడు. "నిజంగా బావా, నువ్వు నాకు అందంగానే వున్నావు." అతను ఫక్కున నవ్వాడు. ఆమె బుంగమూతి పెట్టి "నేనబద్ధాలాడను, తెలుసా" అన్నది వోరచూపుగా.

"నేను నవ్వతాలకి రాలేదు శశీ—నా శశిని మకిలికళ్ళతో చూడలేదు నేను. నీలోని ఈ క్షణిక దౌర్బల్యాన్ని వుపయోగించుకుంటా ననుకున్నావేమో"

"ఏమిటి బావా, నిజమా?" ఆమె బిక్క మొహం పెట్టింది.

"నీ పెళ్లికి రఘు తండ్రీ, నీ మేనమామ రామచంద్రయ్యగారూ, ఇవాళే తాంబూలాలు పుచ్చుకున్నారు సర్వవరంలో. ముహూర్తం నిర్ణయమయి పోయింది. నీతో చెప్పిపోదామని వచ్చాను. తొమ్మిది గంటలబండికి మద్రాసు పోతున్నా. ఇక మళ్ళీ మనం కలుసుకోము బహుశా." అని గబగబా వెళ్ళి పోతున్నా డతను "నాకీ పెళ్ళి అక్కర్లేదు." అని కునుస్తో చొక్కా పట్టుకుంది. అత నాగాడు.

"శశీ, నీమనస్సు నీకు తెలియదు. నాకు తెలుసు. రఘు బుద్ధిమంతుడు, చదువుకున్నవాడు. తగినంత ఆర్థికస్తోమతు కలవాడు, నీ ఆకర్షణకి గురి అయిన అదృష్టవంతుడు, నిన్ను ప్రాణప్రదంగా చూచు కుంటాడు, పిచ్చిపిల్లా, బావ యేదో వాలుగుపార్లు నీకోసం ఇటూ అటూ తిరిగాడుకదా అని, నీ హృదయాన్ని అర్పణ చేసుకోవాలని చూస్తున్నావా? పో! పో! పోయి కళకళలాడుతూ జీవితంలోకి అడుగు పెట్టు. నన్ను మరిచిపో. లేకుంటే చిక్కులపాలయి పోతావుసుమా"

తల వంచుకుని వింటోంది శశి. అతను వెళ్ళి పోతున్నాడు. "బావా, బావా" అని పిలుస్తోనేవున్న దామె. ఏదో బరువు దించేసుకుని పారిపోతున్న వాడల్లే కనిపించాడు. శశిరేఖ అట్లానే నిలబడి పోయింది. వేడివేడి కన్నీళ్లు ఆమె చెంపలమీదనించీ పెరట్లో గుమ్మంముందు పోగుపడివున్న ఎండురావాకుల మీద చిటపటమని రాలాయి. పక్కయింటి మరుగోడమీదనుంచి వాలిన సరుకు చెట్లనీడలు చీల్చుకొంటూ పోతున్నా డతను. తన జీవితంలోకి వద్దు పొమ్మన్నప్పుడు వచ్చి, రా రమ్మన్నప్పుడు వెళ్లిపోతున్న ఉదారమూర్తి! అందాన్ని గుర్తించగల ప్రజ్ఞా, హృదయాలు పంచుకోగల నేర్పూ తనకి అలవరచిన త్యాగమూర్తి!! ఏ పాటలూ ఎరుగని, ఏ కృతులూ మోగని, తనలో ఎన్నడో బూజుపట్టి, ఏమూలనో పడివున్న అనురాగ వీణని అతిసున్నితంగా మీటి, పోతున్న గంధర్వ మూర్తి!!!

అతను ఇక రాడు!

యక్షగానములు : సాంప్రదాయిక పాత్రలు

శ్రీ యస్. వి. జోగారావు

ప్రాయికముగా ప్రతిదేశ జానపదరూపకములలోను యేవో కొన్ని సాంప్రదాయిక పాత్రలుంటాయి. ఇతివృత్త మేదైనా ఆపాత్రలన్నికథలతోను పొత్తు కుదిరేటట్లుగా ఉంటాయి. ఆ సాంప్రదాయిక పాత్రల తత్త్వము పరిశీలిస్తే అందులో చాలా మట్టుకు హాస్యరసప్రసక్తికోసం ఉద్దేశింపబడినట్లు ఉంటాయి. రుచులలో ఉప్పెటువంటిదో రసములలో హాస్య మట్టిది. అది సర్వజనమనఃపర్వమైనది. విద్వత్ప్రియుల కుద్దేశింపబడిన సంస్కృత నాటకాల్లోనే విదూషకపాత్ర గతానుగతికంగా కనిపిస్తుంది. అటువంటప్పుడు ఆరంభించినది మొదలు జాగరం చేయించే మన జానపద ప్రదర్శనాల్లో మధ్యమధ్య ప్రేక్షకుల కులాసాకీ ఖుషీకీ కొంత వెసులుబాటు అవసరం. అందుకే ఆ పాత్రలు. ఆ పాత్రల వినోద ప్రసాదం అభినవ నాగరకులకు వెగటనిపించవచ్చును. కాని, మన యక్షగానాల విషయ మెత్తుకుంటే అవి యీనాడు మనకెంత మోటుసరుకనిపించినా ఒకనాడు కోటలోని రాజుకీ పేటలోని ప్రజలకీ సమానమైన కాలక్షేపంగా పరిఢవిల్లినవి. అసలా గ్రంథ రచన కావించినవారిలో గ్రామకరణాలే కాదు పండితగ్రామణులు, రాజకవులుకూడా ఉన్నారు. మరొకమాట ఆ ప్రదర్శనల ప్రేక్షకసమాజంలో యెక్కువపాలు ప్రజాసామాన్యము. వారికి కావలసినది విజ్ఞానమే అయినా వారెక్కువగా కాంక్షించేది వినోదమే. ఆ వినోదకాంక్షలోనూ, తరాలుగడచినా ప్రజాభిరుచిలో, వారిలో వైజ్ఞానికపరిణామము వేగముగా రాదు కాబట్టి, ఏదో సమీచీనమైన సమానత్వము గోచరిస్తుంది. వారి ఊహాపోహాలు, ఆశయములు, ఆదర్శములు సమయబద్ధములు. అందుచేతనే వారభిలషించే ప్రదర్శనములలో కొన్ని పాత్రలలోగూడ సాంప్రదాయికత పాదుకొన్నది. ఆ పాత్రలు ప్రజాదరం చూరగొని ప్రచారానికి వచ్చినవి. అప్పటి రూపకకర్తలది గుర్తించి, సంప్రదాయవిధేయులై తామేకథ నెత్తుకొన్నా ఆ పాత్రల కేలాగో ప్రసక్తి కల్పిస్తూ వచ్చారు. తోలుబొమ్మలాటలో బంగారక్కజుట్టుపోలిగాడు, గంధోళిగాడు మొదలైన సరుకు మొదట యిలా బయలుదేరినదే. అలాగే యక్షగానాల్లోనూ తద్రూపాంతరములైన కలాపములు, కొరవంజులు మొదలగువానిలోనూ కొన్ని పాత్రలు, అన్నీ హాస్యరసప్రసన్నములే, సాంప్రదాయికముగా రూపొందినవి. ఆ పాత్రల హాస్యప్రవృత్తిలో సామాన్యజీవిత స్పర్శ వుంటుంది. తత్తత్పాత్రోచితముగు వాటి వ్యావహారికపు నుడికారము కైవారముకూడా తెలుస్తుంది.

ఒక్కొక్క పాత్రనే మెతుకుపట్టి చూద్దాం.

మాధవి:—ఇతగాడి పాత్ర కూచిపూడి కులపతుల అపూర్వసృష్టి. ఇతడు పాత్రంటే పాత్రకాడు. కాడా అంటే ప్రతి భామకలాపంలోనూ విధిగా ప్రత్యక్షమౌతాడు. గొల్లకలాపాల్లో కదాచిత్కంగా కనిపిస్తాడు. కాని సత్యాకృష్ణ సంబంధులగు పారిజాతాది కథాసందర్భము లితివృత్తంగాగల చాలా యక్షగానాల్లోకూడా తరచుగానే కనిపిస్తాడు. మాధవి సూత్రధారునివలె కథానుసంధానం చేస్తాడు. విదూషకునివలె హాస్యప్రసంగాలు వినిపిస్తాడు. పాత్రలను ప్రేక్షకులకు పరిచయం చేస్తాడు, స్వయంగా పలకరిస్తాడు. ఇతడచ్చుమచ్చు సింహళదేశపు నృత్యరూపకము 'కోలం నాటిమా' లోని 'తోరాతరు కథాకారయా' లాంటివాడు. బర్మాదేశపు వీధినాటకము 'నిభట్ కిన్' లో 'లూ—బయట్' లాంటివాడు. యథార్థాని కితడు కథాగత పాత్రకాడు. అలాగని కేవలం వెనకనుండి హంగుచేసే అక్కాబత్తుడూ కాడు. కథకు కలిసివచ్చేపాత్ర. నాయికానాయకు లిద్దరికీ శృంగార సహాయకుడుగా వ్యవహరిస్తాడు. వారిద్దరికీ మధ్య దౌత్యంకూడా నడుపుతాడు. వారిని వెటకారం చెయ్యడానికి 'లైసెన్సు' కూడా సంపాదించాడు. చెంగల్వరాయ పారిజాతాది యక్షగానకృతుల్లో వారి ప్రసంగాలకు 'పేరడీ'లు కూడా చేశాడు. మాధవివేషం వేసేవాడు మగవాడే, ఆ ప్రదర్శక ముఖ్యుడెవడో వేస్తాడు. అసలా వేషానికొక నిర్దిష్టమైన ఆహార్యకమేమీ లేదు. పైమీద కండువావుంటే చాలు. మామూలు పంచెకట్టులో దిగిపోవచ్చు ప్రదర్శనలోకి. నాయకుని పలకరించినప్పుడు మగధీరునివలెనే కండువా సవరిస్తాడు. నాయికను పలకరించేసరికి ఆ కండువానే ఘుమిటగా సవరించి బుగ్గమీద వేలూ, నడుంప్రక్క కేలూ పెట్టుకొని నడ

కలో మాటలోకూడా ఆడారివాటం తెచ్చిపెట్టు పలుకుతుం. అతను అక్కల్లో అక్క, బావల్లో బావ. మాధవికే మానవుడని కూడా పర్యాయ వ్యవహార మున్నది. మాధవ మాధవీ నామధేయాలు కృష్ణునికి, అతని సఖులకు మాత్రమే వరిస్తాయి. కాని, యీ భామాకలాపం సీసగుఱుక్కికూడా ఆ పేళ్ళు పెట్టా రంటే యేదో విశేషముండాలి. అప్పుడప్పుడు కలాపంలో నాయికా నాయకులకు పరస్పరం గాని, మరెవరితో గాని మాట్లాడడానికి అవకాశం గాని ఔచిత్యం గాని లేని సందర్భాలుంటాయి. కాని, పాత్రలు తమ మనస్స్వరూపము ప్రేక్షకులయెదుట పెట్టాలి. అందుకు 'స్వగతము' నాశ్రయించాలి. అసలే కలాపము ఆహార్యశయ్యలో నడిచే రూపకము. అందులో యీ స్వగతాలుకూడా వుంటే ప్రేక్షకులకు విసుగుదల హెచ్చవచ్చు. అదిగాక స్వగతాలు అసహజమైన వంటారుగదా కొందరు. బహుశా ఆ స్వగతాలను పరిహరించడానికే మాధవిపాత్ర ప్రకల్పితమైనదని ఊహించవచ్చు. ఎందుచేతనంటే ఒక మాధవుడింకొక మాధవునితోనూ, ఒక మాధవి యింకొక మాధవితోనూ మాట్లాడడమన్నది చాలా విచిత్రంగానే కనిపిస్తుంది, కాని, అలా మాట్లాడేరంటే పాత్రలు తమలో తాము మాటాడుకున్నట్లే జమ అవుతుంది. కలాపసారాన్నికి కలిపివస్తుంది, దాని ఆహార్యశయ్యకి డోకా వుండదు. విసుగు పుట్టించకుండా నాటకం చక్కా నడిచిపోతుంది. అందుకే కలాపంలో మాధవి కథాగతపాత్ర కాకపోయినా కలిసివచ్చే పాత్ర అవడం.

సుంకరి కొండడు:—గొల్లకలాపాల్లో యీడాలి వీడి వాలకం. అన్నింటిలోనూ వాడి పేరు కొండడే. వీడు గుజరాతీ భాషైలో 'రంగోళో'లాంటివాడు. లాలాకన్నయ అనే ఆయన రచించిన సుంకరికొండడి వేషము 'కథ' అనే యక్షగాననాటకంలో వాడి వాలకం మిల్లా వర్ణింపబడింది.

గడితపు దల్వ దల్లడము పైన బిగించి
        తగ రాణమెరయ గాదట్టి జుట్టి
పిక్కటి బిరుదుగా బిగియు ముంగురుగుంటి
        చొక్కాయ పిక్కల నంట దొడిగి
జరిబుసుంబారంగు శాలుపాగా మీద
        రవగుల్కు కల్కితురాయి చెక్కి
గుధ గుభాళించు సౌరభము గుల్కెడిమేన
        కమ్మదుప్పటి వేటుగా నమర్చి
కత్తి ఝళిపించి వరకరాగ్రమున నుంచి
వాడి కొనగోళ్ళ మీసంబు దీడి దీడి
దుండగీడౌచు సుంకరి కొండ డదుగో
వచ్చె కొబోలు వినవమ్మ వారిజాక్షి.

వాడి రాకపోకలు చెదరిసురుగా వుంటాయి. ఏలపాటలు పాడుకొంటూ హేలగా వస్తాడు. వచ్చి చల్లనమ్మే గొల్లభామను సుంకముగాని 'తత్ప్రత్యర్హ్నయ' చుంబనము కాని యిమ్మంటాడు. ఆమె తప్పించుకోడానికి ప్రయత్నిస్తుంది. ఇక యిద్దరికీ వాగ్వివాదము. ఆ వాదం చాలా సరదాగా నడుస్తుంది. కాని, మోటుగా వుంటుంది. గొల్లభామ తన గయ్యాళి అత్తగారిని పిలుస్తాను మాసుకో అని బెదిరిస్తుంది. వాడెపాధ్యుడు, 'గుత్తి లోగడను మీ యత్తమాకు' అంటాడు. చివరకు చెయిపట్టుకు సరసానికి కూడా దిగుతాడు. కొన్ని గొల్లకలాపాల్లో ఆ అత్తగారు రంగంమీదికి వచ్చి సుంకరిని గద్దించి కోడలుపిల్లని తీసుకొనిపోతుంది. ఇన్ని కబుర్లు చెప్పిన సుంకరీ ఆమె రాగానే బిక్కచచ్చిపోతాడు. కొన్నిట్లో అత్త రాకుండానే సుంకరే గొల్లభామను సరసంగానో బలవంతంగానో లాక్కుపోతాడు. గొల్లభాములుకూడా అత్తిచాటున కర్చుపెట్టుకోడానికి సుంకండబ్బులు కలిసివస్తాయనో, నిజంగా కులాసాపుట్టో సుంకరి సరసానికి సై అనడం కద్దు. దీనినిబట్టి నాటి సుంకరి గొల్లభాముల అల్లరిచిల్లర ప్రవర్తన విశదమౌతుంది. అసలు గొల్లకలాపానికి అంతరార్థం మరొకటున్నది. సుంకరి కృష్ణపాత్రకొక సంకేతము. గొల్లభామ గొల్లభామే. అందుచేత గొల్లకలాపము గోపికా కృష్ణ ప్రణయతత్త్వ ప్రతిపాదకమన్న మాట. ఈ ఊహకు బలకంగా శ్రీనివాసదాసు రచించిన రంగపురి పారిజాతం అనే ఒక అముద్రిత యక్షగానంలోనూ, లాలాకన్నయ గ్రంథంలోనూ శ్రీకృష్ణుడే సుంకరివేషం ధరించినట్లు స్పష్టంగా వుంది. కన్నయ గ్రంథంలో భాషలో విలక్షణత, భావాలలో విరసత్వము వున్నా సుంకరి కథ బాగా రక్తికట్టింది.

కటికము:—కటిక, కట్టియం, కటికీడు, కోలకేతివాయుడు, కేతడు, ఆస్థాన సంతోషి, సంతోషుడు, బాగుదారు, చోపుదారు, బరాబరి అని వీడికి చాలా పేర్లున్నాయి. యక్షగానములందు రాజప్రసక్తివచ్చే కథ లెక్కువ. కటికము రాజోద్యోగి. రాజకథాప్రసక్తిగల యక్షగానములందెల్ల వీడి అవతారం విధిగా వుంటుంది.

రాజంటే కేవలం రాజే కానక్కరలేదు, ఇంద్రుడూ శివుడూ మొదలైనవారుకూడా కావచ్చు. రాజపాత్రకు ప్రసక్తి లేని యక్షగానాల్లో కూడా అక్కడక్కడ వీడి అవతారం కనిపిస్తుంది. వాడి పేర్లనుబట్టి వాడి పనులు విశదమౌతాయి. వాడు రాజుగారివాకిలి కావలివాడు— వేత్రహస్తుడు. రాజుగారి రాక సభవారికి తెలియచేస్తాడు. రాజుగారిముందు నడుస్తూ త్రోవ కడ్డు తొలగిస్తాడు. రాజుగారు వచ్చి గద్దెనెక్కగానే కైవారములు, హెచ్చరికలు, పరాకులు పలుకుతాడు. వీడి పేర్లన్నింట్లోనూ యెక్కువ ఆకర్షించేది 'ఆస్థాన సంతోషి' అన్న పేరు. అంటే 'కోర్ట్ ఫూల్' అన్నమాట. ఉత్తి సంతోషుడు అన్న పేరు 'బఫూన్' అన్నమాటకు సమానార్థకంగా గ్రహించవచ్చు. దక్షిణాంధ్ర యక్షగానాల్లో వీడి పాత్ర బాగా రూపు కట్టింది. తిరువాతి తిరువాత ఉత్తరాంధ్ర కృతుల్లోనూ వీడి వునికి తిరుచుగానే కనిపిస్తుంది. అసలు తంజావూరు నాయక రాజుల మహారాష్ట్ర భూపతుల కొలువులో చాలా ప్రాముఖ్యం వహించిన రాచ తైనాతీ. వాడి దొక వెర్రిగొల్లని వాలకం. ఆ రాజులు హాస్యచతురాస్యులు. వాడికి బోలెడు చనవిచ్చిరి. వాడు తన సహజ వికృతాకారచేష్టా భాషణాదికము వలన కొంత నత్తియో చెవుడో నటించి, కొంత హాస్యము ప్రదర్శించెడివాడు. ఆ తంజావూరి రాజకవులు, తదాస్థానాశ్రితులైన తక్కిన కవులును తమ యక్షగానకృతుల్లో కటికముపాత్ర ముచ్చటదీర చిత్రించుకొన్నారు. శహాజీ యక్షగానాల్లో (ఇవి అముద్రితములు) వీడి పాత్ర యింకను విశిష్టముగా చిత్రింపబడ్డది. అందు శివసంబంధులగు కృతులలో కుండోదర, కుంభోదర, చండికేశ్వరాది ప్రమథశ్రేష్ఠులను మామూలు కటికీళ్ళవలెనే వ్యవహరించిరి. కటికమునకు వికటాంగుడను పేరు కూడ పెట్టినాడు శహాజీ. వాడి వాలకము, దరువు...

పట్టెవామనూను బెట్టి, బారికోల కేలపట్టి
దట్టిపైని దుప్పటి గట్టిగా గట్టి
జుట్టునిండా పూలు సుట్టి, మిట్టా పంస్తైనెగబెట్టి
యట్టాహాసముతో వికటాంగుడు వచ్చెన్.

చాల గ్రంథములందు సర్వసాధారణముగా కటికము రాకతోనే కథారంభమగును. వాడు భాగవతులతో హాస్యప్రసంగములాడుటయు కొన్ని గ్రంథములలో గలదు. గ్రంథములో వాడి హాస్యమున కెక్కువ అవకాశమిచ్చునట్టు రాజదర్శనార్థులరాక. వచ్చినవారినెల్ల యొక సక్కము చేయుట వాడిపని.

సింగి, సింగడు:— చెంచులు, ఎఱుకలు, కొరవలు అను కొండజాతులకు చెందిన దంపతులు వీరు. తాము చెంచుహోబళు అంటే గరుడాద్రి నారసింహుని వారసులమని వారి విశ్వాసము. అందుకే ఆ పేర్లు. సింగడికి వేట వృత్తి. సింగికి సోది వృత్తి. సింగడు అడవికోనలు తిరిగి వేటతోపాటు వేళ్ళు వెల్లంకుల సంపాదనకూడా చేస్తాడు. సింగి దేశద్రిమ్మరియై సోదెతోపాటు ఆ వేళ్ళూ వెల్లంకులు అమ్ముతుంది. వారి వేషభాషలు, కులాచారాల్లో సగం ఆటవికత్వము, సగం దేశద్రిమ్మరితనం కనిపిస్తుంది. చెంగల్వరాయ పారిజాతం అనే - అముద్రిత - యక్షగానంలోని ఎఱుకలకథవల్ల సింగి పచ్చబొట్లు కూడా పొడుస్తుందనీ, శకునాలు సాముద్రికంకూడా చెపుతుందని తెలుస్తుంది. సన్నిధిరాజు జగ్గకవి జ్ఞాన— ఎఱుకల కురవంజి మొదలైన గ్రంథాల్లో కూచిపూడి గొల్లకలాపంలో గొల్లభామలాగ వేదాంతోపన్యాసాలు కూడా చేస్తుంది. సింగడికి చోడిగాడనికూడా పేరు. ఆ పదం ప్రియుడు అనే అర్థంలో కోవెల రాఘవదాసు ప్రణయ కలహకలాపం, (అముద్రితం) కూర్మనాథకవి మృత్యుంజయవిలాసము మొదలగు యక్షగానాల్లో వాడబడింది. దాని అసలు స్వరూపం 'కోడెగాడు' అయివుంటుందని ఊహ. సింగికి ఎఱుక, కొరవజాతుల స్త్రీ అనే అర్థంలో ఎఱుకత, కొరవంజి అనికూడా పేర్లున్నాయి. అసలా మూడు సమానార్థకాలుగా వాడబడినవీ గ్రంథాల్లో— ఉదాహరణకు: గిరిరాజ కవిరాజ మోహన కొరవంజి (అముద్రితం). చాలా యక్షగానాల్లో సింగీ సింగళ్ల ప్రసంగం వస్తుంది. కాని సింగిపాత్రకున్న ప్రసిద్ధి సింగడికి లేదు. ఆమె పాత్రకు ప్రాధాన్యముగల కొన్ని గ్రంథాలకు ఆమె పేరే పెట్టబడింది.

అవే కొరవంజులు. యక్షగానములకు కొరవంజులకు లక్షణప్రక్రియలో భేదము లేదు. కొరవంజుల్లో ఎఱుకత పాత్ర తప్పనిసరిగా వుంటుంది. యక్షగానాల్లో యాదృచ్ఛికము అంతే. కొరవంజుల్లో నైతేనేమి యక్షగానాల్లో నైతేనేమి సర్వసాధారణంగా ఎఱుకతపాత్ర ప్రవేశించే సందర్భము! కథానాయిక తాను వలచినవాని గూర్చిన తలపోతలో ఉంటుంది. అతని పొందు కుదురుతుందా కుదరదా అని అనుమానపడుతూ వుంటుంది. అప్పుడు వస్తుంది యెఱుకత. వచ్చి, తన కులాచారము లుగ్గడించి, తన దేశాటన విశేషములు వివరించి, ఎఱుక దేవుళ్ళ నెకరువు పెట్టి సోది మొదలెడుతుంది. ఆ దేవుళ్ల పరంపరలో యెవరి పేరు తప్పినా తప్పవచ్చుకాని కొల్లాపురి లక్ష్మి

పేరు తప్పదు ఆమె వారి కులదేవత. ఒక యక్ష గానంలో 'కొల్లాపురమ్మను కొలుగుము చేము! ఎల్ల వారికి నది యిలు వేలుపమ్మ' అంటుంది...ఎఱుకత. ఆమె సోది అయిపోయేసరికి సింగ డామెను వెదుకు కొంటూ వస్తాడు. ఆమె సోది చెప్పి సంపాదించిన సొమ్ములూ, అవీ మాసి మరెవడో యిచ్చివుంటాడని అనుమానపడతాడు. ఆమె సమాధానం చెప్పుకోవలసి వస్తుంది. అక్కడ వారి సంవాదం. ఆ ఘట్టము ఘట్ట మంతా హాస్యరసో త్తరంగా నడుస్తుంది. కొన్ని కొన్ని గ్రంథాల్లో లక్ష్మీనారాయణాది దేవతలు కూడా సింగీ సింగళ్ళ నేపథ్యం స్వీకరించినట్లు తెలుస్తోంది. ఉదా: తరిగొండవెంకమాంబ—అముద్రిత—శివవిలాస యక్ష గానము మొదలైనవి.

మంత్రసాని:—శ్రీకృష్ణ, ప్రహ్లాద, మార్కండేయ, ధర్మాంగదాది బాలపాత్రల జననాదికమునకు ప్రాధాన్యముగల గాథలు గ్రహించిన యక్షగాన గ్రంథకర్తలు కొందరు మంత్రసాని పాత్రను తమాషాగా చిత్రించారు. ఒక్క ఉదాహరణ—పాలుట్ల లక్ష్మణకవి ధర్మాంగద నాటకములో దాసీజనము రాణిగారికి ప్రసవసమయమైనదని మంత్రసానిని రమ్మందురు. దాని కెక్కడలేని బెట్టుసరి అప్పుడే వచ్చిపడినది. దాని సమయ మప్పుడేకదా! అయింతా 'అమావాస్యనాడు అట్లు జెసితిరె, పున్నమనాడు బూరెలు జెసితిరె' యిట్లా చెప్పడానికి లంకించుకుం టుంది.

ఇకపోతే, అంతంతమాత్రం తరచుగా వచ్చే చిల్లరమల్లర హాస్యపాత్రలు కొన్ని వున్నాయి. పురోహితులు, ముత్తైదువలు మొదలగువారు. వారి ప్రసంగాలు రంగాజమ్మ మన్నారుదాసవిలాసాదుల్లో కమ్మగా వర్ణింపబడ్డాయి. కొన్ని యక్ష గానాల్లో హాస్యగాడని ప్రత్యేకంగా ఒక పాత్ర కనిపిస్తుంది. వాడు మానవి కటికకాల్లాగ వ్యవహరిస్తాడు. తంజావూరి యక్షగానాల్లో విఘ్నేశ్వరుని స్తుతిమాత్రమే కాకుండా విఘ్నేశ్వరుడొక పాత్రగా అతని రాకకూడా సంప్రదాయసిద్ధముగా ముద్ఘటింపబడింది. ఉత్తరాంధ్ర యక్షగానకృతుల్లో కొన్నిట్లో గంధర్వస్త్రీల రాకడ అని గ్రంథారంభమున నే కథకు సందర్భశుద్ధి లేకపోయినను రంభోర్వశ్యాదుల రాకలు వారి గానాభినయముల ప్రసక్తియు చెప్పబడుట కద్దు. సత్యభామా రుక్మిణులు, గంగా గౌరులు, చెంచులక్ష్మి ఆదిలక్ష్ములు, మోహినీ సంధ్యావళులు మొదలగు నాయికల జంటలు వచ్చే యక్షగానాల్లో సవతి కయ్యమొకటి గతానుగతికముగా వచ్చుచున్న జనరంజకమగు విషయమైనది. భామాకలాపాల్లో దానిదొక ప్రత్యేకత.

తంజావూరు సరస్వతీమహాలు అముద్రిత గ్రంథసంచయంలో 'నాటక పాత్రలు' అను నొక గ్రంథమున్నది. అందులో నాడు ప్రదర్శనమున కెక్కిన రామాపండితాదుల నాటకము లిరువది మూడింటిలో వచ్చు వివిధపాత్రల, తత్పాత్రధారుల పేర్లుమాత్రము పట్టికలుగా నుదాహరింపబడినవి. అందు భిన్నభిన్నేతివృత్తములుగల గ్రంథాల్లో సామాన్యంగా కనిపించే పాత్రలు కొన్నివున్నవి. అవి విఘ్నేశ్వరుడు, ప్రమథగణాలు, మణియం కురుక్కళు, పరిచారకుడు, బిక్కాజినాయకుడు, మహల్దారులు, సుయిణీ, బుగదవేషం, కైకోజనీ వేషం, జోసి మొదలైనవి. పై పాత్రలలో కొన్నింటి స్వరూపం యీనాడు మన కూహించను కానీ మనకు దొరికిన ఆనాటి యక్షగానాల్లో నైనా కనిపి స్తాయా అంటే మచ్చుకైనా కనిపించవు. అందులో మొదటి నాలుగైదు పాత్రలు నాటక పూర్వరంగ ప్రవర్తన కుపయోగపడేనవి. అందు మణియం, కురుక్కళు అరవమాటలు. మణియం అంటే మఠదేవాయతనాద్యధికారి, కురుక్కళంటే పూజారి లేక పురోహితుడు అని అర్థం. వాళ్లిద్దరూ ఆయిరవైమూడు నాటకాల్లోనూ కనిపిస్తారు. బిక్కాజినాయకుడు తొమ్మిది నాటకాల్లో కనిపిస్తాడు. ఆ బిక్కాజి శబ్దానికి అర్థం తేలలేదుకాని కటికంలాంటి పాత్ర గాని అయివుంటాడేమో అని తోస్తుంది.

యక్షగానాల్లోని సాంప్రదాయికపాత్రలను గురించి సంగ్రహంగా మనవిచేసుకున్నాను. ముఖ్యమైన పాత్రల స్వరూపస్వభావాలు నిరూపించడానికి కొంత ప్రయత్నించాను. యక్షగానాలు ప్రధానంగా ప్రజాసామాన్యపు వినోదానికి ఉద్దిష్టమైనవి. అందుచేత అందులోని సాంప్రదాయికపాత్రలు కూడా హాస్యరసపాత్రీయాలుగా వుంటాయి. ఒక్కొక్కప్పుడా పాత్రలు చేసే పరిహాసం యెదుటి పాత్రల పాత్రతాపాత్రతలనుకూడా లెక్కపెట్టదు. అది శోచనీయమైన విషయమే. అంతమాత్రంచేత మన మా కావ్యరాశినంతటినీ నిరసింపకూడదు. అందులో సాహిత్యజిజ్ఞాసువులు తెలుసుకోదగిన విశేషాలు, ఆ సాంప్రదాయికపాత్రలద్వారానే వెలువడేవి అనేకమున్నవి.

ఆగంతుకము

శ్రీ మెట్టా వెంకటేశ్వరరావు

పాత్రలు

రామకృష్ణయ్య	వీరాస్వామి
ప్రభాకరరావు	రమణ
మాధవరావు	పార్వతి
కనకరాజు	వసుంధర

* * ఇంట్లో ఒక హాలు, హాల్లో ఒక ప్రక్కన టేబిల్, టేబుల్ చుట్టూ నాలుగు కుర్చీలు. ప్రక్కన పుస్తకాల బీరువా. మరో ప్రక్కన మంచంమీద ప్రభాకరరావు పడుకుని ఉంటాడు

[అతని భార్య పార్వతి లోపలనుంచి వచ్చి]

పార్వ: ఏమండోయ్......(దగ్గరకు వచ్చి) మిమ్మల్నే (కుదుపుతుంది)

ప్రభా: [మసల్తాడు]

పార్వ: మిమ్మల్నేనండీ! లేవరేం? ఎనిమిదైంది ఇంకేం నిద్దరండీ అంతూ పొంతూ లేకుండా? లేవండీ!

ప్రభా: అబ్బ! ఉండవే.

పార్వ: ఏమిటి వుంటానండీ! ఎనిమిదైతేను. ఎంతసేపూ? (మొహంమీదనుంచి దుప్పటిలాగుతుంది)

ప్రభా: ఆగాగు. ఏమిటే నీ హడావుడి పొద్దున్నే. ఒక్క రోజన్నా కంటినిండా నిద్ర పోనిచ్చావే నన్ను? తెల్లవారనీవాయె, లేలే అని ఒకటే పోరు చెవికింద. మొగవాడు పెళ్ళంటూ ఒక దౌర్భాగ్యపుపని యేనాడైతే చేసుకున్నాడో ఆనాడే స్వస్తి, కమ్మటి నిద్రకి.

పార్వ: అవును పాపం, నామూలంగా యెంత కష్టపడుతున్నారు. అనటానికి నోరెట్లా వస్తున్నదండీ! తెల్లవారనివ్వనూ—అయితే అయింది గాని లేచి తొందరగా మొహం కడుక్కోండి. లాంతరు తీసుకొచ్చేదా వెలకాల? పాపం చీకట్లో యేమన్నా తగిలి పడతారేమో... లేవండ్లేవండి, కాఫీ చల్లారి పోతుంది. తొందరగా—

ప్రభా: ఎందుకు పోవాలి? పట్టుకురా.

పార్వ: పాచి మొహంతోనా—ఛా— నే నివ్వను.

ప్రభా: ఓసి నీ యిల్లు బంగారంగాను—ఎంత గడుగ్గాయి మనిషివే. (లేచి మెల్లిగా దొడ్లోకి వెళ్తాడు)

పార్వ: (పక్క చుట్టి, ఇల్లూడ్చుకుంటుంది. వాకిట్లో వంకాయలకేక వినబడుతుంది) ఇదుగో! వంకాయలూ ఎలా?

ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఆంధ్రభాషాసమితి జరిపిన ఏకాంకిల పోటీలో ప్రథమ బహుమతినందిన నాటిక

[వాకిట్లోనుంచి 'శేషు']

పార్వ: ఒక అరవీసెకు తుయ్య. వస్తున్నానుండు (బుట్ట తీసికెళ్ళి పట్టుకొస్తుంది. ఇంతలోకే ప్రభాకరంవచ్చి కుర్చీలో కూర్చుని మొహం తుడుచుకుంటాడు)

ప్రభా: కాఫీ తీసుకురా—

పార్వ: (తీసుకొచ్చి బల్లమీద పెడుతుంది) చిత్తగించండి.

ప్రభా: నోటికి పట్టాలి.

పార్వ: పసిపిల్లలకి మల్లేనా.

ప్రభా: అసలి రోటు దిరిగీ లేదుగా! నాకన్నా పట్టు (తీసుకుతాగుతూంటాడు)

పార్వ: ఏం? కావాలని అంత ఉబలాటంగా ఉందా!

ప్రభా: అదెందుకు లేనిపోని బాధ. లేకుండా ఉంటేనే రొనిమిదింటి కిస్తున్నావు కాఫీ. ఉంటే అసలు తిండికూడా పెట్టవు.

పార్వ: అయితే స్వామీ! తమరు పానుపు దిగటమే యీ వేళకిగదా, అరింటికే లేసి నిద్రపోతున్నా సరే బలవంతంగా నోరుతెరిచి చంచాతో పొయ్యమని సెలవా?

ప్రభా: ఒసే నీకేం తెలియకపోబట్టిగాని ఋగ్వేదంలో యేంచెప్పేడో తెలుసా శుక్రాచార్యుడు—

యా దదాతి పత్యైకాఫీమ్
ప్రాతఃకాలే దినమ్దినమ్
సా ఏవ పవిత్రానారీ
స్వర్గేపి కీర్త్యతే సదా—

అంటే 'ఏ స్త్రీయైతే పెందలకడనే ప్రతిదినమూ భర్తకు కాఫీ యిస్తుందో ఆమెయే పతివ్రత. స్వర్గమునందుకూడా ఆమె కీర్తింపబడుచున్నది' అని. అయితే యిక్కడొక చిన్న మతభేదముంది. ప్రాతఃకాలమంటే రొన్నిగంటలప్పుడూ అని. ఈ శ్లోకానికి వ్యాఖ్య వ్రాస్తూ ఏతంపూడి నారాయణస్వామి దీక్షితులవారు 'ప్రాతఃకాలే ఇతి కించిత్సూర్యోదయానంతరే' అంటే, కొద్దిగా రొండెక్కిన తర్వాత అని సెలవిచ్చారు. దీన్ని ఖండిస్తూ కాండూరు లక్ష్మీపతి భట్టాచార్యులవారు 'కించిత్సూర్యోదయానంతరే ఇతి ప్రామాదికవదనమ్; కదా భర్తా తల్పాదుత్తిష్ఠతి తదైవ ప్రాతఃకాలమ్' అని సెలవిచ్చారు. అంటే 'కొంచెం ప్రొద్దెక్కినతర్వాత' అన్నమాట పొరపాటు — ఎప్పుడు భర్త నిద్రపక్కనుండి లేస్తే—అదే భార్యకి ప్రాతఃకాలము కాబట్టి లేచిందాకా నిరీక్షిస్తూ లేవంగానే యివ్వవలెను' అని.

పార్వ: అయిందా యింకేమన్నా ఉందా వ్యాఖ్యానం—అయితే స్వామీ! కాలేజీలో తెలుగు మేష్టరు పని యీ పాండిత్యంతో నేనా చేస్తున్నారు? అయితే త్వరగానే ఉద్వాసన చెబుతారు.

ప్రభా: ఏంపోతే ముష్టిఉద్యోగం? ఇంతకంటె భాటోక్రప్ పని మరొకటి లేదు.

పార్వ: మరెందుకు చేరేరు?

ప్రభా: ఏదో యీ పేరుతోనన్నా లోకంలో కులాసాగా ఉండొచ్చునని — అరెరె — కొంప మునిగింది.

పార్వ: (కంగారుగా) ఏమిటి?

ప్రభా: ఏముంది అన్నీ రాత్రే తాగేశాగా.

పార్వ: సరే! ఇంతాచేస్తే సిగరెట్టా! ఏం యిప్పుడు లేకపోతే! అంత కురేమిటండీ?

ప్రభా: ఒట్టి తెలివితక్కువ ప్రశ్న. గుడికి గోపురం దేనికి? చీరెకి అంచు దేనికి? నీకు నేను దేనికి? అట్లాగే కాఫీకి సిగరెట్టు. వాటిరెంటికీ అవినాభావ సంబంధం—ఇప్పుడు కొట్టుదాకా ఎక్కడ పోయేది.

పార్వ: అంత అవసరమా?

ప్రభా: అయ్యో! అత్యవసరం. ఏం అలా అడుగుతున్నావ్ ఉందా?

పార్వ: (లోపలికెళ్ళి సిగరెట్టు అగ్గిపెట్టె తీసుకొచ్చి యిస్తుంది)

ప్రభా: ఏం? నువ్వుకూడా తాగుతున్నావా యేమిటి?

పార్వ: ఏం? తాగితే తప్పా?

ప్రభా: అబ్బే! తప్పేంవుంది? ఎంతమంది తాగటంలేదు గనక. మా కాలేజీ అమ్మాయిల్లో దాదాపు సగమ్మంది తాగుతారు; అట్లాగే నువ్వూ.

పార్వ: నా కదొక్కటే తక్కువ. పెట్టెలకి పెట్టెలు తగలేస్తుంటే రోగమొస్తుందేమో నని తీసి దాచాను.

ప్రభా: (సిగరెట్టు ముట్టించుకుంటూ బయటికి వెళ్ళిపోతాడు.)

[పెరుగుమనిషి రామక్క ప్రవేశము]

రామ: పట్టమ్మా!

పార్వ: (లోపలి కెళ్ళి గిన్నె తెచ్చి పెరుగు వేయించుకుంటుంది)

రామ: ఈయ నేడీ?

పార్వ: ఇప్పుడే పాన్పుదిగి కాఫీతాగి దొడ్లోకి దయచేశారు.

రామ: ఏం ఇయ్యాళ లింత లీశ్యం.

పార్వ: ఏముంది నాటకం రిహార్సలని రాత్రి పన్నెండింటికి దయచేశారు కొంపకి.

రామ: నాటకాల గీటకాల కెళ్ళనియ్యక మోక నమ్మోయ్ పండంటి మొగాణ్ణి యే ముండావల్లో యేసుకున్నా కొంప కులో సవుద్ది.

పార్వ: మన మొద్దంటే ఆగుతారా యేమిటీ (నవ్వుతూ) ఇదుగో! మామగారొచ్చినప్పుడు చెబుతాను మీ అబ్బాయి నాటకాల్లో తిరిగి చెడిపోతున్నాడని.

రామ: అబ్బో! ఎలిక్కి పిల్లి సాచ్చెమంట. ఇంతకీ పదాకు లెక్కన సదివే డాయన. ఆయ నేం జేత్తాడు.

పార్వ: అదేమిటి రామక్కా మామగార్ని—

రామ: ఏం వంగనా చనుకుంటున్నావా మీ మావ?—పోతా, తొందరగా పోసేసి పెందలాడి యింటికెళ్లి గొడ్డనిప్పాలి. బుడ్డాడు లెగవటం లేదు.

పార్వ: అబ్బ వెట్టిగాని లెద్దూ తొంద రేమిటి? అయితే యేమిటి కొద్దిగా చెప్పవే మామగారి సంగతి?

రామ: అబ్బో అదంతా పెద్ద భాగోతం. ఇప్పుడెక్కడ. అయినా సెప్పే మాటలు గాదులే అయి.

పార్వ: అదుగో నాదగ్గర కూడా రహస్య మేనా. ఎవరితో నన్నా అంటానా! నేను కాపరాని కొచ్చి నప్పట్నుంచీ యెరుగుదువే నిన్ను నాతో చెబితే యేం. ఏమిటి చెప్పు?

రామ: అచ్చే యేం లేదు. ఆయన గూడా ఒకప్పుడు కాల్జారిన మనిసేనని.

పార్వ: అదే ఎక్కడ—నువ్వసలు కూర్చో ముందు. (చెయ్యిపట్టుకుని కూర్చోబెట్టి) ఆ! ఏమిటి? ఎక్కడా?

రామ: అయ్యొ! మీ ఆయ నొస్తాడేమో బాగుండదు.

పార్వ: రార్లే యిప్పుడే వెళ్లారు.

రామ: ఒత్తే మటుకు వచ్చేం జేత్తాడు. చిన్నప్పట్నుంచీ నా పాల్తో పెరిగినోడు.

పార్వ: అవున్లే—ఏదీ?

రామ: ఏముందీ. ఈపయోజీకుడు మీ అత్త కడుపున బడ్డాడు. ఆయన సానిగూడెంమీద పడ్డాడు.

పార్వ: ఉహూ! ఎక్కడ ఏ వూరు?

రామ: బందర్లో వుండేదిలే వో సాని. నాలుగేళ్లపాటు దాని ల్లిడిసి పెట్టలా. సివరికి మనూరి పెద్ద మనుసులు కొందరు మీ అత్తనిగూడా వెంటేసుకు నెల్లి అక్కడ బెమ్మపెలయం జేత్తే యెట్టాగోట్టా బయటపడ్డాడు. అప్పటికీ వొచ్చే వోడేనా. దాని కూడా కడుపైతే యింకొందుకులే అని వొచ్చేశాడు. మొగాళ్ళంతా ఇంతేగా ఉండంత కాల ముండటం కడుపయ్యేతలికి గప్‌చిప్‌గా తప్పుకోటం—

పార్వ: అయితే మామగారు కూడా—

రామ: అబ్బో ఒకప్పుడెలిగించినోడే. అయితే యేం పాపం అప్పట్నుంచీ మళ్లీ యెక్కడా—మాట్టాడిగోడు. చేసినపనికి సాలా నొచ్చుకునే వాడంట. మీ అత్త సెప్పేది నాతో. ఏదో అట్టా శని తోసుకొచ్చి తప్పటడుగేశాడు. ఆమాత్రం పెద్దమనిసుండాడంటమ్మా మనూర్లో.

పార్వ: అయితే యీయనగార్నిక జాగ్రత్త చెయ్యాల్సిందే.

రామ: అంతా అట్టాగే ఉంటారంటమ్మా పోట్టాడుకునేరు కొంపదీసి నా మూలంగా. ఇకెల్లా పొద్దెక్కుతుంది.

పార్వ: ఏమిటి యింటిదగ్గర విశేషాలు. అత్తగారొక్కసారి రమ్మందూ మంచి సినిమా వొచ్చింది చూస్తారు.

ప్రభా: (ప్రవేశించి) ఏమిటేవో రహస్యాలు చెప్పుకుంటున్నారు!

రామ: నీమీద సాడీలు సెబుతా వుండయ్యా! అద్దిరాత్తిరిదాకా యింటికి రావంట. నాటకాల్లో తిరిగి సెడిపోతున్నావంట. సలికాలంలో పెందరాడి కొంపసేరక మాబాద పెసతున్నావంట మీ నాన్నతో చెప్పి కొట్టిచ్చుద్దంట నిన్ను. ఆ మరిశేపోయినా ఆనిక్క బస్సులో మీ నాన్నొత్తన్నాడు. బోజనఏలకి వొత్తాడంట. యెల్లా (వెళ్ళిపోతుంది)

ప్రభా: అబ్బా! వేడిచేసిందే.

పార్వ: చెయ్యదూ మరి. అర్ధరాత్రిదాకా నిద్దరలేకుండా ఉంటూంటే.

ప్రభా: ఏం చెయ్యనే. నే నుంటేనేగాని అంతా సరిగ్గా ఉండదు.

పార్వ: మీా రెందుకండీ అక్కడ మీారేమీా వెయ్యరుగా.

ప్రభా: వెయ్యకపోతే మటుకేమే? నాటకం వ్రాసినవాణ్ణి నేనైతే నేనులేకుండా వుంటే యింకేం రిహార్సలు.

పార్వ: ఏదో చెప్పండి వంక. నే నేమన్నా మీావెంట వచ్చి చూశేదాన్నా పెట్టేదాన్నా; యింట్లో పడుండేదాన్ని. మీాయిష్టం ఏంచేస్తే మటుకు కాదనేదెవరు?

ప్రభా: ఊఁ...అయితే పడిందన్నమాట కడుపులో యేదో అనుమానం.

పార్వ: పడితేమటుకేం? మీాదారికేమన్నా అడ్డమా!

ప్రభా: నీ తప్పదియ్యాల రెండేళ్లిబట్టీ కాపరం చేస్తున్నా యింకా నమ్మటంలేదే నన్ను.

పార్వ: ఏమో యెంతసేపు కావాలి కాలుజారటానికి. /మహామహావాళ్లు యెంతో పెద్దమనుషు లనుకునేవాళ్లే తప్పటడుగులు వేశారు.

ప్రభా: అంత అనుమానంగా ఉంటే నువ్వు కూడా రారాదూ నావెంట.

పార్వ: ఏమిటీ! ఈసారంటే అన్నారు, ఇంకెప్పుడూ అనకం డామాట.

ప్రభా: ఏం?

పార్వ: ఏమేమిఁటండి. ఎక్కడన్నా కాపరం చేసుకుంటూ మర్యాదగా బతికే ఆడవాళ్ళట్లాంటి చోటు కొస్తారుటండీ. ఎవరో భోగంవాళ్ళు రావాలిగాని.

ప్రభా: పొరపాటు గొప్పగొప్పవాళ్లే యెంతో గౌరవంగా బతికేవాళ్లే వస్తారు. మునిసిపల్ కౌన్సిలర్ గారి అమ్మాయిలు మా నాటకాల్లో డ్యాన్సు చెయ్యటానికి వస్తారు తెలుసా. నాకే కనక ఒక చెల్లెలున్నట్టయితే నాతోపాటు చదివించి నాటకాల్లో వేషాలు వేయించి ఒక గొప్ప 'స్టార్' ని చేసేవాణ్ణి. ...ఇంకా... పెద్ద రచయితనైపోయి, డైరక్టర్నయి, ప్రొడ్యూసర్నయి ప్రపంచఖ్యాతి పొందుదా మనుకున్నాను. నువ్వొప్పవే సాగిస్తివి.

పార్వ: ఇంకేం — ఒక భోగందాన్ని కూడా ఉంచుకున్నారంటే చక్కగా మీారు తీయబోయే సినిమాలో డబ్బు ఖర్చులేకుండా యాక్టు చేస్తుంది. అప్పుడింకా యెక్కువ సినిమాలు తీసి యింకా యెక్కువ కీర్తి సంపాదించుకోవచ్చు.

ప్రభా: ఒసేవ్ నువ్వు నన్ను అవమానపరుస్తున్నావ్.

పార్వ: మీాకంటేనా? ఒక్కదాన్నీ టిక్కు టిక్కుమంటూ కొంపలో ఒదిలిపెట్టి మీా యిష్టం వచ్చినట్లు తిరిగిరావటం నన్ను అవమానపరచటం కాదు కాబోలు.

ప్రభా: 'ఇష్టం వచ్చినట్లూ!'—ఒసేవ్ నాకు కోప మొస్తున్నదనే చెప్పాలి.

పార్వ: స్వేచ్ఛ కద్దు తగిత్తే రాదూ మరి.

ప్రభా: వచ్చేసింది. తియ్ పెట్టెలోనుంచీ లంగోటీ తియ్.

పార్వ: లంగోటీ యెందుకు?

ప్రభా: అది కట్టుకుని నీతో పోట్లాడాలి

పార్వ: నాతో పోట్లాట్టానికి లంగోటీ అక్కర్లేదు. అయినా నేను మీాతో పోట్లాడ కూర్చోలేదు. మీా యిష్టం వచ్చినట్లు చేసుకోండి. (వెళ్ళబోతూంది)

ప్రభా: ఆగు, ఈ మాట వినిపో. నీతో నేనూ పోట్లాడను. ఇంత అనుమానపడే పెళ్లాంతో కాపరం చేసేకంటే సన్యాసం పుచ్చుకోటం మెఱుగు. ఆ పనే చెయ్యబోతున్నాను. ఇప్పటివరకు పుచ్చుకున్న వాళ్ళల్లో నూటికి తొంభై తొమ్మిదిమంది పెళ్ళాం దెబ్బకి తట్టుకోలేక పుచ్చుకున్న వాళ్ళే. నేనూ వెళ్ళిపోతున్నాను. తలు పేసుకో.

పార్వ: ఎక్కడికో?

ప్రభా: నా యిష్టం వొచ్చినచోటుకి, హిమాలయాలకి వెళ్తాను.

పార్వ: అక్కడ మహా చలి. మీా రగ్గు తీసి కెళ్ళండి.

ప్రభా: అయితే వింధ్యపర్వతాల్లో కెళ్ళిపోతాను.

పార్వ: తలుచు ఉత్తరాలు వ్రాస్తూండండి.

ప్రభా: ఉత్తరాలు గిత్తరాలు జాంతానై. ఈ పూటతో నీకు నాకూ రాంరాం.

పార్వ: మళీ నాపేర పాలమేమన్నా వ్రాసి—

ప్రభా: దావా వేసుకో.

పార్వ: కోర్టు ఖర్చు లిప్పించండి.

ప్రభా: వస్తువు లమ్మకో (వెళ్లిపోతూండగా మాధవరావొస్తాడు) రారా! బావా! (పార్వతి లోపలికి వెళ్తుంది కొబ్బరినూనెకోసం)

మాధ: ఎక్కడికి బయల్దేరేవు (వచ్చి కుర్చీలో కూర్చుంటాడు)

ప్రభా: ఎక్కడికీ లేదురా. సిగరెట్లయిపోయినయ్. కొట్టుదాకా వెళ్దామని.

మాధ: ఉన్నయ్ లేరా.

ప్రభా: నువ్వురా బావవంటే! ఏదీ ఒక్కటిప్పించు (తీసుకుని ముట్టిస్తాడు. పార్వతి వచ్చి తలకి నూనె రాస్తూంటుంది)

మాధ: బావ బావంటమేగాని నీ చెల్లెల్ని చేసేదేమైనా ఉందా పాడా. ఊరికి నే అంటానికేం.

ప్రభా: లేదుగదరా. ఉంటే ఊరుకుందేవాణ్ణా. సుప్రసిద్ధ నటులు శ్రీ శ్రీ రంగదుప్పి మామిళ్ళ మాధవరావుగారి బావమరిదినంటే నా కెంతగౌరవం!

పార్వ: ఎందుకన్నయ్యా మనకీ వంశంలో వాళ్లు. ఈయన్ని చేసుకుని నే నింత సుఖపడుతున్నాను గదా. ఈయనకే కవక చెల్లెలుంటే ఎంత గయ్యాళి దయ్యేదో. ఆవిణ్ణి చేసుకుని మీరేం సుఖపడతారు. (లోపలికి వెళ్తుంది)

ప్రభా: అబ్బ! బహు కష్టపడుతున్నదిరా యిల్లాలు. పోనీ ఒకపని చెయ్యరాదుట్రా...వన్నే చేసుకోరాదూ. దీన్ని పుట్టింటికి తోలేస్తాను.

మాధ: చేసుకోవచ్చుగాని నువ్వు ఉద్యోగం మానేసి వంటచేస్తూ యింట్లో ఉంటావా?

ప్రభా: నే నొక్కణ్ణే చెయ్యటమేం? చెరి పదిహేనురోజుల చొప్పున. ఎవడింట్లో ఉంటే వాడు పెళ్ళాం. బయట పన్లుచూసేవాడు మొగుడు.

మాధ: సరేగాని మూడురోజులు బయట కూర్చోటం మాత్రం నీపనే.

ప్రభా: ఎందుకని, చెరి రోజున్నర.

మాధ: మరి యింతమంచి అభిప్రాయాన్నిన్ని రోజులబట్టీ దాచావేం?

ప్రభా: మించిపోయిందేమిల్లే అని ఊరుకున్నాను—

మాధ: సరే యీ సొల్లుకబుర్లకేంగాని ఒక ముఖ్యమైన రహస్యవిషయం మాట్లాట్టానికి వచ్చాను.

ప్రభా: ఏమిట్రోయ్ అంత ముఖ్యమైన విషయం! కొత్తగా మాట్లాడుతున్నావే యివాళ. అసలెందుకనో వాలకమంతా కొత్తగానే ఉందిలే! ఏమిటి సంగతీ?

మాధ: చెబుతా...పార్వతి—

ప్రభా: లేదులే దొడ్లో స్నానం చెయ్యటానికి వెళ్ళినట్టుంది.

మాధ: రాత్రల్లా యీవిషయంమీద నాకు నేనే తర్జనభర్జన చేసుకున్నాను. ఒక నిర్ణయానికి వచ్చాను. నీతో చెప్పి నిశ్చయం చేసుకుందా మనుకుంటున్నాను. ఇది నా జీవితసమస్య. జాగ్రత్తగా ఆలోచించు.

ప్రభా: ఏమిట్రా అంత కొత్తగా మాట్లాడుతున్నావ్. అసలుసంగ తేమిటి?

మాధ: ఏం లేదురా పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నాను.

ప్రభా: నిజంగానా!...ఏం...నేటికవసర మనిపించిందా. రెండేళ్లబట్టీ నేను చెబుతున్నా వద్దంటున్నావుగా.

మాధ: ఏం చెయ్యమంటావురా నాకొచ్చేది అరవైరూపాయలా! నాకే హస్తాహస్తి. మరోమనిషి కూడా యేం పెట్టను చెప్పు.

ప్రభా: బాగుందే—సరిపోవటానికీ పోకపోవటానికీ ఎక్కడ్రా? అందులో నే; తప్పేదేమన్నా ఉందా.

మాధ : అయితే యిప్పుడా యిబ్బందికూడా లేకుండా కుదురుతుంది.

ప్రభా: ఏం బాగా ఉన్న పిల్లా యేమిటి? అసలు సంగతంతా చెప్పు. ఎవరమ్మాయ్? యేం చేస్తున్నది?...

మాధ: అదుగో ఆ విషయంగురించే మన మిప్పుడాలోచించాలిసింది—నాకు అమ్మా నాన్నా లేరు గదా! ఉన్న అక్కయ్యలకీ నాకూ సగమెఱుక. కాబట్టి నే నేపిల్లని చేసుకున్నా కాదనేవాళ్లు లేరు గదా; ముందీసంగతి చెప్పు; పుటకకీ ప్రవర్తనకీ సంబంధ ముంటుందంటావా?

ప్రభా: కొన్నిచోట్ల ఉండవచ్చు. అందరు వ్యక్తుల విషయంలో అలా ఉంటుందని చెప్పలేము.

మాధ: అయితే మంచి భోగంపిల్లని చేసుకోమంటావా?

ప్రభా: నిరభ్యంతరంగా—అయితే నీ మనస్సు కష్టపడే ప్రవర్తన లేకుండా ఉండాలి—అంటే—

వృత్తిలోకి దిగిన పిల్ల కాకుండా వుండాలి. ఇంతకీ ఎవరో చెప్పవేం? నే నేలుగుదునా! ఎవర్రా!

మాధ: వసుంధర.

ప్రభా: వసుంధరా! మన నాటకంలో వేషం వేసే వసుంధర! నిజం చెప్పు. నాతో యెగతాళిగా మాట్లాడుతున్నావా!

మాధ: ఎగతాళేమిట్రా—రాత్రల్లా యీ విషయాన్ని గురించి ఆలోచించి ఆలోచించి ఇక నీ ఒక్కడితో మాట్లాడి ఆఖరు నిర్ణయం చేసుకుందామని వచ్చాను.

ప్రభా: అది సరేరా—అస లింతదూర మెలా వచ్చింది? నువ్వా అమ్మాయితో మాట్లాడేవా? చేసుకుంటానందా? అసలు కథంతా మొదట్నుంచీ చెప్పరా!

మాధ: ఏముందిరా—మొన్నొక రోజున మన హార్మోనిష్టు భీమశంకరం పాటలు ప్రాక్టీసు చేయిస్తా రేదో మామూలుగా అడిగేడట కుటుంబ పరిస్థితులు. ఆ మాటమీదా యీ మాటమీదా వచ్చి ఎవరైనా పెళ్లి చేసుకుందామని అనుకుంటున్నట్టుగా మాట్లాడిందట. ఆ విషయం నిన్న పొద్దున నాతో చెప్పేడు.

ప్రభా: కావచ్చు. అంతమాత్రంచేత నిన్ను చేసుకుంటుందని—

మాధ: ఆగరా—పొంతం విను మరి; ఈ వూరొచ్చినప్పట్నుంచీ ఆ అమ్మాయిని చేసుకోవాలని పించింది నాకు. భీమశంకరం నాతో యీ మాట చెప్పగానే మన ప్రయత్నాని కనుకూలంగానే ఉందని అతనిచేతనే అడిగించాను.

ప్రభా: ఏమని?

మాధ: పేరు మాత్రం చెప్పకుండా నా పరిస్థితంతా చెప్పి యేమంటుందో కనుక్కోమని. చేసుకుంటానందట.

ప్రభా: నిజంగానా!

మాధ: ఒట్టురా; ఇక చెయ్యాల్సిందేమిటంటే మనిద్దరం వెళ్లి స్వయంగా అడిగి తేల్చుకోవటమే. ఇక అనుమానమేమీ లేదురా. ఖాయంగా ఒప్పుకుంటుంది. రిహార్సల్లో కనిపెడుతునే ఉన్నాగా.

ప్రభా: ఆ పిల్లసంగతి సరే, మరి ఆ అమ్మాయి తండ్రో?

మాధ: ఎవడు వీరాస్వామిగాడా! వాడొప్పుకుంటే యెవడిక్కావాలి ఒప్పుకోకపోతే యెవడిక్కావాలి. ఆ అమ్మా యొప్పుకుంటే చాలు.

ప్రభా: అదేమిటి! అత నిష్టంలేకుండా.

మాధ: వాడిసంగతి చాలా ఉందిలేరా. అసలు వాడీ అమ్మాయి తండ్రి కాడుట. ఈ పిల్ల పుట్టిం తర్వాత తల్లిదగ్గరకొచ్చి చేరేడుట ఆ మనిషి రెండు నెలల్రిందటే పోయిందట. ఇప్పు డతని గొడవేమిటీ, యెలాగైనా యీ పిల్ల పేరనున్న ఆస్తి కాస్తా కాజేసి చల్లగా తప్పుకుందామని.

ప్రభా: ఓరి పిడి తస్సదియ్యా! తండ్రే అనుకుంటున్నా! అయితే ఆ అమ్మాయికి ఆస్తికూడా ఉందేమిటి.

మాధ: ఏదో కొద్దిగా వుందిలే. బందర్లో ఒక చిన్న యిల్లు. బ్యాంకులో ఒక రెండువేలు రొఖ్ఖం.

ప్రభా: అహా! మొత్తానికి భోగట్టా అంతా తీశావన్నమాట. నిజంగా ఆ పిల్లని నువ్వు చేసుకుంటే సుఖపడతావురా. ఆస్తిసంగతి దేవుడెరుగుగాని యెంత చక్కటి పిల్లరా. చక్కగా 'ఆక్టు' చేస్తుంది. ఒక్కసారి చెబితే చాలురా, వెంటనే గ్రహిస్తుంది. కాస్త చదువూ సంస్కారం ఉన్న పిల్లలాగే ఉంది. చేసుకోరా నాకూ బాగానే ఉంది.

మాధ: మరి నీ సాయం కావాలి.

ప్రభా: నేనేం చెయ్యాలిందులో? పెళ్ళంతా నా చేతిమీదుగానే జరిపేస్తాను.

మాధ: అది సరేలేవోయ్. ముందుసంగతో. నువ్వు వాళ్ళిద్దరితో మాట్లాడాలి. కాలేజీ మేష్టరువనీ, మంచివాడివనీ నీకు పెద్ద గౌరవమాయె అక్కడ. మరి భోంచేసింతర్వాత వెళ్దామా రూముకి.

ప్రభా: ఎందుకురా ఆ అమ్మాయి యిక్కడికే వస్తుంది.

మాధ: ఎప్పుడు? నిజంగా? ఎందుకు?

ప్రభా: మొన్న మన ఆర్గనైజర్ని చదువుకోవటాని కేమైనా పుస్తకాలుంటే యివ్వండని అడిగిందట. అతను నన్నడిగమని చెప్పేడు అడిగింది. కావాల్సినవేవో వచ్చి చూసుకోమని చెప్పేను. మన రమణగాణ్ణి వెంటబెట్టుకుని యీపూట వస్తానంది. ఇంకోళ్లయింటికైతే అలా వస్తారా. రమ్మంటాని కసలు కుండేలుంటాయా! మనమంటే గౌరవమోయ్. అయ్యగారి పద్ధతంతా వేఱు. పెద్దమనిషితరహా—

మాధ: అఘోరించినట్టుంది నీ పెద్దమనిషితనం.

[ప్రవేశం 12 యేళ్ల కుర్రాడు రమణ]

రమ: మేష్టరుగారూ! మరి—

ప్రభా: వచ్చిందా వసుంధర?

రమ: వచ్చిందండి. అదుగో బయట—

ప్రభా: అరే రమ్మను (లేచి వాకిలిదాకా వెళ్ళి) రామ్మాయి! అదేమిటే బయట నిలబడ్డావేం. రా! .... కూర్చో.

వసుంధర: (ఇద్దరికీ నమస్కారం చేసి కూర్చుంటుంది)

రమణ: నేను లేడీసూ ఆఫీసుదాకా వెళ్ళొస్తానండి. రాజుగారు చీటీయిచ్చి రమ్మన్నారు. (వెళ్తాడు)

ప్రభా: (మాధవరావుని చూపుతూ) వీరి నెరుగుదువా?

మాధ: (ప్రభాకరాన్ని చూపుతూ) వీరు సాక్షాత్తు ఆంజనేయస్వామి అవతారం. ఆ మొహం ఆ వాలకం అంతా తెలుస్తూనే వుంది గాబట్టి వేరే చెప్పక్కర్లేదనుకుంటా.

ప్రభా: (పెద్దగా) ఉంటే ఒక్కసారిలా దయచేస్తావ్ (లోపలనుంచి "వస్తున్నా") చిత్తం అలాగా కానీయ్— కాని కొంచెం శీఘ్రంగా.

పార్వ: ("ఏ మ్మునిగిపోయిం"దంటూ ప్రవేశించి నాలుక్కరుచుకుని వసుంధరని చూస్తూంటుంది)

ప్రభా: ఇలా రా! ఈ అమ్మాయిని వసుంధరంటారు. మా నాటకంలో వేషం వేస్తున్నదని చెప్పేనే...

పార్వ: ఓహో! బాగా పాడుతుందని కూడా చెప్పేరు.

ప్రభా. ఆ! ఆ అమ్మాయే. ఇక—(వసుంధరతో) ఈమెనిగురించి చెప్పాలంటే చాలా వుంది. నే నెక్కడ సుఖపడిపోతానో అని సృష్టించి బ్రహ్మదేవుడు నా మెడ కంటగట్టిన స్త్రీరత్నం. ఒక్కమాటలో చెప్పాలంటే నా భార్య.

మాధ: ఒరేయ్ నువ్వెన్ని జన్మల్లో పుణ్యం చేసుకున్నావో అలాంటిది దొరికింది. లేకపోతే నీ మొహానికి—

పార్వ: పాంకోటి టెక్కల్లే—

మాధ: హైదరాబాదు రాచిప్పల్లే.

పార్వ: మన బుద్ధికి మన అందానికి అమ్మో మాబోటివాళ్ళెం పనికొస్తామా.

మాధ: మొగవాడు గాని ఆడది గాని మనిషై పుట్టేంతర్వాత సిగ్గనేది ఉండాలి. మన మొఖమెట్లా ఉందో ఒక్కతడవ అద్దంలో చూసుకుని తర్వాత యితరుల్ని వెక్కిరించాలి.

ప్రభా: ముళ్ళకంప. రామరామ. కదిలించితే చాలు వదిలించుకోలేవు— మీ యిద్దరి నోళ్ళూ మూయించాలంటే బ్రహ్మతరం గాదు. ఇదుగో అమ్మాయి! అన్నా చెల్లెళ్ళిద్దరూ యేకమయ్యారు. థామస్ ఫుల్సీగాడి 'బ్యాలెన్సు ఆఫ్ పవర్' సిద్ధాంతం ప్రకారం మనిద్దరం ఒక పక్షం కావాలి.

వసుం: వదినెగారదృష్టవంతురాలు.

పార్వ: ఎందుకనో.

వసుం: ఎప్పుడూ కులాసాగా నవ్విస్తూ రోజు క్షణంగా గడిపే భర్త దొరకటంకంటె స్త్రీకి అదృష్టమేముంది చెప్పండి?

పార్వ: నాలుగురోజు లిక్కడున్నావంటే తెలుస్తుంది నా అదృష్టం. కొత్తవాళ్ళముందబ్బో యెంత మర్యాద.

ప్రభా: ఒసే! అంటే రాతిపల్లే మీదపడతావు గాని యింటికి చుట్టాలంటూ వచ్చినప్పుడు కాస్త కాఫీ అంటూ—బొత్తిగా మర్యాదంటూ తెలియదేమే నీకు?

వసుం: అబ్బె! ఇప్పుడే—

పార్వ: మరిచేపోయానండీ మాటలసందట్లో పడి—

ప్రభా: మా యిద్దరికీ చాల్లే. నువ్వు కళ్ళుమూసుకుంటావుగదరా మేం తాగేటప్పుడు.

పార్వ: (లోపలికి వెళ్తూ) కలపగానే పిలుస్తాను లోపలికి రా అన్నయ్యా! గప్‌చిప్‌గా చేరి కాస్త తాగుదాం (వెళ్తుంది)

మాధ: సరే నే నొస్తారా. కాస్తపనుంది (ప్రభాకరానికి కన్నుగిలిపి వెళ్ళబోతూండగా అతను చెయ్యిపట్టుకుని నిలిపి కూర్చోబెడతాడు)

ప్రభా: ఆగరా పోదుగాని తొందరేం.

మాధ: బజార్లో పనుందిరా కొద్దిగా.

ప్రభా: నీకూ నాకూ పన్లేం దెప్పకులే. భోంచేసి పోదువుగాన్లే కూర్చో...ఏమిటమ్మా సంగతులు?

వసుం: ఏమున్నయ్యండి.

ప్రభా: మామూలుగా మా యింటి పరిస్థితులు. ఎప్పుడూ ఒకళ్లనొకళ్లు వెక్కిరించుకోవటం పోట్లాడుకోవటం.

వసుం: ఇంతకంటె యేం కావాలండీ జీవితానికి! నిర్మలమైన హృదయాలతో—ప్రేమించుకుంటూ—హాయిగా కాలంగడిపేకంటె మనుషుల కేం కావాలండి! నాబోటివాళ్లకి మీ ఆనందంచూస్తే యెన్ని జన్మలకైనా యిలా బ్రతికే అదృష్టం దొరుకుతుందా అని జీవితంమీద విరక్తికూడా కలుగుతుంది. నరకంలో నుంచి స్వర్గంలో పడితే యెలా ఉంటుందో అలా ఉంది నాకీ అయిదు నిమిషాలనుంచీ.

ప్రభా: మీ యిళ్ళల్లోమటుకు లేవమ్మా.

వసుం: హుఁ...ఇళ్లు. మావికూడా యిళ్ళే నంటారా? పాపపుకూళ్లు. ఇప్పుడా రొంపిని జ్ఞాపకం చేసుకోవటం దేనికిలెండి. చెప్పండి? చదువుకున్న వారుగదా! పుణ్యపాపా లున్నాయంటారా?

ప్రభా: ఉన్నయో లేవో చెప్పలేనుగాని ఉన్నట్టుగానే నా మనస్సుకు నిష్కారణంగా తోస్తుంది. అంటే నమ్మకముంది కొద్దిగా.

వసుం: అయితే పాపం చేసుకుంటే నేగదూ భోగంకులంలో పుట్టేది.

ప్రభా: అదేమిటమ్మా! ఎందుకని.

వసుంధర: ఎందు కేమిటండీ! చదువూ విజ్ఞానం ప్రేమా ఆనందం అన్నిటికీ దూరమైపోయి పురుగుల్లాగా ఆ పాడునరకంలో పడిఉండటం పాపం కాకపోతే మరేమిటో చెప్పండి.

మాధ: అదేమిటి నీచంగా బ్రతికేవాళ్లేకులంలో మాత్ర మెందుకు లేరు? ఈ బెజవాడలో నిజానికి భోగంవృత్తిలో వున్న వాళ్ళు నూటికి తొంభైమంది మే మెక్కువంటే మే మెక్కువనుకు నే కులాలవాళ్లే.

ప్రభా: పుటకకి వ్యక్తి కారణం కాదమ్మా తాను చేసేపన్లకీ తన జీవనవిధానానికీ కారణం. మీ కులంకూడా చాలావరకు మారిపోయింది. చదువుకుని పెళ్ళిచేసుకుని సంసారులకంటె నీతిగా బ్రతికేవాళ్లెందరు లేరమ్మా.

వసుం: ఉండొచ్చులెండి, కొద్దిగా యెవరో అదృష్టం వున్నవాళ్లు.

ప్రభా: దానికి పెద్ద అదృష్ట మేమిటమ్మా. అలా నడుచుకోవటమే.

వసుం: అది సాధ్యమౌతుందంటారా?

ప్రభా: తప్పకుండా. ఇదేం భూమికీ ఆకాశానికీ తాళం వెయ్యటమా. మనచేతిలో ఉన్న దాన్ని మనం చెయ్యటంలో సాధ్యం అసాధ్యం అన్న ప్రశ్నేముంది.

వసుం: అయితే ఒక చిన్న సాయం చేస్తారా! నే నీప్రాంతంలో నే ఎక్కడనా ఒక చిన్న గది తీసుకు నుంటాను. మీదగ్గర చదువుకుంటాను నాకు గార్డియన్ గా ఉండండి. నే నిక ఆ పాడు లోకంలో అడుగు పెట్టను.

ప్రభా: ఓ అలాగే! అయినా నీకంత కష్ట మేమొచ్చిందమ్మా? మీ నాన్న నువ్వు చెప్పినట్టే వింటాడుగా.

వసుం: (నిట్టూర్చి) నాన్న...భోగం కొంపల్లో 'నాన్న' 'అన్న' అనేవి ఉద్యోగాల్లాంటివి. ఒక్క తల్లీ కూతుళ్లది తప్పితే మిగతా సంబంధాలన్నీ బూటకాలే.

ప్రభా: అయితే వీ—రా—స్వా—మి?

వసుం: ఆ! వీరాస్వామి—మా అమ్మ మొగుడు—నాపాలిటి యముడు.

ప్రభా: అదేం! నువ్వంటే బాగా నే ఉంటాడే. ఏమన్నా కష్టపెడుతున్నాడా?

వసుం: ...ఎందుకులెండి అన్నయ్యగారూ! ఈ మాటలన్నీ ఆ మనిషితో సంబంధం పూర్తిగా తెంచుకున్న తర్వాత అనుకోవాల్సినవి. లేకపోతే—

మాధ: తెంచుకోరాదూ?

వసుం: ఆశ్రయం లేకుండా ఆడది బతగ్గలదా?

మాధ: మరోటి కల్పించుకోవటమే.

వసుం: ఎక్కడ?

మాధ: ఇష్టమైన చోట.

వసుం: నిజమేనా?

మాధ: అతురాలా!

వసుం: (నవ్వుతూ) అయితే మీ యిద్దరూ హామీ.

మాధ: కచ్చితంగా.

ప్రభా: చెప్పమ్మా? అసలు సంగతేమిటి? ఈ వీరాస్వామి యెవరు? నీకేం యిబ్బంది కల్గిస్తున్నాడు.

వసుం: ....పదహారేళ్ల క్రితం మాట; మొదట్లో యితను గుఱ్ఱబ్బండీ తోలేవాడు. పెద్ద జట్టుండేది. ఇతన్ని చూస్తే బందరులో సానివాడంతా భయపడేది. ఇరవైనాలుగ్గంటలూ

తాగుడూ పేకాటా ఇత వాడిం దాక పోసింది పాటగా ఉండేది నేను పుట్టేంతర్వాత యితను మా అమ్మదగ్గరికి చేరేకుట.

ప్రభా: అదా సంగతి ఇతను మీ నాన్నే అనుకుంటున్నాం, యిన్నాళ్లబట్టీ

వసుం: కాదండీ ఈ విషయం యీ వీరాస్వామి సంగతీ అంతా చచ్చిపోయేముందు మా అమ్మే చెప్పింది.

మాధ: మరయితే అసలు మీ నాన్నెవరో చెప్పలా?

వసుం: ఎవరో చౌదరి గారని చెప్పిందండి. అట్లానే పిలిచేదిట. అసలు పేరేదో మరిచేపోయిందండీ ఎందుకూ మా అమ్మా ఆయనా కలిసి తీయించుకున్న ఫోటోలున్నయ్యండి ఈమధ్యనే తీసుకొచ్చాను. నా పెట్టెలో ఉన్నయ్. ఏమనిషి కనుపించినా తేరిపార చూస్తాను ఫోటోలో మొహం పోలుపడుతుందేమోనని.

మాధ: ఆ! తర్వాత!

వసుం: మా వీధిలోనే ఒక చిన్న బడుండేదండి మా అమ్మ నన్ను అయిదోయేడునుంచే బళ్లోకి పంపేది. అయిదోక్లాసు దాకా ఆ బళ్లో చదువుకున్నాను. నేనింకా చదువుకుంటానంటె మా అమ్మ నన్ను హైస్కూల్లో చేర్పించింది. మూడెవ ఫారం చదువుతూండగా మానిపించేశాను నా కింత డబ్బు ఖర్చౌతున్నదని.

మాధ: ఇదేమి?... డబ్బు తనదికాదుగా మీ అమ్మదేగా.

వసుం: అయితేమటుకేమండి. ఎదురుచెప్పటానికి గుండె లెవరికున్నయ్! నే నెంతవరకు చదువుకుంటే అంతవరకు చెప్పిస్తాననేది; ఎందుకంటే మా అమ్మ స్నేహితురాలొకామెని తాశీల్దారుగారుంచుకుని పుట్టినకూతుర్నికి డాక్టరు చదువు చెప్పించాడట. వాళ్ళని చూసినప్పుడెల్లా మా అమ్మెంతో ఉబలాటపడేది నాక్కూడా పెద్దచదువు చెప్పించాలని.

మాధ: కొంపతీసి చదివివట్టయితే మా కొడ వేషం వేసేమనిషి దొరక్కపోను.

వసుం: అబ్బ యేం రాగతాళిచేస్తారు లెండి. ఇన్నాళ్లబట్టీ నే నే వేశావా యేమిటి? ఏదో అదృష్టవశాత్తు యీ ప్రాగునాటకానికి రావటం మీరు చూసి నన్ను తీసుకోవటం జరిగిందిగాని—

ప్రభా: ఆ!—మానేశావు తర్వాత—

వసుం: ఏముందండీ ఇంట్లో కూర్చోటమే. మాఅమ్మే నాకు సంగీతం నేర్పుతూండేది. ఎప్పుడన్నా అడిగితే కథల పుస్తకాలు కొనిపెట్టేది. అవి చదువుకుంటూ కాలం గడిపేదాన్ని. రెండేళ్లక్రితమే నాచేత వేషాలు వేయించటం మొదలుపెట్టేరు.

మాధ: నాటకాల్లోకి దింపిందీ యితనేనన్న మాట—అప్పుడే మాకు చాలా సాయపడ్డాడన్నమాట!

వసుం: ఏంసాయంచేశాడంటారు?

మాధ: అవును మరి. అతను నిన్ను నాటకాల్లోకి దింపకపోతే మన మిలా కలుసుకోవటం సందర్భపడేదికాదుగా అంట.

ప్రభా: అయితే యీ రెండేళ్లబట్టీ నాటకాలు వేస్తూనే ఉన్నావన్నమాట.

వసుం: ఆహా! ఆయనగారి తాగుడికి అన్నీ విధంగా ఉపయోగించుకుంటున్నాడు.

మాధ: అంతేనా!......ఇంకేమన్నా గందరగోళం...

వసుం: చేసేవాడే గానీండి, మాఅమ్మ చచ్చియేలోకానుంచో తను చెడ్డా నేనైనా నీతిగా బతకాలని అన్నీ సర్దుతూండేది.

మాధ: ఏంచేసేవా డేమిటి?

వసుం: ఏంచేస్తాడు. వాళ్లదగ్గరా వీళ్లదగ్గరా అమాటా యీమాటా చెప్పి డబ్బు తీసుకుని వాళ్ళని యింటిమీదికి తోలేవాడు. మాఅమ్మ వాళ్ళని బ్రతిమాలి, చెప్పినంత డబ్బు తిరిగి యిచ్చేసి కొందర్ని, కొందరి కామాటా యీమాటా చెప్పి పంపించేసేది. ఎవరైనా యింటికొస్తే చాలు నాకు గుండెలు పగిలి పక్కింటికి పరిగెత్తేదాన్ని. అయితే పోలీసుల్ని మాత్రం మానిలగొట్టేది.

మాధ: ఎట్లా?

వసుం: సబ్ ఇన్స్పెక్టరు వచ్చే వేళయిందనేది. పాపం గుండెలు బాదుకుంటూ పరిగెత్తేవాళ్లు.

మాధ: అయితే యెంత గ్రంథం చెయ్యాల్లో అంతా చేస్తూనేవున్నాడన్నమాట.

ప్రభా: పాపం మీ అమ్మపోయి రెండు నెలలైందా.

వసుం: అవునండి ఇంకా కొద్ది కాలమున్నా బ్రతికుంటే నన్నీయన బారినుంచి తప్పించేది.

ప్రభా: అంటే... పెళ్ళి చేసేదా!

వసుం: (సిగ్గుతో) రెండేళ్ళబట్టి ప్రయత్నం చేస్తూనే ఉందండి. మంచి సంబంధమెక్కడా దొరక్క ఊరుకుంది. మాకు మంచి వాళ్లెలా దొరుకుతారు చెప్పండి?

మాధ: ఎందుకు దొరకరూ చేసుకోదలిస్తే. వజ్రాల్లాంటివాళ్లు దొరుకుతారు.

ప్రభా: అవును. పిల్ల బంగారంలాంటిదైతే వజ్రంలాంటివాళ్లే దొరుకుతారు...ఊఁ......ఇదా సంగతి!

వసుం: దయచేసి అతన్తో మాత్రం ఒక్క మాట కూడా అనకండేం; పీక పిసికేస్తాడు......మీ బోటి వారితో మాకెంతో సంతోషంగానూ గౌరవంగానూ ఉంటుందండి. అదీ యెప్పుడైనా నాటకాలకంటూ యిల్లు కదిలితేనే. ఇంటిదగ్గరుంటే యేముంది, దిన దిన గండం—

ప్రభా: మూడవఫారందాకా చదువుకున్నావా!

వసుం: అందుకనేనండి కాస్త ఆ పుస్తకం యీ పుస్తకం చదవాలన్న ఉబలాటం. అందుకనే వచ్చాను. నాటక మయిపోయేలోగా చదివిచ్చేస్తాను.

ప్రభా: ఏం ఫరవాలేదు. అదుగో బీరువా నీ క్కావాల్సినవి తీసుకెళ్ళు (లోపల్నుంచి "అన్నయ్యగారూ")

ప్రభా: తీసుకురావే మహాలావు 'అన్నయ్యగారూ దున్నయ్యగారూనూ ఏ మీ క్కయిద్దరికే పాట్లూ.

పార్వ: (ప్రవేశించి కాఫీ ముగ్గురికీ యిచ్చి) వంకాయకూర చేశాను. బీరకాయలున్నయ్ యేం చెయ్యమంటారు.

ప్రభా: ఉన్నాదుగా అన్నయ్య. అయన్నే అడుగు.

పార్వ: సరే మా యిష్టమొచ్చిందే చేసుకుంటాం లెండి. వెయ్యమని అడిగినప్పుడు చెబుతా (ఇంట్లోకి వెళ్తుంది)

ప్రభా: తీసుకోమ్మా?

[ముగ్గురూ తాగుతారు. ప్రభాకరం మాధవరావులు సిగరెట్లు ముట్టిస్తారు]

మాధ: ఇప్పుడే వస్తారా (ప్రభాకరాన్ని చాటుగా గిల్లి వెళ్తాడు.)

ప్రభా: ఊఁ...మరేమిటమ్మా! ఇక ముందేం చెయ్యాలని.

వసుం: నేనేం చెయ్యగలను చెప్పండి ఏమీ తోచటంకూడా లేదు.

ప్రభా: మళ్ళీ మీవూరు వెళ్ళింతర్వాత వీరాస్వామి వెనకటి ప్రవర్తనే మొదలు పెడతాడేమో!

వసుం: అదే భయంగా ఉందండి. మొన్నటిదాకా మా అమ్ముండేది కాబట్టి గండాలన్నీ తప్పించేది. ఇప్పుడడ్డుపడే దెవరు? ఈ రెండు నెల్లబట్టీ అది చచ్చిపోయిన గొడవల్లో నామీద కెవర్నీ తోల లేదు. ఇక బతకనియ్యడేమోనని భయంగా ఉందండి. నన్నేం చెయ్యమంటారు చెప్పండి. మీ రేది చెబితే అది చేస్తాను. ఈ రెండేళ్ళబట్టీ వేషాలు వెయ్యటంలో కూడా అసలు కారణం అతనే అయినప్పటికీ నాకుకూడా కొంత ప్రయోజనముంటుందనే ఉద్దేశం కూడా కారణమేనండి. ఏమిటంటే పదిమందితో పరిచయమౌతుంది. ఎవరన్నా ఒకరు యేదోవిధంగా నా కీతనిబాధ తప్పిస్తారేమో నని. నా అదృష్టంకొద్దీ యిప్పటికి మీరు—

ప్రభా: ఒక పని చెయ్యరాదూ—

వసుం: ఏం చెయ్యమంటారు చెప్పండి మీరేం చెయ్యమంటే అది చేస్తాను. ఇంతవరకూ నాతో యింత ఆప్యాయంగా మాట్లాడినవారుకూడా లేరు. నా కష్టసుఖా లెవరికి కావాలి చెప్పండి.

ప్రభా: తిరిగి బందరు వెళ్ళబోకు.

వసుం: నిజమే వెళ్ళ కూడదనే ఉంది. అతను నూరుకుంటాడా యుద్ధం చెయ్యడూ. మరి నాకండగా యెవరు నిలుస్తారు చెప్పండి. ఎక్కడుండేది?

ప్రభా: ఆ యేర్పాట్లన్నీ ముందుగానే చేసుకుందాం.

వసుం: అంటే? చెప్పండి ఎలాగో.

ప్రభా: ఏముంది. నువ్వెవర్నన్నా పెళ్ళిచేసుకుందా మనుకుంటున్నావుగా చేసుకుని అతనింట్లో ఉండిపో.

వసుం: పె...ళ్ళా!

ప్రభా: ఊఁ! ఈ వారంరోజుల్లోనే జరుగుతుందా అని నీ అనుమానం కాదూ? అస లెలాంటివాణ్ణి చేసుకుందామని నీ ఉద్దేశం చెప్పు?

వసుం: నేనేం చెప్పగలనండి?

ప్రభా: అహా! ఉద్దేశం. ఎలాంటివాడైతే నీకు సుఖం దొరుకుతుంది...మరి పెళ్ళంటే మాటలు కాదు చూడు. నూరేళ్ల జీవితానికి సంబంధించిన విషయం. అన్నీ జాగ్రత్తగా ఆలోచించుకుని దిగాలి...

వసుం: మధ్యలో నన్ను! మోసం చెయ్యకుండా ఉంటే చాలండి. ఇంక నాకేం అక్కర్లేదు. నా చేత వేషాలు వేయించటాని కొప్పుకుంటే తేలిగ్గా నెలకు వంద రూపాయలు తేగల్ను. అలా యిష్టం లేకపోతే నాకింత తిండీ గుడ్డా యివ్వగల్గితే చాలు. డబ్బు సుఖం గురించి నాకేమీ ఆశ లేదండి. 'భార్య' అనే గౌరవం దొరికితే చాలు. మామూలు సంసారాల్లో పిల్లని చేసుకుంటే ఎలా ఉంటారో అలా ఉంటే చాలండి నాకు.

ప్రభా: మన హాస్యవిష్ణు భీమశంకరం నీతో మాట్లాడేడటగా మొన్న!

వసుం: మాట్లాడేరండి.

వసుం: ఏమన్నావ్?

వసుం: అలాగే నన్నానండి. మళ్ళీ ఆ విషయం గూర్చి ప్రస్తావన చెయ్యలేదు.

ప్రభా: మరయితే నే నొకటి చెపుతాను. నీకు యిష్టమైతే చూడు. మాధవరావుని చేసుకుంటావా?

వసుం: (ఆశ్చర్యంగా) ఆ! (తల వంచేస్తుంది)

ప్రభా: అవునమ్మా! భీమశంకరం నీకు చెప్పింది వీణ్ణిగురించే. పేరు చెప్పకుండా పరిస్థితంతా చెప్పేడు. అడిగించిందే వీడు. చేసుకోవాలని చాలా ఉబలాటపడుతున్నాడు. నువ్వొచ్చేదాకా యీ విషయాన్ని గురించే మాట్లాడుకుంటున్నాం. వెళ్ళి అడుగుదాం రమ్మంటున్నాడు. నువ్వొచ్చావు... చెప్పు నీ యిష్టమేనా.

వసుం: (సిగ్గుతో)......నిజంగానాండి.

ప్రభా: ఇటువంటి విషయాల్లో ఎగతాళిటమ్మా. చెప్పు. ముందు అసలుమనిషి నచ్చేడా?

వసుం: నాకంత అదృష్టం పడుతుందాండి!

ప్రభా: వాడూ అలాగే అనుకుంటున్నాడు. నువ్వొప్పుకోవటం తనకు పెద్ద అదృష్టమని.—ఇక వాడి పరిస్థితేమిటంటే తల్లిదండ్రులిద్దరూ లేరు. అప్పలున్నారంటే వాళ్ళు వీణ్ణి రమ్మనరు వీడు వాళ్ళిళ్ళకి వెళ్ళడు. వాళ్ళకి తగని అతిశయం వీడికి తగని అభిమానం. ఒక ప్రెస్సులో పనిచేస్తూ నెలకి అరవై రూపాయలు తెచ్చుకుంటున్నాడు. ఒక చిన్నగది అద్దెకి తీసుకుని కాలక్షేపం చేస్తున్నాడు. వస్తే మాయింటికి లేకపోతే రిహార్సల్ రూము. ఇదీ పరిస్థితి. స్వంత ఆస్తి యేమీ లేదు. ఆలోచించుకో మరి ......నా ఉద్దేశ్యంలో మీ పరిస్థితుల్నిబట్టి యిద్దరికీ చాలా చక్కగా సరిపోతుంది. ఇద్దరూ కలిసి నాటకాలాడుకోవచ్చు. నాలుగు డబ్బులు తెచ్చుకుని సుఖంగా జీవితం గడుపుకోవచ్చు. ఏమంటావ్?

వసుం: నా కంతకంటె యింకేం కావాలి. నా జీవితాంతం మీకు—

ప్రభా: అదుగో అదేవద్దు. నే నేం నీకు సాయం చెయ్యలేదు. నా స్నేహితుడి తరఫున నేను మాట్లాడుతున్నాను. ఇందులో ఒకళ్ళొకళ్ళకి కృతజ్ఞత చూపవలసిన అవసరమేమీ లేదు. ఎలాగైనా ఒక ఒడ్డుకు చేరుకుందామని నీ ఉద్దేశం. ఎలాగైనా నా స్నేహితుడు సుఖపడే పద్ధతి చూద్దామని నా ఉద్దేశం. ఈ రెండు ఉద్దేశాలతోనే మన సంభాషణంతా నడిచింది...... మరి సరే నన్నదని చెప్పమంటావా వాడితో?

వసుం: (కొద్దిగా తల పైకెత్తి కృతజ్ఞతా, ఆనందమూ, స్వేచ్ఛా అన్నీ ద్యోతకమయ్యేలాగ చూస్తూ అంగీకారాన్ని తెలియజేస్తుంది)

మాధ: (ప్రవేశించి) ఏమయిందన్నట్టు కళ్ళతో అడుగుతూ పైకి) ఇక నే నింటికి వెళ్తారా!

వసుం: (వెనకటిలాగా కాదు. ముఖకవళికల్లో కొద్ది మార్పు. కొద్దిగా పక్కకి తిరిగి కూర్చుంటుంది).

ప్రభా: పో! నే నేం బలవంతం చేస్తాననుకున్నావా. ఉండి నన్నేం ఉద్ధరిస్తావా. తిండి దండగ పైగా.

మాధ: పోనీరా నువ్వంత సరదా పడుతూంటే నేనెందుకు కాదనాలి. భోంచేసి పోతాలే.

ప్రభా: అరవకుండా యిటు రా (ప్రక్కన కూర్చోపెట్టుకుని) ఏవిఁటి మరి?

మాధ: ఏవిఁటి?

ప్రభా: వసుంధర ఒప్పుకుంది.

మాధ: నిజంగానా...అయితే—

ప్రభా: చెబుతా విను. నాటక మయ్యేలోపుగా మీరు పెళ్ళి చేసేసుకోండి. వీరాస్వామి యివాళో రేపో వస్తాడుగా! రాగానే చెబుదాం ఇక ఈ అమ్మాయితో సంబంధం వదులుకోమని.

మాధ: వదులుకో కేం జేస్తాడు. అసలతనికేం సంబంధం. ఎందుకు నా గదిలో నే—

ప్రభా: తొందర్లేదు. అదేం చాలుతుంది. కాస్త యిల్లంటూ దొరికేదాకా యిక్కడే వుండొచ్చు. ఒక్కటేమటుకు జాగ్రత్త. పెళ్ళయిపోయేదాకా మీ రేం బయటపడకూడదు.

[ప్రవేశం: కనకరాజు, వీరాస్వామి.]

ప్రభా: హలో! కనకరాజుగారూ! అరె వీరాస్వామిగారు కూడా వచ్చారే! రండి రండి. కూర్చోండి (లేచి కుర్చీలు ముందుకి జరుపుతాడు.)

వీరా: కూర్చోవటానికి వీలేదండి. వాకిట్లో రిక్షా నిలబడిఉంది. ఈ బస్సులో బందరు వెళ్ళిపోవాలి. ఇదిక్కడికి వచ్చిందని మనవాళ్ళు చెబితే వచ్చాను — ఇక్కడికొచ్చావేమే?

ప్రభా: ఆ యేదో చదువుకోవటానికి పుస్తకాల కోసమని వచ్చింది. ముందు మీరు కూర్చోండి (ఇద్దర్నీ కూర్చోబెడతాడు. మాధవరావు టేబిల్ మీదకి చేరతాడు) అయితే యిదేమిటి యిప్పుడు వెళ్ళటం?

కనక: వారంరోజుల్లో నాటకం పెట్టుకుని యిప్పుడామ్మాయిని తీసికెళ్తానంటాడండి. ఇప్పటికింత డబ్బు ఖర్చు పెట్టేము.

ప్రభా: అదేమిటండీ వీరాస్వామిగారూ! న్యాయమేనా? మధ్యలో వెళ్ళటం యేం బాగుంటుంది చెప్పండి.

వీరా: కాదు మేష్టరుగారూ అర్జంటు పనొకటుంది. అది చూసుకుని మళ్ళీ యెల్లుండి పొద్దునకల్లా వచ్చేస్తాను.

ప్రభా: అదేదో మీరే చూసుకోరాదూ.

వీరా: కాదండీ అది కూడా రావాలి.

ప్రభా: అంత అర్జంటు పనేమిటబ్బా.

కనక: ఈ పిల్ల పేర నున్న యింటికేదో మంచి ధర వచ్చిందట. వెంటనే రిజిస్టరు చేసేపద్ధతిలో కొంటారట. అందుకని.

ప్రభా: అంత యిల్లవసరమైనవాళ్లు వారం రోజు లాగలేరుటండీ.

వీరా: కాదండి క్షణాలమీద బేరం. పోతే మళ్లీ చిక్కదు.

వసుం: అస లిల్లమ్మటం దేనికి?

వీరాస్వామి: నోర్మూయ్. ఆ సంగతి నాకు తెలియదూ.

ప్రభా: (కంటితో మాధవరావుని మాట్లాడవద్దని సైగచేసి) నువ్వూరుకోమ్మా! పోనీ అలా వెళ్లిరుగాని. ఈపూట మాయింటికి చుట్టాలు. భోంచేసి వెళ్ళండి. ఎటుతిరిగీ తొమ్మిదయిందిగా.

వీరా: ఎందుకులెండి. ఇంటికి వెళ్ళి భోంచేస్తాంగా.

ప్రభా: ఫరవాలేదులెండి మా యింట్లో చేస్తే తప్పా! ఈ వేళప్పుడు యింటికొచ్చినవాళ్ళని భోంచెయ్యకుండా పంపటం న్యాయమేనా? వంటయిపోవచ్చింది. హాయిగా భోంచేసివస్తే యే వేళకి చేరినా యిబ్బంది ఉండదు. మరిచేపోయా! వాణ్ణి వెళ్లమంటాను.

వీరా: అహహా! పెట్టె వుంది. ఇటునుంచే బస్ స్టాండ్‌కి వర్తాంగదా అని హాసునుంచి దాని పెట్టె కూడా తెచ్చాను.

ప్రభా: ఏయ్ రిక్షా! ఆ పెట్టె యిలా తీసుకురా!

[రిక్షావాడు పెట్టె తీసుకొస్తాడు. వీరాస్వామి డబ్బులిచ్చి పంపేస్తాడు]

ప్రభా: నువ్వు ముందు స్నానం చేసెయ్యమ్మా! తర్వాత మేంకూడా చేసేస్తాం. ఇదుగో ఈ అమ్మాయిని తీసికెళ్ళవే.

[వసుంధర పెట్టె తీసి గుడ్డలు తీసుకుంటుంది పార్వతి గుమ్మందగ్గరకు వచ్చి ఆమెను తీసికెళ్తుంది]

కనక: అది సరేనండి. పిల్లలా మధ్యలో వెళ్ళిపోవటం నాకేం బాగాలేదు.

ప్రభా: నిజమే మరి. మళ్ళీ వచ్చిందాకా రిహార్సల్స్ ఆపాల్సిందే గదా? మధ్యలో ఆపితే చేసిన ప్రాక్టీసంతా వృధా. ఎలాగోలా యీవారం ఓపికపట్టండి వీరాస్వామిగారూ.

వీరా: అట్నే చెప్పేనుగదండి వీల్లేదని. ఇక పదిసార్లడక్కండి.

కనక: ఎలాగయ్యా వెత్తే! ఇప్పటికి రెండు వందలు ఖర్చు పెట్టేను. ఇదేం తమాషా అనుకున్నావా డబ్బుతో పని.

వీరా: అదేమిటండీ అలా మాట్లాడతారు. మళ్లీ ఎల్లుండికల్లా వచ్చేస్తానంటూంటే.

కనక: అవునయ్యా మాకు నమ్మకమేమిటి? రాకపోతే మే మభాసుపాలు గావద్దు...ఇంతవఱకు మా నాటకాలన్నా మేమన్నా యీవూళ్ళో కాస్త గౌరవముంది. అది కాస్తా మన్నుకొట్టుకుపోతుంది.

వీరా: అంత అనుమానంగా ఉంటే మీరిచ్చిన బయానా తీసుకోండి.

కనక: బయానా తిరిగిస్తే అయిందా యేమిటి? మళ్ళీ యిప్పుడు వేరేమనిషిని వెతుక్కుని అంతా మొదలెత్తుకుని వారంరోజుల్లో తయారు కాగలమా?

ఈవూళ్లో అంతమాత్రం తెలివిగల దెక్కడుంది? చెల రోజులు రుద్దితే నే అంతంతమాత్రం. ఈ వారంలో పోర్షనుకూడా రాదు. అసలు కొత్త అక్షరజ్ఞానం ఉండి వేషాలు వేసే కేడీ యీవూళ్లో. అందుకే నేగా మీకోసం బందరు పరిగెత్తుకొచ్చింది. పోనీ నాలుగు రోజులు వెనక్కి జరుపుదామంటే హాలుకు 'లేడీ' ఖాయం చేసుకుంటేమి బయానాకూడా యిచ్చేమి. ఆగోజాడుకోవాలి లేకపోతే బయానాకి తిలోదకాలే. నువ్వైనువ్వా చెప్పవయ్యా మీరు వెళ్ళటానికి వీల్లేదు. నాటకమయ్యేదాకా ఆ అమ్మాయిని కదిలించటానికి వీల్లేదు.

మాధ: రాజాగారూ! ఎందుకు మీకీ కంఠశోష. ఆ అమ్మాయి యెక్కడికీ వెళ్ళదు. సరేనా. మీరూరుకోండి (ప్రభాకరం మాట్లాడవద్దని సైగ చేసినా ఊరుకోడు.)

వీరా: అదేమిటండోయ్! ఎందుకని?

మాధ: ఎందుకనేమిటి? అసలెందుకు రావాలి నీతో? రాదు. ఇక నువ్వా అమ్మాయిని గుటేం చేశావ్యలా పెట్టుకోఖర్లా తెలిసిందా?

వీరా: అదేమిటండోయ్ మీరు మర్యాదా దాటి మాట్లాడుతున్నా రిష్టంవొచ్చిన...

మాధ: పొరపాటు. నేను మర్యాదా దాటి మాట్లాట్టంలేదు. ఉన్న విషయాలేవో విశదంగా చెబుతున్నాను. నీకూ వసుంధరకీ యిక యేరకమైన సంబంధమూ లేదు.

వీరా: మీరు జాగ్రత్తగా మాట్లాడాలి అది నా పిల్ల.

మాధ: ఎంతమాత్రం కాదు. అ ఉద్దేశమే యిక విడిచిపెట్టమని చెబుతున్నాను.

ప్రభా: ఒరేయ్ నువ్వెందు చెబుతా. ఇదుగో వీరాస్వామిగారూ! ఇక వాగ్వాదంతో లాభంలేదు. వసుంధరా మాధవరావూ పెళ్లి చేసుకోబోతున్నారు—

వీరా: వీల్లేదు.

ప్రభా: ఎందుకు లేదులెండి. ఇక మీరు అనవసరంగా ఆయాసపడొద్దు. మీ రామ్మాయి తండ్రి కానట్లు తెలిసింది, కాబట్టి—

వీరా: ఇదుగో మీరుకూడా అలా* మాట్లాడుతున్నారు. మీ రేమో మర్యాదస్తులనుకున్నాను. ఎవరు చెప్పేరు మీకు?

ప్రభా: ఎవరో చెబితే యెలా తెలుస్తుంది. తల్లి చెప్పిందని ఆ అమ్మాయి చెప్పింది—

వీరా: ఏది సాక్షాత్.

మాధ: పళ్లు రాలిపోతయ్ మరోసారన్నావంటే. పిచ్చి పిచ్చి—

వీరా: ప్రాణం తీసేస్తాను (మీదకిపోతూండగా ప్రభాకరం పట్టుకుంటాడు. మాధవరావును కనకరాజు పట్టుకుంటాడు)

మాధ: వదలండి రాజాగారూ! కృష్ణలో పాతేస్తాను.

[రామకృష్ణయ్యగారు హడావుడిగా లోపలికి వచ్చి]

రామ: ఏమిటేమిటి!...

ప్రభా: (అదిరిపోయి) రా నాన్నా!

రామ: ఏమిటీ గందరగోళం......ఒక్కళ్ళూ మాట్లాడరేమిరా...ఏమిట్రా ప్రభూ...ఏమిట్రా మాధవా! కొట్టుకోబోతున్నారు.

[వీరాస్వామి రామకృష్ణయ్యవంక తేరిపార జూస్తుంటాడు]

మాధ:...ఏమీ లేదు మామయ్యా...నాటకం రీహార్సలు.

రామ: ఛా! నోరుముయ్! (వీరాస్వామివంక తేరిపారజూచి)...ఎవరీ మనిషి......ఎక్కడో...చూసినట్టు

కనక: బందరండి. వీరాస్వామి—

రామ: బందరు—వీరాస్వామా......ఆ గుర్తొచ్చింది. ఓరి నీ తస్సదియ్యా గుర్తుపట్టకుండా మారిపోయావేమోయ్ చాలా చిక్కిపోయావ్ నన్ను గుర్తుపట్టావా?

మాధ: నువ్వెరుగుదువా యేమిటీ మామయ్యా!

రామ: ఎరుగటమేమిట్రా నాలుగేళ్ళపాటు వృంగా నాకు గుఱ్ఱబ్బండీ కట్టేవాడు. మేఘాల మీద పోయేదా గుఱ్ఱం. ఏమోయ్ వీరాస్వామీ! ఈ పూరొచ్చావేమేమిటీ...అయితే యీ పోట్లాటేమిటి.. అర వెళ్ళిపోతావేమోయ్.

వీరా: (కంగారుగా నీళ్లు నములుతూ నడుస్తూనే) ఆ! ఇదుగో ఒకటి తెల్లొస్తా. (వెళ్తాడు)

[ప్రభాకరం లోపలికి వెళ్తాడు.]

రామ: (కనకరాజుతో) ఏమిటండీ యిదంతా మాయగా ఉంది నాకేం అర్థం కావటం లేదు?

కనక: అ...దేమీ లేదండి...మా నాటకంలో వేషం వెయ్యటానికి బందరునుంచీ ఒకమ్మాయిని తీసుకొచ్చామండి. నాటకమింకా వారంరోజులుంది. ఆ అమ్మాయిని తీసికెళ్ళిపోతానంటాడు ఇతను. వీల్లేదని మేము. ఇదండీ పోట్లాట.

రామ: ఇతను తీసికెళ్ళటమేమిటి! వాళ్ళిద్దరికీ సంబంధం?

కనక: ఆపిల్ల తండ్రి నంటాడండి.

రామ: అనటమేమిటండి. అసలు విషయమేమిటో మొదట్నుంచీ వివరంగా చెప్పండి.

మాధ: ఏంలేదు మామయ్యా! ఆ పిల్ల పుట్టిం తర్వాత తల్లిదగ్గర ఈ వీరాస్వామిగాడు చేరేడు. ఆ పిల్లని నానా బాధలు పెడుతున్నాడు. రెండు నెల్ల క్రిందటే తల్లి చచ్చిపోయింది. సరే నాటకానికంటూ యీవూరొచ్చింది. ఇప్పుడు మధ్యలో తీసికెళ్తానంటాడు. ఆ పిల్లేమిటి—ఇక మళ్ళీ ఆ వూరు వెళితే నానాబాధలు పెడతాడని అచ్చంగా యిక్కడే వుండిపోదామని నిశ్చయం చేసుకుంది.

రామ: చేసుకోనీ. మధ్యలో మీరు పోట్లాడుకోటం దేనికి?

ప్రభా: (చెంబుతో నీళ్ళు తెచ్చి) కాళ్ళు కడుక్కో నాన్నా!

రామ: అక్కడ పెట్టు...మాట్లాడరేమండీ.

[మాధవరావు మెల్లిగా కనకరాజును గిల్లుతాడు.]

కనక: అంటే మాధవరావుగారు...ఆ అమ్మాయిని—పెళ్ళి....

రామ: ఏరా మాధవా! నిజమేనా?

మాధ: (తలవంచుకుని) నిజమే మామయ్యా!

రామ: అయితే తల్లిదండ్రులు లేరుగదా అని యిష్టంవచ్చినట్లు ప్రవర్తించటమే నన్నమాట...... అంతకంటే మంచి సంబంధమేమీ దొరకలా?...... మాటాడవేంరా?

మాధ: నాకేం ఆస్తా పాస్తా. మామయ్యా! మంచి సంబంధాలు రావటానికి? ఏదో నాతోపాటుగా నాలుగుడబ్బులు సంపాదించేది. లేకపోతే యెట్లా గడవాలి నా జీవితం. ఒక్క కులాన్ని గురించే కదా నీ కిష్టంలేంది.

రామ: అవున్రా మరి. పదిమందిలో తిరగవలసినవాడివి. మీ అక్కయ్యలు నిన్ను గడపతొక్కనిస్తారా?

మాధ: ఆ!...ఇప్పుడు తవ్వి తలకెత్తుతున్నారు. ఇక మాడరేమో నని దిగులు. నాలక్ష్యం వాళ్ళకి లేదు వాళ్ళలక్ష్యం నాకు లేదు. నా జీవితం యిబ్బంది లేకుండా గడిచే మార్గమేదో నేను చూసుకోవాలి గదా. ఇక కులం సంగతంటావ్. నిజాయితీగా ఉండేవాళ్లు వాళ్లల్లోనూ ఉన్నారు. పెళ్ళినాటికే రెండుమూడు గండాలు గడిచినవాళ్లు మన కులాల్లోనూ ఉన్నారు.

రామ: అచ్చే! ఆ విషయం నేను కాదనటం లేదు. మంచిపిల్లలు వాళ్లల్లోనూ ఉండవచ్చు. కాని నీకు సంబంధించిన వాళ్ళతో—

మాధ: నేనొకళ్ళ యిష్టంపట్టె పోయేవాణ్ణి కాదు మామయ్యా నా విషయమేదో నేనే స్వయంగా చూసుకుంటాను ఒకళ్ళేమో అనుకుంటారని చేతులారా యిబ్బందులు తెచ్చుకోను. లేనప్పుడు పెట్టేవాళ్ళెవ్వరూ లేరు.

రామ: సరే నీయిష్టం. నేనేం చెప్పగల్ను. ఇందువల్ల నీకు సౌఖ్యం లభిస్తుందంటే అలాగే కానియ్......మరిచేపోతూ ఏడీ యీ వీరాస్వామి! వాకిట్లో కల్లోస్తానన్నాడురా—లేదే చూడరా ప్రభా ఉంటే లోపలికి రమ్మను.

మాధ: ఇంకేం ఉంటం అప్పుడే దారి పట్టుంటాడు.

ప్రభా: (చూసివచ్చి) లేడు.

రామ: ఆ! అదే పోక పోయాడేరా ముండాకొడుకు. చాలా సంగతులు మాట్లాడా లనుకున్నాను. ఆ పిల్లదగ్గరకే వెళ్ళాడేమో. మరిచేపోయా ఇప్పుడా పిల్ల నీ అండలోనే ఉందా?

మాధ: ఇంకా లేదు?

రామ: మరెక్కడుంది.

పార్వ: (గుమ్మంలో ఉండి) ఇదుగో యింట్లో ఉంది. ఇదుగో వసుంధరా యిలారా మీ అన్నయ్యగారి నాన్నగారు నిన్ను చూస్తారట.

రామ: ఇక్కడే ఉందీ! అందుకనే నన్నమాట యిక్కడ పోట్లాడుకుంటున్నారు. ఏదీ (వసుంధర రాగానే మొహంవైపు చూస్తాడు.)

వసుం: (రామకృష్ణయ్యనుచూసి తెల్లబోయి) ఆ! (అదేపనిగా వెఱ్ఱిగా చూస్తుంది.)

రామ: ......అదేమిట్రా అట్లా చూస్తుంది... ఏమిటమ్మాయ్!

ప్రభా: ఏమిటి వసుంధరా?

మాధ, కనక: అరె!

వసుం: (కళ్ళనీళ్ళు గిర్రున తిరుగుతయ్)... నాన్నా! (అమాంతం రామకృష్ణయ్య ఒళ్లో కూలిపోతుంది)

మాధ, ప్రభా, కనక: ఆ!

పార్వ: అదేమిటి?

ప్రభా: ఆ! (వసుంధర పెట్టెతెరిచి గబగబా గుడ్డలన్నీ తోసి పారేసి అడుగునున్న ఫోటో తీసి ఒక్క నిమిషంచూసి మాధవరావుకిచ్చి లోపలికి వెళ్లిపోతాడు. పార్వతి అతని వెంటే వెళ్తుంది)

రామ: ఇదేమిట్రా! ఇదేమిటమ్మాయ్. ఆ ఫోటో యేమిట్రా మాధవా! ఏమిట్రా అంతా అయోమయంగా ఉంది నాకు.

మాధ: మరేంలేదు మామయ్యా! ఈ ఫోటోలో వాళ్ళు (చూపిస్తూ) ఆ అమ్మాయి తల్లీ...తండ్రీ.

రామ: (నిర్ఘాంతపోయి) ఆ!...(నిట్టూర్చి)... 15, 16 యేళ్లనాటి కథ. లే తల్లీ...రా...అమ్...మ్మ

వసుం: రెండు చెల్లైంది నాకా...

రామ: పిలు తల్లీ నీ మనసారా పిల్చుకో! నాలోటివాళ్లమూలంగా ఎంతమంది అమాయికపు పిల్లలకి ఆమాట ఉచ్ఛరించే భాగ్యంలేకుండా పోతున్నదో!

కనక: ఫలం వెతుక్కుంటూ వచ్చి ఆసామిని చేరింది.

మాధ: అయితే కొన్నాళ్లు చౌదరనికూడా తగిలించుకున్నావేమిటి మామయ్యా.

రామ: మనపని పైలాపచ్చీసుగా ఉండే రోజుల్లో ఆమాట లేకుండా పిలిస్తే పలికేవాళ్ళం గాదోయ్.

కనక: మాధవరావుగారూ! అర్జంటుపనిఉన్నది వెళ్ళొస్తా.

రామ: భోంచేసి వెళ్దురుగాని—

కనక: క్షమించండి మరోమాటు. వస్తా తొందరపనుంది (వెళ్లిపోతాడు)

పార్వ: (నవ్వుకుంటూ తుండుగుడ్డలు పట్టుకుని వచ్చి) స్నానం చెయ్యండి మామయ్యా (అని యిచ్చి, వసుంధరని తనదగ్గరికి తీసుకుంటుంది) (రామకృష్ణయ్య దొడ్లోకి వెళ్తుండగా)

మాధ: కట్నంమాట చెప్పేపో మామయ్యా.

రామ: నాకు తెలియకముందే ఖాయం చేసుకున్నావుగదోయ్—కాబట్టి మరి మాట్లాడొద్దు. (వెళ్తాడు)

ప్రభా: (లోపల్నుంచి వచ్చి) ఇదిగో నడిపాతవి రెండు (అని తండ్రి చెప్పులు చూపిస్తాడు)

మాధ: (గబుక్కున మంచంమీద పడుకుని) నోరుమూసుకుని వేళ్లి పిసకరా.

ప్రభా: (ప్రక్కన కూర్చుని దవడ పగుల్తుంది)

పార్వ: ఎవరికోసం. దక్కించుకుంటూ

ప్రభా: (వెక్కిరిస్తూ) హే హే హే!

పార్వతి: (మరీ వెక్కిరిస్తూ) వె వె వె వె ఈ బస్సులో వెళ్లి అత్తగార్ని తీసుకురండి. ఎందుకన్నా నాదగ్గరికి చేరేవు. (అని నవ్వుతూ వసుంధరని అవతలికి నెట్టి యింట్లోకి వెళ్లిపోతుంది.)

నేటి సాహిత్యము

అపభ్రంశ ప్రయోగములు

శ్రీ తిరుమల రామచంద్ర

భారతి నవంబరు సంచికలో పై శీర్షికతో శ్రీ మరుగంటి సీతారామయ్యగారు ఒక వ్యాసం వ్రాసినారు. వారు పేరునకు నేటిసాహిత్యమన్నారు కాని, వారిచ్చిన ఉదాహరణలన్నిటినీ పరిశీలిస్తే, కేవలం ఇటీవల వెలువడిన "ఉదయ ఘంటలు" అన్న అఖిలాంధ్ర కవుల కావ్యసంపుటికి (తెలంగాణా రచయితలసంఘం ప్రచురించినది) మాత్రమే వారి పురోభాగిత్వం పరిమితమైనట్లు స్పష్టపడుతుంది. వారామాట స్పష్టంగా, తెలిపివుంటే పాఠకులకు సుకరంగా వుండేది. ఆ సంపుటి పేరు వారు ఎందుకు తెలుపలేదో దురూహ్యం. పాఠకుల సౌకర్యంకోసం వారిచ్చిన క్రమంలోనే వారిచ్చిన "అపభ్రంశాల"ను పరిశీలింతాము.

అచ్చుతప్పులు

మొట్టమొదట ఒక్క మాట చెప్పవలసి వుంది. పూర్వకాలంలో లేఖక ప్రమాదాలలాగే నేడు ముద్రణప్రమాదాలు వుండడం అంగీకరించాలి. అప్పటివారు లేఖకప్రమాదాలను తొలగించుకొని సరైన పాఠాలను నిర్ణయించుకొని విమర్శకు పూనుకొనేవారు. శ్రీ సీతారామయ్యగారు అచ్చు తప్పులను కూడా అపభ్రంశాలుగా ఉదహరించడానికి వెనుదీయలేదు.

ఉదాహరణకు విద్వాన్ విశ్వంగారి "నాన్యః పంథాః" అనే గీతంలోవున్న "జనతాగతి" అన్న పదాన్నే తీసుకుందాం. ఆ గీతం పూర్వం—1949 ఆగస్టు నెలలో నవ్యసాహితిలో (సాహిత్య పక్షపత్రిక, అనంతపురం) ప్రచురితమైంది. అందులోని భాగమిది.

> "వంచన ఏ కించిత్తో
> కనబడినా నిన్ను నన్ను
> నలగద్రొక్కి ముందునకే
> సాగుతుంది జనతాగతి
> ఆగబోదు! ఆగబోదు!
> ఆలోచించుము సఖుడా."

ఈ గీతం 'ఉదయ ఘంటల'లో 'జనతాగతి' అనడానికి మారు "జనతాగళి" అని పడింది. ఆ స్వరూపంలో అచ్చు తప్పన్నది సుస్పష్టం. కాని శ్రీ భట్టాచార్యులు "ద్విగుసమాసము చేసినాడనుకొందుము కవి" అని ఒక విసురు విసిరినారు.

ఈ వరుసలోనికి వచ్చేవే మరికొన్ని. "మానవమాత్రుడు". ఇది అచ్చుతప్పన్నందుకు గుర్తు అదే పద్యంలో ప్రప్రథమ పాదంలో 'మానవమాత్రుడు' అనే ఉండడం. ఆ పద్యాన్ని పూర్తిగా చదివి వుండినా, "మాత్రుడు అని కాబోలు కవిహృదయము" అని అనుకొనవలసిన ఆవశ్యకత వుండదు. వారి వ్యాసంలోనే (పుట 466, 2 వ కాలంలో 28 వ పంక్తి) 'శ్రుతి' అనుటకు మారు 467 వ పుట 2 వ కాలం 20 వ పంక్తిలో 'లాఘవ' మనుటకు మారు, శృతి అని 'లాఘువ'మని పడినది. దీనినిబట్టి శ్రీ భట్టాచార్యులవారికి శ్రుతి శృతులకు లాఘువ లాఘవాలకు భేదం తెలీదని చెప్ప సాహసింతుమా?

ఇలాంటివే "కృషియింప, షుప్తి, కక్షీవంతుడు రక్తపాయ" మొదలైనవి. వీటి సాధురూపాలు "కృశియింప, సుప్తి, కక్షీవంతుడు, రక్తపాయి."

"అపభ్రంశాలు"

(1) శ్రీ వార్ల వేంకటేశ్వరరావుగారు వ్రాసిన "ఆవల" అనే గీతంలో "ప్రత్యహ పరివర్తనలే" అన్నమాటమీద వీరు "అహశ్శబ్దస్వరూప మితనికి తెలియదు" అని విమర్శించారు. రాజాహస్సఖి శబ్దాలకు 'టచ్' వచ్చి, ప్రత్యహం కావడం, ప్రత్యహం జరిగే పరివర్తనలు అన్న అర్థంలో ప్రత్యహశబ్దం పరివర్తన శబ్దంతో సమసించడం సంస్కృత వ్యాకరణం చదువుకున్న వారికి తెలియనిది కాదు.

(7) ఇక మిశ్రీయ సమాసాల సంగతి. మిశ్రీయ సమాస చర్చ ఈనాటిది కాదు. ఎందరో పండిత ప్రకాండులు ఆంధ్ర వాఙ్మయాన్ని ఆవలోడించి వీటిని ఏరికితీసి వీటి ప్రామాణ్యాన్ని తెలియజేసినారు. మిశ్రమ సమాసాల కూర్పు ఆదికవి నుండి అత్యాధునిక కవిదాక నిరాఘాటంగా సాగుతూ వచ్చినదే. వీరు తప్పన్న 'బహు మంచి' లాంటి "మహామంచి" భాస్కర రామాయణం యుద్ధకాండలో వున్నది. వాడి మయూఖములు, వేడి పయోధరాలు అందరూ చూచినవే. అందరూ ఎరిగినదే. శివకవులు మరికొంత ముందడుగు వేసి అమరలేమ, భక్తకూటువులు, (సోమనాథుని బసవపురాణం) వంటి సంస్కృత పూర్వ మిశ్రమ సమాసాలను ప్రయోగించినారు. అంతేకాదు. పుష మీాళి, చేదళొబ్బంవంటి ప్రాకృత సంస్కృత మిశ్రాలను ప్రయోగించారు. శ్రీనాథుని వంటి మహాకవి కైవార, హేరాళాలవంటి అచ్చ తెలుగు పదాలను సంస్కృత సమాస మధ్యంలో బిగించారు. "కైవార దుర్భాషణంబులు"—నైషధం 7-89. హేరాళ క్రీడా సంచారిణీ "—భీమఖండం. 1-100, ఇలాటి వాటిని చూచే శ్రీనాథునికి సంస్కృత సమాసంలో నే సంస్కృతేతర పదాలను చేర్చే అలవాటున్నదని సూర్యరాయ నిఘంటు కారులు అనవలసి వచ్చింది. "వందిమాగధ సూత కైవార రవము" అని భాగవతం. దినవెచ్చ దినవహిలాంటివి కొల్లలు. ఇవన్నీ చూచిన తర్వాత శరద్వెన్నెల' సెగపిండాలు, విమతతైర, లాంటిపదాలను అపభ్రంశాలని ఎలా అనగలం? అట్లని ప్రతి ప్రయోక్త మిశ్ర సమాసాన్నీ సమర్థించడం కాదు. కాని, ఇవేవో ఈనాటి అభ్యుదయ కవులకే అలవాటయినట్లు, వారికి శబ్దస్వరూపం రేఖా మాత్రంగానైనా తెలియనట్టు శ్రీ భట్టాచార్యులు గారు సూచింపదలచిన అభిప్రాయం సరికాదనిమాత్రమే నా మనవి.

(8) సంస్కృతపదాలు రూపాంతరం చెందడం కూడా ప్రాచీనకాలంనుంచి పండితులకు పరిచితమైన సత్యమే. సౌదామని సౌదామిని అయినది.

"..........సౌదా
మినితోఁ జెలువొందు నీల
మేఘముపోలెన్"—సింహాసన
ద్వాత్రింశతి. 2-146.

ఏకాదశి ఏకాశి అయినది.

"కళికిపాపంప్ర పేరిమి జేకాశి
గూడు"—శ్రీరంగమాహాత్మ్యం. 8 119.

ఏకాదశి మరికొంత ముందుకుపల్కి ఏకాస్తి, కాస్తి అనికూడా అయింది.

ముష్టీముష్టి ముష్టాముష్టి అయింది.

కల్హారం కలుహారము, కలహారము అయింది. నన్నెచోడుని కుమారసంభవంలో చూడవచ్చు.

సమూహం సమూహి అయినది. వసుసమూహి, బకసమూహి, భక్తగణసమూహి అని కేతన, నన్నెచోడుడు, సోమనాథుడు మున్నగువారు ప్రయోగించినారు.

వ్రటువసుశీ క్రౌవడి అయినది.

"క్వారాస్త్రదంష్ట్ర క్రుత్తోరుబాహులై"
"ప్రముఖులైన చేతులు ముండ్లపోవలు"
"ప్రకటకణాంశంబు వజ్రమై ప్రబంచమనట్లు."

బాలిక బాలికగా మారినది. యౌవనము యవ్వనమయినది. అంబుజనేత్రి అంబుజనేత్రి అయినది.

ఇలాటి విశేష ప్రయోగాలను సహృదయతతో సేకరించి శ్రీ నిడదవోలు వెంకటరావుగారు "భాషా పరిశోధన—ప్రయోగ విశేషములు" అన్న గ్రంథంలో ప్రకటించారు. మరింత జిజ్ఞాసగల పాఠకులు ఆ గ్రంథాన్ని ముదలకించవచ్చు.

సత్యం ఇలా వుండగా, శ్రీ సీతారామయ్య గారు "అలిశ్యం, పరికి" అను మాటలను ఆధారంగా చేసుకుని పెద్ద ఆర్భాటం చేసినారు. "భాషాజ్ఞాన శూన్యతవలన ఇది కలుగుచున్నది" అన్నంతవరకూ వెళినారు. నేటి కవులలో భాషాజ్ఞానమే కాదు— అలంకృతమైన భాషా పాండిత్యం కలవారు చాల మంది వున్నారు. సౌందర్య ప్రలుబ్ధతతో వారి కావ్యాలను చదివి ఆనందించే సహృదయులు వున్నారు. "సంస్కృత పదములను మార్పుటకు రద యితరులకు ఏమి యధికారముకలదు?" అని వారు ప్రశ్నించడం, పైన నే నిచ్చిన ఉదాహరణలను పరిశీలిస్తే ఎంత తొందరపాటో పాఠకులకు తెలుస్తుంది.

భాషా పరిణామగతిని సునిశితంగా పరిశీలించి, "ప్రవాహినీ శక్తి" అన్న మాటను నిరూపించడానికి బాలావి శరణ్యం, భాషా క్షేమం లాంటి ఉత్తమ గ్రంథాలను రచించిన శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు ఈనాటి భాషాగమనాన్ని చూచి విలపించి వుండెరు.

ద్వంద్వసమాసం

శ్రీ భట్టాచార్యులుగారు "ద్వంద్వసమాస విషయమున "తల్లిదండ్రులు" (విశ్వగీతి) గమనింపవలసిన ప్రయోగము" అని అది తప్పన్నట్లు సూచించారు. ద్వంద్వసమాసంలో మొదటి పదంమీది సముచ్చయార్థకం దీర్ఘంగా మారడం అసహజమేమాత్రం కాదు. భాషా ప్రామాణికత విషయంలో కవిత్రయాన్ని వీరు తోసి రాజనరుగదా! — ఆ కవిత్రయంలోని ఎఱ్ఱాప్రగడ "అన్నాదమ్ముల గని" అని ప్రయోగించాడు. (ఎఱ్ఱాప్రగడ హరివంశం. ఆశ్వాసం 4-15). ప్రౌఢవ్యాకరణ కారుడు సంధిపరిచ్ఛేదంలో ఇలాటి దీర్ఘాలసాధనకు ఒక సూత్రమే (6 వ సూత్రం) ప్రత్యేకంగా చెప్పి "అప్పా సెల్లెండ్రు" అన్న ప్రయోగం ఉదాహరించారు.

తెలుగుపదాలు

దేశం, మధురం, వీరింటంటెవికూడ వీరికంటెకి అపభ్రంశాలయినవి. ఎందువల్లనో కాదు—కేవలం అందులోని 'ము' ప్రత్యయం 'ం' గా మారడమే వీరికి అసహజంగా కన్పట్టినది. మనది అజంతభాష గనుక హలంతాలే లేనట్లు వీరు అన్నారు. భాషాతత్త్వాన్ని తెలిసిన వీరుకూడా ఇలాఅనడం ఆశ్చర్యం. అజంతభాష గనుక కేశముల్, సుజాల్, వరాల్, మొదలయిన హలంతాలు వుండకూడదనగలమా? 'ము' విభక్తి సున్నగా మారడం ఏమాత్రం అసహజం కాదు. తమిళ కన్నడ భాషలలో ప్రథమావిభక్తి అనునాసికమే. పళం, రామం, బందం మొదలైనవి. ఆ అనునాసికం క్రమంగా తెలుగులో కన్నడంలో వు గాను, ము, వులు గాను మారినది. కాని వ్యవహారంలో మాత్రం అనునాసికంగానే వుంది. భాషకు "సిద్ధిర్లోకాద్వ్యాఖ్యా." కదా! బహువచన ప్రత్యయమైన లు లోని అచ్చుపోయి లకారం మాత్రం మిగిలి నప్పగు, ము లోని అచ్చుపోయి మ్ మాత్రం మిగలడంలో ఆశ్చర్యమేముంది?

మానవసృష్టి, దేవసృష్టి అవడంకూడా లోకంలో వుంది. ప్రాచీన వ్యాఖ్యాతలందరూ వాడినదే. మల్లన రామస్తవ రాజంలో వాణ్ణి అని ప్రయోగించాడు. దాన్ని ఆధారంగా శ్రీ గిడుగు సీతాపతి గారు భారతశతకంలో పద్యానికి పద్యమే రచించారు.

శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు "బరువుబండి" అనే గేయంలో 'మంటల్లో' అని వ్రాయడం ఆక్షేపించినారు శ్రీ సీతారామయ్యగారు. పదమధ్యాన వున్న రెండు లకారాలలో వెనుకది ముందుదాని లోనికి తోసుకొని వచ్చుట స్వరశాస్త్ర సంసిద్ధమే.

కళ్లు నీళ్లుకూడా అప్పకవికే కాదు వీరికికూడా తప్పులుగా కనిపించినవి.

"నీళ్ళకు నిర్రితోళ్లకును నేతి కరుళ్లకు..." అని శ్రీ దాసు శ్రీరాములుగారు "తెనుగు వాడు"లో ప్రయోగించినది గుర్తుకు తెస్తున్నాను.

వాకదులో వున్న క్రియారూపాలను అట్లే ప్రయోగించడం అదేపనిగా నేటి రచయితలు అలవాటు — చేస్తున్నారు. దక్షిణాంధ్ర సాహిత్యంలో ఇలాటివి కొల్లలు. పూజ్యశ్రీ చెళ్లపిళ్ల వారివంటి వారు తమ వ్యావహారికంలో "అనిద్యేవే, ఆయాయి, అంచాత, ఏతావాతా," వంటివి ప్రయోగించడం తెనువారికి తెలియనిది కాదు.

దెయ్యాలు తప్పట. "దెబ్బకు దెయ్యం జడుస్తుంది" అన్న మనసామెత దకారాదినే సూచిస్తుంది. మన సామెతలలో యతిప్రాసలలో ఏదో ఒకటి వుండడం లోకవిదితం. ఇంతకూ ఈ దెయ్య శబ్దం దైవ, దేవశబ్దభవం. దయ్య అని ప్రాకృత హిందీల లోను, దెవ్వ అని దకారాదిగా కన్నడంలోను వుంది. కనుక వ్యవహారంలో దకారాదిగా వుండడం, దానిని నేటి కవులు ప్రయోగించడం అపభ్రంశం కాదు.

పయనము పైనమైనప్పుడు బయలుదేరడం బైల్దేరడం ఎట్లా తప్పవుతుంది?

ప్రంగ, క్రోతి, ప్రప్పులలోని క్రావడి ఎన్నో శతాబ్దాలకిందే జారిపోయింది. పెనగపప్పును పెనగ ప్రప్పని అంటే హాస్యాస్పదంగా వుంటుంది. క్రావడి లోపించటం తప్పా?

వీరు దుస్సంధులుగా భావించిన కోటొక్కటి వంటి ప్రయోగాలు తెలుగులో 'నూటొక్కటి.'

కట్టకడపట సీతారామయ్యగారు ఈ గీతములు కూడ తమ తృప్తికిని, మిత్రుల మన్ననలకును, విద్యార్థుల చప్పట్లకును వ్రాసినట్లు కనబడును అని యావదాంధ్రంలోని కవులను, ఆధునిక కవిత్వ సర్వస్వాన్ని అవహేళన చేయడానికి ప్రయత్నించడం సహృదయత కాదు. అపభ్రంశమన్నదే లేదని మా వాదం కాదు. అది నేటికవులలోనే కాదు; ఎవరు వ్రాసినా, ఎందులో వున్నా తప్పే. అయితే ఏమాత్రం అపభ్రంశం లేనివానినికూడ తప్పుపట్టే దురభినివేశాన్నే మేము ఖండిస్తున్నాము.

శ్రీ ప్రభాకర శాస్త్రిగారి మాటలతో ఈ మనవిని ముగిస్తాను.

'మానవుడు పుట్టింది మొదలుకొని నేటిదాకా స్థలస్థలమూ, క్షణక్షణమూ — అంటే ప్రతి కాలలేశంలోనూ, ప్రతి దేశంలోనూకూడా తన స్వరూపస్వభావాలలో మార్పు చెందుతూనే ఉన్నాడు. అలాగే ప్రతి దేశలేశంలోనూ, ప్రతి కాలలేశంలోనూకూడా మానవ ముఖయంత్రంలోనూ భాష విభిన్నలక్షణాలతో కొంతకొంత రాలిపోతూ మాటి ఎంతో విజృంభిస్తూ పెంపొందుతూ ఉన్నది.

"వృక్షవిజృంభణవంటిదే మానవతా విజృంభణమూ, వారిభాషల విజృంభణమూనూ. శబ్ద శాస్త్రవేత్తలు వృక్షశాస్త్రవేత్తలవలె దొరికే ప్రతిశబ్దమూనూ శ్రమించి, దాని పుట్టుపూర్వోత్తరాలు, ఇప్పటివరకు అది చెందిన పరివర్తనాలు, అర్థంలోనూ, రూపంలోనూ కూడా గుర్తించి, నిరూపించి ప్రకటిస్తారు. భావికాలంలో అవి మారిపోగలవు. ఆ మార్పులను భావికాలంవారు పరిగణించి ప్రకటించగలరు. దాని స్వరూపస్వభావాలను, ఉపయోగాలను గుర్తించడము, వానిని ప్రకటించడముమాత్రమే వారిపని గాని, చంపడంగాని, పుట్టించడంగాని వారిపని గాదు...శాస్త్రకారులట్లా ఉంటూఉంటే ప్రజలు ఆయా శబ్దరూపాలకు వైరస్యపారస్యాలవల్ల సౌకర్యాసౌకర్యాలవల్ల కాలక్రమాన కుంపు పెంపులు జరిగిస్తూ ఉంటారు."



ఎర్నెస్ట్ హెమింగ్‌వే

ఉత్తమ సాహిత్యవేత్తగా 1954 నోబెల్ బహుమతి నందుకున్న అమెరికన్ రచయిత; పాశ్చాత్యసాహిత్య ప్రపంచంలో ప్రసిద్ధ నవలాకారుడుగా హెమింగ్ వేకు ఇదివరకే ఉన్నతమైన స్థానం వున్నది. ఇప్పుడీ బహూకృతిని సాధించిన రచన 'Old Man and the Sea' అనే నవల. ఈరచనలో సృష్టించిన సాంకేతిక రూపకల్పన (Symbolism) అద్భుతమైనదని పలువురు విమర్శకులు అంటున్నారు.

గ్రంథ విమర్శనము

తపోవనము

ఖండకావ్య సంపుటి; రచన: శ్రీ శెష్టూరి శ్రీనివాసమూర్తి, కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా. మూల్యం రెండు రూపాయిలు.

నిను కవితా తపస్వియుని
నీ కవనంబు తపోవనంబుగా
ననిశము లోకమెల్ల కొని
యాడగ, స్ఫూర్తిరమ్య మాధురుల్
కనుగొని తన్మయత్వమున
కన్నులు మోడ్చెద వెంత ధన్య జీ
వనము లభించె పాడుకొన
వయ్య యథేచ్ఛముగా నిచ్చటన్

ఈపద్యం 'తపోవనం' అనే శీర్షికకు వ్యాఖ్యాన రూపంలో వుంది. ఇంకా వివరంగా రచయిత:

'నా కవితా ఖండికల సమగ్రస్వరూపమీ తపోవనము. ఇవియన్నియు నొక నిర్ణీత కాలమున రచింపబడినవి కావు. ఆబాల్యముగ కొనసాగివచ్చిన దీర్ఘ తపస్సు. ఇందలి మూడు సంపుటములు పూర్వోత్తర ఖండములుగా విభజింపబడినవి. రచనలో కాలభేదమించుక సూచించుటయే దీనికి కారణము, బాల్యదినములుగల పుటలయందే అనువాదరచన కొద్దిగ చేర్చితిని' అని తెలుపుతున్నారు.

కాని ముమ్మందు ఈ కావ్య సంచయాన్ని 'కళాజీవి (కళాతపస్వి యనుకొందము), 'పాన్థ్యము', 'స్వర్గద్వారము' అను మూడు ప్రధాన భాగములుగా ఏల విభజించిరో రచయిత తెలుపలేదు. రచయిత చెబుతున్న పూర్వోత్తర ఖండవిభజన ఈ మూడుభాగాలకూ జరిగిన పునర్విభజనవిషయము.

శ్రీ శ్రీనివాసమూర్తిగారు ఆస్తికులు. అందుచేత ఆబాల్యమూ సాగుతూవచ్చిన ఈ కవితాసాధనను, ప్రాచీన ఋషిసంప్రదాయాన్ని అనుసరించి లాంఛనప్రాయంగా ఈమూడు సోపానములుగా అమర్చివారే గాని ప్రత్యేకతమేదో యొక దృక్పథమును సూచించుటకు చేసిన విభజన గాదమో!

వీరి ఆస్తికత్వం, ఆధ్యాత్మిక దృక్పథం వాస్తవికజీవితాన్నుంచి పరారీ చిత్రించే బాపతు కాదు. భౌతికాధ్యాత్మిక జీవితాలను సమన్వయం చేసుకుని వీటికి అర్థాన్ని కల్పించుకోగలిగారు. భౌతిక జీవితంలోనే ఈ కవితాతపస్సుద్వారా పరతత్త్వాన్ని సాధించటానికి ఉద్యమించారు:

సౌందర్యార్చనలో సమస్తముగ కాం
క్షల్ లీనమైపోవని!
ఎందాకన్ కవితా తపోవనములో
నే, కోకిలంబైతి, నీ
డెందంబున్ మధురంబుగా దెరచి స్ప
ర్శిం ప్రేమసారించి, 'ఆ
నందో బ్రహ్మ'యటంచు దేహము పరి
త్యాగంబు గావించెదే?

జగత్తులో గల సుఖదుఃఖములు రెంటిమీదా వీరు పరతత్త్వాన్నే చూడగలుగుతున్నారు. 'అజ్ఞానము' అనే కావ్యంలో:

తావకీనవినూత్న సౌందర్యమరయ
చివురుటాకుల చెనకు జూచితినిగాని
రాలి పడియున్న శుష్కపత్రములయందు
నీవు దాగిపోయిన జాడ తెలియనైతి!
తావకీనవినూత్న సౌందర్య మరయ
శీతల జ్యోత్స్నలందు జూచితినిగాని
కవిసికొనియున్న కారు చీకటులయందు
నీవు సంచార మొనరింప నెరుగనైతి!
తావకీనవినూత్న సౌందర్య మరయ
లలిత హర్మ్యము లెక్కిపోదలతుగాని

పేదల కుటీరసీమకు బోదువనుచు
నీ రహస్యవర్తనలెల్ల నెరుగనైతి!
తావకీన వినూత్న సౌందర్యమరయ
ఏవొ సుఖమయ లోకము లెంతుగాని
వాగులై పారు దుఃఖబాష్పములయందు
నీవు లీనమైపోవుట నెరుగనైతి!

ఈ సాధనయొక్క సమగ్రపరిణామం 'అమృతసిద్ధి' అనే కావ్యంలో విస్పష్టంగా ద్యోతమానం చేశారు.

'అమృతమే వోయుదనుచు పేరాసబూని
దోసిలొగ్గితి మది పరితోషమంద
కలుష మెఱుగని నాచిన్ని కరములందు
విషము బోసితి నిర్దయావికలమతిని!

నీదు పరిశుష్క హృదయంబు నీసడించి,
విషముకోసమె తుదకు నిన్ వేడుకొంటి
అమృతధారలు గురిసి నా హస్తయుగళి
నిండుకన్నుల నశ్రులు నించితేల!

ఈ సుధాపానమత్తత హృదయమెల్ల
నవ్యతూనంద మాధుర్య మనుభవింప
చావులేని ఏ లోకమందో వసింతు—
ధన్యమైనది నా జీవితంబు నేడు

ఇటి మహత్తరమైన ఆధ్యాత్మిక దృష్టితో ఈ కవితా సాధనను కొనసాగిస్తున్నా, వీరు వాస్తవిక జీవితానికి విముఖులు కారు. ఈ కావ్య సంచయంలో గగన పథంనుంచి 'గంజికేంద్రము' వరకూ వీరు తడవి చూడని విషయమంటూ లేదు. బాధాపరిపీడితులైన సహజీవులను చూసి వీరి హృదయం కరుణావిలమై స్పందిస్తుంది. 'పయనం' అనే కావ్యం:

ముసలవ్వా—ఓ ముసలవ్వా!
ఎప్పుడు—ఈలోకానికి నీరాక
ఎప్పుడు—లోకం విడిచి నీపోక
నీ చల్లని గర్భములో
పూచిన పువ్వులుగా
కొడుకులతో బిడ్డలతో
కాలము గడిపావా?
మనమలను—మనమరాళ్ళను
కనుగవతో చూచావా,
ఎప్పుడు నీ పయనం—

వృద్ధాప్యం—అంధత్వం
కళేబరం కన్పిస్తుంది!
జీర్ణ శీర్ణ వస్త్రంతో
చేతిమూత కఱ్ఱతో
శిథిల శిరోజాలతో
లోకాంతర సీమలకై—
ఎప్పుడు నీపయనం.

కడుగాసిపడిన జీవానికి
పిడికెడు కబళంలేదా
తిరిపానికి తరిమేశారా
వయసు వచ్చినవారంతా
ఇంటినుంచి గెంటినారా
ముసలవ్వా—ఎప్పుడు నీ పయనం.

ఇంతిదవ్వ ఆ యీ రచనలను ఎత్తి చూపేకంటే ఒకమాట చెబితే సరిపోతుంది: రచయిత సిద్ధహస్తుడు. ఏ విషయాన్ని స్పృశించినా దాన్ని రసమయ కావ్యంగా చేసివేయగలరు. ఈ 'మధురకవి' భారతీముఖాన ఆంధ్ర రసికలోకానికి సుపరిచితులు. ఈ సంపుటిలోని కావ్యాలలో చాలాభాగం భారతిలోగడ ఆంధ్రప్రజలకు అందజేసినవే! రచయితను గురించి ఇప్పుడు క్రొత్తగా ప్రశంసావాక్యాలు పలుకవలసిందేమీ లేకపోయినా, ఇప్పుడు వారి కావ్యసంచయాన్ని ఎలాగూ పరిచయం చేయవలసిన అవసరం వచ్చింది గనుక రచయితనుగురించి ఒకటి రెండు సంగతులు వక్కాణించటం అప్రస్తుతం కాదు. నవ్యాంధ్ర కవితా రంగంలో వ్యాపించుతున్న అయోమయత్వం దృష్ట్యా ఇట్టి ప్రసక్తి అవసరమని కూడా తోస్తుంది.

రచయిత వారసత్వంగా లభించిన సంస్కృతాంధ్ర రచనావిధానాన్ని సంపూర్ణంగా అనుభవానికి తెచ్చుకున్నారు. వారికి సంస్కృతాంధ్ర శబ్దజాలం మీద సమగ్రమైన అధికారం వుంది. అలాంటి ఆత్మవిశ్వాసంకూడా వుంది. ఇది రచయితలో చాలా ఆరోగ్యకరమైన విషయం. 'పండితుణ్ణి కాదనుకుని పోతానేమో' ననే శంకతో లేనిపోని గందరగోళాలు చెయ్యరు. అందుచేతనే సహజము, సరళము, మధురము అయిన శైలి కరతలామలకమైంది. పదజాలానికి అందకుండా గగనపథానికి ఎగసిపోయే ఎలాంటి ఉదాత్తమైన భావాన్నయినా అలా పుణికి పుచ్చుకుని తన పదజాలంలో రూపొందించి సువ్యక్తం చేయగలరు. శతాధికంగావున్న ఈ సంపుటిలోని ఏ ఒక్క కావ్యాన్ని పరిశీలించినా ఈ నిజం వ్యక్తమౌతుంది. ఈ సందర్భంలో కాళిదాసు శ్లోకానికి వీరు రచించిన ఈ అనువాదం గమనార్హం.

అందంబు కొరత వడునే
చందురునకు మచ్చయున్న, శైవాలముగ
ప్పం దామరపువ్వన—ఈ
సుందరియును వల్కలముల సొంపుగులికెడిన్.

వీరికి ఆంగ్ల కవితారంగంతో కూడా విస్తృతమైన పరిచయం వుంది. వీరిమీద ఆ ప్రభావం కూడా కొంత కనుపించుతుంది. అందుచేతనే వీరిని ఒక సోదరకవి అభినందించుతూ 'మాలో—శ్రీనివాసమూర్తి కీట్సు వంటివాడు' అన్నారు. ఇది నిజానికి చాలా విచిత్రమైన మాటే! సౌందర్యోపాసనవిషయంలో వీరి ఛాయలు కొన్ని కీట్సులో కనుపించినా కీట్సులో వున్న అవాంఛనీయమైన నిరాశావాదం శ్రీనివాసమూర్తిగారిలో ఏ కోశానా కనుపించదు.

ప్రకృతిసౌందర్యంపట్ల మోజుపడే గుణాన్ని తీసుకున్నా వీరిలో వాల్మీకి కాళిదాసులఛాయలే ఎక్కువగా గోచరించుతాయిగాని కీట్సు వగైరా ఆంగ్లకవుల అనుకరణ కనుపించదు. ఆంగ్లకవుల అనుభవాలను జీర్ణం చేసుకున్నా వాటిని వ్యక్తం చేసేటప్పుడు సంప్రదాయశుద్ధమూ సజాతీయమూ అయిన తన స్వంతగొంతుతోనే పలుకుతారు. శ్రీనివాసమూర్తిగారిని 'మాలోకీట్సు' అనటం, వారిని అభినందించటం కాదేమో. శ్రీనివాసమూర్తిగారు శ్రీనివాసమూర్తిగారే; ఆయనను కవులతో పోల్చి చెప్పవలసిన అగత్యం లేదు. నవ్యాంధ్రసాహిత్యరంగంలో 'మధురకవి'గా ఆయనకు విశిష్టమైన స్థానం వుంది.

ప్రతిభాసంపదలున్న కవి; ఖండకృతులను కాదనటం కాదుగాని—సమగ్రమైన ఒక కావ్యాన్ని సృష్టించి సాహితీరంగానికి అందజేస్తే బాగుంటుంది.

గ్రంథస్వీకృతి

కుమతిశతకము

రచన: శ్రీ కె. నారాయణరావు; ప్రచురణ: శ్రీ జయలక్ష్మి అండ్ కో, నెల్లూరు; వెల రు 0-6-0.

ఆంధ్ర తరుణి

పద్యాలు; రచన: శ్రీ రాంపల్లి శ్రీరామచంద్రమూర్తి, పోడూరు, పయా పాలకొల్లు; వెల రు 0-4-0.

వెంకటేశ నక్షత్రమాల

పద్యాలు: రచన: శ్రీమతి కుమారి సుందరి; ప్రచురణ: శ్రీ టి. అప్పన్న, మూరారీ బిల్డింగ్సు; అమూల్యం.

మందీ - మనిషి

నాటిక; ఎర్నెస్ట్ టాలర్ రచనకు అనువాదం; అనువాదకులు శ్రీ సోమసుందర్; కళాకేళీ ప్రచురణలు; శామల్ కోట; వెల రు 1-0-0.

మహేంద్రమణి

పిల్లల కథల సంపుటి; రచన: శ్రీ రావూరి భరద్వాజ; శ్రీనివాస పబ్లికేషన్సు, తెనాలి; వెల రు 0-8-0.

గోదావరి దొడ్డమ్మ కౌగిళ్ళలో

గేయాలు; రచన: క్రాంతిదాస్ ప్రవాసి; ప్రచురణ: క్రాంతి ఎకాడెమీ, పిఠాపురం, వెల రు 0 8 0.

కాశ్మీరుదేశ చరిత్ర

రచన: శ్రీ కొత్త భావయ్యచౌదరి; సంగం జాగర్లమూడి; (గుంటూరు జిల్లా) వెల రు 1-0-0.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7. Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.